సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 69

శనివారం 31-5-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'




క్వాలిఫయర్-2కు ముంబై

'ఎలిమినేటర్'లో 20 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై విజయం -17లో



జీడీపీ వృద్ధి 7.4 శాతం

జనవరి-మార్చి త్రైమాసికంలో నమోదు.. 2024-25లో వృద్ధి 6.5 శాతం-17లో



ఆ విష సర్పాన్ని నలిపేస్తాం

ఉగ్రవాదం ఒక విషసర్పమని, అది మరోసారి మనవైపు తలెత్తి చూస్తే కాలితో నలిపి చంపేస్తామని ప్రధాని మోదీ హెచ్చరించారు.

వివరాలు 6లో ▸



ఎంఐటీ వేదిక నుంచి..

భారత సంతతికి చెందిన మేఘ వేమూరి అనే విద్యార్థిని కేంబ్రిడ్జ్‌లోని ఎంఐటీ గ్రాడ్యుయేషన్ వేదిక నుంచి పాలస్తీనాకు మద్దతు పలికారు.

వివరాలు 6లో ▸



ఒకే షిఫ్ట్‌లో నీట్-పీజీ పరీక్ష

జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష-పోస్టు గ్రాడ్యుయేట్ (నీట్-పీజీ)-2025ను ఒకే షిఫ్ట్‌లో నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

వివరాలు 6లో ▸



ముంచుకొస్తున్న ముప్పు

కర్బన ఉద్గారాలు, వాతావరణ మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు పెరిగిపోతుండడంతో హిమానీనదాలు వేగంగా కరిగిపోతున్నాయి.

వివరాలు 6లో ▸

లక్ష మందికి.. రూ.లక్ష వరకు!

జూన్ 2న ప్రారంభం కానున్న 'రాజీవ్ యువ వికాసం'



యువతకు స్వయం ఉపాధి యూనిట్ల పంపిణీకి సర్కారు కసరత్తు

తొలి విడత రూ.లక్ష లోపు యూనిట్లకు మంజూరు పత్రాల పంపిణీ

- నాలుగు కేటగిరీలకు గాను తొలి రెండు కేటగిరీల వారికి చాన్స్
- రూ.50 వేలు, రూ.లక్ష లోపు కేటగిరీలకు కలిపి లక్ష మంది లబ్ధిదారుల ఎంపిక
- మిగతా రెండు కేటగిరీలకు విడతల వారీగా మంజూరు పత్రాలు ఇచ్చేందుకు నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: రాజీవ్ యువ వికాసం.. రాష్ట్రంలోని యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు వీలుగా వివిధ రకాల యూనిట్లు మంజూరు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న పథకం. రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకుని జూన్ 2న లక్ష మంది అర్హులకు యూనిట్ల మంజూరు పత్రాలు ఇవ్వాలని సర్కారు నిర్ణయించింది. మొత్తం నాలుగు కేటగిరీలకు గాను తొలివిడతలో రెండు కేటగిరీలకు చెందిన లక్ష మంది లబ్ధిదారులకు, రూ.లక్ష లోపు యూనిట్లకు మంజూరు పత్రాలు ఇచ్చేందుకు సిద్ధమైంది.

మొత్తం 16.23 లక్షల దరఖాస్తులు

రాజీవ్ యువ వికాసం పథకం కింద వివిధ సంక్షేమ కార్పొరేషన్ల వారీగా దరఖాస్తుల స్వీకరణ మార్చి 17న ప్రారంభమైంది. ఏప్రిల్ 14వ తేదీ రాత్రి 11.59 గంటల వరకు ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తుల స్వీకరణ పూర్తి అయ్యింది. మొత్తం 16,23,764 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ దరఖాస్తులను నాలుగు కేటగిరీల్లో స్వీకరించారు. రూ.50 వేల లోపు పరిమితి యూనిట్లను కేటగిరీ-1గా, రూ.50 వేల నుంచి రూ.1లక్ష లోపు వాటిని కేటగిరీ-2గా, రూ.1 లక్ష నుంచి రూ.2 లక్షల పరిమితి ఉన్న యూనిట్లను కేటగిరీ-3గా, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల మధ్య ఉన్న యూనిట్లను కేటగిరీ-4గా విభజించారు. ఈ క్రమంలోనే తొలుత కేటగిరీ-1, 2లోని అర్హులకు తొలి విడత కింద మంజూరు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది.

2 కేటగిరీలకు 1.32 లక్షల దరఖాస్తులే..

తొలి రెండు కేటగిరీలకు సంబంధించి 2.81 లక్షల మంది లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం భావించినప్పటికీ.. ఈ రెండు కేటగిరీల్లో కేవలం 1.32 లక్షల దరఖాస్తులే వచ్చాయి. క్షేత్రస్థాయిలో దరఖాస్తుల పరిశీలన పూర్తి చేసిన మండల, మున్సిపల్ స్థాయి కమిటీలు...జాబితాలను జిల్లా కలెక్టర్లకు సమర్పించాయి. కలెక్టర్ల వద్దకు చేరిన ప్రతిపాదనలను పరిశీలించిన జిల్లా స్థాయి కమిటీలు లబ్ధిదారుల ఎంపికను పూర్తిచేశాయి. జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో ఆదివారం సాయంత్రానికి తుది జాబితాలు ఖరారు చేసి... లబ్ధిదారులకు మంజూరు

మిగతా 3వ పేజీలో ▶



న్యూస్‌రీల్

గ్రేటర్‌లో వాహనాలు 85,22,284



గ్రేటర్‌లో ద్విచక్ర వాహనాలు టాప్‌గేర్‌లో పరుగులు తీస్తున్నాయి. మహా నగరంలో ప్రస్తుతం అన్ని రకాల వాహనాల సంఖ్య 85,22,284 కాగా, ద్విచక్రవాహనాలు 62,85,582 ఉన్నాయి.

- వివరాలు 2లో▶

'స్పెల్ బీ' విజేత హైదరాబాదీ



హైదరాబాద్‌కు చెందిన ఫైజన్ జకీ అనే 13 ఏళ్ల బాలుడు అమెరికా జాతీయ స్పెల్లింగ్ బీ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. ఫైనల్లో జకీతో పోటీపడ్డ మరో ఇద్దరు చిన్నారులు సర్వజ్ఞ కదం, సర్వ్ ధరవనెవి కూడా భారత మూలాలే కావడం విశేషం.

- వివరాలు 14లో▶

బడుల్లో టీచర్ల సర్దుబాటు



ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు పాఠశాల విద్యాశాఖ సర్దుబాటు వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఈ క్రమంలో విద్యార్థులు-ఉపాధ్యాయుల నిష్పత్తి విధానంపై పాఠశాల విద్యాశాఖ స్పష్టత ఇచ్చింది.

- వివరాలు 2లో▶

హిమాచల్ హైడల్ ప్రాజెక్టులో భారీ అవినీతి

హరీశ్‌రావు ఆరోపణ 8లో

ప్రపంచ సుందరి ఎవరో తేలేది నేడే



ప్రపంచ సుందరి ఎవరో శనివారం తేలనుంది. హైదరాబాద్‌లో అట్టహాసంగా జరుగుతున్న మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ పోటీల గ్రాండ్ ఫినాలె నేటి రాత్రి జరగబోతోంది. హైటెక్స్ వేదికగా సాగే ఈ కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన 40 మంది పోటీలో నిలవబోతున్నారు. విజేతకు రూ. 8.5 కోట్ల ప్రైజ్ మనీ దక్కనుంది.

-వివరాలు 14లో▶

తెలుగు సినిమాకు అవార్డుల 'బలగం'



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2014 – 2023 సంవత్సరాల మధ్య విడుదలైన తెలుగు సినిమాలకు గద్దర్ అవార్డులను ప్రకటించింది. ఏడాదికి మూడు చొప్పున ప్రథమ ఉత్తమ చిత్రం, రెండో ఉత్తమ చిత్రం, మూడో ఉత్తమ చిత్రం కేటగిరీల కింద అవార్డులకు ఎంపిక చేసింది. వీటితో పాటు సినీ రంగానికి సేవలందిస్తున్న వారికి ఆరు ప్రత్యేక అవార్డులు దక్కాయి. అలాగే, ప్రజాకవి, దివంగత కాళోజీకి స్పెషల్ జ్యూరీ అవార్డు ప్రకటించారు.

వివరాలు -16లో

ఈ దఫా మొత్తం రేవంతే సీఎం



ఇందులో ఎలాంటి గందరగోళం లేదు

- రేవంత్‌రెడ్డి అర్ధరాత్రి కూడా రాహుల్‌ను కలవగలరు
- శిశుపాలుడిలా కేసీఆర్ తప్పులు 99కి చేరాయి
- ఇంకా ఒక్క తప్పు మాత్రమే మిగిలి ఉంది
- కాళేశ్వరం విషయంలో ఎంత పెద్దవారున్నా వదలం
- ఆగస్టు 15లోగా ధరణి భూబకాసురుల చిట్టా తేలుస్తాం

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి చిట్‌చాట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఈ దఫా పూర్తికాలం రేవంత్‌రెడ్డే ముఖ్యమంత్రిగా ఉంటారని, ఈ విషయంలో ఎలాంటి గందరగోళం లేదని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్‌కు రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదని కొందరు అనవసర రాద్ధాంతం చేస్తున్నారని.. కాంగ్రెస్ సీఎంలతో రాహుల్ నిత్యం హాట్ లైన్‌లో అందుబాటులోనే ఉంటారని చెప్పారు. శుక్రవారం సచివాలయంలోని

మిగతా 2వ పేజీలో ▶

కూర్పు కుదిరినట్టేనా!



- పీసీసీ కొత్త కమిటీలపై భిన్నాభిప్రాయాలు
- సామాజిక సమీకరణలకు ప్రాధాన్యమిచ్చిన అధిష్టానం
- 66 మందిలో 40 వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ నేతలు
- జూనియర్లకు ప్రాధాన్యం ఇవ్వటంపై సీనియర్ల పెదవి విరుపు
- ప్యారాచూట్లకు ప్రాధాన్యమిచ్చారనే విమర్శలు

14లో

పరికరాల్లేకే ప్రాణనష్టం

గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదం బాధితురాలి ఆరోపణ



- ఫైరింజన్‌లో సరిపడా నీళ్లు లేవు.. పైపులకూ రంధ్రాలు
- కనీసం టార్చ్‌లైట్ లేదు
- ఆక్సిజన్ మాస్కులు లేవు
- అందుకే అగ్నిమాపక సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టలేదు
- 6:45కి వచ్చినా 8:04 వరకు ఏం చెయ్యలేకపోయారని ఆవేదన

2లో

ఇదండీ సంగతి



గ్రేటర్‌లో వాహనాలు 85,22,284

బైక్‌లు 62.85 లక్షలు.. కార్లు 15.72 లక్షలు



గ్రేటర్‌లో మొత్తం వాహనాలు ఇలా..		
బైక్‌లు	:	62,85,582
కార్లు	:	15,72,795
క్యాబ్‌లు	:	85,991
మ్యాక్సీక్యాబ్‌లు	:	15,165
ఆటోరిక్షాలు	:	1,08,489
కాంట్రాక్ట్ క్యారేజ్	:	7,795
ఈ–రిక్షాలు	:	64
స్కూల్ బస్సులు	:	15,354
వస్తు రవాణా వాహనాలు	:	3,28,959
స్టేజీ క్యారేజ్‌లు	:	9,213
ప్రైవేట్ సర్వీస్ వాహనాలు	:	2,354
ట్రాక్టర్ ట్రైలర్స్	:	48,141
ఇతర వాహనాలు	:	42,382
మొత్తం	:	85,22,284

గ్రేటర్‌లో ద్విచక్ర వాహనాలు టాప్‌గేర్‌లో పరుగులు తీస్తున్నాయి. ఏటా లక్షలాది వాహనాలు కొత్తగా వచ్చిచేరుతున్నాయి. సామాన్య, మధ్యతరగతి వర్గాల్లో ఉద్యోగ, ఉపాధి పనులు, వ్యాపార కార్యకలాపాల్లో టూవీలర్ల వినియోగం అనూహ్యంగా పెరిగింది. ఆ తరువాత రెండోస్థానంలో వ్యక్తిగత కార్లే రయ్‌మంటూ దూసుకుపోతున్నాయి. రవాణాశాఖ తాజా గణాంకాల ప్రకారం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ప్రస్తుతం అన్ని రకాల వాహనాల సంఖ్య 85,22,286కు చేరింది. ఇందులో ద్విచక్రవాహనాలు 62,85,582 ఉన్నాయి. మొత్తం వాహనాల్లో ఇంచుమించు మూడొంతులు ఇవే కావడం గమనార్హం. మధ్యతరగతి, ఉన్నతాదాయ వర్గాలు ఎక్కువగా వినియోగించే కార్లు 15,72,795కు చేరుకున్నాయి. మహానగర విస్తరణకు అనుగుణంగా

ఏటా భారీగా పెరుగుతున్న వ్యక్తిగత వాహనాలు

ఉద్యోగ, ఉపాధి పనుల కోసం భారీగా పెరిగిన బైక్‌ల వినియోగం

ప్రజారవాణా వాహనాల తగ్గుముఖం • రవాణాశాఖ తాజా గణాంకాల వెల్లడి

ప్రజా రవాణా సదుపాయాలు విస్తరించకపోవడం వల్ల వ్యక్తిగత వాహనాల వినియోగం అనివార్యంగా మారింది. ఇదే సమయంలో సిటీబస్సుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. నాలుగేళ్ల క్రితం 3,580 బస్సులు అందుబాటులో ఉంటే ఇప్పుడు 2,500 మాత్రమే ఉన్నాయి. నిజానికి రవాణా రంగానికి చెందిన నిపుణుల అంచనాల మేరకు సుమారు 6,000 బస్సులు అందుబాటులోకి రావలసి ఉండగా అందుకు భిన్నంగా వాటి సంఖ్య తగ్గింది. మరోవైపు ప్రయాణికుల డిమాండ్ మేరకు మెట్రోరైళ్లు పెరగలేదు. కోవిడ్ నుంచి ఎంఎంటీఎస్‌ల వినియోగం కూడా తగ్గింది. - సాక్షి, హైదరాబాద్

ఏటా 3 లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలు కొత్తగా రోడ్డెక్కుతున్నాయి. ప్రతి మనిషికి ఒక మొబైల్ ఫోన్ తప్పనిసరి అయినట్లుగానే బైక్ కూడా తప్పనిసరిగా మారింది. 18 ఏళ్లు దాటిన యువత మొదలుకొని 65 ఏళ్లు దాటిన వయోధికుల వరకు ద్విచక్ర వాహనాలపైనే ఆధారపడి ప్రయాణం చేస్తున్నారు. మరోవైపు, ఆన్‌లైన్ కొనుగోళ్లు పెరగడంతో డెలివరీ వర్కర్ల సంఖ్య కూడా బాగా పెరిగింది. బైక్‌ట్యాక్సీ సేవలూ పెరిగాయి. కార్ల విషయానికొస్తే.. ఏటా లక్షకు పైగా కొత్తవి రోడ్డెక్కుతున్నాయి. ఇంటిల్లిపాది కలిసి వెళ్లేందుకు కారు సౌకర్యవంతంగా ఉండటంతో వీటి కొనుగోళ్లు పెరుగుతున్నాయి.

హైస్పీడ్‌లో బైక్

వ్యక్తిగత వాహనాల వినియోగం ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న దృష్ట్యా మరో రెండు, మూడేళ్లలో గ్రేటర్‌లో వాహనాల సంఖ్య కోటికి చేరుకొనే అవకాశం ఉంది. ఏటా 5 లక్షల వాహనాలు కొత్తగా నమోదవుతున్నాయి. కాగా, రహదారుల విస్తరణ లేకపోవడం వల్ల రోడ్లపై వాహనాల రద్దీ భారీగా పెరిగి గ్రిడ్‌లాక్ అయ్యే ప్రమాదం కూడా ఉందని నిపుణులు చెబుతున్నారు.


త్వరలో కోటి బండ్లు

సొంత బండి ఆదాయమార్గమైంది

ప్రజారవాణా సదుపాయాలను బాగా పెంచి వ్యక్తిగత వాహనాల వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉంది. కానీ ఇటీవల కాలంలో ద్విచక్ర వాహనం కేవలం ప్రయాణ సాధనమే కాకుండా ఒక ఆదాయమార్గంగా మారింది. బండి ఉంటే చాలు ఏదో ఒక ఉపాధి లభిస్తుందనే భరోసా ఏర్పడింది. జీవితంలోని అన్ని రంగాల్లోకి ఆన్‌లైన్ మార్కెట్ విస్తరించింది. ఇది ఒక అనివార్యమైన పరిస్థితి. అందుకే మిగతా కేటగిరీలకు చెందిన వాటి కంటే బైక్‌లే ఏటా ఎక్కువగా నమోదవుతున్నాయి.

– సి.రమేశ్, జేటీసీ, హైదరాబాద్

గత మూడేళ్లలో కొత్తగా నమోదైన వాహనాలు



ఉద్యోగ విరమణ రోజే పింఛను ఉత్తర్వులు

ఈపీఎఫ్‌వో 'ప్రయాస్'లో పంపిణీ

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయిస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) రంగారెడ్డి (హైదరాబాద్) ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం 'ప్రయాస్'పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉద్యోగ విరమణ చేస్తున్న పలువురు చందాదారులకు పెన్షన్ పేమెంట్ ఆర్డర్లను (పీపీవోలు) పంపిణీ చేశారు. రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్–1 తేజ్ ప్రతాప్‌సింగ్ యాదవ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. రంగారెడ్డి (హైదరాబాద్) రీజనల్ కార్యాలయం పరిధిలోని వివిధ సంస్థల్లో మే 30వ తేదీన ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు అధికారులు పీపీవోలను అందజేశారు. కార్యక్రమంలో రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్–2 వి.వాసవి, అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ కె.వి.ఎస్.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటు పేరుతో టీచర్లే లేకుండా చేస్తారా?

టీఎస్ యూటీఎఫ్ మండిపాటు

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు, అభ్యాసనా సామర్థ్యాలను పెంచాలని అందుకు ఉపాధ్యాయులే బాధ్యత వహించాలని చెప్పిన అధికారులు.. సర్దుబాటు పేరిట ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకుండా చేయడం దారుణమని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్ యూటీఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చావ రవి, ఎ.వెంకట్ విమర్శించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు ఏటేటా తగ్గిపోతోందని, ఈ సంవత్సరం నమోదు పెంపుకోసం సమష్టిగా కృషి చేద్దామని చెప్పిన విద్యాశాఖ అధికారులు ఏకపక్షంగా సర్దుబాటు ఉత్తర్వులు ఇవ్వడం ఏంటని ప్రశ్నించారు. అధికారుల మాటలు నమ్మి విద్యార్థుల నమోదు కోసం క్యాంపెయిన్ నిర్వహిస్తున్నామని, కానీ వాటిని నీరుగార్చే విధంగా ప్రభుత్వ చర్యలున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు.

సరిపడా నీళ్లు లేవు.. ఉన్న పైపులకూ రంధ్రాలు

పరికరాల్లేకే ప్రాణనష్టం!

గుల్జార్‌హౌస్ అగ్నిప్రమాదం బాధితురాలి ఆరోపణ

- కనీసం టార్చ్‌లైట్ లేదు.. ఆక్సిజన్ మాస్కులు లేవు..తలుపులు పగులగొట్టే పరికరాల్లేవు
- అందుకే అగ్నిమాపక సిబ్బంది వెంటనే సహాయక చర్యలు చేపట్టలేదు
- 6:45కి వచ్చినా 8:04 వరకు ఏం చెయ్యలేకపోయారు
- తల్లిదండ్రులు, కుమార్తె సహా బంధువుల్ని కోల్పోయిన మహిళ ఆవేదన
- అంబులెన్సుల్లో ఆక్సిజన్ లేదు.. సీపీఆర్ చెయ్యలేదు
- ఉస్మానియా వైద్యులు కాళ్లు పట్టుకున్నా వైద్యం చేయలేదన్న బాధితురాలి కుమారుడు
- వీటన్నిటిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్

పంజగుట్ట (హైదరాబాద్): హైదరాబాద్ పాతబస్తీలోని గుల్జార్‌హౌస్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 17 మంది మృతి చెందడానికి.. అగ్నిమాపక సిబ్బంది వద్ద సరైన పరికరాలు లేకపోవడం, ఫైర్ సిబ్బంది సరిగా స్పందించక పోవడమే కారణమని ఈ ఘోర ప్రమాదంలో తన తల్లిదండ్రులు, కుమార్తె, ఇతర కుటుంబ సభ్యులను పోగొట్టుకున్న సంతోష్‌గుప్తా (భవన యజమాని ప్రహ్లాద్ మోదీ కుమార్తె) ఆరోపించారు. 'ఫైర్ ఇంజన్‌లో సరిపడా నీళ్లు లేవు. పైపులకు రంధ్రాలు ఉండడంతో మన ఇంట్లో ట్యాప్‌లో ఎలా వస్తాయో అలా నీళ్లు బయటకు వస్తున్నాయి. ఆక్సిజన్ మాస్కులు లేవు. సిబ్బంది వద్ద కనీసం టార్చ్‌లైట్ కూడా లేదు. తలుపులు, గోడలు పగలగొట్టేందుకు ఎలాంటి పరికరాలు లేవు. దీంతో బాధితులను కాపాడేందుకు వారు ప్రయత్నించలేదు. ఉదయం 6:45కు ఫైర్ ఇంజన్లతో వచ్చినా 8:04 వరకు ఏం చెయ్యలేకపోయారు. ఈ సమయంలో లోపల ఉన్నవారు దట్టమైన పొగ కారణంగా బయటకు రాలేక, ఆ పొగ పీల్చుకోవడంతో మృతి చెందారు..'అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నెల 18వ తేదీ ఉదయం జరిగిన ఘోర ప్రమాదం నుంచి తప్పించుకుని బయటకు వచ్చిన ప్రహ్లాద్ మోదీ ఇద్దరు కుమార్తెల్లో ఈమె ఒకరు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తన కుమారుడు నితీష్, సమీప బంధువు అతుల్ అగర్వాల్‌తో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు.

నేను, నా సోదరి బయటికొచ్చాం..: 'ఉదయం 5:55కు పొగ వాసన వస్తుండటంతో నిద్ర లేచా. కుటుంబ సభ్యులు కొందరిని అప్రమత్తం చేశా. పొగ ఎక్కడనుండి వస్తోందో చూసేందుకు నేను, నా సోదరి ఒకామె 6:05 సమయంలో కిందకు వెళ్లాం. నలుగురు పైకి వెళ్లారు. అప్పటికే మొదటి అంతస్తు నుంచి దట్టమైన పొగలు వస్తున్నాయి. తర్వాత పెద్ద శబ్దంతో పాటు ఆవరణలో మంటలు వచ్చాయి. ఉదయం 6:12కు అగ్నిమాపక సిబ్బందికి (101కు) ఫోన్ చేశాం. 6:16కు 100కు ఫోన్ చేసి బాధితులు ఎక్కువగా ఉన్నారని కనీసం 10 అంబులెన్సులు పంపించాలని కోరాం.

మమ్మల్ని టార్చిలైట్ తెమ్మన్నారు..

ఉదయం 6:45కు ఒక ఫైర్ ఇంజన్, ఒక అంబులెన్స్ వచ్చింది. ఫైర్ ఇంజన్ పైపులకు రంధ్రాలు ఉండడంతో ప్రెజర్ రావడం లేదు. ఫైర్ సిబ్బంది పైపులను సరిచెయ్యలేకపోయారు. వారి వద్ద కనీసం టార్చ్‌లైట్ కూడా లేదు. మమ్మల్ని టార్చ్ తెమ్మని అడిగారు. కొందరు స్థానికులు లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు కానీ సిబ్బంది మాత్రం సరైన సమయంలో లోనికి వెళ్లలేకపోయారు.

అంబులెన్సులో సౌకర్యాలు లేవు..

నితీష్‌తో పాటు స్థానికులు కొంతమంది 8:04 సమయంలో ధైర్యంగా లోనికి వెళ్లి కొంతమందిని బయటకు తీసుకువచ్చారు. కానీ అప్పటికే వారు బాగా పొగ పీల్చడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లారు. ఇక అంబులెన్సుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. ఒక్క అంబులెన్సులో ఆక్సిజన్ లేదు. బయటకు తీసుకువచ్చిన బాధితులకు సిబ్బంది కనీసం సీపీఆర్ కూడా చెయ్యలేదు..'అని సంతోష్ గుప్తా ఆరోపించారు.



మీడియాతో మాట్లాడుతున్న సంతోష్ గుప్తా

కాళ్లు పట్టుకున్నా కనికరించలేదు..

'అంబులెన్సు డ్రైవర్ ప్రైవేట్ ఆసుపత్రికి వెళదాం అంటే ఒప్పుకోకుండా ఉస్మానియా ఆసుపత్రికి తీసుకువెళ్లాడు. అక్కడకు తీసుకువెళ్లిన ముగ్గురు అప్పటికి బతికే ఉన్నారు. కానీ ఉస్మానియా వైద్యులు ఎఫ్ఐఆర్ చూపించాలని, లేనిపక్షంలో పోలీస్ అధికారులు వచ్చి చెబితేనే చికిత్స చేస్తామని పట్టుబట్టి కూర్చున్నారు..'అని నితీష్ తెలిపారు. డాక్టర్ కాళ్లు పట్టుకున్నా తాను చికిత్స చెయ్యను అంటే చెయ్యను అన్నారని చేసేది లేక 15 నిమిషాల తరువాత మలక్‌పేట యశోదా ఆసుపత్రికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. ఈలోగా బతికి ఉన్న వారు కూడా చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

కమిటీ మమ్మల్ని సంప్రదించలేదు

రాష్ట్రపతి, ప్రధాని, సీఎంకు లేఖలు

ఘోర అగ్ని ప్రమాదంపై ప్రభుత్వం ఆరుగురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసినా, సదరు కమిటీ ఏదీ ఇప్పటివరకు తమను సంప్రదించలేదని బాధితులు తెలిపారు. ఫైర్ సిబ్బంది వద్ద సరైన పరికరాలు ఉండి ఉంటే, సుమారు గంటన్నర సమయం వృధా చేసి ఉండకపోతే, సరైన సిబ్బంది ఉండి ఉంటే.. అన్ని ప్రాణాలు పోయేవి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ యావత్ ఉదంతంపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో రాష్ట్రపతి, ప్రధానమంత్రి, ఢిల్లీలోని డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫైర్ సేఫ్టీ విభాగానికి, రాష్ట్ర ముఖ్యమంత్రికి సైతం లేఖలు రాసినట్లు వెల్లడించారు.



తెలంగాణ స్టాల్‌ను పరిశీలిస్తున్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్

'అగ్రి' టెక్నాలజీలో తెలంగాణ అద్భుతం

- కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసలు
- భువనేశ్వర్‌లో వీక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: వ్యవసాయం, ఉద్యానవన పంటల సాగులో సాంకేతికత వినియోగించుకోవడంలో తెలంగాణ తీరు అద్భుతమని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రశంసించారు. మామిడి పిందె దశ నుంచే బ్యాగింగ్‌తో మంచి ఫలితాలు సాధిస్తోందని.. దేశమంతా దీన్ని అవలంబించాల్సిన అవసరముందని చెప్పారు. అలాగే భవిష్యత్‌లో రైతులకు బ్యాగింగ్‌కు సబ్సిడీ ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తామన్నారు. భువనేశ్వర్‌లోని ఒడిశా వ్యవసాయ, సాంకేతిక విశ్వవిద్యాలయ క్యాంపస్‌లో వీక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్‌ను శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రారంభించారు. అనంతరం ఒడిశా సీఎం మోహన్ చరణ్ మాఝీ తదితరులతో కలసి స్టాళ్లను పరిశీలించారు. దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాలు దాదాపు 450 రకాల మామిడిలను ప్రదర్శించారు. రాష్ట్రంలోని కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం తరఫున శాస్త్రవేత్త పోరిక హరికాంత్ హాజరయ్యారు. బంగినపల్లి, దశహరి లాంటి రకాలతోపాటు సార రకాన్ని కూడా ప్రదర్శించారు. శుక్రవారం తెలంగాణ స్టాల్‌ను పరిశీలించిన మంత్రి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. సార మామిడి ఒక్కటి రెండు కిలోల వరకు ఉంటుందని చెప్పడంతో ఆశ్చర్యం వ్యక్తం చేశారు. తెలంగాణ పండ్లు ఎలాంటి మచ్చలు లేకుండా, ఎక్కువ తీపితో ఉండటం గురించి అడిగి తెలుసుకున్నారు. కాగా, తెలంగాణ మామిడి బ్యాగింగ్ వీడియోను అధికారిక ఫేస్‌బుక్ పేజీ, ఇతర వెబ్‌సైట్‌లో పోస్టు చేశారు. కార్యక్రమంలో హరికాంత్ వెంట టెక్నికల్ అసిస్టెంట్ ఎం.అఖిలేశ్ పాల్గొన్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో 'యంగ్ ఇండియా' స్కూళ్లు

వసతులు లేని ఇతర రెసిడెన్షియల్ స్కూళ్లు 'ఇంటిగ్రేటెడ్'కు తరలింపు

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో వెనుకబడిన వర్గాల నుంచి వచ్చే పిల్లలకు అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో బోధన సాగించేందుకు అత్యాధునిక మౌలిక వసతులతో రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేయనుంది. రాష్ట్రంలోని దాదాపు 600 ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలల్లో గత ప్రభుత్వం ఎలాంటి వసతులు కల్పించలేదని, అవన్నీ దాదాపు ప్రైవేట్ అద్దె భవనాల్లో నడుస్తున్నాయని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. వసతులు లేని ఈ రెసిడెన్షియల్ పాఠశాలలను ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌కు తరలించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పాఠశాలల్లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన క్రీడా వసతులతో పాటు బోధన, బోధనేతర సిబ్బందికి నివాస గృహాలు, ప్రతి పాఠశాలలో 2,650 మంది విద్యార్థులకు వసతి కల్పించనున్నట్లు ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

5.36 లక్షల చదరపు అడుగుల్లో నిర్మాణం..: యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూళ్లలో నాలుగు అకడమిక్ బ్లాక్‌లు ఉంటాయి. జీ+2 ఫ్లోర్లతో 1,60,339 చదరపు అడుగుల్లో వీటిని నిర్మిస్తారు. డార్మెటరీలను జీ+3 ఫ్లోర్లతో ఆరు బ్లాక్‌లుగా 2,57,451 చదరపు అడుగుల్లో నిర్మిస్తారు. ఇక డైనింగ్ కమ్ కిచెన్‌ను జీ+1 ఫ్లోర్లతో 41,860 చదరపు అడుగులు, 3 బీహెచ్‌కే ప్రిన్సిపాల్ క్వార్టర్లను నాలుగు యూనిట్లు ఒక బ్లాక్‌గా జీ+1 ఫ్లోర్లతో 7,483 చదరపు అడుగుల్లో నిర్మిస్తారు. వీటితోపాటు ఇతర సిబ్బందికి కూడా క్వార్టర్లు ఉంటాయి. మొత్తంగా 5,36,194 చదరపు అడుగుల వైశాల్యంతో ఒక్కో రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణం ఉంటుందని తెలిపింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయాలకు నిర్ణయించిన ధరలతో పోలిస్తే రెసిడెన్షియల్ స్కూల్స్‌కు చాలా తక్కువ వ్యయం అవుతోందని ప్రభుత్వం వెల్లడించింది.

మూడోరోజూ కొనసాగిన కాంగ్రెస్ సమీక్షలు

నల్లగొండ, భువనగిరి పార్లమెంటు నేతలతో మీనాక్షి నటరాజన్ ముఖాముఖి... నేడు ఖమ్మం జిల్లాలో మీనాక్షి, డిప్యూటీ సీఎం భట్టి, మహేశ్‌గౌడ్ పర్యటన

సాక్షి హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గాల వారీ సమీక్షలు కొనసాగుతున్నాయి. మూడోరోజు శుక్రవారం పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నల్లగొండ, భువనగిరి లోక్‌సభ నియోజకవర్గాల నేతలతో మాట్లాడారు. రెండు నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు, అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులతో ముఖాముఖి మాట్లాడిన ఆమె ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీ పరిస్థితి, రాజకీయ సమీకరణలు, రాష్ట్ర ప్రభుత్వ పనితీరు, సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై ప్రచారం, స్థానిక సంస్థల ఎన్నికలు తదితర అంశాలపై నాయకుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. జనగామ నియోజకవర్గం నుంచి గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన కొమ్మూరి ప్రతాపరెడ్డి ఓటమిపై మీనాక్షి ఆరా తీసినట్టు తెలిసింది. 'మీరు ఎందుకు ఓడిపోయారు?'అని ప్రతాపరెడ్డిని మీనాక్షి ప్రశ్నించగా.. కాంగ్రెస్ పార్టీ నేతలే ఇందుకు కారణమని ఆయన చెప్పినట్లు సమాచారం. కాగా, మీనాక్షి నటరాజన్, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ శనివారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటల నుంచి ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల సమీక్ష అనంతరం ఆదివాసీ విభాగం సమావేశంలో వారు పాల్గొంటారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీలు బలరాం నాయక్, రఘురామ్ రెడ్డి, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల పార్టీ అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ నాయకులు ఈ సమావేశాలకు హాజరుకానున్నారని తెలిపాయి.

ఈ దఫా మొత్తం రేవంతే సీఎం

▶ మొదటి పేజీ తరువాయి

తన చాంబర్‌లో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. 'సీఎంకు రాహుల్‌గాంధీ అపాయింట్‌మెంట్ ఇవ్వడంలేదని కొందరంటున్నారు. కొన్నిసార్లు కొన్ని కారణాల వల్ల రాహుల్‌గాంధీని రేవంత్ కలవలేకపోవచ్చు. అంతమాత్రాన కొంపలేం అంటుకుపోవు. పచ్చకామెర్లవాడికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు ఈ అంశానికి కలర్ పూయాల్సిన అవసరం లేదు. రాహుల్‌గాంధీని అర్ధరాత్రి అయినా రేవంత్‌రెడ్డి కలవగలరు. అయినా, సీఎంలు, పీసీసీ అధ్యక్షులతో రాహుల్‌గాంధీ హాట్‌లైన్‌లో మాట్లాడుతుంటారు'అని చెప్పారు.

తప్పుచేసి దొరికినా దబాయింపా?

కాళేశ్వరం విషయంలో అబద్ధాన్ని నిజంగా, నిజాన్ని అబద్ధంగా చిత్రీకరించేందుకు బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని పొంగులేటి విమర్శించారు. తాము తలుచు కుంటే కేసీఆర్‌ను మొదటి ముద్దాయిగా ఎప్పుడో విచారణకు పిలిపించేవారమని అన్నారు. తప్పు చేసి రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన తర్వాత కూడా దబాయించాలని చూస్తున్నారని మండిపడ్డారు. ఒక్క తప్పు చేస్తే వెంటనే శిక్ష వేయవచ్చని, కానీ కేసీఆర్ తప్పులు శిశుపాలుడి తరహాలో 99 వరకు వచ్చాయని.. ఇంకొక్కటి మాత్రమే మిగిలిందని అన్నారు. ఎనిమిదో వింతను కట్టానని చెప్పుకునే వ్యక్తి మేడిగడ్డ బరాజ్‌పై ఓ నివేదిక ఇవ్వొచ్చు కదా అని ప్రశ్నించారు. కమిషన్ ముందుకు వచ్చి తాను శిల్పినని కేసీఆర్ పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇస్తారా? అని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం అవినీతిలో ఎంత పెద్దవారున్నా తీవ్ర కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

2.10 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక

కాంగ్రెస్ ప్రభుత్వ ప్రస్తుత దఫాలోనే రాష్ట్రంలో ఇళ్లులేని పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని పొంగులేటి స్పష్టంచేశారు. 'ఈ పథకంలో భాగంగా తొలి విడత కింద 2.10 లక్షల మంది లబ్ధిదారుల జాబితాను ఫైనల్ చేశాం. పైలట్ ప్రాజెక్టు కింద తీసుకున్న గ్రామాల్లో 42 వేల ఇళ్లను మంజూరు చేస్తే, అందులో 24 వేల ఇళ్ల నిర్మాణం ప్రారంభమైంది. వాటికి రూ.135 కోట్లు చెల్లించాం. ప్రతి సోమవారం చెల్లింపులు జరుపుతున్నాం. 33 గృహాలకు 15 – 20 రోజుల్లో గృహ ప్రవేశాలు జరుగుతాయి. ఇంకా 1.15 లక్షల మంది జాబితాను తయారు చేయాల్సి ఉంది. జూన్10 లోపు అది కూడా పూర్తి చేస్తాం. ప్రతిపక్ష ఎమ్మెల్యేలున్న చోట్ల 40 శాతం ఇండ్లకు వారి సిఫారసులు తీసుకుంటున్నాం. ఆ సిఫారసులను గెజిటెడ్ అధికారి పరిశీలించి అర్హులను ఎంపిక చేస్తారు'అని మంత్రి తెలిపారు.

అసైన్డ్ భూముల్లో పేదలకు పట్టాలు

భూభారతి పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించిన నాలుగు మండలాల్లో ఉన్న 625 ఎకరాల అసైన్డ్ భూముల్లో వ్యవసాయ యోగ్యమైనవాటికి పేదలకు పట్టాలు ఇస్తామని పొంగులేటి చెప్పారు. సుప్రీంకోర్టు స్టే ఎత్తివేయగానే సాదా బైనామాల సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే 700 మంది ప్రభుత్వ సర్వేయర్లను నియమిస్తున్నామని వెల్లడించారు. ధరణి పోర్టల్ ఫోరెన్సిక్ ఆడిట్‌కు సంబంధించిన చర్చలు పూర్తికావచ్చాయని, మరో వారంలో ఇందుకు సంబంధించిన ఉత్తర్వులిచ్చి ఆగస్టు 15లోపు భూబకాసురుల చిట్టా తేలుస్తామని చెప్పారు.

కవిత ఎపిసోడ్ టీకప్పులో తుఫాన్‌లాంటిది

బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ కవిత ఎపిసోడ్ టీకప్పులో తుఫాన్ లాంటిదని పొంగులేటి అన్నారు. 'కొందరు ఆడమంటే మరికొందరు ఆడుతుంటారు. అది కుటుంబ పంచాయితీ. కవిత బీజేపీలోకి వెళ్తారని ఒకరు.. కాంగ్రెస్‌లోకి వస్తారని మరికొందరు అంటున్నారు. దెయ్యాలు, భూతాలు, దేవుళ్లంటూ మాట్లాడుతున్నారు. దెయ్యాలెవరో కవిత చెప్పొచ్చు కదా?'అని ప్రశ్నించారు. తన ఇంటికి ఈడీ అధికారులెవ్వరూ రాలేదని పొంగులేటి స్పష్టంచేశారు. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ ఒకరోజు ముందో.. వెనుకో జరుగుతుందని పేర్కొన్నారు.

ఉదయం 9:30 లోపు జెండా ఎగరేయాలి


2న అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, జిల్లా కేంద్రాల్లో రాష్ట్ర ఆవిర్భావ వేడుకలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా జూన్ 2వ తేదీన అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఉదయం 9:30 గంటల కల్లా పూర్తి కావాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఎమ్మెల్యేలు, మేయర్లు, జెడ్పీ చైర్మన్లు, ప్రత్యేకాధికారులు, డీసీసీబీ, డీసీఎంఎస్, మున్సిపల్ చైర్మన్లు, ఇతర ప్రధాన కార్యాలయాల్లో ఈ కార్యక్రమం జరగాలని, అదే సమయంలో మండల కేంద్రాలు, గ్రామాల్లో కూడా జెండాలు ఆవిష్కరించాలని వెల్లడించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు శుక్రవారం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రస్థాయిలో ఈ వేడుకలను ఉదయం 10 గంటలకు ఘనంగా నిర్వహించనుండగా, సీఎం రేవంత్‌రెడ్డి జెండా ఆవిష్కరణ చేస్తారు. జిల్లా కేంద్రాల్లో అమరవీరుల స్తూపాల వద్ద నివాళి అర్పించిన అనంతరం జెండా ఆవిష్కరణ జరగనుంది. ఈ వేడుకల్లో జెండా ఆవిష్కరణ చేసే అతిథులను కూడా ఈ ఉత్తర్వుల్లో ప్రకటించారు. ఈ వేడుకల్లో ప్లాస్టిక్ జెండాలను ఉపయోగించకూడదని సీఎస్ రామకృష్ణారావు విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ఏ జిల్లాకు ఎవరంటే! సాక్షి ప్లస్ ఈ పేపర్‌లో

సర్కారు బడుల్లో టీచర్ల సర్దుబాటు

- విద్యార్థులు, టీచర్ల నిష్పత్తి ఆధారంగా బదిలీలు
- తాత్కాలిక ప్రాతిపదికన అదనపు టీచర్ల డిప్యుటేషన్
- జిల్లా పరిధిలోని పాఠశాలలకు మాత్రమే పరిమితం
- జూన్ 13 నుంచి కొత్త పాఠశాలలో టీచర్ల విధులు
- వేతనాలు మాత్రం వాస్తవ పోస్టింగ్ ఉన్నచోటనే..
- ఉత్తర్వులు జారీ చేసిన పాఠశాల విద్యాశాఖ



సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు పాఠశాల విద్యాశాఖ సర్దుబాటు వ్యూహాన్ని అమలు చేస్తోంది. టీచర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న పాఠశాలల నుంచి తక్కువ టీచర్లు ఉన్న సమీప పాఠశాలలకు సర్దుబాటు చేసేందుకు అవకాశం కల్పించింది. తాత్కాలిక బదిలీలు/ డిప్యుటేషన్ పద్ధతిలో సర్దుబాటు చేసుకోవాలని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేసింది. గతేడాది 11 వేల టీచర్ పోస్టులు భర్తీ చేయటంతో ప్రస్తుతం చాలా పాఠశాలల్లో సంతృప్తికర స్థాయిలో టీచర్ల సంఖ్య ఉంది. అయితే, కొన్నిచోట్ల విద్యార్థుల నిష్పత్తి కంటే ఎక్కువ మంది టీచర్లుండగా, మరికొన్ని చోట్ల సరిపడా లేరు. దీంతో ఆ స్కూళ్లలో అవసరాన్ని బట్టి విద్యావలంటీర్లను నియమిస్తూ వస్తున్నారు. 2025–26 విద్యా సంవత్సరంలో విద్యావలంటీర్ల అవసరాన్ని తగ్గించి అందుబాటులో ఉన్న టీచర్ల సేవలు వినియోగించుకునేందుకు సర్దుబాటు అవకాశం కల్పించారు. ఈ మేరకు విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది.

గిరిజన ప్రాంతాల నుంచి బదిలీలు వద్దు

విద్యార్థులు–ఉపాధ్యాయుల నిష్పత్తి విధానంపై పాఠశాల విద్యాశాఖ స్పష్టత ఇచ్చింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలకు సంబంధించి ఒక పాఠశాలలో పదిలోపు విద్యార్థులుంటే ఒక టీచర్, 11 నుంచి 60 మంది ఉంటే ఇద్దరు, 61–90 మంది పిల్లలున్నచోట్ల ముగ్గురు, 91–120 మధ్య ఉంటే నలుగురు, 121–150 మంది ఉంటే ఐదుగురు, 151–200 మధ్య విద్యార్థులుంటే ఆరుగురు టీచర్లు ఉండాలి. ఈ దిశగా కసరత్తు చేయాలని విద్యాశాఖ సూచించింది. ఏజెన్సీ ప్రాంతాల్లోని టీచర్లను మైదాన ప్రాంతాలకు పంపొద్దని, అదే సమయంలో ఏజెన్సీల్లో తగినంత మంది టీచర్లు లేకపోతే మైదాన ప్రాంతాల నుంచి డిప్యుటేషన్‌పై పంపాలని కోరింది. విద్యార్థుల నిష్పత్తి కంటే ఎక్కువ మంది టీచర్లు ఉన్నచోట జూనియర్ టీచర్‌ను సర్‌ప్లస్ కేటగిరీలోకి చేర్చి అవసరమున్న సమీప పాఠశాలకు పంపించాలి. నిబంధనలకు అతీతంగా చేసే సర్దుబాట్లు చెల్లుబాటు కావని స్పష్టం చేసింది. డిప్యుటేషన్‌పై కొత్తగా సర్దుబాటు చేసిన పాఠశాలలో జూన్ 13వ తేదీ నుంచి టీచర్లు విధులు నిర్వహించాల్సి ఉంటుందని పేర్కొంది. ఈ డిప్యుటేషన్ విధులు నిర్వహించడానికే పరిమితమని, వాస్తవ పోస్టింగ్ ఉన్నచోటి నుంచే వేతనం పొందాల్సి ఉంటుందని వెల్లడించింది. సర్దుబాటు చేసిన టీచర్ల జాబితాను జూన్ 30వ తేదీ కల్లా జిల్లా కలెక్టర్లు పాఠశాల విద్యాశాఖ రాష్ట్ర కార్యాలయానికి సమర్పించాలన్నారు.

ఐదు స్థాయిల్లో సర్దుబాట్లు

టీచర్ల సర్దుబాటులో ఐదు స్థాయిలను పాఠశాల విద్యాశాఖ నిర్దేశించింది. తొలుత గ్రామ పంచాయతీ స్థాయి, ఆ తర్వాత కాంప్లెక్స్ పరిధి, మండల పరిధి, సమీప మండల పరిధి, చివరగా జిల్లాలోని మండల పరిధికి డిప్యుటేషన్లను పరిమితం చేయాలని సూచించింది. ఈ సర్దుబాటు ప్రక్రియంతా జిల్లా కలెక్టర్ అనుమతితోనే నిర్వహించాల్సి ఉంటుంది.

- ఉన్నత పాఠశాలల్లో ప్రతి సబ్జెక్టుకు ఒక టీచర్ తప్పకుండా ఉండాలి.
- 220 మంది విద్యార్థులున్న హైస్కూల్‌లో కనీసం ఏడుగురు టీచర్లుండాలి.
- 221–250 మధ్య విద్యార్థులుంటే 8 మంది టీచర్లు, 251–280 మంది ఉంటే 9 మంది టీచర్లుండాలి. ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక టీచర్ పెరగాలి.

నిమ్స్ సేవలో మేము సైతం..

- ఎన్నారై డాక్టర్ అన్నపూర్ణ రూ.10 కోట్ల విరాళం
- ఎకరంన్నర విస్తీర్ణంలో ఆడిటోరియం



ఎర్రమంజిల్ కాలనీలో నిమ్స్ ఆడిటోరియం నిర్మాణానికి సిద్ధం చేస్తున్న దృశ్యం

లక్డీకాపూల్ (హైదరాబాద్): పేదలకు అత్యాధునిక వైద్య సేవలను ఉచితంగా అందిస్తున్న నిజామ్స్ వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) అభివృద్ధిలో మేము సైతమంటూ పలువురు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారు. నగరానికి చెందిన యూఎస్‌లో స్థిరపడిన డాక్టర్ అన్నపూర్ణ ఆస్పత్రికి అవసరమైన ఆడిటోరియంను నిర్మించేందుకు తన వంతుగా రూ.10 కోట్లు విరాళంగా ఇచ్చారు. దీంతో నిమ్స్‌కు చెందిన ఎర్రమంజిల్‌లోని 1.50 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక హంగులతో కూడిన ఆడిటోరియంను నిర్మించేందుకు యాజమాన్యం సమాయత్తమైంది. తాజ్ కృష్ణా హోటల్ రోడ్డులోని బెంజి షోరూమ్ పక్కన ఉన్న స్థలంలో నిర్మాణానికి సంబంధించిన పనులు చురుగ్గా కొనసాగుతున్నాయి. జూన్ రెండవ వారంలో నిమ్స్ ఆడిటోరియం నిర్మాణానికి భూమి పూజ నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్టు నిమ్స్ ఆర్ఎంఓ, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ డాక్టర్ సయ్యద్ సల్మాన్ తెలిపారు. ఇప్పటి వరకు నిమ్స్‌కు 120 మంది సిట్టింగ్ కెపాసిటీ కలిగిన లెర్నింగ్, 150 మంది సిట్టింగ్ కెపాసిటీ కలిగిన ట్రామా బ్లాక్‌లోని ఆడిటోరియం ఉన్నాయన్నారు. ప్రస్తుత అవసరాలను ఆయా ఆడిటోరియంలు తీర్చలేని పరిస్థితి ఉందని చెప్పారు. ఈ నేపథ్యంలో నిమ్స్‌కు ప్రత్యేకంగా ఆడిటోరియం ఉండాలని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప సంకల్పించారని.. ఆ దిశగా నిమ్స్ అనస్థీషియా విభాగం హెచ్ఓడీ డాక్టర్ పద్మజ యూఎస్‌లోని తన స్నేహితురాలు డాక్టర్ అన్నపూర్ణతో సంప్రదించగా ఆమె సానుకూలంగా స్పందించి ముందుకు వచ్చారన్నారు. ఈ విరాళంతో 750 సిట్టింగ్ కెపాసిటీ, 300 సిట్టింగ్ కెపాసిటీలతో కూడిన సరికొత్త హంగులతో ఆడిటోరియంను నిర్మించతలపెట్టామని వెల్లడించారు.

సెల్‌ఫోన్ లైట్‌తో రోగులకు చికిత్స

జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి దుస్థితి




సెల్‌ఫోన్ వెలుతురులో రోగికి చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

జహీరాబాద్ టౌన్: సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కరెంట్ లేని సమయంలో సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ వెలుతురులో రోగులకు చికిత్స అందించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆస్పత్రిలో జనరేటర్లు ఉన్నా అవి పూర్తిస్థాయిలో పనిచేయడం లేదు. విద్యుత్ సరఫరా నిలిచిపోయినప్పుడు చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. శుక్రవారం కరెంట్ సరఫరా నిలిచిపోవడంతో రోగులకు సెల్‌ఫోన్ లైట్‌లో చికిత్స అందించడం కనిపించింది. జహీరాబాద్ ఆస్పత్రి 65వ జాతీయ రహదారిపై ఉంది. ప్రతి రోజు పెద్ద సంఖ్యలో ఓపీ, ఇన్‌పేషెంట్ రోగులు వైద్య చికిత్సలు పొందుతుంటారు. ఇక్కడ ఆపరేషన్లు కూడా జరుగుతుంటాయి, దీంతో ప్రతి రోజు రద్దీగా ఉంటుంది. అనివార్య కారణాల వల్ల విద్యుత్ నిలిచిపోయినప్పుడు జనరేటర్లను ఆన్ చేయాలి. కానీ జనరేటర్లు పూర్తిస్థాయిలో పనిచేయడంలేదని తెలిసింది. తప్పనిసరి పరిస్థితిలో వైద్య సిబ్బంది సెల్‌ఫోన్ వెలుతురులోనే వైద్య సేవలందిస్తున్నారు. అధికారులు స్పందించి జనరేటర్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని రోగులు, బంధువులు కోరుతున్నారు.



ఏ చట్టప్రకారం నోటీసులిచ్చారో చెప్పాలి

రెవెన్యూ అధికారులకు తేల్చిచెప్పిన హైకోర్టు



సాక్షి, హైదరాబాద్: రెవెన్యూ అధికారులు జారీ చేసే ప్రొసీడింగ్‌లు, నోటీసులలో వాటిని ఏ చట్టం, నిబంధన ప్రకారం ఇస్తున్నారో పేర్కొనాలని హైకోర్టు తేల్చిచెప్పింది. ఏ అధికారం మేరకు వారు ప్రొసీడింగ్స్ జారీ చేశారో చెప్పాలని స్పష్టంచేసింది. ఎలాంటి చట్టం, నిబంధన లేకుండా ప్రొసీడింగ్‌లు జారీ చేయడం కుదరదని చెబుతూ 2019లో మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలం తహసీల్దార్ జారీ చేసిన ఓ ప్రొసీడింగ్‌ను నిలిపివేశారు. ఆ భూమిపై రెవెన్యూ అధికారులు, ప్రైవేట్ పార్టీల మధ్య వివాదం కొనసాగుతోంది. సేత్వార్‌లో దీనిని ఆబాది అని పేర్కొనడం కారణం. ఈ సమస్య కోర్టుకు వెళ్లిన ప్పుడు, ప్రైవేట్ పార్టీలకు నోటీసులు జారీ చేయాలని, వారి వాదనల ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని తహసీల్దార్‌కు ఆదేశాలు జారీ చేసింది. అయితే తహసీల్దార్ ఆ భూమిని ప్రభుత్వ భూమిగా ప్రకటిస్తూ ప్రొసీడింగ్స్ జారీ చేశారు. 'తోల్లా ఖర్కానా'(పాత సర్వే నంబర్ 380) పరిధిలోని 5.30 గుంటల భూమిని ప్రభుత్వ భూమిగా పరిగణించడాన్ని సవాల్ చేస్తూ బుజ్జి బానోత్ సహా 40 మంది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. కోర్టు ఆదేశాలను తహసీల్దార్ తప్పుగా అర్థం చేసుకుని టైటిల్‌ను నిర్ణయించారని పిటిషనర్ న్యాయవాది వాదించారు. 'ఆబాది' భూములు ప్రభుత్వానివే అని రెవెన్యూ జీపీ వాదించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. ఏ చట్టం కింద ప్రొసీడింగ్‌లు జారీ చేశారో తహసీల్దార్ కోర్టును ఒప్పించలేకపోయినందున వాటిని నిలిపివేస్తున్నట్లు చెప్పారు.

లక్ష మందికి.. రూ.లక్ష వరకు!

▶ మొదటి పేజీ తరువాయి

పత్రాలను అందించేలా కసరత్తు ముమ్మరం చేశారు. అయితే దరఖాస్తుదారుల ఆధార్, పాన్‌కార్డులు, బ్యాంకు ఖాతాల ఆధారంగా పరిశీలించి వడపోత అనంతరం తొలి విడత లక్ష మందికి అర్హత కల్పించారు. వీరికి ఈ నెల 2వ తేదీన మంజూరు పత్రాలు ఇవ్వనున్నారు. రూ.50 వేల లోపు యూనిట్లకు పూర్తి సబ్సిడీ ఇస్తారు. రూ.లక్ష లోపు యూనిట్లకు 80 శాతం సబ్సిడీ ఇస్తారు. ఈ కేటగిరీ–2లోని దరఖాస్తుదారులు మంజూరు పత్రాలు తీసుకున్న తర్వాత బ్యాంకు నుంచి అంగీకార పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

వారం శిక్షణ.. 16 కల్లా యూనిట్ల ప్రారంభం

లబ్ధిదారులకు జూన్ 2న మంజూరు పత్రాల పంపిణీ ప్రారంభిస్తారు. క్షేత్రస్థాయిలో జూన్ 9 వరకు ఈ కార్యక్రమం సాగుతుంది. పత్రాల పంపిణీ పూర్తయ్యాక జూన్ 10నుంచి 15వరకు లబ్ధిదారులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తారు. శిక్షణ పూర్తి చేసుకున్న లబ్ధిదారులు యూనిట్లను ప్రారంభించాలి. జూన్ 16 నుంచి యూనిట్ల ప్రారంభోత్సవాలను నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. అక్టోబర్ 2న గాంధీ జయంతి నాటికి యూనిట్ల గ్రౌండింగ్ పూర్తి చేయాలని కార్పొరేషన్లకు ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటులో జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, కలెక్టర్లతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు సమన్వయం చేసుకోవాలని చెప్పింది. కాగా, తొలుత జూన్ 2న ఒకేసారి 5 లక్షల మందికి మంజూరు పత్రాలు ఇవ్వాలని ప్రభుత్వం సంకల్పించింది. గరిష్టంగా రూ.4 లక్షల వరకు వ్యయమయ్యే యూనిట్లు ఇవ్వాలని నిర్ణయించింది. అయితే, ప్రస్తుతం తొలి రెండు కేటగిరీలకే పరిమితమైంది. కేటగిరీ–3, 4లకు సంబంధించి ఇప్పటివరకు దరఖాస్తుల పరిశీలన ప్రారంభం కాలేదు. వీరికి విడతల వారీగా మంజూరు పత్రాలు పంపిణీ చేయనున్నారు.

కార్పొరేషన్ల వారీగా దరఖాస్తులు ఇలా..

కార్పొరేషన్	దరఖాస్తులు
ఎస్సీ	3,92,951
ఎస్టీ	1,83,494
బీసీ	8,01,008
ఈబీసీ	37,414
మైనార్టీ	2,04,202
క్రిస్టియన్	4,695

కేటగిరీల వారీగా వచ్చిన దరఖాస్తులు ఇలా...

కేటగిరీ	లక్ష్యం	దరఖాస్తులు
కేటగిరీ–1 (రూ.50 వేల లోపు)	158650	39401
కేటగిరీ–2 (రూ.50 వేలు–రూ.లక్ష)	122540	93233
కేటగిరీ–3 (రూ.లక్ష–రూ.2లక్షలు)	107200	249434
కేటగిరీ–4(రూ.2లక్షలు–రూ.4లక్షలు)	79269	1241696
మొత్తం	493231	1623764

దేశం గర్వించేలా రేవంత్ ప్రసంగం

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు

సాక్షి, హైదరాబాద్: జైహింద్ సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన ప్రసంగం దేశం గర్వించేలా ఉందని ప్రభుత్వ సలహాదారు కె.కేశవరావు వ్యాఖ్యానించారు. రాహుల్‌గాంధీ అడగని కొన్ని ప్రశ్నలను రేవంత్‌రెడ్డి అడిగారని, బీజేపీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే వాటికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాహుల్ అడిగిన ప్రశ్నలకు మోదీ సమాధానం చెప్పాలని కోరారు. కేశవరావు శుక్రవారం జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. సంబంధం లేని వ్యక్తులు.. పాక్–భారత్ కాల్పుల విరమణ జరిగిందని ఎలా చెబుతారని ప్రశ్నించారు. పాకిస్తాన్‌పై చేసిన యుద్ధంలో మనం ఏం కోల్పోయామో, ఏం నష్టం జరిగిందో కేంద్రం చెప్పాల్సిందేనని స్పష్టం చేశారు. యుద్ధంలో పాకిస్తాన్ ఓడిపోయిందని ఏ దేశం కూడా చెప్పలేదని, కాల్పుల విరమణ జరగకపోతే కచ్చితంగా మనం గెలిచేవారమన్నారు. పహల్గాం ఘటనకు కారణమైన వారిలో ఎంతమంది దొరికారో కూడా చెప్పాలన్నారు. మావోయిస్టులు శాంతి చర్చలకు వస్తామని కోరితే కేంద్రం పిలవాలన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత మాటలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిగణించడం లేదని చెప్పారు. తెలంగాణ ఇవ్వనందుకే పార్టీ మారాల్సి వచ్చిందని, ఇప్పుడు కాంగ్రెస్‌లోనే ఉన్నానని, కాంగ్రెస్‌లోనే చస్తానని కేకే వెల్లడించారు.





ఏ విధముగ అగ్నిలో కట్టెలు కాలిపోవుచున్నవో,
అదే విధముగ జ్ఞానాగ్నిలో సర్వ కర్మలు కాలిపోవుచున్నవి.
– హిందూ ధర్మం

సాక్షి

శనివారం, 31 మే 2025

ఆయుధాల పందేరం!

రాజ్యాంగాన్ని మనం అమలు చేసుకోవటం మొదలెట్టి 75 ఏళ్లవుతుండగా మన పాలకుల విపరీత పోకడలు దాన్ని కాస్తా భ్రష్టుపట్టించే దిశగా సాగుతున్నాయి. రాష్ట్రంలోని సరిహద్దులకు సమీపంగా వుండే మారుమూల ప్రాంతాల్లోని స్థానిక తెగలకూ, నివాసితులకూ ఆయుధాల లైసెన్స్‌లు మంజూరు చేయాలని అస్సాం మంత్రివర్గం బుధవారం నిర్ణయించటం ఆ కోవలోనిదే. సరిహద్దు ఆవలి నుంచి చొరబడి బెదిరింపులకు దిగేవారి నుంచి రక్షణ కోసం, వ్యక్తిగత భద్రత కోసం ఈ ప్రతిపాదనకు ఆమోదం తెలిపామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చెబుతున్నారు. 'జాతి, నేల, స్థానికత' కాపాడటం కోసమే ఇలా చేస్తున్నామని ఆయన ప్రకటించారు. బంగ్లాదేశ్ పొడవునావుండే రెండు జిల్లాల్లోని ఆరు ప్రాంతాల వాసులకు ఈ ఆయుధాల లైసెన్స్‌లు లభిస్తాయని ఆయన చెప్పారు. ఈ ప్రాంతాలన్నిటా ముస్లింల జనాభా ఎక్కువ. ఇప్పుడు జనం చేతికి తుపాకులందితే మత ఉద్రిక్తతలు పెరిగినప్పుడల్లా తుపాకులు మాట్లాడటం మొదలవుతుంది. ఇది ప్రభుత్వానికి మంచిదేనా? 1985 నుంచీ ఆ ప్రాంతాలవారు ఈ లైసెన్స్‌ల కోసం డిమాండ్ చేస్తుంటే గత ప్రభుత్వాలేవీ సాహసించలేదని, వాటికి ధైర్యంలేదని శర్మ వివరిస్తున్నారు. ప్రజలు ప్రభుత్వాన్ని ఎన్నుకొనేది తమకు రక్షణ, భద్రత కల్పిస్తాయని, మౌలిక సదుపాయల కల్పనపై శ్రద్ధ పెడతాయని, తమ బతుకులు మెరుగుపరచటానికి అవసరమైన పథకాలు రూపొందిస్తాయని ఆశించబట్టే! ఇంతకూ 'ధైర్యం లేని' గత ప్రభుత్వాల్లో తాను మంత్రిగా పనిచేసిన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలున్నట్టేనా? ఆ కాలాల్లోని ప్రభుత్వాలకు 'ధైర్యం' కలిగించేందుకు తాను చేసిందేమిటి? తాను విఫలమైన పక్షంలో దానిపై నిలదీయకుండా మౌనంగా ఎందుకు ఉండిపోయినట్టు?

దాదాపు పాతికేళ్లుగా శర్మ రాజకీయాల్లో వుంటున్నారు. ఆయన కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాల్లో కీలక శాఖలకు మంత్రిగా వ్యవహరించారు. 2015లో కాంగ్రెస్ నుంచి తప్పుకోవటానికి కూడా కారణం ఆ సర్కార్‌కు ధైర్యం లేదని కాదు. తన రాజకీయ ఎదుగుదలకు అప్పటి సీఎం తరుణ్ గొగోయ్ అడ్డంకిగా మారటం! దీన్నంతటినీ రాహుల్‌గాంధీని కలిసి మొరపెట్టుకోవాలని శర్మ తీవ్రంగా ప్రయత్నించారు. కానీ జనాదరణగల యువ నాయకుల కన్నా పీఠాధిపత్యం నెరపే వృద్ధ తరం నేతలకే పెద్దపీట వేసే సంస్కృతిగల కాంగ్రెస్‌లో అది సాధ్యపడలేదు.

నేపథ్యం ఏమైనా బీజేపీలో శర్మ బాగా రాణించారు. ఏనాటినుంచో ఆ పార్టీలో వున్న నేతలను తలదన్నే విధంగా ప్రకటనలిచ్చి వివాదాస్పదుడూ అయ్యారు. అందువల్ల పార్టీలో ఆయన పట్టు పెరిగింది గనుకే 2021లో బీజేపీ అధిష్ఠానం శర్మను అస్సాం ముఖ్యమంత్రిగా ఎంపిక చేసింది. కానీ గత ప్రభుత్వాలు తుపాకీ లైసెన్స్‌లు ఇవ్వకపోవటానికి వాటికి ధైర్యం లేకపోబట్టే అని ఆయన దేని ఆధారంగా నిర్ణయానికొచ్చారో చెప్పలేదు. శర్మ చెబుతున్న ప్రకారం ఆ ప్రభుత్వాలు సాహసించలేక పోబట్టి చాలామంది స్థానిక తెగలవారు బయటి వ్యక్తుల ఒత్తిళ్లకు లొంగి భూములు అమ్ముకోవాల్సి వచ్చింది. అక్కణ్ణించి వలసలు పోవాల్సి వచ్చింది. మరి ప్రభుత్వాల వైఖరి వల్ల జనం ఇన్ని ఇబ్బందులు పడుతుంటే ఆయన మౌనంగా మిగిలిపోవటం ఎందువల్ల?

హిమంత గ్రహించాల్సిన విషయం ఒకటుంది. గతంలో ప్రజల నుంచి ఎన్ని డిమాండ్లు వచ్చినా అప్పటి ప్రభుత్వాలు ఆయుధ లైసెన్సులివ్వకపోవటానికి కారణం ధైర్యం లోపించి కాదు. అది అనైతికమూ, రాజ్యాంగ విరుద్ధమూ అని విశ్వసించటం వల్ల! అమెరికాలో పౌరులెవరైనా ఆయుధాలు కొనుక్కోవచ్చు. అందుకు కొన్ని నిబంధనలున్నా ఆచరణలో అవి ఏమవుతున్నాయో అక్కడ తరచు జరిగే ఉదంతాలు గమనిస్తే అర్థమవుతుంది. అక్కడ సగటున 100 మంది పౌరులకూ 120.5 తుపాకులున్నాయని గణాంకాలు చెబుతున్నాయి. నిరుడు తుపాకీ మరణాలు 30,000 మించాయి. అకారణంగా లేదా భయపడి తరచు అవతలివారిని చంపుతున్న ఉదంతాలు ఎక్కువ. ఆ దేశంలో కూడా హిమంత ప్రభుత్వం ఏకరువు పెడుతున్న నిబంధల వంటివే వున్నాయి. మానసికంగా సక్రమంగా వుండి అవతలివారి నుంచి ప్రాణభయం ఉన్న 21 ఏళ్లు పైబడినవారందరికీ లైసెన్సులిస్తామని హిమంత చెబుతున్నారు. ఏదైనా కేసులో శిక్షపడినా, శాంతికి దోహదపడతామని గతంలో ప్రభుత్వానికి బాండు రాసిచ్చినా అనర్హులవుతారట. అంతేగాక మానసికంగా, శారీరకంగా సరైన స్థితిలో వున్నవారికే లైసెన్సులు జారీచేస్తారట. ఒకసారంటూ క్లాం వదిలాక ఇవన్నీ నిజాయతీగా, చిత్తశుద్ధిగా అమలవుతాయా? అనుమానమే!

అస్సాం మొదటినుంచీ సమస్యాత్మక రాష్ట్రం. అక్రమంగా చొరబడిన విదేశీయులను వెనక్కి పంపాలంటూ ఉవ్వెత్తున లేచిన విద్యార్థి ఉద్యమం, అటుతర్వాత ఉల్ఫా లాంటి ఉగ్రవాద సంస్థల ఆగడాలు తెలియంది కాదు. నిత్యం అపహరణలు, డబ్బు దండుకోవటం, హత్యలు ఒకప్పుడు చాలా అధికం. సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) జవాన్లు, పోలీసులు ఉల్ఫా ఆటకట్టించాక అవి చాలావరకూ తగ్గిపోయాయి. ఇప్పటికీ బీఎస్ఎఫ్ జవాన్లు సరిహద్దుల్లో నిత్యం పహారా కాస్తుంటారు. సమస్య వుందనుకుంటే మరింతమందిని నియమించి, పటిష్ఠమైన పర్యవేక్షణ అమలు చేయటం పెద్ద కష్టం కాదు. అందుకు భిన్నంగా లైసెన్సులిస్తామంటే ప్రభుత్వం చేతులెత్తేసినట్టు కాదా? ఇలాంటి కారణాల వల్లే గతంలో ఛత్తీస్‌గఢ్‌లో సుప్రీంకోర్టు సల్వాజుడుంను రద్దుచేసింది. పైగా అస్సాంకు భారీయెత్తున పెట్టుబడులు తీసుకొస్తామని చెబుతూ శాంతికి విఘాతం కలిగించే ఇలాంటి విధానం అమలు చేయటం సరైందేనా? హిమంత ఆలోచించాలి.

దేశమంటే కేంద్రం కాదోయ్!

అభిప్రాయం



మోహన్ గురుస్వామి

'ఇండియన్ యూనియన్ ఆఫ్ స్టేట్స్' చిక్కుల్లో పడింది. న్యాయం, విద్య, ఆరోగ్యం, సామాజిక సేవలు అందరికీ సమానంగా అందిస్తూ, ఇండియాను ఆధునిక, ప్రజాస్వామిక, లౌకిక రాజ్యంగా మార్చడమే రాజ్యాంగ అభిమతం.

ఇండియా కాషాయ రంగు ఒక్కటే పులుముకున్న దేశంగా ఉండాలన్న భావన ఏనాడూ లేదు. భిన్న జాతులు, సంస్కృతులు, భాషలతో విలసిల్లే వైవిధ్యభరిత దేశమే లక్ష్యంగా రాజ్యాంగ రచన జరిగింది. ఈ వైవిధ్యత నేడు పెను సవాలు ఎదుర్కొంటోంది.

ఇండియాలోని ఒక్కో రాష్ట్రం స్వరూప స్వభావాలు ఒక్కో విధంగా ఉంటాయి. కాబట్టి వాటిమధ్య రాజకీయ, ఆర్థిక బలాబలాల సమతుల్యత సాధించడం ముఖ్యం. అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని జనాభాను తగ్గించుకున్న రాష్ట్రాలకు ప్రస్తుత డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) కసరత్తు వల్ల పార్లమెంటులో వెయిటేజ్ తగ్గుతుంది. అలా చేయలేని విఫల రాష్ట్రాలను డీలిమిటేషన్ పేరిట అధిక పార్లమెంటు స్థానాలిచ్చి సత్కరిస్తున్నారు. పార్లమెంటరీ నియోజక వర్గాల సంఖ్యను ఇప్పుడున్న స్థాయిలోనే శాశ్వతంగా స్తంభింపజేయాలి. డీలిమిటేషన్ ప్రక్రియను నిలిపేయాలి.

విద్య పూర్తిగా రాష్ట్రాలదే!

ప్రపంచం ఇప్పుడు సాంకేతిక యుగంలోకి ప్రవేశించింది. విద్యా ప్రమాణాలే సమాజాల ప్రగతిని శాసిస్తాయి. కేంద్ర నిర్వహణలోని ఉన్నత విద్యావిధానం చాలావరకు విఫలమైంది. విద్య యావత్తూ రాష్ట్ర జాబితాలోకి రావాలి. ఏఐసీటీఈ, యూజీసీ వంటి సంస్థల అధికార పరిధి నుంచి రాష్ట్రాలను విముక్తం చేయాలి. వైద్య, న్యాయ, సామాజిక శాస్త్రాల విద్యను మెరుగుపరచడం మాత్రమే నేటి జాతీయ అవసరం. నాణ్యమైన విద్యలో రాష్ట్రాలు పరస్పరం పోటీ పడేవిధంగా విధానాలు ఉండాలి. అంతేతప్ప, సగటు స్థాయి కేంద్రీకృత నిర్వహణ సంస్థలకు తలొగ్గే పరిస్థితి ఉండకూడదు.

కనీస మద్దతు ధరలు (ఎంఎస్పీ) చెల్లించి పంటలను కొనుగోలు చేయడం అనేది ప్రస్తుతం ఏవో కొన్ని రాష్ట్రాలు, ప్రాంతాలకే పరిమితమైంది. ఇలా సేకరించడం అంటే సబ్సిడీ ఇవ్వడమే. వ్యవసాయ సాగుభూమి ప్రాతిపదికగా, ఈ సేకరణ అన్ని రాష్ట్రాలకూ వర్తింపజేయాలి. ఆహారధాన్యాల్లో తృణధాన్యాలు ఎక్కువ భాగం ఆక్రమిస్తాయి కనుక అన్ని రాష్ట్రాల్లో వాటి సేకరణకు గ్యారెంటీ ఇవ్వాలి. అన్ని రాష్ట్రాల్లో ఇలా సేకరణ చేయడం సాధ్యం కాదనుకున్నప్పుడు, ఆ యా రాష్ట్రాలకు అందుకు బదులుగా గ్రాంట్ల రూపేణా పరిహారం ఇవ్వాలి.

గంగా పరివాహకేతర ప్రాంతాల్లో బొగ్గు, ఇనుప ఖనిజం, అల్యూమినియం, రాగి, జింకు, నికెల్ వంటి ఖనిజ వనరులు విరివిగా ఉన్నాయి. ఈ వనరులు ఎవరి భూమి కింద ఉన్నాయో వారికి చెందాలి. అన్ని ఖనిజాల మీద ఆ యా రాష్ట్రాలకే తవ్వకం హక్కులు కట్టబెట్టాలి. వాటి ద్వారా సమకూరే ఆదాయాలు సైతం వాటికే సంక్రమించాలి.

పన్నుల్లో వాటా రాష్ట్రాలకు ముందే ఇచ్చేయాలి!

రాష్ట్రాలు ఆర్థిక స్వయంప్రతిపత్తి సాధించినప్పుడే నిజమైన



సమాఖ్య వ్యవస్థ సాధ్యమవుతుంది. అంటే రాష్ట్రాలకు మరిన్ని ఆర్థిక వనరులుండాలి. ఫైనాన్స్ కమిషన్ సిఫారసుల ప్రకారం, పన్నుల రాబడిలో రాష్ట్రాలకు ప్రస్తుతం 42 శాతం వాటా దక్కాలి. అలా జరగటం లేదు. కేంద్రం వద్ద నిధులు కేంద్రీకృతమవుతున్నాయి. దీనికి తోడు, రాష్ట్రాలకు రావలసిన పన్ను బకాయిలను తొక్కిపట్టే ధోరణి పెరుగుతోంది. రాష్ట్రాలకు న్యాయబద్ధంగా దక్కాల్సిన ఆదాయాన్ని కేంద్రం తన పథకాల కోసం వాడుకుంటోంది. దీని నివారణకు మార్గాలు ఆలోచించాలి. పన్ను చెల్లింపు మూలం వద్దే రాష్ట్రాలకు చెందాల్సిన వాటా మినహాయించే విధానం అవసరం. దీనివల్ల సకాలంలో రాష్ట్రాలకు నిధులు అంది, అవి ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోగలుగుతాయి. నిధుల బదిలీలో జాప్యం జరిగితే ఆర్బీఐ రేట్ల ప్రకారం వడ్డీ చెల్లించే నిబంధన కూడా ఉండాలి.

అలాగే, రాష్ట్రాలకు తమ సాంస్కృతిక చారిత్రక వనరులను పరిరక్షించుకునే హక్కు ఉంది. కేంద్రం తన అధీనంలోని ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) ద్వారా ఈ పరిరక్షణ హక్కును కాపాడటంలో విఫలమైంది. పురాతన కట్టడాలు, శిథిలాల సంపద నాశనమవుతోంది. ఈ బాధ్యతను నేరుగా రాష్ట్రాలకే అప్పగించాలి. ఏఎస్ఐ వద్ద ఉండే రాష్ట్రాల నిధులను తక్షణం బదిలీ చేయాలి. ఏఎస్ఐ, కేంద్ర సాంస్కృతిక శాఖ సంకుచిత భావజాలంతో కొన్ని ప్రాంతాల మీద అధిక ప్రేమ కనబరిచే ధోరణి పెరుగుతోంది.

సైన్యంలో ఆ ఒక్క రాష్ట్రమేనా?

సైనిక దళాలు, పారామిలిటరీ దళాల నియామకాలు కొన్ని ప్రాంతాల్లో ఎక్కువగా జరుగుతున్నాయి. పరిమిత కాల సర్వీసు, జీవితకాల పెన్షన్, ఇతర బెనిఫిట్స్ కారణంగా యుద్ధ జాతులుగా పరిగణనలో ఉన్న వారికి మిలిటరీలో ఎక్కువ అవకాశాలు దక్కి వారే ఎక్కువ ప్రయోజనం పొందుతున్నారు. ఇది ఎలా జరుగుతోందో ఉదాహరణలతో పరిశీలిద్దాం. మద్రాస్ రెజిమెంట్ భారత సైన్యంలో అత్యంత పురాతనమైన పదాతిదళం. నీలగిరుల్లోని వెల్లింగ్టన్ ప్రధాన కేంద్రంగా పనిచేస్తున్న ఈ రెజిమెంటులో 21 బెటాలియన్లు ఉన్నాయి. దక్షిణ భారతం అంతటికీ చెందిన దాదాపు 27 కోట్ల మంది (భారతీయుల్లో 22 శాతం) దీని పరిధిలోకి వస్తారు. అదే సిక్కు రెజిమెంటును తీసుకుంటే, కేవలం 80 లక్షల జనాభా నుంచి దీనికి ఎంపికలు జరుగుతాయి. ఈ ఒక్క రెజిమెంటులోనే 22 పదాతిదళ బెటాలియన్లు ఉన్నాయి. కేవలం 3 కోట్ల జనాభా ఉన్న పంజాబు రాష్ట్రంలోని అన్ని రెజిమెంట్ల కిందా కలిపి 74 బెటాలియన్లు ఉంటాయి. గ్రామీణ యువతకు అద్భుత ఉపాధి అవకాశాలు కల్పించే ఒక సంస్థలో ఆ యా ప్రాంతాల ప్రాతినిధ్యంలో ఇంతటి అసమానత ఉండటం సమంజసం కాదు. ఇతర ప్రాంతాల నుంచి సైనిక దళాల్లోకి నియామకాలు పెంచాల్సి ఉంది.

ఇక మీడియా విషయానికి వద్దాం. ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియాలు రెండూ భారీ పెట్టుబడితో ముడిపడి ఉంటాయి. పైగా, వీటిని కేంద్ర ప్రభుత్వం, బడా వ్యాపార సంస్థలు అదుపు చేస్తున్నాయి. గమనించవలసిన అంశం ఏమిటంటే, ఈ రెండూ ప్రముఖంగా ఉన్నా, నేటికీ రేడియో వార్తలు దేశంలో అధిక సంఖ్యాకులకు అందుబాటులో ఉన్నాయి. వీటిని పూర్తిగా కేంద్ర ప్రభుత్వం అదుపు చేస్తోంది. రేడియో వార్తలను ఎఫ్ఎం బ్యాండ్స్ మీద ప్రసారం చేయడానికి స్థానిక ఔత్సాహికులను అనుమతించాలి. ప్రింటు, టీవీ ప్రసార మాధ్యమాల నిర్వహణను ప్రయివేటు, ప్రభుత్వ సంస్థలు రెండూ చేపట్టే అనుమతి ఉన్నప్పుడు, అత్యధికులకు అందుబాటులో ఉండే రేడియో ద్వారా సమాచారం అందించడానికి ప్రయివేటు, రాష్ట్ర ప్రభుత్వాలకు ఎందుకు అనుమతి ఇవ్వరో అర్థం కాని విషయం.

అన్ని జాతులకూ వర్గాలకూ సమాన గౌరవం దక్కినప్పుడే ఇండియా సమైక్యత వికసిస్తుంది. ప్రతి ఒక్కరికీ తమ వాణి వినిపించే అవకాశం కల్పించిన రాజ్యాంగం రాష్ట్రాలను ఒక రాజకీయ సమాహారంగా కూర్చింది. అందుకు భిన్నంగా దేశాన్ని ఏకవర్ణంగా, ఏకశిలగా మార్చే ఎలాంటి ప్రయత్నం చేసినా అది దుస్సాహసం అవుతుంది. అదే జరిగితే రాజ్యాంగ మౌలిక భావన కుప్పకూలుతుంది. యూనియన్ విచ్ఛిన్నం అవుతుంది.

వ్యాసకర్త విధాన నిర్ణయాల విశ్లేషకుడు, రచయిత
mohanguru@gmail.com

- కనీస మద్దతు ధరలు చెల్లించి పంటలను కొనుగోలు చేయడం ప్రస్తుతం ఏవో కొన్ని రాష్ట్రాలు, ప్రాంతాలకే పరిమితమైంది. వ్యవసాయ సాగుభూమి ప్రాతిపదికగా, ఈ సేకరణ అన్ని రాష్ట్రాలకూ వర్తింపజేయాలి.
- పన్ను చెల్లింపు మూలం వద్దే రాష్ట్రాలకు చెందాల్సిన వాటా మినహాయించే విధానం అవసరం. దీనివల్ల సకాలంలో రాష్ట్రాలకు నిధులు అంది, అవి ప్రజలకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోగలుగుతాయి.
- ప్రింటు, టీవీ ప్రసార మాధ్యమాల నిర్వహణను ప్రయివేటు, ప్రభుత్వ సంస్థలు రెండూ చేపట్టే అనుమతి ఉన్నప్పుడు, అత్యధికులకు అందుబాటులో ఉండే రేడియో విషయంలో న్యూస్‌కు ఆ అనుమతి ఎందుకు ఇవ్వకూడదు?

సోషల్ మీడియా

ఏం దక్కినట్టు?



పాకిస్తాన్‌తో రష్యా 2.6 బిలియన్ డాలర్ల మెగా ప్రాజెక్ట్ ఒప్పందం కుదుర్చుకుందని వార్త. ఉక్రెయిన్ యుద్ధంపై రష్యాను ఖండించడానికి నిరాకరించినందుకుగానూ ఇండియా ప్రపంచ ఆగ్రహాన్ని ఎదుర్కొంది. రష్యాకు వ్యతిరేకంగా ఉన్న ఎన్నో ఐక్యరాజ్యసమితి తీర్మానాలకు మనం దూరంగా ఉన్నాం. బదులుగా మనకు దక్కేది ఇది. నిజంగా మన విదేశాంగ విధానం ఘోరం.

– సుమంత్ రామన్, టీవీ హోస్ట్

కొనసాగించాలి!



ట్రంప్ సుంకాలపై యూఎస్ కోర్టులు ఏమన్నప్పటికీ, యూఎస్‌తో వాణిజ్య ఒప్పందం కోసం ఇండియా ప్రయత్నించాలి. ప్రపంచానికి తన సుంకాలను ప్రకటించకముందే ట్రంప్‌ను మోదీ కలిశారు. వాణిజ్య ఒప్పందం త్వరలో కుదుర్చుకోవాలని ఇద్దరు నాయకులూ అంగీకరించారు.

– యూసుఫ్ ఉంర్ఘూవాలా, సంపాదకుడు

ఎవరికి చెప్పేదేమిటి?



ఆపరేషన్ సిందూర్ తర్వాత ఇండియా 'కథన నిర్మాణం' ఎందుకు చేయాలో అర్థం చేసుకోలేకపోతున్నా. ఉగ్రవాదులు ఇండియా మీద దాడిచేశారు; మనం వాళ్ల ఉగ్రవాద ప్రధాన కేంద్రాన్ని ధ్వంసం చేశాం; వాళ్లు మన స్థావరాలను కొట్టడానికి యత్నించారు, విఫలమయ్యారు; మన వైమానిక దళం వారి వైమానిక స్థావరాలను గట్టిగా కొట్టాక చర్చలకు వచ్చారు; అంతే!

– విష్ణు సోమ్, జర్నలిస్ట్

అదే పని!



ఢిల్లీ గాలి మిమ్మల్ని చంపడానికి ఏడాదిలో రెండుసార్లు ప్రయత్నిస్తుంది. ఒకసారి ఉక్కిరిబిక్కిరి చేసే శీతకాలపు కాలుష్యంతో, రెండోసారి దారుణమైన వేసవి ఎండలతో! వీటిని తట్టుకోవడమే పూర్తి ఉద్యోగం.

– ఇస్మత్ ఆరా, కాలమిస్ట్

చేయకూడనివి!




పడుకోవడానికి 6 గంటల ముందు తీవ్రమైన వ్యాయామం, 4 గంటల ముందు చివరి భోజనం చేయకపోవడం మంచిది.

– బ్రయన్ జాన్సన్, వెంచర్ క్యాపిటలిస్ట్

ఇన్ బాక్స్

ఆద్యకళను అడ్డుకోవడమా?

'ఆద్యకళ' పేరిట ప్రొ॥ జయధీర్ తిరుమలరావు గత కొన్నేళ్లుగా వివిధ కేంద్రాలలో ఏర్పాటు చేస్తున్న పురావస్తు ప్రదర్శనలు విశేష ఆదరణ పొందుతున్నాయి. జానపద పరిశోధకుడిగా ఆయన దశాబ్దాలుగా సేకరిస్తూ, ప్రదర్శిస్తున్న వేలాది ఆదివాసీ కళాఖండాలు, పనిముట్లు, సంగీత వాద్యాలు, లోహ ప్రతిమలు, సాంస్కృతిక చిహ్నాలు వెలకట్టలేనివి. అయితే వీటి సంరక్షణ తన శక్తికి మించిన పని అవుతోందనీ, వాటి కోసం ఒక ప్రత్యేక ప్రదర్శనశాలను ఏర్పాటు చేయాలనీ తిరుమలరావు ఎంతో కాలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం వాటిలో కొన్నింటి భద్రత, ప్రదర్శన నిమిత్తం హైదరాబాద్, నాంపల్లిలోని తెలుగు విశ్వవిద్యాలయం ఆవరణలో కొంత స్థలాన్ని కేటాయించింది. అదేవిధంగా ఉస్మానియా యూనివర్సిటీ ఆవరణలో ఉన్న అధ్యాపకుల నివాస స్థలాల్లో రెండు గృహాలను ఈ పురావస్తు సంరక్షణ, ప్రదర్శన, భద్రత కోసం అధికారికంగా అప్పగించారు.



అయితే ఆ నివాసాలు శిథిలావస్థలో ఉన్నందున వాటికి ప్రభుత్వం మరమ్మతు పనులు చేయిస్తుండగా విద్యార్థి సంఘాలకు చెందినవారు 'ప్రయివేటు వ్యక్తులకు ప్రొఫెసర్ క్వార్టర్లు కేటాయించడం కుదరదు. తక్కువ రెంటుతో లబ్ధి పొందుతున్నారు' అని అభ్యంతరం చెబుతూ నిర్మాణ సామగ్రిని కూలదోసి, చిందరవందర చేశా'రని తిరుమలరావు ఆవేదన వ్యక్తం చేశారు. నిజానికి ఆయన ఇదే విశ్వవిద్యాలయంలో చాలా కాలం పని చేసినవారే. ఆదివాసీ సంస్కృతిని కాపాడేందుకు ఎవరితోనైనా చేతులు కలిపి పని చేసేందుకు తాను సిద్ధమే అనేది ఆయన ప్రతిపాదన.

రెండేళ్ల క్రితం పురాతత్త్వ ప్రదర్శనశాల వారి ఆహ్వానంపై తిరుమలరావు ప్యారిస్ వెళ్లారు. అప్పుడు జర్మనీ, స్విట్జర్లాండ్ లాంటి దేశాల ప్రతినిధులు వాటిలో కొన్నింటిని తమ మ్యూజియాలలో భద్రపరుస్తామని ముందుకు వచ్చారు. అయితే ఇది భారతదేశ సంపద అని వారి ప్రతిపాదనను ఆయన ఒప్పుకోలేదు. గత ఏడాది ఢిల్లీలోని రాష్ట్రపతి నివాసంలో నిర్వహించిన గిరిజన సాంస్కృతిక ప్రదర్శనలో వీటికి గౌరవం దక్కింది. ఇక్కడ చూస్తే పరిస్థితి ఇలా ఉంది! కవులు, కళాకారులు, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు అందరూ చాలా కాలంగా తిరుమలరావుకు బాసటగా నిలబడి, ఆద్యకళ మ్యూజియం ఏర్పాటుకై ప్రభుత్వాలకు ఎన్నో వినతులను సమర్పించారు. చివరకు ప్రదర్శనశాల ఒక కొలిక్కి వస్తున్న దశలో అశనిపాతంలా వచ్చి పడిన ఈ విద్యార్థి సంఘాల వారి బెదిరింపు ఖండనార్హం.

– బద్రి నర్సన్ | 94401 28169

హ్రస్వ దృష్టి సంక్షోభంలో ప్రపంచం

విశ్లేషణ



అమోద్ గుప్తా

2020లో లక్షలాది మంది ప్రాణాలను బలిగొన్న కోవిడ్–19 వైరస్ వ్యాప్తిని అరికట్టడానికి ప్రభుత్వ అధికారులు లాక్‌డౌన్ ప్రకటించారు. కార్యాలయాలను, పాఠశాలలను మూసివేశారు. వినియోగదారు అనుకూల ఇంటర్ఫేస్ జూమ్, ఇదే విధమైన వీడియో–కాన్ఫరెన్సింగ్ ప్లాట్‌ఫామ్‌ల కారణంగా, ఇంటి నుండి పని చేసే కొత్త సంస్కృతి పుట్టింది. లాక్‌డౌన్‌ల అనిశ్చితి, విద్యా కార్యకలాపాలను కోల్పోతామనే భయంతో చిన్నపిల్లలు, పసిపిల్లలు రోజుకు చాలా గంటలు తమ ఇళ్లలోనే ఉండి ఆన్‌లైన్ తరగతులకు హాజరయ్యారు. ఫలితంగా పిల్లలు హ్రస్వ దృష్టి (మయోపియా) బారినపడ్డారు.

మొదట్లో చైనా, ఆ తరువాత ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలోని నేత్ర వైద్య నిపుణులు 2020 నాటికి, చిన్న పిల్లల్లో ఆందోళన కలిగించే స్థాయి వేగంతో హ్రస్వ దృష్టి వ్యాపిస్తోందని కనుగొన్నారు. దీంతో ప్రమాద హెచ్చరికలు మోగాయి. చైనాలో ఆరేళ్ల వయస్సు పిల్లలలో మయోపియా వ్యాప్తిలో 400 శాతం పెరుగుదలను గుర్తించారు. ముఖం నుండి 30 సెం.మీ. కంటే తక్కువ దూరంలో పుస్తకాలను ఉంచుకోవడం, 30 నిమిషాల కంటే ఎక్కువసేపు నిరంతరం చదవడం అనేవి చిన్న పిల్లలలో హ్రస్వ దృష్టి పెరగడానికి ప్రధాన ప్రమాద కారకాలు. చదవడం, రాయడం ప్రభావితం కానప్పటికీ, ఉపాధ్యాయుడు బ్లాక్‌బోర్డ్‌పై రాసిన అక్షరాలను, సుదూర వస్తువులను చూడలేకపోవడమే హ్రస్వదృష్టిగా సాధారణంగా వ్యవహరిస్తుంటారు.

1960లలో పట్టణ, గ్రామీణ జనాభా రెండింటినీ విస్తృతంగా సర్వే చేసిన చీఫ్ డాక్టర్ ఐఎస్ జైన్ ముఖ్యమైన విషయాన్ని వెల్లడించారు. గ్రామీణ జనాభాలో (2.77 శాతం), పాఠశాల పిల్లల్లో (4.79 శాతం), చండీగఢ్ పట్టణ జనాభాలో (6.9 శాతం), పీజీఐ వైద్యులలో (33 శాతం) మందిలో హ్రస్వ దృష్టి వ్యాప్తి క్రమంగా పెరగడానికి కంటికి దగ్గరలో పని చేయడం, అధిక అక్షరాస్యత రేట్లు, ఆదాయ స్థాయులు కారణమని ఆయన అన్నారు. ఇటీవల, ఉత్తర భారతదేశంలో పాఠశాలకు వెళ్లే పట్టణ పిల్లలలో 21 శాతం మందికి హ్రస్వ దృష్టి ఉన్నట్లు గుర్తించారు. ఇది 50 ఏళ్లలో 4 రెట్లు ఎక్కువ.

పెరుగుతున్న హ్రస్వ దృష్టిపై కోవిడ్–19 క్వారంటైన్ ప్రభావం తూర్పు, ఆగ్నేయాసియాలో ముందుగా ఎక్కువగా కనిపించినప్పటికీ, తక్కిన ప్రపంచంలో ఎవరూ దానినుంచి తప్పించుకోలేదు. ఒక అధ్యయనం ప్రకారం, డిజిటల్ పరికరాల్లో రోజుకు సగటున ఒక



- 2050 నాటికి ప్రపంచ జనాభాలో సగం మంది మయోపిక్ రోగులే అవుతారన్న అంచనాలు నిజమైతే ఈ వ్యవహారం ఒక పెద్ద ప్రజారోగ్య సమస్యగా మారవచ్చు.

గంట గడిపిన పిల్లలలో 46 శాతం మంది హ్రస్వదృష్టితో ఉన్నారు. నాలుగు గంటలు గడిపిన వారిలో 76 శాతం మంది ఉన్నారు. తక్కువ బహిరంగ కార్యకలాపాలు, మసక గది వెలుతురు, అధిక పని దీనికి కారణం.

గత 10 సంవత్సరాలలో, డిజిటల్ పరికరాల వాడకం నాలుగు రెట్లు పెరిగింది. ఇటీవల ప్రతిష్ఠాత్మకమైన 'జామా' జర్నల్‌లో '3 లక్షల కంటే ఎక్కువ మంది పాఠశాల పిల్లలు పాల్గొన్న శాస్త్రీయ అధ్యయనాల ఆధారంగా, రోజుకు కనీసం నాలుగు గంటల వరకు డిజిటల్ స్క్రీన్‌లపై గడిపే వారిలో, ప్రతి గంటకూ హ్రస్వ దృష్టి అభివృద్ధి చెందే అవకాశాలు 21 శాతం పెరిగాయని' ఓ విశ్లేషణ ప్రచురితమయ్యింది. హ్రస్వదృష్టి బారిన పడిన అన్ని రకాల రోగుల్లో దాదాపు 8 శాతం మంది జీవితంలో తరువాత అంధత్వాన్ని ఎదుర్కొంటున్నారు. 2050 నాటికి ప్రపంచ జనాభాలో సగం మంది మయోపిక్ రోగులే అవుతారని డాక్టర్ హోల్డెన్, ఆయన సహచరులు చేసిన అంచనాలు నిజమైతే ఈ వ్యవహారం ఒక పెద్ద ప్రజారోగ్య సమస్యగా మారవచ్చు.

కంటి కండరాలను సడలించే అట్రోపిన్ కంటి చుక్కలను ఉపయోగిస్తే అవి చిన్న పిల్లలలో కనుగుడ్డు వ్యాప్తి చెందటాన్ని నిరోధిస్తాయని, అంతే కాకుండా హ్రస్వదృష్టి పెరగడాన్ని కూడా అవి తగ్గిస్తాయని సింగపూర్‌కు చెందిన డాక్టర్ చువా, ఆయన సహచరులు ఇరవై సంవత్సరాల క్రితమే నిరూపించారు. డాక్టర్ రోహిత్ సక్సేనా నేతృత్వంలో జరిగిన దేశవ్యాప్త అధ్యయనం ప్రకారం, రెండేళ్ల కాలంలోనే భారతీయ పిల్లలలో కరిగిపోయే అట్రోపిన్ చుక్కలు (0.01 శాతం) ఉపయోగించినప్పుడు అవి హ్రస్వదృష్టి పెరుగుదలను తగ్గించాయని తేలింది.

సూర్యరశ్మికి గురికావడం వల్ల రెటీనాలో డోపమైన్ స్థాయులు పెరుగుతాయి. ఇది హ్రస్వ దృష్టి బారిన పడకుండా కాపాడుతుంది. కోవిడ్–19 సమయంలో ప్రతిరోజూ రెండు గంటలు బయట గడపడం అనేది పిల్లలలో హ్రస్వ దృష్టి వ్యాప్తిని అరికడుతుందని టర్కీకి చెందిన డాక్టర్లు ధ్రువీకరించారు. బహిరంగ కార్యకలాపాలు రోజుకు 2 గంటలు మించి ఉంటే అట్రోపిన్ (బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ నిరోధకం) మరింత ప్రభావవంతంగా ఉంటుందని చండీగఢ్‌లోని డాక్టర్లు కనుగొన్నారు.

అనుభవపూర్వకమైన, సమగ్ర అభ్యాసంపై దృష్టి సారించిన 'జాతీయ విద్యా విధానం–2020', పట్టణ భారతదేశంలో స్థల పరిమితుల సాకును చూపి, 2008 విద్యా హక్కు చట్టంలో తప్పనిసరి చేసిన ముఖ్యమైన ఆట స్థలం అవసరాన్ని తొలగించింది. అయితే ఉపాధ్యాయులు పిల్లలను రోజుకు రెండుసార్లు కనీసం ఒక గంట బయట నడవడానికి అనుమతించాలి.

వ్యాసకర్త ఎమెరిటస్ ప్రొఫెసర్, పీజీఐఎమ్ఈఆర్, చండీగఢ్

యోగం – ధ్యానం

**యోగాత్పరతరం పుణ్యం
యోగాత్పరతరం శివమ్
యోగాత్పరతరం సూక్ష్మం
యోగాత్పరతరం నహి**

యోగము కన్నా శ్రేష్ఠమైన పుణ్యము మరొకటి లేదు. యోగము కన్నా అధికమగు మంగళకరమూ లేదు. యోగము కన్నా శ్రేష్ఠమగు, సూక్ష్మతరమగు జ్ఞానమూ లేదు. యోగము కన్నా ఉత్కృష్టమగు వస్తువు మరొకటి లేదు. (యథార్థ భారతి ఫిబ్రవరి 2014 సంచిక)



జ్యోతిర్మయం

**నాస్తి ధ్యాన సమం తీర్థం
నాస్తి ధ్యాన సమం తపః
నాస్తి ధ్యాన సమో యజ్ఞం
తస్మాత్ ధ్యానం సమాచరేత్**

ధ్యానంతో సమానమైన తీర్థం లేదు, ధ్యానంతో సమానమైన తపస్సు లేదు, ధ్యానంతో సమానమైన యజ్ఞం లేదు, కాబట్టి ధ్యానాన్ని బాగా ఆచరించండి అని దీని అర్థం.


యోగం, ధ్యానం వేరు వేరు కాదు. యోగం ప్రారంభ దశ, ధ్యానం తర్వాతి దశ. యోగం శరీరంతో మొదలై ధ్యానానికి బాటలు వేస్తుంది. శరీరం, మనసు, ఆత్మ అనేవి మూడు విడి విడి భాగాలు కావనీ; శరీరం స్థూలమైనదనీ, దానికంటే సూక్ష్మమైనది మనస్సనీ, అంతకంటే సూక్ష్మమై అన్నిటికీ కేంద్రమై ఆధారమై ఉన్నది ఆత్మ అనీ అనుభవజ్ఞులు చెబుతారు. ఆత్మ దర్శనం కావాలన్నా, ఆత్మానుభూతి కావాలన్నా అంతర్ముఖులు కావాల్సిందే! యోగంతో... అంటే శరీరంతో ప్రారంభించి మనసుకు చేరితే తర్వాత జరగాల్సినది జరుగుతుందంటారు.

అంటే ముందు శరీరాన్ని దోష రహితంగా, రోగ రహితంగా చేసుకోవాలి. తర్వాత మనసులోని మాలిన్యాలను తీసివేయాలి. వాటికి సహకరించేవే యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యానాలు. ఇవన్నీ ఆచరిస్తే సమాధి అనే స్థితి కల్గుతుంది. యోగాన్ని సక్రమంగా అభ్యాసం చేసి శారీరక, మానసిక, ఆధ్యాత్మిక అభివృద్ధిని పొందుదాం. ప్రపంచ శాంతికీ పాటుబడదాం. 'యోగీ భవ' అన్నది శ్రీకృష్ణుని సలహా. (పుట 552–గీతామకరందము)

– రాచమడుగు శ్రీనివాసులు

గ్రహం అనుగ్రహం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, తిథి: శు.పంచమి రా.12.33 వరకు, తదుపరి షష్ఠి, నక్షత్రం: పుష్యమి రా.1.28 వరకు, తదుపరి ఆశ్లేష, వర్జ్యం: ఉ.9.35 నుండి 11.10 వరకు, దుర్ముహూర్తం: ఉ.6.03 నుండి 7.14 వరకు, అమృతఘడియలు: రా.7.13 నుండి 8.50 వరకు; రాహుకాలం: ఉ.9.00 నుండి 10.30 వరకు, యమగండం: ప.1.30 నుండి 3.00 వరకు, సూర్యోదయం: 5.28, సూర్యాస్తమయం: 6.26.


DMart®
Daily Discounts Daily Savings
కొత్త క్లాస్,
కొత్త ఆరంభం
DMart ready
స్టేషనరీ మరియు మరిన్ని
ఎంఆర్‌పిపై 15%-35% తగ్గింపు బ్రాండెడ్ లాంగ్‌బుక్ మరియు నోట్‌బుక్‌లు
ఎంఆర్‌పిపై కనీసం 15% తగ్గింపు పెన్నులు
ఎంఆర్‌పిపై కనీసం 20% తగ్గింపు పెన్సిల్స్
₹15 నుంచి ప్లాస్టిక్ పెన్సిల్ బాక్స్‌లు
₹275 మాత్రమే జెకె కాపీయర్ పేపర్ ఎ4 (21 సెం.మీ x 29.7 సెం.మీ) 70 జిఎస్ఎమ్ 500 షీట్లు ఎంఆర్‌పి ₹355
ఎంఆర్‌పిపై కనీసం 15% తగ్గింపు ఫెవికాల్ గ్లూ
ఎంఆర్‌పిపై కనీసం 15% తగ్గింపు డ్రాయింగ్ ఉపకరణాలు
₹49 నుంచి పెన్సిల్ పర్సులు
₹139 నుంచి లంచ్ బ్యాగులు
₹99 నుంచి మెటల్ అండ్ మాగ్నెటిక్ పెన్సిల్ బాక్స్
₹179 మాత్రమే 12 పాకెట్ ఎక్స్‌ప్యాండబుల్ ఫైల్ ఎంఆర్‌పి ₹250
₹55 మాత్రమే బ్రౌన్ బుక్ కవర్ 38 సెం.మీ ఎంఆర్‌పి ₹70
₹21 నుంచి బుక్ లేబుల్ స్టిక్కర్
₹219 మాత్రమే కాలిక్యులేటర్ ఎంఆర్‌పి ₹400
₹49 నుంచి కత్తెర
₹199 మాత్రమే ఎక్స్‌ప్యాండబుల్ ఫోల్డర్ 12 పాకెట్ ఫైల్ ఎంఆర్‌పి ₹290
ఎంఆర్‌పిపై 15% తగ్గింపు కంగారు ఉత్పత్తులపై
ఎంఆర్‌పిపై 20% తగ్గింపు అప్సర ఎరేజర్ మరియు షార్పెనర్
₹349 నుంచి స్టడీ టేబుల్
₹149 నుంచి బిల్డింగ్ బ్లాక్స్
₹99 నుంచి ఇవా పజిల్
బ్యాగులు, బాక్స్‌లు మరియు మరిన్ని
₹299 నుంచి కాలేజ్ బ్యాగులు
₹199 నుంచి స్కూల్ బ్యాగులు
₹149 నుంచి లంచ్ బాక్స్ + వాటర్ బాటిల్ కాంబో
₹99 మాత్రమే స్టీల్ ఫ్లెక్సీ 2 లేయర్ లంచ్ బాక్స్ ఎంఆర్‌పి ₹399
₹39 నుంచి లంచ్ బాక్స్
₹149 నుంచి స్టీల్ బాటిల్
₹49 నుంచి ప్లాస్టిక్ బాటిల్
₹10 నుంచి కిడ్స్ ఫేస్ టవల్
₹249 నుంచి పాలిమర్ క్రికెట్ బ్యాట్
₹379 మాత్రమే ఫుట్‌బాల్ ఎంఆర్‌పి ₹470
₹249 నుంచి బాస్కెట్‌బాల్
₹299 నుంచి గొడుగు
₹149 మాత్రమే పూంచో ఎంఆర్‌పి ₹199
₹179 నుంచి స్కూల్ షూస్
గ్రోసరీ అండ్ డైలీ ఎసెన్షియల్స్
కొనండి 1 పొందండి 1 ఉచితంగా సన్‌ఫీస్ట్ మామ్స్ మేజిక్ జీడిపప్పు మరియు బాదం బిస్కెట్లు 560 గ్రాములు ఎంఆర్‌పి ₹150
₹145 మాత్రమే లోట్టె చాకోపై బిస్కెట్ 504 గ్రాములు ఎంఆర్‌పి ₹230
₹75 మాత్రమే బ్రిటానియా మిల్క్ బికిస్ బిస్కెట్స్ 710 గ్రాములు ఎంఆర్‌పి ₹125
₹69 మాత్రమే బ్రిటానియా జిమ్ జామ్ పాప్స్ 350 గ్రాములు ఎంఆర్‌పి ₹100
₹19 మాత్రమే బ్రిటానియా గోబుల్స్ చోకో చిప్/ఫ్రూట్ ఫన్ కేక్ 100 గ్రాములు ఎంఆర్‌పి ₹30
₹145 మాత్రమే హెల్మన్స్ రియల్ మయోనైస్ పౌచ్ 800 గ్రాములు ఎంఆర్‌పి ₹210
₹27/₹30 మాత్రమే ORSL ఆపిల్/ఆరెంజ్ ఎలక్ట్రోలైట్ డ్రింక్ టెట్రా 200 మి.లీ ఎంఆర్‌పి ₹42 / ₹45
₹309 మాత్రమే బూస్ట్ రీఫిల్ ప్యాక్ 750 గ్రాములు ఎంఆర్‌పి ₹469
కొనండి 1 పొందండి 1 ఉచితంగా డెల్మోంటే టొమాటో కెచప్ పౌచ్ 900 గ్రాములు ఎంఆర్‌పి ₹130
₹320 మాత్రమే నుటెల్లా ఫెర్రెరో 350 గ్రాములు ఎంఆర్‌పి ₹399
₹209 మాత్రమే కిస్సాన్ మిక్స్ ఫ్రూట్ జామ్ 700 గ్రాములు ఎంఆర్‌పి ₹270
₹79 మాత్రమే సన్‌ఫీస్ట్ యిప్పీ మ్యాజిక్ మసాలా నూడుల్స్ 480 గ్రాములు ఎంఆర్‌పి ₹120
₹449 మాత్రమే కల్పవి జంబో ఫ్యాక్స్ కాష్యూ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹648
₹449 మాత్రమే నట్‌రాజ్ కాలిఫోర్నియా ఆల్మండ్స్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹649
₹280 మాత్రమే డాబర్ హనీ స్క్వీజీ ప్యాక్ 400 గ్రాములు ఎంఆర్‌పి ₹420
₹389 మాత్రమే సెన్సోడైన్ రిపేర్ అండ్ ప్రొటెక్ట్ టూత్‌పేస్ట్ 2 U x 100 గ్రాములు ఎంఆర్‌పి ₹513
₹250 మాత్రమే పారాచూట్ కొబ్బరి ఆయిల్ 600 మి.లీ ఎంఆర్‌పి ₹321
కొనండి 1 పొందండి 1 ఉచితంగా సన్‌సిల్క్ స్ట్రాంగ్ బ్లాక్ షైన్ షాంపూ 650 మి.లీ ఎంఆర్‌పి ₹882
₹275 మాత్రమే ఫియామా సెలబ్రేషన్ ప్యాక్ జెల్ బార్ 4x125 గ్రాములు ఎంఆర్‌పి ₹425
₹524/₹460 మాత్రమే సర్ఫ్ ఎక్సెల్ మాటిక్ ఫ్రంట్/టాప్ లోడ్ లిక్విడ్ డిటర్జెంట్ పౌచ్ 4 లీ ఎంఆర్‌పి ₹885 / ₹795
ఎంఆర్‌పిపై 20% తగ్గింపు కివి షూ పాలిష్ (అన్ని రకాలు)
₹43 మాత్రమే లూస్ చక్కెర 1 కిలో
₹43 మాత్రమే లూస్ సోనా మసూరి కర్నూల్ పిండి 1 కిలో
₹77 మాత్రమే లూస్ బిర్యానీ రైస్ 1 కిలో
₹34 మాత్రమే లూస్ గోధుమ పిండి 1 కిలో
₹33 మాత్రమే లూస్ ఇడ్లీ రవ్వ 1 కిలో
₹105 మాత్రమే లూస్ తాండూర్ కంది పప్పు దాల్ 1 కిలో
₹75 మాత్రమే లూస్ శనగపిండి 1 కిలో
₹39 మాత్రమే లూస్ రవ్వ 1 కిలో
₹55 మాత్రమే లూస్ అటుకులు 1 కిలో
₹101 మాత్రమే లూస్ ఉరద్ గోటా 1 కిలో
₹119 మాత్రమే లూస్ వేరుశనగ 1 కిలో
₹59 మాత్రమే లూజ రౌండ్ జాగరీ 1 కిలో
₹259 మాత్రమే మిక్స్ డ్రై ఫ్రూట్స్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹396
₹429 మాత్రమే బాదంపప్పు 500 గ్రాములు ఎంఆర్‌పి ₹670
₹399 మాత్రమే స్వాద్ పిస్తా 400 గ్రాములు ఎంఆర్‌పి ₹575
₹140 మాత్రమే స్వాద్ కిస్మిస్ 500 గ్రాములు ఎంఆర్‌పి ₹196
₹79 మాత్రమే గరం మసాలా హోల్ 100 గ్రాములు ఎంఆర్‌పి ₹136
కనీసం 6% డిస్కౌంట్
1 ఎన్
Impulse/05/25



గెలాక్సీలు ఢీకొంటే!

గెలాక్సీలు. అసంఖ్యాకమైన నక్షత్రాలకు నిలయాలు. అలాంటి రెండు అతి పెద్ద గెలాక్సీలు పరస్పరం ఢీకొంటే? అందులో ఒకటి మన పాలపుంతే అయితే? సుదూర భవిష్యత్తులో జరిగేందుకు అవకాశాలు పుష్కలంగా ఉన్నట్టు సైంటిస్టులు చెబుతున్నారు. పాలపుంతకు అత్యంత సమీపంలో ఉన్న గెలాక్సీ ఆండ్రోమెడా. అవి రెండూ ప్రస్తుతం పరస్పరం 25 లక్షల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నాయి. అవి పరస్పరం సమీపించే కొద్దీ జరగబోయే భావి పరిణామాలకు సంబంధించిన ఊహాచిత్రాలను నాసా తాజాగా విడుదల చేసింది. మొదటి ఫొటోలో అవి 10 లక్షల కాంతి సంవత్సరాల దూరంలో ఉన్నాయి. రెండో ఫొటోలో చూపినట్టుగా ఆ దూరం 5 లక్షల కాంతి సంవత్సరాలకు తగ్గుతూనే రెండు గెలాక్సీల్లోనూ ఉండే కృష్ణరాశి కారణంగా వాటి మధ్య విపరీతమైన రాపిడి పుడుతుంది. దాంతో అవి పరస్పరం దగ్గరయ్యే వేగం ఊహాతీతంగా పెరుగుతుంది. అది లక్ష కాంతి సంవత్సరాలకు తగ్గిన మరుక్షణం మూడో ఫొటోలో మాదిరిగా అవి ఢీకొంటాయి. అలాగని మనం పెద్దగా భయపడాల్సింది కూడా ఏమీ లేదు. ఎందుకంటే మన పాలపుంత, ఆండ్రోమెడా ఢీకొనేందుకు కనీసం మరో 400 నుంచి 500 కోట్ల ఏళ్లు పడుతుందట! అంతేగాక దీని ప్రభావం మన సౌరవ్యవస్థపై మాత్రం మరీ భారీగా ఉండకపోవచ్చన్నది సైంటిస్టుల అంచనా. - సాక్షి, నేషనల్ డెస్క్

ముంచుకొస్తున్న ముప్పు

ఉష్ణోగ్రతల పెరుగుదలతో వేగంగా కరిగిపోతున్న హిమానీనదాలు

- మరో 2 డిగ్రీలు పెరిగితే హిందూకుష్‌లో 75 శాతం మంచు మాయం
- ఆసియాలో 200 కోట్ల మంది మనుగడకు ప్రమాదం
- 10 దేశాల సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడి
- గ్లేసియర్లను కాపాడుకోవడంపై దృష్టి పెట్టాలంటున్న పర్యావరణ నిపుణులు



న్యూఢిల్లీ: హిమాలయ పర్వతాలు భారతదేశానికి పెట్టని కోటలాంటివి. హిమాలయాల్లోని 800 కిలోమీటర్లకుపైగా పొడవైన హిందూకుష్ పర్వత శ్రేణిలో ఎన్నెన్నో హిమానీనదాలు(గ్లేసియర్స్) ఉన్నాయి. ఎన్నో నదులు, సరస్సులకు ఇవే ఆధారం. మధ్య, దక్షిణాసియాలో హిందూకుష్ గ్లేసియర్స్ నుంచి వచ్చే నీటిపై ఆధారపడి 200 కోట్ల మంది జీవనం సాగిస్తున్నారు. కర్బన ఉద్గారాలు, వాతావరణ మార్పుల వల్ల ఉష్ణోగ్రతలు విపరీతంగా పెరిగిపోతుండడంతో హిమానీనదాలు వేగంగా కరిగిపోతున్నాయి. పారిశ్రామిక యుగానికి ముందున్న ఉష్ణోగ్రతల కంటే మరో 2 డిగ్రీల సెల్సియస్‌కుపైగా పెరిగితే ఈ శతాబ్దం ఆఖరు నాటికి హిందూకుష్ హిమానీనదాల మంచులో 75 శాతం అంతమైపోతుందని తాజా అధ్యయనంలో వెల్లడయ్యింది. 200 కోట్ల మంది జీవనం ప్రమాదంలో పడుతుందని తేలింది. ఈ అధ్యయనం వివరాలను సైన్స్ జర్నల్‌లో ప్రచురించారు. భూగోళంపై మానవ మనుగడ కొనసాగాలంటే వాతావరణ మార్పుల నియంత్రణ, పర్యావరణ పరిరక్షణపై ప్రపంచ దేశాలన్నీ తక్షణమే దృష్టిపెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు.

- 10 దేశాలకు చెందిన 21 మంది శాస్త్రవేత్తలు ఉమ్మడిగా ఈ అధ్యయనం నిర్వహించారు. ప్రపంచవ్యాప్తంగా 2 లక్షలకుపైగా గ్లేసియర్లలో మంచు కరుగుతున్న తీరును పరిశీలించడానికి 8 గ్లేసియర్ మోడల్స్ ఉపయోగించారు.
- ఉష్ణోగ్రతలు మరింత పెరగకుండా స్థిరంగా ఉన్నప్పటికీ గ్లేసియర్లలో మంచు కరగడం ఇప్పట్లో ఆగదని అధ్యయనకర్తలు స్పష్టంచేశారు. రాబోయే కొన్ని దశాబ్దాలపాటు ఈ పరిమాణం కొనసాగుతూనే ఉంటుందని పేర్కొన్నారు.
- ఉష్ణోగ్రత కేవలం అర డిగ్రీ పెరిగినా సరే దాని ప్రభావం హిమానీనదాలపై కచ్చితంగా ఉంటుందని, ఈ మేరకు మంచు కరిగిపోతుందని సైంటిస్టు డాక్టర్ హ్యారీ జెకొల్లారీ చెప్పారు. మనం ఈ రోజు తీసుకొనే నిర్ణయాలు మన భవిష్యత్తు తరాల బతుకులను నిర్ణయిస్తాయని అన్నారు. రాబోయే తరాలు బాగుండాలంటే గ్లేసియర్లను కాపాడుకోవాలని సూచించారు.
- పారిస్ వాతావరణ ఒప్పందం ప్రకారం.. భూమిపై ఉష్ణోగ్రతల పెరుగుదలను 1.5 డిగ్రీలకు పరిమితం చేస్తే హిమాలయాలు, కాకస్ పర్వతాల్లో 40–45 శాతం మంచును కాపాడుకోవచ్చు.
- ఒకవేళ ఉష్ణోగ్రతలు 2.7 డిగ్రీలు పెరిగితే ప్రపంచవ్యాప్తంగా 75 శాతం మంచు కరిగిపోతుంది. ఈ శతాబ్దం ఆఖరు నాటికి కేవలం 25 శాతమే మిగిలి ఉంటుంది.
- యూరప్‌లో ఆల్ప్స్, ఉత్తర అమెరికాలో రాకీస్‌తోపాటు ఐస్‌ల్యాండ్‌లోని గ్లేసియర్లు మానవులకు జీవనాధారం కల్పిస్తున్నాయి. ప్రస్తుతం వీటికి ముప్పు పొంచి ఉంది. భూగోళం మరో రెండు డిగ్రీలు వేడెక్కితే.. ఇక్కడ మంచు 10–15 శాతమే మిగులుతుందని అంచనా వేస్తున్నారు. దాదాపు 90 శాతం మంచు కనుమరుగైతే పరిస్థితి తీవ్రత ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. ఇక స్కాండినేవియా ప్రాంతంలో మంచు పూర్తిగా కరిగిపోతుందన్న అంచనాలున్నాయి.
- హిమానీనదాలపై ఐక్యరాజ్యసమితి తొలి సదస్సు ప్రస్తుతం తజకిస్తాన్‌లోని దుషాన్బేలో జరుగుతోంది. 50కిపై దేశాలు ఇందులో పాల్గొంటున్నాయి.
- గ్లేసియర్లు వేగంగా కరిగిపోతుండడం వల్ల ఆసియాలో 200 కోట్ల మందికి కష్టాలు రాబోతున్నాయని ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఉపాధ్యక్షుడు యింగ్‌మింగ్ యాంగ్ హెచ్చరించారు. ఆసియా, పసిఫిక్ ప్రాంతాల్లో సమీప భవిష్యత్తులో తీవ్రమైన వరదలు, కరువులు సంభవించే ప్రమాదం ఉందని, సముద్ర నీటి మట్టం పెరగడం వల్ల తీర ప్రాంతాలు మునిగిపోతాయని చెప్పారు.
- మంచు కరిగిపోవడాన్ని ఆపాలంటే శిలాజ ఇంధనాలను పక్కనపెట్టాలని, క్లీన్ ఎనర్జీని ఉపయోగించుకోవాలని యింగ్‌మింగ్ యాంగ్ స్పష్టంచేశారు. భూమిని అగ్నిగుండంగా మారుస్తున్న కాలుష్య ఉద్గారాలకు కళ్లెం వేయాలన్నారు.

ఉగ్రవాద విష సర్పాన్ని నలిపేస్తాం

మన అమ్మలపాదిలో ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక బాణం

ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఉగ్రవాదులను శిక్షించాం: ప్రధాని మోదీ



కారాకాట్/కాన్పూర్: ఉగ్రవాదం ఒక విష సర్పమని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అది మరోసారి మనవైపు తల ఎత్తిచూస్తే, కలుగులోంచి బయటకు లాగి, కాలితో నలిపి చంపేస్తామని తీవ్రంగా హెచ్చరించారు. పహల్గాం ఉగ్రవాద దాడి వెనుక ఉన్న కుట్రదారుల స్థావరాలను మన సైనిక దళాలు శిథిలాలుగా మార్చేశాయని చెప్పారు. మన అమ్మలపాదిలో ఆపరేషన్ సిందూర్ కేవలం ఒక బాణం అని తెలిపారు. ఉగ్రవాదంపై పోరాటం ఆగదని, ఆపే ప్రసక్తే లేదని పునరుద్ఘాటించారు. శుక్రవారం బిహార్‌లోని కరాకాట్ పట్టణంలో రూ.48,520 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు. అలాగే ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో రూ.47,600 కోట్ల విలువైన 15 మెగా అభివృద్ధి ప్రాజెక్టులు ప్రారంభించారు. మరికొన్నింటికి శంకుస్థాపన చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులకు సర్టిఫికెట్లు, చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా రెండుచోట్లా బహిరంగ సభల్లో ప్రసంగించారు. గత నెలలో పహల్గాంలో ఉగ్రదాడి జరిగిన మరుసటి రోజే బిహార్‌లోని మధుబని జిల్లాలో పర్యటించానని, ముష్కరులను కలలో కూడా ఊహించలేని రీతిలో శిక్షిస్తానంటూ ప్రజలకు మాట ఇచ్చానని గుర్తుచేశారు. ఆ మాట నిలబెట్టుకొని, మళ్లీ బిహార్‌లో అడుగు పెట్టానని పేర్కొన్నారు. మన ఆడబిడ్డలు ధరించే సిందూరం శక్తి ఏమిటో పాకిస్తాన్‌తోపాటు మొత్తం ప్రపంచం చూసిందన్నారు. ప్రధాని మోదీ ఇంకా ఏం చెప్పారంటే...

అణు బాంబులకు భయపడం

''పాకిస్తాన్ సైన్యం రక్షణలో భద్రంగా ఉన్నట్లు ఉగ్రవాదులు భావించేవారు. కానీ, వారిపై దాడి చేసి మోకాళ్లపై నిలబెట్టాం. పాకిస్తాన్ వైమానిక స్థావరాలు, సైనిక కేంద్రాలను ధ్వంసం చేశాం. ఇది నవ భారతం. మన శక్తి ఏమిటో అందరికీ తెలుస్తోంది. ఉగ్రవాదులకు మరింత బాగా అర్థమవుతోంది. దేశ రక్షణ కోసం సరిహద్దు భద్రతా దళం(బీఎస్ఎఫ్) అందిస్తున్న సేవలు వెలకట్టలేనివి. బిహార్‌లోని సరన్ జిల్లాకు చెందిన బీఎస్ఎఫ్ ఎస్ఐ మొహమ్మద్ ఇంతియాజ్ జమ్మూకశ్మీర్‌లో ఉగ్రవాదులపై పోరాడుతూ అమరుడయ్యాడు. బీఎస్ఎఫ్ జవాన్లు దేశమాత సేవలో తరిస్తున్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో స్వదేశీ ఆయుధ బలాన్ని, మేక్ ఇన్ ఇండియా శక్తిని ప్రదర్శించాం. బ్రహ్మోస్ క్షిపణులు పాకిస్తాన్ భూభాగంలోకి ప్రవేశించి, విధ్వంసం సృష్టించాయి. మనం కొడుతున్న దెబ్బలు తట్టుకోలేక యుద్ధం ఆపాలంటూ పాకిస్తాన్ వేడుకుంది. ఆపరేషన్ సిందూర్ ముగియలేదు. అణు బాంబులకు భారత్ భయపడదు. శత్రువుల వద్దనున్న అణ్వాయుధాలను బట్టి నిర్ణయాలు తీసుకొనే రోజులు పోయాయి. ఉగ్రవాదాన్ని అంతం చేసే విషయంలో మన సైనిక దళాలకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చాం. ముష్కరులపై ఎప్పుడు, ఎక్కడ, ఎలా దాడి చేయాలో సైనికులే నిర్ణయించుకుంటారు. ఉగ్రవాదులను, ఉగ్రవాదాన్ని ప్రోత్సహించే ప్రభుత్వాలను ఇకపై ఒక్కటిగానే పరిగణిస్తాం.

మావోయిజం అంతమయ్యే రోజు దగ్గర్లోనే..

దేశానికి శత్రువులైన వారందరిపైనా మన పోరాటం కొనసాగుతోంది. వారి సరిహద్దులో ఉండొచ్చు లేదా దేశం నడిబొడ్డున ఉండొచ్చు. హింస, అశాంతిని ప్రేరేపించే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. గతంలో నక్సలైట్ల అరాచకాల వల్ల బిహార్ ప్రజలు భయంభయంగా బతికారు. నక్సలైట్ల కారణంగా అభివృద్ధి ఆగిపోయింది. పిల్లల చదువులు దెబ్బతిన్నాయి. రోడ్లు వేస్తున్న కార్మికులను కూడా హత్య చేశారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం పట్ల నక్సలైట్లకు ఏమాత్రం విశ్వాసం లేదు. 2014లో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తీవ్రవాద నిర్మూలనపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాం. మా కృషి ఫలితంగా దేశంలో మావోయిస్టు ప్రభావిత జిల్లాల సంఖ్య 125 నుంచి 18కి పడిపోయింది. రోడ్లు నిర్మిస్తున్నాం, యువతకు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. మావోయిజం పూర్తిగా అంతమయ్యే రోజు దగ్గర్లోనే ఉంది. శాంతి, సౌభాగ్యం, విద్య ప్రతి గ్రామానికీ చేరుకుంటాయి'' అని ప్రధాని మోదీ ఉద్ఘాటించారు.


'పహల్గాం' బాధిత కుటుంబానికి పరామర్శ



పహల్గాం ఉగ్రదాడిలో మృతి చెందిన శుభం ద్వివేది కుటుంబ సభ్యులను ప్రధాన మంత్రి పరామర్శించారు. కాన్పూర్‌లోని చాకేరి ఎయిర్‌పోర్టులో వారిని కలుసుకున్నారు. మోదీని చూసి వారంతా బోరున విలపించారు. ఈ సందర్భంగా మోదీ సైతం తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. ఆందోళన వద్దని, ప్రభుత్వం అండగా ఉంటుందని శుభం ద్వివేది కుటుంబానికి భరోసా కల్పించారు.

ఒకే షిఫ్ట్‌లో నీట్-పీజీ పరీక్ష

న్యూఢిల్లీ: జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష-పోస్టు గ్రాడ్యుయేట్ (నీట్-పీజీ)-2025ను ఒకే షిఫ్ట్‌లో నిర్వహించాలని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహిస్తే కొన్ని ఇబ్బందుల ఏర్పడే అవకాశం ఉందని అభిప్రాయపడింది. నీట్-పీజీ పరీక్షను జూన్ 15న పూర్తి పారదర్శకంగా, ఒకే షిఫ్ట్‌లో నిర్వహించడానికి చర్యలు చేపట్టాలని జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. పూర్తి భద్రత కలిగిన ఎగ్జామ్ సెంటర్లను గుర్తించాలని పేర్కొంది. నీట్-పీజీ పరీక్షను రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహించాలన్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి. పరీక్ష రెండు షిఫ్ట్‌ల్లో నిర్వహిస్తే ప్రశ్నల క్లిష్టత స్థాయి మారిపోయి కొందరు అభ్యర్థులకు అన్యాయం జరిగే అవకాశం ఉందన్న ఆందోళనలు వ్యక్తమయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ విక్రమ్‌నాథ్ ధర్మాసనం విచారణ చేపట్టింది. ఒకే షిఫ్ట్‌లో పరీక్ష నిర్వహించడానికి, ఏర్పాట్లు చేయడానికి సమయం సరిపోదన్న ఎన్‌బీఈ వాదనను తోసిపుచ్చింది.



సుప్రీం జడ్జిగా ప్రమాణం చేస్తున్న జస్టిస్ విజయ్ బిష్ణోయ్ | సీజేఐ జస్టిస్ గవాయ్‌తో జస్టిస్ అంజారియా | ప్రమాణం చేస్తున్న జస్టిస్ ఏఎస్ చందూర్కర్

సుప్రీం జడ్జీల ప్రమాణస్వీకారం

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు న్యాయమూర్తులుగా జస్టిస్ ఎన్.వి.అంజారియా, జస్టిస్ విజయ్ బిష్ణోయ్, జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్ శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయ మూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. ముగ్గురు న్యాయమూర్తుల ప్రమాణ స్వీకారంతో సుప్రీంకోర్టులో సీజేఐతో కలిపి మొత్తం జడ్జిల సంఖ్య పూర్తి సామర్థ్యం మేరకు 34కు చేరుకుంది.

ఇంటర్వ్యూ స్లాట్ల కోసం చెక్ చేసుకోండి

న్యూయార్క్: అమెరికా వీసాల కోసం దరఖాస్తు చేసు కున్న విదేశీ విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిలిపివేస్తూ డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. కొత్తగా ఇంటర్వ్యూలు నిర్వహించడం లేదని ప్రభుత్వం స్పష్టం చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు ఇంటర్వ్యూ స్లాట్లు తాత్కాలికంగా నిలిపివేసింది. అయితే, స్లాట్లు ఎప్పుడైనా తెరిచే అవకాశం ఉందని, అందుకోసం తరచుగా తనిఖీ చేసుకోవాలని విదేశీ విద్యార్థులకు ట్రంప్ ప్రభుత్వం తాజాగా సూచించింది. ఇంటర్వ్యూ స్లాట్లు ఎప్పుడు మొదలవుతాయో కచ్చితంగా చెప్పలేమని పేర్కొంది. కొంత ఆలస్యమయ్యే అవకాశం ఉందని వెల్లడించింది. స్లాట్ల కోసం ఆన్‌లైన్‌లో చెక్ చేసుకోవడం మంచిదని తెలియజేసింది.

ఎంఐటీ వేదిక నుంచి

పాలస్తీనాకు సంఘీభావం

- భారతీయ విద్యార్థిని సాహసం
- గ్రాడ్యుయేషన్ వేడుకలో కెఫియే ధరించి ప్రసంగం



భుజంపై కెఫియేతో మేఘ వేమూరి

కేంబ్రిడ్జ్ (యూఎస్): పాలస్తీనా మాటెత్తితే చాలు, ఏకంగా యూనివర్సిటీలపైనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఉక్కుపాదం మోపుతున్న వేళ భారత సంతతికి చెందిన మేఘ వేమూరి అనే విద్యార్థిని సంచలన వ్యాఖ్యలు చేశారు. కేంబ్రిడ్జ్‌లోని మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) గ్రాడ్యుయేషన్ వేదిక నుంచి ఏకంగా పాలస్తీనాకు మద్దతు పలికారు. ఇజ్రాయెల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇజ్రాయెల్‌తో తమ వర్సిటీ పరిశోధన ఒప్పందాలను తీవ్రంగా వ్యతిరేకించారు. పాలస్తీనా సంఘీభావానికి ప్రతీకగా కెఫియే (హిజాబ్ వంటిది) ధరించి మరీ గ్రాడ్యుయేషన్ వేడుకలో పాల్గొన్నారు! తన ప్రసంగంలో పాలస్తీనాకు పూర్తి మద్దతు తెలిపారు. ''పాలస్తీనా ప్రజలపై ఇజ్రాయెల్ దాడికి అమెరికా మాత్రమే కాదు, మన యూనివర్సిటీ కూడా సాయం చేస్తోంది. వాటిని ప్రోత్సహిస్తోంది'' అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ''ఎంఐటీ విద్యార్థులు స్వేచ్ఛాయుత పాలస్తీనాను కోరుకుంటున్నారు. ఒక జాతి విధ్వంసాన్ని విద్యార్థులు సహించలేరు. మా జీవితాలను శాస్త్రవేత్తలుగా, ఇంజనీర్లు, విద్యావేత్తలు, నాయకులుగా తీర్చిదిద్దుకుంటాం. అలాగే ఆయుధ నిషేధానికి పిలుపునిచ్చేందుకు కూడా మేం అంతే కట్టుబడి ఉన్నాం. ఎంఐటీ పూర్వ విద్యార్థులుగా ఇజ్రాయెల్‌తో సంబంధాలను తెంచుకోవాలని వర్సిటీని డిమాండ్ చేస్తూనే ఉంటాం'' అని ఆమె ఉద్ఘాటించారు. అమెరికాలో విద్యా రంగంలో అనిశ్చితి, విద్యార్థి కార్యకర్తలు ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి కూడా మేఘ మాట్లాడారు. ''ప్రస్తుతం అమెరికావ్యాప్తంగా విద్యాసంస్థలపై అనిశ్చితి చీకట్లు కమ్ముకున్నాయన్నది బహిరంగ రహస్యం. తర్వాత ఏం జరగనుందనే ప్రశ్న మా మనస్సుల్లో ప్రతిధ్వనిస్తోంది'' అని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎంఐటీ విద్యార్థులు జాతి విధ్వంసాన్ని సహించరు

అమెరికాలో చాలామంది విద్యార్థుల హృదయాల్లో భయాందోళనలు గూడుకట్టుకుని ఉన్నాయని మేఘ అన్నారు. ''మేమంతా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి జీవితాల్లో ముందుకు సాగడానికి సిద్ధమవుతున్నాం. గాజాలో మాత్రం అసలు విద్యా సంస్థలే లేకుండా చేశారు. పాలస్తీనాను పూర్తిగా తుడిచిపెట్టడానికి ఇజ్రాయెల్ ప్రయత్నిస్తోంది. ఆ ప్రయత్నాల్లో ఎంఐటీ కూడా భాగస్వామి కావడం సిగ్గుచేటు. గాజాలో శాశ్వత కాల్పుల విరమణకు ఎంఐటీ విద్యార్థులు పిలుపునిచ్చారు. క్యాంపస్‌లో పాలస్తీనా అనుకూల కార్యకర్తలకు సంఘీభావం తెలిపారు. వర్సిటీ నుంచే బెదిరింపులు, అణచివేత ఎదుర్కొన్నా వెనకడుగు వేయలేదు. ఎందుకంటే నాకు తెలిసి ఎంఐటీ విద్యార్థులు మారణహోమాన్ని ఎప్పటికీ సహించరు. జాతి విధ్వంసాన్ని హర్షించరు'' అని స్పష్టం చేశారు.

100% అక్షరాస్యత సాధించాం: గోవా సీఎం

పణజీ: గోవా నూటికి నూరు శాతం అక్షరాస్యత సాధించిందని ఆ రాష్ట్ర సీఎం ప్రమోద్ సావంత్ శుక్రవారం ప్రకటించారు. ఉల్లాస్ (అండర్‌స్టాండింగ్ ఫర్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) నవభారత్ సాక్షరతా కార్యక్రమం ద్వారా ఈ విజయం సాధ్యమైందని తెలిపారు. పదవీ విరమణ చేసిన ఉపాధ్యాయులు, ఎన్ఎస్ఎస్ విభాగాలు, ఉపాధ్యా శిక్షణ కళాశాలల విద్యార్థులు, క్షేత్ర స్థాయి విద్యా నిపుణులు, స్వచ్ఛంద కార్యకర్తలు ఈ బృహత్ కార్యక్రమంలో పాలుపంచుకున్నారని సీఎం వివరించారు. పాఠశాల విద్యకు నోచుకోని 15 ఏళ్ల పైబడిన వారికి సాధికారిత కల్పించడం కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన విద్యావిధానంలో ఉల్లాస్ ఒక భాగం. గోవా రాష్ట్ర 39వ అవతరణ దినోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో సీఎం సావంత్ ఈ విషయం ప్రకటించారు.

ఆర్ఐసీని పునరుద్ధరిద్దాం: రష్యా

మాస్కో: రష్యా-భారత్-చైనా త్రయం బంధాన్ని పునరుద్ధరించాలని రష్యా పిలుపునిచ్చింది. లద్దాఖ్‌లో సైనిక ప్రతిష్టంభనకు సంబంధించి భారత్, చైనా అవగాహనకు వచ్చిన నేపథ్యంలో మూడు దేశాలూ మరింతగా కలసి సాగాలని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ పేర్కొన్నారు. ''రష్యా-భారత్-చైనా (ఆర్ఐసీ) కార్యకలాపాల పునరుద్ధరణపై మేం ఆసక్తిగా ఉన్నాం. రష్యా మాజీ ప్రధాని యెవగనీ ప్రిమకోవ్ చొరవతో చాలా ఏళ్ల క్రితం స్థాపించిన ఆర్ఐసీ పునరుద్ధరణ కోసం వేచి చూస్తున్నాం. వాటి మధ్య గతంలో ఏకంగా 20సార్లకు మించి అత్యున్నత స్థాయి సమావేశాలు జరిగాయి. సరిహద్దులో పరిస్థితిని సులభతరం చేయడంపై భారత్, చైనా మధ్య అవగాహన కుదిరింది. కనుక ఆర్ఐసీ పునరుద్ధరణకు ఇదే సరైన సమయం'' అని లావ్రోవ్ అన్నారు. పెర్మ్‌లో జరిగిన అంతర్జాతీయ సామాజిక, రాజకీయ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. భారత్‌ను చైనా వ్యతిరేక కుట్రలోకి లాగేందుకు నాటో ప్రయత్నిస్తోందని ఆరోపించారు. 2020 జూన్లో గల్వాన్ సంక్షోభం అనంతరం ఆర్ఐసీ కార్యకలాపాలు నిలిచిపోయాయి.

టారిఫ్‌ల నిలిపివేతపై స్టే

ట్రంప్‌కు తాత్కాలిక ఊరట

వాషింగ్టన్: ప్రపంచ దేశాలపై విధించిన అదనపు టారిఫ్‌ల విషయమై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు ఊరట లభించింది. అదనపు టారిఫ్‌లు కుదరవంటూ యూఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇచ్చిన తీర్పును అపీల్స్ కోర్టు తాత్కాలికంగా నిలుపుదల చేసింది. వాటిపై స్టే విధిస్తూ గురువారం తీర్పు వెలువరించింది. కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఉత్తర్వులను వైట్‌హౌస్ ప్రెస్ సెక్రెటరీ కరోలినా లెవిట్ దుయ్యబట్టారు. వాటిని మితిమీరిన న్యాయ జోక్యంగా అభివర్ణించారు. ఆ ఉత్తర్వులపై అపీల్స్ కోర్టు తుది విచారణలోనూ చుక్కెదురైతే సుప్రీంకోర్టుకు వెళ్తామని ట్రంప్ న్యాయ సలహాదారులు ప్రకటించారు.

పాక్‌లో 90 రోజులున్నా..

- ఐఎస్ఐ అధికారుల్ని కలిశా!
- ఢిల్లీ పోలీసుల విచారణలో రాజస్తాన్ వాసి వెల్లడి

న్యూఢిల్లీ: పాకిస్తాన్‌కు రెండుసార్లు వెళ్లి వచ్చిన ఓ వ్యక్తిని ఢిల్లీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పాకిస్తాన్ నిఘా సిబ్బందికి (పీఐవోలకు) భారత మొబైల్ సిమ్ కార్డులను అందజేయడంతోపాటు గూఢచర్య కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు ఇతడిపై ఆరోపణలున్నాయి. రాజస్తాన్ రాష్ట్రం డీగ్ జిల్లా గంగోరా గ్రామానికి చెందిన కాసిమ్(34)ను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. ఇతడు 2024 ఆగస్ట్- 2025 మార్చి మధ్యలో రెండుసార్లు పాకిస్తాన్ వెళ్లి వచ్చాడని, అక్కడ కనీసం 90 రోజులు గడిపినట్లు విచారణలో వెల్లడించాడని చెప్పారు. ఆ సమయంలో అతడు పాక్ గూఢచర్య విభాగం ఇంటర్ సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ)అధికారులను కలిసినట్లు చెబుతున్నారు. భారత మొబైల్ నంబర్లను పాక్ నిఘా విభాగం అధికారులు గూఢచర్యం కోసం వాడుతున్నట్లు 2024 సెప్టెంబర్‌లో తమ దృష్టికి వచ్చిందన్నారు. వీటిని ఇక్కడే పొంది, అక్కడికి పంపించారని తెలిపారు. ఈ నంబర్లను వాడుకుంటూ సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ మార్గాల్లో భారతీయులను వలలో వేసుకుని, ఆర్మీకి సంబంధించిన సున్నిత సమాచారాన్ని సేకరిస్తున్నట్లు గుర్తించామని వివరించారు. వీటిపై దర్యాప్తు సమయంలోనే కాసిమ్ పేరు బయటకు వచ్చినట్లు తెలిపారు. ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో అధికారులు దేశంలో గూఢచర్యం కార్యకలాపాలకు పాల్పడుతున్న ఆరోపణలపై పలువురిని అదుపులోకి తీసుకుంటుండటం తెల్సిందే.

వివేక్ రామస్వామిపై జాతి విద్వేష వ్యాఖ్యలు
రూ.500 నోట్ల కట్టలను రోడ్డుపైకి విసిరేసి..
- సాక్షి ఫ్లస్ పేజీలో...

118 పాక్ ఫార్వర్డ్ పోస్టులు, నిఘా వ్యవస్థలు తుత్తునియలు

బీఎస్ఎఫ్‌పై హోం మంత్రి అమిత్ షా ప్రశంసలు



పూంఛ్: ఆపరేషన్ సిందూర్ సమయంలో బీఎస్ఎఫ్ బలగాలు పాకిస్తాన్‌కు చెందిన 118 ఫార్వర్డ్ పోసులతోపాటు సమాచార, నిఘా వ్యవస్థను తుత్తునియలు చేశాయని హోం మంత్రి అమిత్ షా తెలిపారు. తీవ్రంగా నష్ట పోయిన శత్రుదేశం తిరిగి కోలుకునేందుకు నాలుగైదు ఏళ్లు పడుతుందని వ్యాఖ్యానించారు. నాలుగు రోజుల ఉద్రిక్తతల సమయంలో పౌర ఆవాసాలతోపాటు, మన సరిహద్దులపైకి దాడులకు పాల్పడిన పాక్‌కు గట్టిగా బుద్ధి చెప్పిన బీఎస్ఎఫ్ బలగాలను ఆయన ప్రశంసించారు. పరిస్థితులు ప్రశాంతంగా ఉన్న సమయంలో సైతం ఇంటెలిజెన్స్ వ్యవస్థలను అప్రమత్తం చేస్తూ, ముందుగానే కచ్చితమైన సమాచారంతో విజయవంతంగా దాడులను పూర్తి చేయగలమని బీఎస్ఎఫ్ రుజువు చేసిందన్నారు. ఎడారులు, పర్వతప్రాంతాలు, అడవులు, కఠినమైన, ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సైతం అచంచలమైన అంకిత భావంతో పనిచేస్తూ దేశానికి మొదటి రక్షణ శ్రేణిగా సేవలందిస్తోందన్నారు. ఆపరేషన్ సిందూర్ అనంతరం జమ్మూ ప్రాంతంలో గురు, శుక్రవారాల్లో మంత్రి పర్యటించారు. ఇందులో భాగంగా ఆయన అమర్‌నాథ్ యాత్రకు చేపట్టిన ఏర్పాట్లు, జమ్మూకశ్మీర్‌లో భద్రతా పరిస్థితిపై ఉన్నతస్థాయి సమావేశంలో సమీక్ష జరిపారు. ఇటీవల పాక్ కాల్పులతో పూంఛ్ జిల్లాలో నష్టపోయిన సరిహద్దు ప్రాంతాల వాసులతో మాట్లాడారు. జవాన్లతో స్వయంగా ముచ్చటించారు.

హఫీజ్, మసూద్‌లను పాక్ అప్పగించాలి: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: ఐక్యరాజ్యసమితి ప్రకటించిన కరడుగట్టిన ఉగ్రవాదులు హఫీజ్ సయీద్, మసూద్ అజార్‌ను భారత్‌కు అప్పగించాలని రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పాకిస్తాన్‌ను డిమాండ్ చేశారు. భారత్‌తో చర్చలు జరపాలని పాకిస్తాన్ నిజంగా కోరుకుంటే వారిని అప్పగించాల్సిందేనని తేల్చిచెప్పారు. ఆయన శుక్రవారం గోవాలో విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రాంత్‌ను సందర్శించారు. నావికాదళం సిబ్బందితో మాట్లాడారు. భారత్‌కు వ్యతిరేకంగా ఏవైనా కుట్రలు పన్నితే తమ నావికాదళం శక్తి ఏమిటో రుచి చూస్తారని పాకిస్తాన్‌ను హెచ్చరించారు. పాక్ ఆటలు సాగవని స్పష్టంచేశారు. ఉగ్రవాదాన్ని అంతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని పునరుద్ఘాటించారు.

క్లుప్తంగా...

రాజన్న సన్నిధిలో హైకోర్టు జడ్జి



జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణకు స్వామి వారి ప్రసాదాలను ఇస్తున్న ఈవో వినోద్‌రెడ్డి

వేములవాడ: శ్రీరాజరాజేశ్వర స్వామిని హైకోర్టు జడ్జి జస్టిస్ అలిశెట్టి లక్ష్మీనారాయణ కుటుంబ సభ్యులతో శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న జడ్జి కుటుంబ సభ్యులకు ఈవో కొప్పుల వినోద్‌రెడ్డి, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణల అనంతరం శ్రీలక్ష్మీగణపతి దర్శనం, శ్రీస్వామివారి పూజ, అమ్మవార్లను దర్శించుకున్నారు. అద్దాల మండపంలో వేదోక్త ఆశీర్వచనం గావించారు.

కర్రెగుట్టల్లో ఎన్‌కౌంటర్‌పై ఎన్‌ఐఏ దర్యాప్తు

- ప్రత్యేక దర్యాప్తు అధికారులుగా ఇప్పటికే ముగ్గురు డీఎస్పీల నియామకం

సాక్షి, హైదరాబాద్: కర్రెగుట్టల్లో ఇటీవల జరిగిన ఎన్‌కౌంటర్‌పై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) దర్యాప్తు ప్రారంభించింది. కర్రెగుట్టల్లో మావోయిస్టులు భారీగా ఐఈడీలు పెట్టినట్లు వివిధ కేసుల్లో భాగంగా అందిన సమాచారంతోపాటు ఈ నెల 8న ములుగు జిల్లా పరిధిలో జరిగిన బాంబు పేలుడు, ముగ్గురు తెలంగాణ పోలీసుల మృతిపై దర్యాప్తు మొదలుపెట్టింది. ముగ్గురు డీఎస్పీ స్థాయి అధికారులను దర్యాప్తు అధికారులుగా నియమించింది. ఛత్తీస్‌గఢ్–తెలంగాణ సరిహద్దులో ఇటీవల కూంబింగ్ ముమ్మరం కావడంతో కర్రెగుట్టలను వ్యూహాత్మక స్థావరంగా మల్చుకునేందుకే మావోయిస్టులు దాని చుట్టూ ఐఈడీలు అమర్చి ఉంటారని.. వాటి ద్వారా భద్రతా బలగాలకు భారీ ప్రాణనష్టం చేసే కుట్రకు పాల్పడ్డారని ఎన్‌ఐఏ భావిస్తోంది. ఇదే కోణంలో దర్యాప్తు సాగిస్తోంది. మావోయిస్టులు రెండేళ్లుగా కర్రెగుట్టలు కేంద్రంగానే ఆపరేషన్లు సాగిస్తున్నట్లు ఆధారాలు సేకరించింది. అలాగే పట్టుబడిన మావోయిస్టుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా లోతుగా విశ్లేషిస్తోంది.

నక్సలిజాన్ని చంపడం మీతరం కాదు

- కేంద్రానికి సీపీఐ కార్యదర్శి నారాయణ హెచ్చరిక



సాక్షి, న్యూఢిల్లీ: నక్సలిజాన్ని చంపడం ప్రభుత్వ తరం కాదని సీపీఐ కార్యదర్శి నారాయణ కేంద్రాన్ని హెచ్చరించారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని ఏపీ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. నక్సలిజాన్ని ఉగ్రవాదంగా పరిగణించడం సరైన దిశ కాదని, అది ఒక సామాజిక, రాజకీయ సిద్ధాంతమని స్పష్టం చేశారు. చంపినంత మాత్రాన నక్సలిజం పోదని.. ఇంకా పెరుగుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మనుషులను చంపుతారు తప్ప సిద్ధాంతాన్ని చంపగలరా? అని నారాయణ ప్రశ్నించారు. అడవుల్లో నివసిస్తున్న వారి భూములను ఖాళీ చేయించి.. కార్పొరేట్ సంస్థలకు అప్పగించాలన్న ప్రయత్నాలే అసలు హింసగా అభివర్ణించారు. బీఆర్‌ఎస్‌లో ప్రజాస్వామ్య లోపం వల్లే కవిత బయటకు వచ్చారన్నారు. ప్రాంతీయ పార్టీల్లో ఇద్దరు పిల్లలున్నా సమస్యేనని.. చంద్రబాబుకు ఒకే కొడుకు ఉండటం వల్లే ఆయనకు ప్రమాదం తప్పిందని చమత్కరించారు. ఇప్పు డు కవిత వ్యవహారం చూస్తే పదవులు, ఆస్తుల గొడవే కనిపిస్తోందని నారాయణ చెప్పారు.

భారీగా నకిలీ, నిషేధిత పత్తి విత్తనాలు స్వాధీనం



నకిలీ పత్తి విత్తన ప్యాకెట్లను పరిశీలిస్తున్న సీపీ సునీల్‌దత్

ఏన్కూరు/మధిర: నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న కొందరు వ్యక్తులను ఖమ్మం జిల్లా పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. నాలుగు ఘటనల్లో నకిలీవే కాక నిషేధిత పత్తి విత్తనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం జిల్లా ఏన్కూరు పోలీసుస్టేషన్‌లో శుక్రవారం పోలీసు కమిషనర్ సునీల్‌దత్ ఈ వివరాలు వెల్లడించారు. ఏన్కూరు, రేపల్లెవాడల్లో చేపట్టిన తనిఖీల్లో ముగ్గురి వద్ద నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. దీంతో వీరిని విచారించగా ఏపీలోని పలు ప్రాంతాల నుంచి తీసుకొచ్చి ఇక్కడ అధిక ధరకు విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. ఈమేరకు మూడు ఘటనల్లో 450 కేజీల లూజ్ విత్తనాలతో పాటు 300కుపైగా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. అలాగే, మధిర మున్సిపాలిటీ పరిధి మడుపల్లిలో నిషేధిత పత్తి విత్తనాలను(బీజీ–3) పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తనిఖీల్లో నిషేధిత పత్తి విత్తనాలతో పాటు అనుమతి లేని రూ.65 వేల విలువైన పురుగు మందులు లభ్యమయ్యాయి.

దేవుడి కోడెలకు మరణశాసనం!

వేములవాడ రాజన్న గోశాలల్లో కోడెల మృత్యుఘోష

- సామర్థ్యానికి 3 రెట్ల మేర గోశాలల్లో కుక్కుతుండటంతో తొక్కిసలాటలు, అంటురోగాలు
- భారీగా చనిపోతున్న మూగజీవాలు.. పూడ్చి చేతులు దులుపుకుంటున్న సిబ్బంది
- చోద్యం చూస్తున్న దేవాదాయశాఖ
- పకడ్బందీ వితరణ విధానం లేక అభాసుపాలవుతున్న దేవాదాయశాఖ



రాజన్న గోశాలలో కోడెలు

సాక్షి, హైదరాబాద్: భక్తులు దేవుడికి సమర్పించిన కోడెలను సంరక్షించాల్సిన దేవాదాయ శాఖ వాటికి మరణశాసనం లిఖిస్తోంది. కొందరు అధికారుల నిర్లక్ష్యం, చేతివాటం ఫలితంగా కొన్ని రోజులుగా రోజుకు 8 నుంచి 10 కోడెలు ప్రాణాలు వదులుతున్నాయి. దీనిపై దేవాదాయశాఖ పట్టించుకోకపోవడంతో స్థానిక యంత్రాంగం చేతులెత్తేసింది. చనిపోయిన కోడెలను ఖననం చేయటం తప్ప సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోలేకపోతోంది.

భక్తుల ఆనవాయితీని సొమ్ము చేసుకుంటూ..

మరే దేవాలయంలో లేని ఓ ఆనవాయితీ వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో ఉంది. కోరికలు నెరవేరిన భక్తులు దేవుడి మొక్కు కింద కోడె (ఎద్దు)లను ఆలయానికి సమర్పించడం ఏళ్లుగా కొనసాగుతోంది. ఇలా పొందిన కోడెల సంరక్షణకు ఆలయం రెండు గోశాలలను నిర్వహిస్తోంది. గతంలో కోడెలను వేలం ద్వారా తిరిగి అమ్మే పద్ధతి ఉండేది. భక్తులు సమర్పించిన వాటిని విక్రయించడం, కొందరు కొని వాటిని కబేళాలకు తరలిస్తుండటం తీవ్ర విమర్శలకు కారణమైంది. దీంతో వేలం ప్రక్రియను నిలిపేసి వాటిని సంరక్షించే గోశాలలకు, వ్యవసాయ పనులు చేసుకొనే రైతులకు ఉచితంగా ఇచ్చే పద్ధతి ప్రారంభమైంది. కానీ దీని అమలుకు పక్కా విధానం లేకుండా పోయింది. గోశాలలు, రైతుల పేరు చెప్పి కొందరు వాటిని చేజిక్కించుకొని అమ్ముకుంటున్నారు. ఈ విషయంలో దేవాదాయ శాఖ ఉద్యోగులు కూడా కమీషన్లకు అలవాటుపడి వారికి సహకరిస్తున్నారన్న ఆరోపణ ఉంది. అలా వెళ్లే కోడెల పరిస్థితి ఏమిటో పరిశీలించే విధానం లేదు. కబేళాలకు అమ్మేందుకు కోడెలను తీసుకెళ్తున్న వారి వివరాలు తెలిసి కూడా దేవాదాయశాఖలోని కొందరు సిబ్బంది కాసుల కోసం వాటిని అప్పగించేస్తున్నారు.

అక్రమాలకు బ్రేక్ పడినా..

గతేడాది ఆగస్టులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన ఓ వ్యక్తి తమకు గోశాల ఉందని.. వేములవాడ ఆలయ గోశాల నుంచి గోవులు ఇస్తే పోషించుకుంటామంటూ దేవాదాయశాఖ మంత్రి కార్యాలయానికి అర్జీ పెట్టుకున్నాడు. దాన్ని పరిశీలించాలంటూ మంత్రి కార్యాలయం ఆ అర్జీని వేములవాడ దేవాలయ అధికారులకు పంపింది. ఆ వ్యక్తి ఏకంగా 60 కోడెలు, గోవులు అడగ్గా అధికారులు అభ్యంతరం చెప్పారు. కానీ మంత్రి కార్యాలయం ఆదేశించడంతో ఇవ్వక తప్పలేదు. అలా పొందిన మూగజీవాల్లో చాలా వాటిని ఆ వ్యక్తి అమ్మేసుకున్నాడని ఆ తర్వాత అధికారులకు ఫిర్యాదు అందింది. దీనిపై పోలీసు కేసు నమోదవగా, విచారణలో అది నిజమేనని తేలింది. అప్పట్లో ఇది సంచలనం కావడంతో కోడెల వితరణను జిల్లా కలెక్టర్ నిలిపివేయించారు. పంపిణీకి కలెక్టర్ ఆధ్వర్యంలో కమిటీ ఉండటంతో ఆయన చర్యలు తీసుకున్నారు.

అనారోగ్యం.. ఆపై తొక్కిసలాటలు..

కోడెల వితరణ నిలిచిపోవడం, మొక్కుల రూపంలో కోడెలు వస్తుండటంతో ఆలయ గోశాలలు కోడెలతో కిక్కిరిసిపోయాయి. ప్రస్తుతం గోశాలల్లో 1,250కిపైగా కోడెలు ఉన్నట్లు సమాచారం. ఉండాల్సిన వాటికంటే మూడు రెట్లు ఎక్కువగా ఉండటంతో గోశాలల్లో వాటికి తిరిగే చోటు కూడా లేదు. పైగా కనీస వసతులు కూడా లేకపోవడం, వర్షాలు కురుస్తుండటంతో గోశాలలు రొచ్చురొచ్చుగా మారిపోయాయి. రోజుల తరబడి బురద ఉండటంతో గిట్టల దగ్గర నుంచి ఇన్‌ఫెక్షన్ సోకి చాలా కోడెలు అనారోగ్యానికి గురవుతున్నాయి. మరోవైపు తొక్కిసలాట కూడా జరుగుతోంది. ఫలితంగా నిత్యం కోడెలు చిపోతున్నాయి. వాటిని ట్రాక్టర్‌లలో తీసుకెళ్లి గోతులు తవ్వి గుట్టుచప్పుడు కాకుండా పూడ్చేసి సిబ్బంది చేతులు దులుపుకొంటున్నారు. ఇంత జరుగుతున్నా దేవాదాయశాఖ కిమ్మనడం లేదు. విషయాన్ని ఆలయ అధికారులు కమిషనర్ కార్యాలయానికి చేరవేశారు. కానీ ఎవరు పట్టించుకోవడం లేదు.

ఒక్కరోజే 8 కోడెలు మృత్యువాత

వేములవాడ అర్బన్: వేములవాడ రాజన్నకు చెందిన 8 కోడెలు శుక్రవారం మృత్యువాత పడ్డాయి. అధికారులు గుట్టుచప్పుడు కాకుండా మూలవాగులో వాటిని ఖననం చేశారు. శ్రీ రాజరాజేశ్వరస్వామికి భక్తులు సమర్పించే కోడెలను తిప్పాపూర్‌లోని గోశాలలో సంరక్షిస్తున్నారు. ఈ గోశాలలో పరిమితికి మించి కోడెలు ఉండటంతో తొక్కిసలాట జరిగి చనిపోతున్నాయని ఆరోపణలున్నాయి. ఏటా కోడె మొక్కులతో రాజన్న ఆలయానికి దాదాపు రూ. 22 కోట్లకుపైగా ఆదాయం వస్తున్నా వాటి సంరక్షణపై ఆలయ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు మండి పడుతున్నారు.



చనిపోయిన కోడెలను తరలిస్తున్న దృశ్యం

వసతులు సరిగ్గా లేక చిన్నపాటి వర్షానికే గోశాల బురదగా మారి కోడెలు అనారోగ్యం పాలవుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా ఆలయ అధికారులు కోడెల సంరక్షణపై నిర్లక్ష్యం చేయకుండా వసతులు కల్పించాలని స్థానికులు, భక్తులు కోరుతున్నారు.

వరికి బదులు ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహించండి

- తాలు, తరుగు సమస్యలు ఉండవు
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల



సమీక్షలో మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వర్‌రావు. చిత్రంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి తదితరులు

సూర్యాపేట: రాష్ట్రంలో రైతులు వరికి బదులు ఆయిల్‌పామ్ సాగు చేసేలా అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రోత్సహించాలని, దీనివల్ల రైతులు తాలు, తరుగు పేరుతో ఎలాంటి ఇబ్బందులు పడరని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. ధాన్యం కొనుగోళ్లు, వ్యవసాయం, ఇందిరమ్మ ఇళ్లు, భూభారతిపై శుక్రవారం సూర్యాపేట కలెక్టరేట్‌లో మంత్రులు ఉత్తమ్‌కుమారెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలతో కలసి నిర్వహించిన ఉమ్మడి నల్లగొండ జిల్లాస్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల్లో ఆయిల్‌పామ్ తోటలు పెంచేందుకు అవకాశం ఉందన్నారు. అందులో నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో అత్యధికంగా ఆయిల్‌పామ్ సాగుకు అనుకూల పరిస్థితులు ఉన్నాయని, ఈ నేపథ్యంలో ఇక్కడ ఆయిపామ్ ఫ్యాక్టరీని ప్రారంభిస్తామని చెప్పారు. కృష్ణాజలాలను పూర్తిగా వాడుకునేందుకు ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌ను పూర్తి చేస్తామని తెలిపారు. వివిధ పథకాల అమలులో ప్రజాప్రతినిధుల సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని, సంక్షేమానికి సంబంధించి శాసనసభ్యుల మాటే చివరి మాటగా పాటించాలని అధికారులకు సూచించారు.

బ్యాంకర్లు సిబిల్ స్కోర్లు అడగొద్దు: మంత్రి ఉత్తమ్

రాజీవ్ యువ వికాసం పథకం లబ్ధిదారులను బ్యాంకర్లు సిబిల్ స్కోర్ అడగవద్దని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సూచించారు. ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులకు ఆయకట్టు ప్లాన్ సంసిద్ధం చేసి ముందే ప్రకటిస్తామని, ఎస్సారెస్పీలో ఒండ్రు మట్టి తొలగింపు ప్రక్రియ మొదలైందని, రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టుల్లోనూ ఇదేవిధంగా చేపట్టి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంపొందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కాగా, ధాన్యం సేకరణలో ముందున్నామని, గత సంవత్సరంతో పోలిస్తే 20 లక్షల మెట్రిక్ టన్నులు అధికంగా కొన్నామని ఉత్తమ్ తెలిపారు.

ప్రజలు సంబురంగా ఉన్నారు: మంత్రి కోమటిరెడ్డి

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ సన్నబియ్యం పథకంతో ప్రజలు సంబురంగా ఉన్నారన్నారు. రాజీవ్ యువ వికాసం పథకంతో నిరుద్యోగులకు స్వయం ఉపాధి దొరుకుతుందని తెలిపారు. ఈ సమావేశంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సూర్యాపేట, యాదాద్రిభువనగిరి, నల్లగొండ కలెక్టర్లు తేజస్ నంద్‌లాల్ పవార్, హనుమంతరావు, ఇలా తిపాఠి, సూర్యాపేట ఎస్పీ నరసింహ, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, జయవీర్‌రెడ్డి, మందుల సామేల్, ఎమ్మెల్సీలు శంకర్‌నాయక్, నెల్లికంటి సత్యం పాల్గొన్నారు.

మావోయిస్టులు లొంగిపోవలసిందే..

- భద్రాద్రి ఎస్పీ రోహిత్‌రాజ్
- 17 మంది మావోయిస్టుల లొంగుబాటు



మాట్లాడుతున్న ఎస్పీ రోహిత్‌రాజ్

సూపర్‌బజార్(కొత్తగూడెం): కర్రెగుట్ట ఘటన తర్వాత ఎలాంటి ప్రత్యామ్నాయాలు లేనందున.. మావోయిస్టులు లొంగిపోవలసిందేనని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజ్ సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో మావోయిస్టులకు ఎవరి నుంచి సాయం అందదని ఆయన స్పష్టం చేశారు. మావోయిస్టు పార్టీకి చెందిన వివిధ దళాల సభ్యులు 17మంది శుక్రవారం లొంగిపోయారు. ఈ సందర్భంగా కొత్తగూడెం హేమచంద్రాపురంలోని పోలీసు హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ రోహిత్‌రాజ్ విలేకరులతో మాట్లాడారు. మావోయిస్టులు లొంగిపోతే రివార్డులను అందజేయడంతో పాటు ప్రభుత్వం ఉపాధి, పునరావాస అవకాశాలను కల్పిస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ–ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లో సాయుధ దళాల సంచారం ఉన్నట్లు తెలుస్తోందని చెప్పారు. ప్రజలు వారికి సహకరించకుండా.. దళాల సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. ప్రజలు ఇచ్చిన సమాచారంతోనే ఇటీవల ములుగు జిల్లాలో 20 మంది సాయుధ దళ సభ్యులను అరెస్ట్ చేశామని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటివరకు 282 మంది మావోయిస్టు దళ సభ్యులు జనజీవన స్రవంతిలో కలిసి పునరావాస సౌకర్యాలు పొందారని వివరించారు. ఈ నేపథ్యాన తాజాగా లొంగిపోయిన 17 మందిలో 11 మంది పురుషులు, ఆరుగురు మహిళలు ఉండగా, ప్రభుత్వం తరఫున వారికి రివార్డు చెక్కులు అందజేశారు. ఆధార్ కార్డులు, బ్యాంకు ఖాతాల్లేని వారికి ఆ సౌకర్యాలు కల్పించనున్నట్లు ఎస్పీ వివరించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ(ఆపరేషన్స్) జి.నరేందర్, భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, 141, 81 బెటాలియన్ల అధికారులు ప్రీతా, రవిశర్మ, సీఐలు శ్రీనివాస్, రాజువర్మ, ఆర్‌ఐ రవి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు ఇక రాదని..

- మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య
- రంగారెడ్డి జిల్లా చింతపట్లలో ఘటన



అశోక్

యాచారం: ఇందిరమ్మ ఇల్లు తనకు ఇక రాదనే మనస్తాపంతో ఓ వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా యాచారం మండలం చింతపట్ల గ్రామానికి చెందిన దొడ్డి అశోక్ (45) ప్లంబర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గ్రామంలో ఆయనకు ఇంటి స్థలం లేదు. ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు అర్హుడైనప్పటికీ స్థలం లేకపోవడంతో మొదటి విడతలో ఇల్లు మంజూరు కాలేదు. ఈ నెల 23న స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి యాచారంలో లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందజేసే సమయంలో లిస్టులో తన పేరు రాలేదని ఆవేదన వ్యక్తం చేశాడు. ఆ రోజు నుంచి మనోవేదనకు గురయ్యాడు. 'స్థానిక కాంగ్రెస్ నేతలు ఇల్లు రాకుండా అడ్డుకుంటున్నారు. ఎమ్మెల్యేకు చెప్పుకొందామంటే కలవనీయరు. పిల్లలు పెద్దవుతున్నా సొంత ఇల్లు లేదాయే'అంటూ కొద్ది రోజులుగా ఇక తాను చస్తానని గ్రామస్తులతో చెబుతూ వచ్చాడు. ఈ క్రమంలో తనకు ఇల్లు రాకపోవడానికి, తన చావుకు కారణం స్థానిక కాంగ్రెస్ నాయకుడు, తన బావ యాదయ్యనేనని చేతిపై రాసుకుని శుక్రవారం ఉదయం అద్దెకుంటున్న ఇంట్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్దామనే సరికే మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు.

మృతదేహంతో ఆందోళన

అశోక్ మృతికి సర్కారే కారణం అంటూ అతని కుటుంబీకులు, గ్రామస్తులు మృతదేహంతో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సమాచారం అందుకున్న ఇబ్రహీంపట్నం ఏసీపీ కేపీవీ రాజు, సీఐ నందీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్ అయ్యప్ప, ఎంపీడీఓ శైలజ గ్రామానికి చేరుకున్నారు. ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి సూచన మేరకు మృతుడు అశోక్ కుటుంబానికి గ్రామంలో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లు, ముగ్గురు కూతుళ్ల చదువు, ఇతర ప్రయోజనాలు కల్పిస్తామని తహసీల్దార్ అయ్యప్ప హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్తులు శాంతించారు.

సమసమాజ స్థాపనకు బీజేపీ, కాంగ్రెస్ వ్యతిరేకం

- ఆపరేషన్ కగార్, దళిత వ్యతిరేక వైఖరిని ఖండిస్తున్నాం
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత



మంచిర్యాలలో మీడియాతో మాట్లాడుతున్న కవిత

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సమసమాజ స్థాపన, ప్రగతిశీల ఆలోచనా విధానాలకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు వ్యతిరేకమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. ఆపరేషన్ కగార్ ఆపేయాలని కోరినా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ మారణకాండ, విధ్వంసం కొనసాగిస్తోందని దుయ్యబట్టారు. మావోయిస్టు పార్టీ జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావు సహా ఇతర మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మరణిస్తే మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించాలన్న కనీస సంస్కారం లేని బీజేపీ వైఖరిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం మంచిర్యాలలో పర్యటించిన కవిత.. స్థానిక జాగృతి నాయకులు పందుల ప్రశాంత్, శశి, లెనిన్ ఇళ్లకు వెళ్లి కలిశారు. సీనియర్ జర్నలిస్టు, సింగరేణి మాజీ కార్మికుడు ఎండీ మునీర్ ఇంటికి వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ఎన్‌కౌంటర్లలో మరణించిన మావోయిస్టుల మృతదేహాలను అప్పగించకపోవడం వల్ల వారి కుటుంబాలు బాధపడుతున్నాయని అన్నారు. సరస్వతి పుష్కరాలకు ఎంపీ వంశీకృష్ణను ఆహ్వానించకుండా అవమానించడం, యాదగిరిగుట్టలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కింద కూర్చోబెట్టిన దళిత వ్యతిరేక సంస్కృతి సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీదని ఆమె ఆరోపించారు. ఈ రెండు పార్టీల చర్యలను అందరూ వ్యతిరేకించాలని కోరారు. తాజా రాజకీయ పరిణామాలపై విలేకరులు ప్రశ్నించగా ఆమె స్పందించలేదు. కవిత పర్యటనలో స్థానిక బీఆర్‌ఎస్, అనుబంధ టీబీజీకేఎస్ కార్మిక సంఘాల నాయకులు, మాజీ ప్రతినిధులెవరూ పాల్గొనలేదు. స్థానిక జాగృతి నాయకులు, కార్మిక నాయకులే ఆమె వెంట ఉన్నారు.

దాబాలో గంజాయి, నల్లమందు విక్రయం

- రూ.3.05 కోట్ల విలువైన మత్తు పదార్థాలు పట్టివేత
- రాజస్తాన్‌కు చెందిన వికాస్ సాహు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న అవినాశ్ మహంతి

చందానగర్/షాద్‌నగర్: అక్రమంగా మత్తు పదార్థాలు విక్రయిస్తున్న వ్యక్తిని శంషాబాద్ ఎస్‌ఓటీ, షాద్‌నగర్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేసినట్లు సైబరాబాద్ కమిషనర్ అవినాశ్ మహంతి తెలిపారు. శుక్రవారం గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన కేసు వివరాలను వెల్లడించారు. రాజస్తాన్‌కు చెందిన వికాస్ సాహు (26) షాద్‌నగర్ జాతీయ రహదారిపై రాయికల్ టోల్‌గేట్ వద్ద ఉన్న మార్వాడి దాబాలో వంట మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. దాబా యజమాని సంజుభాయ్‌కి గంజాయి తాగే అలవాటు ఉండటంతో హైదరాబాద్‌లోని ధూల్‌పేటకు చెందిన సలీం వద్ద వికాస్ గంజాయి కొనుగోలు చేసి సరఫరా చేసేవాడు. దాబా వద్దకు వచ్చే లారీ డ్రైవర్లు, ఇతరులకు కూడా అమ్ముతున్నాడు. 2022లో వికాస్ సాహు, సంజుభాయ్ కలిసి గంజాయి విక్రయిస్తుండగా జడ్చర్ల పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపించారు. జైలు నుంచి వచ్చాక కూడా వారు గంజాయి దందా కొనసాగించారు. వీరికి మహేశ్వరానికి చెందిన రాజు అనే వ్యక్తి గంజాయి, మధ్యప్రదేశ్‌కు చెందిన గణపతి హెరాయిన్, నల్లమందు (ఓపియం), పాపిస్ట్రా సప్లై చేస్తున్నారు. ఏప్రిల్ 28న సంజుభాయ్ అనారోగ్యంతో మృతి చెందటంతో వికాస్ ఒక్కడే గంజాయి విక్రయిస్తున్నాడు. గతవారం వికాస్ 1.5 కిలోల హెరాయిన్, 750 గ్రాముల నల్లమందు, 3.5 కిలోల పాపిస్ట్రా కొని, కొంతమేర విక్రయించాడు. ఈ సమాచారం అందుకున్న ఎస్‌ఓటీ, పోలీసు అధికారులు దాబాపై దాడిచేసి వికాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 1.5 కిలోల హెరాయిన్, 632 గ్రాముల ఓపియం, 2.80 కిలోల ఇతర మత్తు పదార్థాలు, రూ.89,700 నగదు, 3 సెల్‌ఫోన్లు, వెయింగ్ మెషీన్ స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.3,05,27,700 ఉంటుందని పోలీసులు తెలిపారు. ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తున్నట్లుగానీ, వాడుతున్నట్లుగానీ తెలిస్తే డయల్ 100కు, వాట్సాప్ నంబర్ 94906 17444కు సమాచారం ఇవ్వాలని అవినాశ్ మహంతి కోరారు.

గిరిజనుల అభివృద్ధికి కేంద్ర చట్టాలే అడ్డంకి

- అటవీ, పర్యావరణ చట్టాల సమస్యను కేంద్రం పరిష్కరించాలి
- డీఏ–పీఎం జుగా సదస్సులో మంత్రి సీతక్క



సాక్షి, హైదరాబాద్: ఏజెన్సీ ప్రాంతాల్లో మౌలిక వసతులు మరింత మెరుగుపడాల్సిన అవసరం ఉందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. అక్కడ వసతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తున్నప్పటికీ అటవీ హక్కుల చట్టం, పర్యావరణ పరిరక్షణ చట్టాలు అవరోధాలుగా మారాయని తెలిపారు. ఈ సమస్యను అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించాలని కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తాజ్ డెక్కన్‌లో పీఎం జన్‌మన్ ధర్తీ ఆబ జన్ జాతీయ గ్రామీణ ఉత్కర్ష అభియాన్ (డీఏ–పీఎం జుగా) పథకంపై సదస్సు జరిగింది. ఈ సదస్సులో ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు కేంద్ర గిరిజన సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి సీతక్క ప్రారంభోపన్యాసం చేశారు. డీఏ– పీఎం జుగా పథకం ద్వారా దేశవ్యాప్తంగా 63 వేల గిరిజన గ్రామాలకు లబ్ధి కలుగుతోందని, 30 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 549 జిల్లాల్లో 2,911 బ్లాకుల్లో వసతుల కల్పన చేయనున్నట్లు చెప్పారు. ఈ పథకంతో 5 కోట్ల మంది గిరిజనులు లబ్ధి పొందనున్నారని వెల్లడించారు.

క్లుప్తంగా...

త్వరలో మంత్రివర్గం, పీసీసీ విస్తరణ

కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ మల్లు రవి



సాక్షి, న్యూఢిల్లీ: త్వరలోనే తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గంతో పాటు.. పీసీసీ కార్యవర్గ విస్తరణ కూడా ఉంటుందని కాంగ్రెస్ క్రమశిక్షణ కమిటీ చైర్మన్, ఎంపీ మల్లు రవి వెల్లడించారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అధిష్టానం తగిన నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. ఆయన శుక్రవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. అన్ని సామాజిక వర్గాల ఎమ్మెల్యేలు.. తమకు క్యాబినెట్‌లో చోటు కల్పించాలని అధిష్టానాన్ని కోరుతున్నట్లు చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ పార్టీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా తనను నియమించినందుకు అధిష్టానానికి కృతజ్ఞతలు తెలుపుతూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీకి లేఖలు రాసినట్లు మల్లు రవి పేర్కొన్నారు.

దేశ భద్రతపై రేవంత్‌కు కనీస అవగాహన లేదు: ఏలేటి



సాక్షి, హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అవగాహన లేక పిచ్చిమాటలు మాట్లాడుతున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి విమర్శించారు. మోదీ ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ సిందూర్ నూరుశాతం విజయవంతం అయిందని అన్నారు. పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాదాన్ని పూర్తిగా అంతం చేసేందుకు చేపట్టిన ఆపరేషన్ సిందూర్ ఇంకా కొనసాగుతోందన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన కొన్ని మాటలను పట్టుకుని ప్రధాని మోదీ పరపతిని తగ్గించేలా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు శిఖండిని తలపిస్తున్నాయని ధ్వజమెత్తారు. దేశ భద్రత, విదేశాంగ వ్యవహారాలపై రేవంత్‌కు కనీస అవగాహన లేదని అన్నారు. ఆయన వ్యాఖ్యలు దేశద్రోహ చర్యల కిందకు వస్తాయని శుక్రవారం ఏలేటి ఒక ప్రకటనలో మండిపడ్డారు.

కేసీఆర్, కేటీఆర్, హరీశ్, కవిత చెల్లని రూపాయలు

ఎంపీ రఘునందన్‌రావు విమర్శ



సాక్షి, హైదరాబాద్: బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు వీఆర్ఎస్ ఇచ్చారని మెదక్ పార్లమెంటు సభ్యుడు, బీజేపీ నేత ఎం.రఘునందన్‌రావు అన్నారు. శుక్రవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ అధినేత కే.చంద్రశేఖర్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.టి.రామారావు, హరీశ్‌రావు, కవిత చెల్లని రూపాయలే అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలు కేసీఆర్‌ను ఫామ్‌హౌస్‌కు పరిమితం చేస్తే, ఇప్పుడు కొత్త కథలతో ప్రచారంలోకి వస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోతోందని, బీజేపీకి మాత్రం ఆదరణ పెరుగుతోందని తెలిపారు. కొందరు తనపై వ్యక్తిగతంగా బురద జల్లుతున్నారని, పెయిడ్ ఆర్టికల్స్ రాయిస్తున్నారని మండిపడ్డారు. చచ్చిపోయిన పార్టీని మళ్లీ లేపేందుకు యూట్యూబ్ చానల్స్ నడిపిస్తున్నారని విమర్శించారు. కవిత సొంత ప్రచారం కోసమే బతుకమ్మ ఆడారని ఆరోపించారు. కుటుంబంలో, పార్టీలో ఏమైనా పంచాయితీ ఉంటే అంతర్గతంగా చూసుకోవాలని, బీజేపీని అందులోకి లాగొద్దని హితవు పలికారు.

కాంగ్రెస్, బీజేపీ చరిత్రలకు వందేళ్ల తేడా: జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ చరిత్రకు, బీజేపీ చరిత్రకు వందేళ్ల తేడా ఉందని, గాంధీ కుటుంబం గురించి తప్పుగా మాట్లాడుతున్న నేతలు ముందు ఈ విషయాన్ని గ్రహించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ 1885లో పుడితే, బీజేపీ 1980లో పుట్టిందన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరుల సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాతే మోదీ, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, రఘునందన్‌రావు పుట్టారని, గాంధీ కుటుంబం దేశాన్ని ఏలుతున్న రోజున ఇప్పుడు విమర్శలు చేస్తున్న వారెవరూ పుట్టనే లేదని ఎద్దేవా చేశారు. ఏఐసీసీ నియమించిన కమిటీల కూర్పు అద్భుతంగా ఉందని, సామాజిక న్యాయానికి ప్రాధాన్యమిచ్చారని చెప్పారు. తనను ఏ కమిటీలో వేసినా, వేయకపోయినా సంతోషమేనన్నారు. గాంధీభవన్‌లో అటెండర్ పోస్టు ఇచ్చినా పనిచేస్తానన్నారు.


కృష్ణాబోర్డు సభ్యుడిగా కేకే జంగిడ్

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ) మెంబర్‌గా కేకే జంగిడ్‌ను నియమిస్తూ కేంద్రం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం బోర్డులో మెంబర్‌గా పనిచేస్తున్న శంఖువ శనివారం పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో కేకే జంగిడ్‌ను నియమిస్తూ కేంద్ర నీటివనరులు, నది అభివృద్ధి గంగా పునరుజ్జీవన విభాగం నిర్ణయం తీసుకుంది. ఈ ఉత్తర్వులు జూన్ 1 నుంచి అమలులోకి రానున్నాయి.

సైబర్ మోసాలతో పదిలం

డయల్ 100 లేదా 1930

సైబర్ మోసమని గుర్తిస్తే వెంటనే డయల్ 100 లేదా సైబర్ క్రైం టోల్‌ఫ్రీ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు..



- రోజుకో కొత్త మోసానికి పాల్పడుతున్న నేరగాళ్లు
- అవగాహనా లేమి, అత్యాశతో మోసపోతున్న వైనం
- ఎస్ఎంఎస్‌లు, వెబ్ లింక్‌లు, ఫోన్‌కాల్స్‌తో జాగ్రత్త

అనాలోచితంగా స్పందించొద్దు అంటున్న పోలీసులు

సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త తరహా మోసానికి పాల్పడుతున్నారు. కంటికి కనిపించకుండా వివరాలు చెప్పించుకొని మరీ బ్యాంకు ఖాతాలు ఊడ్చేస్తున్నారు. అవగాహనా లేమి, అత్యాశలే సైబర్ మోసాలకు ప్రధాన కారణాలు. మన చుట్టూ సైబర్ నేరాలకు సంబంధించిన వార్తలు నిత్యం చక్కర్లు కొడుతున్నా వాటిపై చాలా మంది ధ్యాస పెట్టడం లేదు. మాకు అంతా తెలుసులే అనే అతిధోరణితో మోసపోతున్నారు. సైబర్ మోసాలపై నమోదవుతున్న కేసులను గమనిస్తే ప్రధానంగా పది రకాల మోసాలే ఎక్కువగా జరుగుతున్నట్లు సైబర్ భద్రతాధికారులు చెబుతున్నారు. ఈ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

పెట్టుబడుల పేరిట స్టాక్ మార్కెట్

మోసాలు విపరీతంగా పెరిగాయి. తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు వస్తాయన్న ఆశ తో ఎంతో మంది అమాయకులు సులువుగా సైబర్ నేరగాళ్ల వలకు చిక్కుతున్నారు. సోషల్ మీడియా ప్రకటనలతో స్టాక్ మార్కెట్లో 30–40% లాభాలంటూ సైబర్ నేరగాళ్లు ఊదరగొడుతున్నారు. ఈ ప్రకటనలకు స్పందించే వారికి వాట్సాప్‌లో లింక్‌లు పంపుతూ వారు రూపొందించిన మోసపూరిత వెబ్‌సైట్ లలో పెట్టుబడి పెట్టిస్తున్నారు. లాభాలు వస్తున్నట్లు చూపుతూ మరింత పెట్టుబడి పెట్టేలా చేస్తున్నారు. నగదు ఉపసంహరణకు ప్రయత్నించినప్పు డు డబ్బులు రాక లబోదిబోమంటున్నారు. అందు వల్ల ఇలాంటి ప్రకటనలు సైబర్ మోసమని గ్రహించాలి.

2. లైక్‌లు.. షేర్‌ల పేరిట..

సోషల్ మీడియా పోస్టులను లైక్, షేర్ చేయడం వంటి సులువైన టాస్క్‌లతో డబ్బులు సంపాదించండంటూ ప్రకటనలిస్తూ సైబర్ ఉచ్చులోకి లాగుతున్నారు. తొలుత చిన్నచిన్న మొత్తాలు రాబడి రూపంలో చూపుతారు. అవతలి వ్యక్తి నమ్మకం పెరిగాక అసలు మోసానికి తెరతీస్తున్నారు. ఫొటోలు, వీడియోలకు లైక్, షేర్ చేస్తే అవతలి వ్యక్తులు డబ్బులు ఎందుకు ఇస్తారు? ఈ చిన్న లాజిక్ మరవొద్దు.

3. క్రెడిట్‌కార్డు మోసాలు

స్కామర్లు బ్యాంక్ ఎగ్జిక్యూటివ్‌ల మాదిరిగా ఫోన్ చేసి క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ సీవీవీ, క్రెడిట్ కార్డు నంబర్లు, పుట్టిన తేదీ, బ్యాంకు ఖాతా వివరాలు సేకరిస్తారు. ఆ తర్వాత డబ్బులు కొల్లగొడతారని గుర్తుపెట్టుకోండి.

4. తప్పుగా డబ్బులు పడ్డాయంటూ..

బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అయినట్లు మెసేజ్‌లు పంపుతారు. ఆ తర్వాత సైబర్ మోస గా ళ్లు ఫోన్ చేసి మీ బ్యాంకు ఖాతా లో పొరపాటున జమ అయిన మొత్తాన్ని తిరిగి పంపాలంటూ డబ్బులు కాజేస్తారు. ఇలాంటి సమ యాల్లో బ్యాంకు ఖాతాలు చెక్ చేసుకోకుండా స్పందించవద్దు.

5. కేవైసీ అప్‌డేట్ పేరిట..

మీ బ్యాంకు ఖాతా వివరాలు, పేరు చెబుతూ ఫోన్ చేస్తారు. కేవైసీ వివరాలు అప్‌డేట్ చేసుకోవాలని సూచిస్తారు. లేదంటే ఎస్ఎంఎస్, ఈ–మెయిల్ ద్వారా కొన్ని లింక్‌లు పంపి అందులో మీ బ్యాంకు ఖాతా కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని సూచిస్తారు. వారు అడిగిన వివరాలు ఇస్తే మీ బ్యాంకు ఖాతా ఖాళీ అయినట్టేనని గుర్తుపెట్టుకోండి.

7. ఐటీ చెల్లింపులు, రిటర్న్‌ల పేరు చెప్పి..



ఆదాయపు పన్ను చెల్లింపుల పేరిట సైబర్ మోసాలు పెరుగుతున్నాయి. ఐటీ శాఖ నకిలీ లోగోతో సందేశాలు పంపుతారు. పన్ను చెల్లింపుదారులకు తాము ఐటీ అధికారులమని చెప్పి.. రీఫండ్‌ను వేగవంతం చేయడానికి బ్యాంకు వివరాలు ఇవ్వాలంటూ ఫోన్ చేస్తారు. ఇలాంటి ఫోన్ కాల్స్, ఎస్ఎంఎస్‌లు మోసపూరితమైనవిగా గుర్తించాలి.

8. ట్రాయ్ పేరిట..

టెలికం రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా (ట్రాయ్) అధికారుల పేరిట ఇటీవల ఫోన్ చేస్తారు. మీ ఫోన్ నంబర్‌పై చట్టవిరుద్ధ కార్యకలాపాలు నమోదయ్యాయని.. ఉగ్రవాదులు, ఇతర నేరగాళ్ల ఫోన్ లిస్టులో మీ నంబర్ ఉందని బెదిరిస్తారు. మీ నంబర్‌ను ఆ లిస్టులోంచి తీసేయాలంటే డబ్బులు ఇవ్వాలంటూ పట్టుబడతారు. తీవ్రంగా ఒత్తిడి తెచ్చి అందినకాడికి డబ్బులు దండుకుంటారు. ట్రాయ్ అధికారులు ఈ తరహా ఫోన్‌కాల్స్ చేయరని గుర్తుంచుకోవాలి.

6. కస్టమ్స్ అధికారులమంటూ..


మీ బంధువులు, స్నేహితులు విదేశాల నుంచి సర్‌ప్రైజ్ గిఫ్ట్ పంపారని.. అది మీకు చేరాలంటే కస్టమ్స్ సుంకం చెల్లించాలని.. తాము కస్టమ్స్ అధికారులమంటూ ఎస్ఎంఎస్‌లు లేదా ఫోన్లు చేస్తారు. బహుమతిపై ఆశతో ఎంతో మంది సైబర్ నేరగాళ్లు చెప్పినట్లు డబ్బు పంపి మోసపోతున్నారు. మీ పేరిట వచ్చిన పార్సిల్‌లో నిషేధిత వస్తువులు ఉన్నాయని.. మీపై కేసులు పెడతామని బెదిరిస్తూ ఫోన్ చేస్తారు. ఇతరులకు ఈ విషయం చెబితే మీకే చిక్కులంటూ భయాందోళనలకు గురిచేసి అందినకాడికి ఆన్‌లైన్‌లో డబ్బులు వేయించుకుంటున్నారు. అనుమానాస్పద ఫోన్‌కాల్స్ విషయంలో తస్మాత్ జాగ్రత్త.

9. డిజిటల్ అరెస్టులు..



ఈ మధ్యకాలంలో అత్యధికంగా నమోదవుతున్న సైబర్ మోసాల్లో డిజిటల్ అరెస్టులు ప్రధానమైనవి. సీబీఐ, పోలీసు అధికారులమని వాట్సాప్‌లో ఆడియో, వీడియో కాల్స్ చేస్తారు. వాట్సాప్ డీపీలో పోలీస్ యూనిఫాంతో ఉన్న ఫొటోలు, వీడియో కాల్ మాట్లాడేటప్పుడు పోలీస్ యూనిఫాంలో ఉంటూ మీ కుమారుడు అత్యాచారం, హత్య కేసులో చిక్కినందున మిమ్మల్ని డిజిటల్ అరెస్టు చేశామని బెదిరిస్తారు. ఈ విషయాలు ఎవరితో పంచుకోవద్దని, బయటికి వెళ్లవద్దని హెచ్చరిస్తారు. కేసు లేకుండా చేయాలంటే తాము చెప్పిన నంబర్‌కు డబ్బులు పంపాలని డిమాండ్ చేస్తారు. ఇలాంటి వాళ్లతో అప్రమత్తంగా ఉండండి.

10. ఏఐతో వలవేసి..



సైబర్ నేరగాళ్లు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను సైతం మోసాలకు వాడుతున్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ఎక్స్ వంటి సోషల్ మీడియా వేదికల్లో పంచుకొనే ఫొటోలు, వీడియోలను ఆధారంగా చేసుకొని.. ఏఐ సాయంతో వారి గొంతును అనుకరిస్తూ ఆడియోలు తయారు చేస్తారు. వాటిని కుటుంబ సభ్యులకు, స్నేహితులకు పంపి అత్యవసరమనో లేదా ఆసుపత్రిలో ఉన్నామనో చెబుతూ వెంటనే డబ్బులు పంపాలని అభ్యర్థిస్తారు. డబ్బులు ఇవ్వకపోతే మీ కుటుంబ సభ్యుల మార్ఫింగ్ ఫొటోలు, వీడియోలు బయటపెడతామని బెదిరించి డబ్బులు డిమాండ్ చేస్తారు. ఇలాంటి సందర్భాల్లో వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని పోలీసులు సూచిస్తున్నారు.

నోటీసులతో పాతబంధం చిగురించింది

- శామీర్‌పేటలోని ఫామ్‌హౌస్‌లో హరీశ్‌రావుతో ఈటల భేటీ
- కేసీఆర్‌తో ఫోన్‌లో కూడా మాట్లాడారు..
- మునిగిపోయే నావ బీఆర్ఎస్ పార్టీయే: మహేశ్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం విచారణ కమిషన్ ఇచ్చిన నోటీసులతో కేసీఆర్ కుటుంబానికి, ఈటల రాజేందర్‌కు ఉన్న పాతబంధం మళ్లీ చిగురించిందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. నోటీసులు వచ్చిన తర్వాత శామీర్‌పేటలోని ఓ ఫామ్‌హౌస్‌లో హరీశ్‌రావుతో ఈటల రాజేందర్ సమావేశమయ్యారని, అక్కడి నుంచే ఆయన కేసీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడారని ఆరోపించారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు, కాంగ్రెస్ నేతలు దివ్యవాణి, బొజ్జా సంధ్యారెడ్డి, నిజాముద్దీన్‌లతో కలసి ఆయన మాట్లాడుతూ.. రాజాసింగ్, కవితల వ్యాఖ్యలతో బీఆర్ఎస్, బీజేపీల మధ్య లోపాయికారీ ఒప్పందం గుట్టురట్టయిందని, ఆ ఇద్దరి వ్యాఖ్యలే ఈ పార్టీల మధ్య స్నేహం, విలీనం గురించి చెపుతున్నాయని అన్నారు. రాష్ట్రంలో 8 ఎంపీ సీట్లు ఉన్న బీజేపీతో కలిస్తే బీఆర్ఎస్‌కు 8 అసెంబ్లీ సీట్లు ఖాయమని ఎద్దేవా చేశారు. రాజాసింగ్ లేవనెత్తిన అంశాలపై సమాధానాలు చెప్పలేని బీజేపీ నేతలు, రాహుల్ గాంధీపై విమర్శలు చేయడం సిగ్గుచేటని మహేశ్‌గౌడ్ మండిపడ్డారు. నిజంగా రాజాసింగ్ వ్యాఖ్యలకు సమాధానం చెప్పే దమ్ము కిషన్‌రెడ్డికి ఉందా? అని ప్రశ్నించారు. మునిగిపోయే నావ కాంగ్రెస్ కాదని, బీఆర్ఎస్సేనని, ఆ మునిగిపోయే నావలో ఉండే వస్తువుల (డబ్బుల) కోసమే కేసీఆర్ కుటుంబంలో కొట్లాట మొదలైందని ఎద్దేవా చేశారు. వాటాల కోసమే పంచాయితీ మొదలైందని చెప్పారు. పాకిస్తాన్‌పై జరిగిన యుద్ధం, లేదంటే ఆపరేషన్ సిందూర్ ద్వారా సాధించిందేంటి? కోల్పోయిందేంటో కేంద్ర ప్రభుత్వం చెప్పాలన్నారు. ట్రంప్ ప్రలోభానికి గురై మోదీ వెనుకడుగు వేసి భారతీయుల ఆత్మాభిమానాన్ని దెబ్బతీశారన్నారు.

సైన్యాన్ని అవమానిస్తున్న బడేమియా చోటేమియా: కిషన్‌రెడ్డి

- సైన్యంపై రాహుల్, రాబర్ట్, రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు దుర్మార్గం
- కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఆగ్రహం
- కవిత అంశం డాడీ–డాటర్, సిస్టర్–బ్రదర్ సమస్య అని వ్యాఖ్య




సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ, ఆయన బావ రాబర్ట్ వాద్రా, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి దేశ సైనికులను అవమానించేలా మాట్లాడుతున్నారని కేంద్ర మంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి మండిపడ్డారు. ఢిల్లీలో ఆయన శుక్రవారం మీడియాతో మాట్లాడారు. మూడు రోజులపాటు ఢిల్లీలో రాహుల్‌గాంధీ దర్శనం కోసం ఆపసోపాలు పడిన రేవంత్‌రెడ్డి, అవమానానికి గురై హైదరాబాద్‌కు వెళ్లి భారత సైనికులను అవమానించేలా మాట్లాడారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఢిల్లీలో బడేమియా రాహుల్ మాటలకు వత్తాసుగా.. హైదరాబాద్‌లో చోటేమియా రేవంత్‌రెడ్డి కాపీ పేస్ట్ ప్రశ్నలు అడుగుతున్నారని ఎద్దేవా చేశారు. సైనికుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బ తీస్తున్నామనే సోయి కూడా వారికి లేకుండా పోయిందని మండిపడ్డారు. దేశ రక్షణకు సంబంధించిన అంశాలపై ఎలా మాట్లాడాలో తెలియని రాహుల్‌గాంధీ లోక్‌సభలో ప్రతిపక్ష నేతగా ఉండటం ప్రజల దురదృష్టమని అన్నారు. తిరంగా యాత్రలతో దేశ ప్రజలంతా పండగ చేసుకుంటుంటే.. రాహుల్, రేవంత్‌కు అది బీజేపీ కార్యక్రమంగా కనిపిస్తోందని విమర్శించారు. తెలంగాణ ప్రజలను గౌరవించాల్సిన బాధ్యత రాహుల్‌గాంధీపై ఉందని అన్నారు.

కవిత ఎపిసోడ్ డాడీ డాటర్, సిస్టర్ బ్రదర్ సమస్య

బీఆర్ఎస్ నేత కవిత అంశం 'డాడీ డాటర్, సిస్టర్ బ్రదర్ సమస్య అని కిషన్‌రెడ్డి అన్నారు. 'అది ఫ్యామిలీ డ్రామా. అందులో మేం పాత్రధారులం, సూత్రధారులం కాదల్చుకోలేదు. తెలంగాణ ప్రజలకు కూడా సంబంధం లేని అంశం. దానిపై మేము కానీ, రాష్ట్ర ప్రజలు కానీ స్పందించే పరిస్థితి లేదు. బెయిల్ విషయంలో ఎవరిదగ్గరికెళ్లి మాట్లాడారు.. బీజేపీలో ఎలా విలీనం కావాలనుకున్నారనే విషయాన్ని కవిత తన తండ్రిని అడగాలి. ఈ అంశంపై అన్ని రాజకీయ పార్టీలు స్పందించాల్సిన అవసరం లేదు. బీఆర్ఎస్ పార్టీ ఒక ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ. ఆ కంపెనీలో వీళ్లంతా డైరెక్టర్లు. దాని గురించి మేమెందుకు మాట్లాడాలి? చిన్న అంశాన్ని మీడియా కూడా పెద్దగా చేయటం దురదృష్టకరం' అని వ్యాఖ్యానించారు.

బీఆర్ఎస్ పాలన.. ప్రపంచానికే ఆదర్శం

- దృఢ నాయకత్వంతో అద్భుత ప్రగతి సాధ్యమని తెలంగాణ నిరూపించింది
- కేసీఆర్ నాయకత్వంలో సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత సాధించాం
- లండన్ బ్రిడ్జ్ ఇండియా వీక్–2025 సదస్సులో కేటీఆర్ ప్రసంగం



సాక్షి, హైదరాబాద్: 'దృఢ నాయకత్వం, ప్రజల జీవితాలను మార్చాలనే చిత్తశుద్ధి ఉంటే అద్భుతమైన ప్రగతి సాధ్యమని తెలంగాణ నిరూపించింది. తొమ్మిదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ సాధించిన విజయాలు దేశానికే కాదు.. ప్రపంచానికే ఆదర్శంగా నిలిచాయి..' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కె.తారక రామారావు చెప్పారు. లండన్‌లో జరుగుతున్న బ్రిడ్జ్ ఇండియా వీక్–2025 సదస్సులో శుక్రవారం కేటీఆర్ పాల్గొన్నారు. వివిధ దేశాల రాజకీయ నాయకులు, ప్రభావశీల వ్యక్తులు హాజరైన ఈ సదస్సులో 'స్థిరమైన వృద్ధితో ప్రపంచ ఆర్థిక రంగాన్ని నడిపించడంలో తెలంగాణ ఎందుకు ముఖ్యం?' అన్న అంశంపై ప్రధాన ఉపన్యాసం ఇచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో విప్లవాత్మక పంథాను అనుసరించి వివిధ రంగాల్లో తీసుకొచ్చిన మార్పులు, విధానాలకు సంబంధించి తన అనుభవాలను వివరించారు.

సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత: 'కేసీఆర్ నాయకత్వంలోని అప్పటి మా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి మధ్య అద్భుత సమతుల్యత సాధించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన ప్రగతిశీల పనులు స్వతంత్ర భారత చరిత్రలో ఏ రాష్ట్రంలోనూ ఎవరూ చేయలేదు. తలసరి ఆదాయంలో 12వ స్థానం నుంచి మొదటి స్థానానికి ఎలా ఎదగవచ్చో తెలంగాణ నుంచి భారతదేశంలోని ఇతర రాష్ట్రాలు నేర్చుకోవచ్చు. విప్లవాత్మక మార్పులను ఆహ్వానించడంతో పాటు నిర్ణయాధికారాన్ని వికేంద్రీకరించడమే తెలంగాణను మిగతా రాష్ట్రాల కంటే ప్రత్యేకంగా మార్చింది..' అని కేటీఆర్ చెప్పారు.

త్రీ గార్జియస్‌తో సమానం కాళేశ్వరం

'ఇంజనీరింగ్ అద్భుతంగా చెప్పుకునే చైనాలోని త్రీ గార్జియస్ డ్యామ్‌కు సరి సమానమైన ప్రాజెక్టు తెలంగాణలోని కాళేశ్వరం. ప్రపంచంలోని అతిపెద్ద బహుళ ఎత్తిపోతల పథకాన్ని కేవలం మూడేళ్లలోనే పూర్తి చేసి దేశం మొత్తం నివ్వెరపోయేలా చేశాం. 80 మీటర్ల సముద్ర మట్టపు ఎత్తు నుంచి 600 మీటర్ల ఎత్తుకు నీళ్లను తీసుకెళ్లి ప్రతి సీజన్‌లో 45 లక్షల ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా కోటి ఇళ్లకు మిషన్ భగీరథతో సురక్షిత మంచినీటిని ఇచ్చాం. తలసరి ఆదాయంలో 156% వృద్ధిని ఒక్క దశాబ్ద కాలంలోనే సాధించిన రాష్ట్రం దేశంలో ఏదైనా ఉందంటే అది తెలంగాణ ఒక్కటే.

హైదరాబాద్‌కు అతిపెద్ద టెక్ క్యాంపస్‌లు

- బీఆర్ఎస్ ప్రభుత్వ పారిశ్రామిక అనుకూల విధానాల కారణంగా గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్, ఫేస్‌బుక్‌తో పాటు ప్రపంచంలోని ప్రఖ్యాత టెక్ కంపెనీలు అమెరికా తర్వాత తమ అతిపెద్ద క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పాయి. మేము అధికారంలోకి రావడానికి ముందు 2014లో టెక్ పరిశ్రమలో 3 లక్షల 23 వేలు ఉద్యోగాలు మాత్రమే ఉండేవి. బీఆర్ఎస్ అధికారం నుంచి దిగిపోయే నాటికి అవి 10 లక్షలకు చేరాయి. 2014లో రూ.56 వేల కోట్లుగా ఉన్న ఐటీ ఎగుమతులు, 2023 నాటికి రూ.2 లక్షల 41 వేల కోట్లకు చేరాయి. ఇదంతా మా అప్పటి మా ముఖ్యమంత్రి కేసీఆర్ దార్శనికత, మార్గదర్శకత్వంతోనే సాధ్యమయ్యాయి..' అని కేటీఆర్ పేర్కొన్నారు.

భారత్‌లో పెట్టుబడులు పెట్టండి

భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని ఈ సందర్భంగా కేటీఆర్ కోరారు. ఇందులో ప్రగతిశీల రాష్ట్రమైన తెలంగాణను ఫస్ట్ చాయిస్‌గా ఎంచుకోవాలని సూచించారు. అపార అవకాశాలను అందుకోవాలనుకునే వారితో పాటు కలల్ని నిజం చేసుకోవాలనుకునే ప్రతి ఒక్కరికీ తెలంగాణ లైట్ హౌస్ లాంటిదని చెప్పారు. ఇండియాతో పాటు ప్రపంచానికే తెలంగాణ దిక్సూచి అని అన్నారు.

గోదావరి-కావేరీ అనుసంధానంపై మళ్లీ కదలిక

జూన్ 24న కీలక సమావేశం

సాక్షి, హైదరాబాద్: గోదావరి–కావేరీ నదుల అనుసంధానంపై మళ్లీ కదలిక వచ్చింది. దీనిపై తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు లేవనెత్తిన అభ్యంతరాలపై చర్చించేందుకు జూన్ 24న హైదరాబాద్‌లో జాతీయ నీటి అభివృద్ధి సంస్థ నదుల అనుసంధానం టాస్క్‌ఫోర్స్ కమిటీ, కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) చైర్మన్ ఆధ్వర్యంలో ఈ భేటీ జరగనుంది. ఇప్పటిదాకా పోలవరం ప్రాజెక్టు నుంచి గోదావరి– కావేరీ అనుసంధానం చేపట్టాలని పదేపదే పట్టుబడుతున్న ఏపీ.. తాజాగా రూటు మార్చినట్లయింది. గోదావరి–బనకచర్ల అనుసంధానంలో భాగంగా పల్నాడు జిల్లా బొల్లాపల్లిలో నిర్మించతలపెట్టిన 200 టీఎంసీల సామర్థ్యం కలిగిన రిజర్వాయర్ నుంచి గోదావరి–కావేరీ అనుసంధానం చేపట్టి, ఆ నీటిని కావేరీ బేసిన్‌కు తరలించే ప్రతిపాదనలు పరిశీలించాలని తాజాగా కేంద్రాన్ని కోరింది. రూ.80,112 కోట్ల వ్యయంతో పోలవరం నుంచి 200 టీఎంసీలను గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టును ఏపీ కొత్తగా తెరమీదికి తెచ్చిన విషయం విదితమే. ఈ ప్రాజెక్టును తెరమీదికి తెస్తే తెలంగాణకు శరాఘాతంగా మారుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ఇప్పటిదాకా సమ్మక్కసాగర్ (తుపాకులగూడెం) నుంచి గోదావరి–కావేరీ అనుసంధానానికే ఎన్‌డబ్ల్యూడీఏతోపాటు కేంద్ర జలశక్తి శాఖ మొగ్గుచూపుతున్న నేపథ్యంలో జూన్ 24న జరిగే సమావేశం ఏ మలుపు తీసుకుంటుందనే దానిపై ఆసక్తి నెలకొంది.

కాళేశ్వరం బరాజ్‌ల్లో పరీక్షలు చేయించండి

ఎస్ఈలకు రామగుండం చీఫ్ ఇంజనీర్ లేఖ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం బరాజ్‌లపై జాతీయ డ్యామ్‌ల భద్రత సంస్థ (ఎన్డీఎస్ఏ) నిపుణుల కమిటీ నివేదిక ప్రకారం కేంద్ర నీటి, విద్యుత్ పరిశోధన సంస్థతో పరీక్షలు చేయడానికి వీలుగా వర్క్ ఆర్డర్ ఇవ్వాలని రామగుండం చీఫ్ ఇంజనీర్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు రామగుండం ఇరిగేషన్ సర్కిల్ ఎస్ఈకి శుక్రవారం సీఈ లేఖ రాశారు. మేడిగడ్డలో కాంక్రీట్ నిర్మాణాలపై రీబౌండ్ హామ్మర్ టెస్ట్, గేట్ల పరిస్థితిపై మరో పరీక్ష, సీపేజీలపై జియో టెక్నికల్ అధ్యయనాలు, బరాజ్ ఏవిధంగా ఉందనే పరీక్షలతోపాటు క్రాస్ హోల్ సీస్మిక్ టోమోగ్రఫీ పరీక్ష, జియో ఫిజికల్ పరీక్షలు, హైడ్రాలిక్ నమూనా అధ్యయనాల (త్రీడీ ఫిజికల్, 2డీ ఫిజికల్, 2డీ న్యూమరికల్ నమూనా అధ్యయనాలు)ను రూ.6.54 కోట్లతో చేపట్టడానికి అనుమతినిచ్చారు. అన్నారం బరాజ్‌లో ఇవే రకాల పరీక్షల కోసం రూ.6.44 కోట్లు, సుందిళ్ల బ్యారేజీలో రూ.6.42 కోట్లతో వర్క్ ఆర్డర్ ఇవ్వాలని నిర్దేశించారు. మూడు బ్యారేజీల్లో పరీక్షల కోసం రూ.19.4 కోట్లు కానుండగా.. వెనువెంటనే సీడబ్ల్యూపీఆర్ఎస్‌కు వర్క్ ఆర్డర్ ఇవ్వనున్నారు. 2023 అక్టోబరు 21న మేడిగడ్డ బరాజ్‌లోని ఏడో బ్లాకు కుంగగా... అదే క్రమంలో అన్నారం, సుందిళ్ల బరాజ్‌ల్లో సీపేజీలు బయటపడ్డాయి. దాంతో ఈ బ్యారేజీలపై అధ్యయనం చేసి నివేదిక అందించాలని గత ఏడాది ఫిబ్రవరిలో ఎన్డీఎస్ఏను తెలంగాణ కోరగా.. సీడబ్ల్యూసీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్ అయ్యర్ నేతృత్వంలో నిపుణుల కమిటీని వేశారు. ఆ కమిటీ రెండు నెలల క్రితం ఇచ్చిన నివేదికను అమలు చేసి, కాళేశ్వరం బరాజ్‌లకు మరమ్మతులు చేసి, పునరుద్ధరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. పరీక్షల అనంతరం సీడబ్ల్యూపీఆర్ఎస్ నివేదిక ఇస్తే.. దాని ప్రకారం ప్రణాళిక సిద్ధం చేసి, కేంద్ర జలవనరుల సంఘం ఆమోదం తీసుకోనున్నారు.

పోలవరం బ్యాక్ వాటర్ ముంపుపై సర్వే

- ఆరు నదుల ప్రవాహంపై సర్వే చేయాలని సీడబ్ల్యూసీ నిర్ణయం
- ఖర్చంతా పోలవరం ప్రాజెక్టు అథారిటీదే

సాక్షి, హైదరాబాద్: పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ గోదావరిలో పలు నదుల ప్రవాహాలు సజావుగా కలవకుండా ముంపునకు కారణమవుతున్నాయని తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలపై కేంద్ర జలవనరుల సంఘం (సీడబ్ల్యూసీ) స్పందించింది. ఆయా నదుల ప్రవాహాలపై సర్వేకు సీడబ్ల్యూసీ సమ్మతి తెలిపింది. ఇప్పటికే పోలవరం ప్రాజెక్టు ఆథారిటీ (పీపీఏ) సర్వే చేయాలని సీడబ్ల్యూసీని కోరడమే కాకుండా 6 నదుల క్రాస్ సెక్షన్ల వివరాలు అందించింది. ఇక దీనికి అయ్యే వ్యయాన్ని పీపీఏ భరించనుంది. దాంతో సర్వే చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని హైదరాబాద్‌లోని కృష్ణా–గోదావరి బేసిన్ ఆర్గనైజేషన్ (కేజీబీవో–సీడబ్ల్యూసీ అనుబంధ ప్రాంతీయ కార్యాలయం)ను సీడబ్ల్యూసీ ఆదేశించింది. ఈ మేరకు శుక్రవారం లేఖ రాసింది. నదుల ప్రవాహాలపై సర్వే అనంతరం నివేదికపై తెలుగు రాష్ట్రాల నీటిపారుదల శాఖ అధికారులతో కౌంటర్ సంతకం చేయించాలని కేజీబీవోను సీడబ్ల్యూసీ ఆదేశించింది. పోలవరం బ్యాక్‌వాటర్ ముంపుపై తెలంగాణ నిరంతరం పోరాటం చేస్తున్న విషయం విదితమే. ఆ పోరాట ఫలితంగా ప్రస్తుతానికి ఆరు నదుల ప్రవాహాలపై సర్వేకు సీడబ్ల్యూసీ సమ్మతించిన విషయం విదితమే. దాంతో పోలవరం బ్యాక్‌వాటర్‌తో దుమ్ముగూడెంలో తుర్పాకవాగు కింద 81.7 ఎకరాలు, ఇరవెండి (బూర్గంపహాడ్) లోని స్థానిక వాగుల కింద 10.47 ఎకరాలు, ఏదులవాగు కింద 110.45 ఎకరాలు, పెద్దవాగు కింద 1888 ఎకరాలు, దోమలవాగు కింద 271.6 ఎకరాలు ముంపునకు గురవుతున్నాయని తేలగా.. ఈ సర్వేతో మరిన్ని వివరాలు బయటపడనున్నాయి. మరో 28 ఉప నదుల ప్రవాహాలపైనా సర్వే చేయాలని తెలంగాణ కోరుతోంది. అంతేకాకుండా పోలవరం ప్రాజెక్టులో 45.72 మీటర్ల గరిష్ట నిల్వతో నీటిని నింపినప్పుడు. బ్యాక్ వాటర్ ప్రభావంపై మొత్తం గోదావరిపై సర్వే చేయాలని తెలంగాణ పట్టుబడుతోంది.

కాళేశ్వరం పై కేసీఆర్, హరీశ్ మరోమారు భేటీ

సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన పిసి ఘోష్ కమిషన్ ముందు జూన్ 5న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, 9న మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరుకానున్న నేపథ్యంలో శుక్రవారం ఎర్రవల్లి నివాసంలో వారిద్దరు మరోమారు సమావేశమయ్యారు. కమిషన్ ఎదుట వినిపించాల్సిన వాదనపై సుదీర్ఘంగా చర్చించారు. కాళేశ్వరం ప్రాజెక్టు వివరాలతో ఇప్పటికే ఒక నివేదికను తయారు చేశారు. నివేదికలోని అంశాలపై శుక్రవారం జరిగిన భేటీలో ఇద్దరు నేతలు లోతుగా విశ్లేషించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం వినిపిస్తున్న వాదన, నిపుణులు చెబుతున్న అంశాలు, విమర్శకులు లేవనెత్తుతున్న సందేహాలను ఒక చోటకు చేర్చి కమిషన్ అడిగేందుకు అవకాశం ఉన్న అంశాలను చర్చించినట్లు తెలిసింది. విచారణ కమిషన్ ఇప్పటివరకు అధికారులు, కాంట్రాక్టర్లను విచారించిన తీరుతన్నులను విశ్లేషించారు. ప్రాజెక్టు నిర్మాణానికి ఆర్థికపరమైన అనుమతులు, అందుకు సంబంధించిన జీవోలను సైతం క్రోడీకరించి సమగ్ర నివేదికను సిద్ధం చేస్తున్నారు. కమిషన్ అధికారుల నుంచి తీసుకున్న ఫీడ్‌బ్యాక్, ఎన్డీఎస్ఏ, విజిలెన్స్ రిపోర్టులను సైతం అధ్యయనం చేస్తున్నారు. కాళేశ్వరంపై ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని తిప్పికొట్టాలని, ప్రాజెక్టు ద్వారా చేకూరిన లాభాలు, సాగు వివరాలు, పంట దిగుబడి తదితరాలకు సంబంధించి కమిషన్ విచారణకు వెళ్లడానికి ముందే పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇవ్వాలని బీఆర్ఎస్ భావిస్తోంది. జూన్ 5న కేసీఆర్ విచారణ కమిషన్ ముందు హాజరయ్యే లోపు ఈ తరహా భేటీలు మరిన్ని ఉండే అవకాశాలు ఉన్నాయి.


హిమాచల్ హైడల్ ప్రాజెక్టులో భారీ అవినీతి

ఎవరూ ప్లాంట్ పెట్టని చోట మీరెందుకు?: హరీశ్‌రావు



సాక్షి, హైదరాబాద్: హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రతిష్టాత్మక సంస్థలు సైతం హైడల్ ప్రాజెక్టు నిర్మాణానికి నిరాకరించిన చోట తెలంగాణ ప్రభుత్వం హైడల్ ప్రాజెక్టు నిర్మిస్తామనడం వెనక భారీ అవినీతి జరిగిందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. దీన్ని పూర్తి ఆధారాలతో బయటపెడతామన్నారు. మోసర్ బేర్, ఎన్టీపీసీ వంటి సంస్థలే సాధ్యం కాదని వదిలేసిన 510 మెగావాట్ల ప్రాజెక్టును రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ. 6,200 కోట్లతో నిర్మించడానికి అవగాహన ఒప్పందం కుదుర్చుకోవడం తుగ్లక్ చర్యేనని శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో దుయ్యబట్టారు. తెల్ల ఏనుగు లాంటి హైడల్ ప్రాజెక్టు నిర్మానానికి టీజీ జెన్‌కోను రంగంలోకి దింపడం దారుణమని విమర్శించారు. ఈ ప్రాజెక్టు నిర్మించేందుకు సిద్ధం కావడానికిగల కారణం ఏమిటని హరీశ్‌రావు ప్రశ్నించారు. డీపీఆర్ లేకుండానే రాష్ట్ర ప్రభుత్వం హిమాచల్ ప్రభుత్వంతో ఎంఓయూ చేసుకొని అప్ ఫ్రంట్ ప్రీమియం కింద రూ. 26 కోట్లు చెల్లించడమే కాకుండా మరో రూ. 26 కోట్లు చెల్లించేందుకు ఎందుకు సిద్ధమవుతోందని నిలదీశారు.

2009లోనే...: 2009లో మోసర్ బేర్ కంపెనీ రూ. 64 కోట్ల అప్ ఫ్రంట్ ప్రీమియం చెల్లించి హిమాచల్ ప్రదేశ్‌లోని సేలి, మియార్‌లో జలవిద్యుత్ ప్రాజెక్టులు కట్టాలని భావించిందని.. కానీ సాంకేతికంగా, ఆర్థికంగా ఈ ప్రాజెక్టు నిర్మాణం సాధ్యం కాదని తేలడంతో ఒప్పందాన్ని రద్దు చేసుకుందని హరీశ్‌రావు గుర్తుచేశారు. అయితే రూ. 64 కోట్ల ప్రీమియం సొమ్మును హిమాచల్ ప్రభుత్వం తిరిగి చెల్లించకపోవడంతో మోసర్ బేర్ సంస్థ ఆ రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించగా వడ్డీతో సహా తీసుకున్న డబ్బును 2023 జనవరిలోనే చెల్లించాలని హిమాచల్ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించిందన్నారు. 7 నెలలకుపైగా మంచు కురిసే ప్రాంతంలో జలవిద్యుత్ ప్రాజెక్టు సాధ్యం కాదని ఎన్టీపీసీ కూడా ఒప్పందాన్ని రద్దు చేసుకుందని హరీశ్‌రావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు. అనువుకాని ప్రాంతంలో జలవిద్యుత్ ప్రాజెక్టు కట్టేందుకు రేవంత్ సర్కారు ఎందుకు ఉబలాటపడుతుందో డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క శ్వేతపత్రం విడుదల చేయాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.



సాక్షి హైదరాబాద్

శనివారం । 31 । మే । 2025



.. రూ.61 లక్షలు టోకరా

భారీ లాభాలు వస్తాయంటూ రూ.21 వేలతో మొదలుపెట్టి, రూ.61 లక్షలు స్వాహా చేశారు సైబర్ నేరగాళ్లు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. -10లో



బ్యూటీ ఫ్లో.. ఫైనల్..షో..

అందం, ఆత్మవిశ్వాసం, సమయస్ఫూర్తి, సామాజిక దీప్తి.. కలగలిసిన అందాల భామలు తలపడుతున్న బ్యూటీ ఫైట్ నేటితో ముగియనుంది. - సిటీప్లస్‌లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 32.0/23.0

నగరంలోని పలు ప్రాంతాల్లో శనివారం చిరు జల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 32, కనిష్టంగా 23 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది.

వర్షాల వేళ.. వరద వెళ్లేదెలా?

అరకొరగానే నాలాల పనులు
నిధులు కేటాయించని ప్రభుత్వం

బిగ్ స్టోరీ



రామంతాపూర్ డివిజన్ పరిధిలోని వివేక నగర్, శాంతినగర్‌లలో వరద నీటి కాల్వల (నాలాలు) నిర్మాణ పనులు నాలుగు నెలలుగా జరుగుతుండటంతో ప్రజలు ఇళ్లలోంచి బయటికి రాలేకపోతున్నారు. పనులు నత్తనడకన నడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో ఇప్పటికే వర్షాలు ప్రారంభం కావడంతో నీరు నిండి ఎలాంటి ముప్పు తలెత్తుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

- మొదటి దశ పనులకే పరిమితం
- కుంటుతున్న ఎస్ఎన్‌డీపీ రెండో దశ
- నగర వాసులకు తప్పని ఇబ్బందులు

ఎస్ఎన్‌డీపీ రెండో దశ కింద పనులు ఇలా..

పరిస్థితి	అంచనా వ్యయం (రూ.కోట్లు)	నాలా పొడవు (కి.మీ)
పురోగతిలో	92.50	9.50
అగ్రిమెంట్ దశలో	141.20	11.39
టెండరు దశలో	154.37	18.40
డీపీఆర్ దశలో	140.44	8.79



కుత్బుల్లాపూర్ సుభాష్ నగర్ ప్రాంతంలో ఓపెన్ నాలాలు పొంగిపొర్లడం పరిపాటిగా మారింది. సమస్య పరిష్కారానికి డ్రైనేజీ నిర్మాణం చేపట్టాలని స్థానికులు ఎంతో కాలంగా కోరుతున్నా ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు.

సాక్షి, సిటీబ్యూరో/ఉప్పల్/శేరిలింగంపల్లి/మోతీనగర్/కుత్బుల్లాపూర్/చందానగర్:

నగరంలో వానలు మొదలయ్యాయి. వరద నీరు పొంగకుండా ఉండేందుకు కాల్వల (నాలాల) ఆధునికీకరణ, విస్తరణ పనులు మొదటి దశలో భాగంగా దాదాపు రూ.985 కోట్ల మేర పనుల్లో 80 శాతానికి పైగా జరిగాయి. రెండో దశ పనులు మాత్రం ఒక అడుగు ముందుకు, రెండడుగులు వెనక్కు అన్నచందంగా కుంటుతున్నాయి. దీంతో తొలిదశలో జరిగిన పనులతో ఉపశమనమే తప్ప నగరంలో వరద సమస్యలు పూర్తిగా తీరలేదు. నాలుగేళ్ల క్రితం నగరంలోని ముంపు సమస్యలతో పరిష్కారానికి అప్పటి ప్రభుత్వం ఎస్ఎన్‌డీపీ (వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం) కింద పనులు చేపట్టింది.

ప్రభుత్వం మారిన తర్వాత నగరంలోని అన్ని ప్రాజెక్టుల పనులనూ హై సిటీ (హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ అండ్ ట్రాన్స్‌ఫార్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) కిందే చేస్తున్నప్పటికీ, నాలాల పనులకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి నిధులు కేటాయించలేదు.

పరిపాలన అనుమతులే..

అధికారులు ఎస్ఎన్‌డీపీ రెండో దశ కింద రూపొందించిన దాదాపు రూ. 528 కోట్ల పనులకు పరిపాలన అనుమతులు మాత్రం లభించడంతో 'అర్బన్ ఫ్లడ్ మేనేజ్‌మెంట్' కింద కేంద్రం నుంచి అందే నిధులతోనో, లేక ప్రభుత్వం ఏదో విధంగా ఇస్తుందనే ధీమాతోనో కానీ వాటిలో కొన్ని చేపట్టారు. మిగతావి పెండింగ్‌లో పడ్డాయి. ఇప్పటికే ప్రారంభమైన పనులు కుంటుతున్నాయి. అలా పురోగతిలో ఉన్న ఆ పనుల అంచనా వ్యయం దాదాపు రూ. 92 కోట్లు. వాటిలో చార్మినార్ జోన్‌లో ఆరోరా కాలేజీ, మస్‌మాని కుంట, గౌస్‌నగర్ అలీ హోటల్, సికింద్రాబాద్ జోన్‌లో సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద నాలా ఆధునికీకరణ, శేరిలింగంపల్లి జోన్‌లో గురునాథ్ చెరువు , పటేల్ చెరువు, తిమ్మక్క చెరువు, నల్లగండ్ల, నేతాజీనగర్, గఫూర్‌నగర్, కూకట్‌పల్లి జోన్‌లో మైసమ్మ చెరువు, దీన్‌దయాళ్ నగర్ తదితర ప్రాంతాల్లో ఉన్నాయి.



నేతాజీనగర్ నుంచి నల్లగండ్ల మార్కెట్ వరకు నాలా సైడ్‌వాల్స్ నిర్మాణం తదితర పనులు జరగాల్సి ఉంది. రెండు కిలో మీటర్లకు పైగా పనులు జరగాల్సి ఉండగా 200 మీటర్ల పని మాత్రమే జరిగింది. అంచనా వ్యయం రూ.28.45 కోట్లు.



మియాపూర్ డివిజన్‌లోని గురునాథ్ చెరువు నుంచి పటేల్ చెరువు వరకు 820 మీటర్ల మేర నాలా విస్తరణ, బాక్స్ డ్రెయిన్ పనులు 620 మీటర్ల మేర పూర్తయినా, బండరాళ్ల అడ్డు రావడంతో మిగతా పనులు అర్ధంతరంగా ఆపేశారు. ఈ పనుల అంచనా వ్యయం రూ. 6.80 కోట్లు. దాదాపు రూ.1.90 కోట్ల అంచనా వ్యయంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు వద్ద బాక్స్ డ్రెయిన్ పనులు ఈ నెలలోనే ప్రారంభించారు. వర్షాలు మొదలు కావడంతో ఎప్పటికి పూర్తవుతాయో తెలియదు. – చందానగర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్లలో ఎలాంటి నాలా విస్తరణ, బాక్స్‌డ్రెయిన్ పనులు చేయడం లేదు.



అల్లాపూర్ డివిజన్ వి.రామారావునగర్ నుంచి అవంతి నగర్ తోట రైల్వే ట్రాక్ వరకు ఇళ్ల మధ్యన ఓపెన్ నాలా విస్తరణ పనులు నాలుగేళ్లయినా పూర్తికాలేదు. వర్షాలు ప్రారంభం కావడంతో ఇప్పటికే నాలా ఇరువైపులా ఉన్న నివాసితులు ఎప్పుడేం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్ సమీపంలో చంద్ర గార్డెన్ నుంచి అల్లాపూర్ సర్వే నెంబర్ 18 వరకు వర్షపు నీరు వెళ్లే విధంగా బాక్స్ డ్రైనేజి నిర్మాణం మాత్రం పూర్తయింది. సున్నం చెరువు నుంచి మైసమ్మ చెరువు వరకు నాలా విస్తరణ పనులకు ప్రణాళికలు తప్ప కార్యరూపం దాల్చలేదు.

జీఐఎస్ సర్వే ఆధారంగా ఆస్తిపన్ను

వసూలు చేయాలంటూ అధికారులకు ఆదేశాలు

సాక్షి, సిటీబ్యూరో: ఆస్తిపన్ను, ట్రేడ్ లైసెన్స్ ఫీజుల వసూళ్లు పెంచేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. ఈ మేరకు జీహెచ్ఎంసీ అడిషనల్ కమిషనర్ (రెవెన్యూ) అనురాగ్ జయంతి శుక్రవారం అన్ని సర్కిళ్ల డిప్యూటీ కమిషనర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జీఐఎస్ సర్వే ఆధారంగా ఆస్తిపన్ను వసూలు చేయాలని సూచించారు. ముఖ్యంగా రెండు కేటగిరీల్లో సర్వే ఆధారంగా రివిజన్ చేసి ఆస్తిపన్ను వసూలు చేయాలన్నారు. నగరంలో ఏటా ఎన్నో కొత్త భవనాలు నిర్మాణాలవుతున్నప్పటికీ అన్నీ ఆస్తిపన్ను జాబితాలోకి రావడం లేదు. దీంతో జీఐఎస్ సర్వేలో కొత్త భవనాలుగా గుర్తించిన వాటికి అసెస్‌మెంట్స్ పూర్తిచేసి ఆస్తిపన్ను వసూలు చేయాలన్నారు. చాలా భవనాల్లో వ్యాపారాలు నడుస్తున్నప్పటికీ, వాటికి నివాస కేటగిరీ ఆస్తిపన్నునే చెల్లిస్తున్నారు. వ్యాపారాలు నడుస్తున్నట్లుగా సర్వేలో గుర్తించిన భవనాలకు వాణిజ్య ఆస్తిపన్ను విధించి, వసూలు చేయాలన్నారు. అలాగే వాటికి ట్రేడ్‌లైసెన్సుల్ని కూడా వసూలు చేయాలని ఆదేశించారు. పెనాల్టీ లేకుండా తొలి ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను చెల్లింపులకు జూన్ నెలాఖరు వరకు గడువున్నందున, లక్ష్యానికగుణంగా ఆస్తిపన్ను వసూలు చేసేందుకు అన్ని సర్కిళ్లలోని బిల్ కలెక్టర్లు, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్లు, ఏఎంసీలు ప్రతిరోజూ క్షేత్ర స్థాయిలో పర్యటించి వసూళ్లు చేయాలన్నారు. ఆస్తిపన్ను వసూళ్లతో పాటు వేకెంట్ ల్యాండ్ టాక్స్ కూడా వసూలు చేయాలని సూచించారు.

పూడికతీత పనులకు కార్యాచరణ



పూడికతీతను పరిశీలిస్తున్న జలమండలి ఎండీ

- జలమండలి, జీహెచ్ఎంసీ సమన్వయం
- పాతబస్తీలో పర్యటించిన అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: వర్షాకాలంలో నాలాలు, సీవరేజీ లైన్లలో పూడికతీత పనుల కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జలమండలి, జీహెచ్ఎంసీ సంయుక్తంగా నిర్ణయం తీసుకున్నాయి. శుక్రవారం జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్, స్థానిక ఎమ్మెల్యే, సంబంధిత అధికారులతో కలిసి పాతబస్తీలో పర్యటించారు. పలు నాలాలు, సీవరేజీ లైన్లను పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో ఇంటి కింది భాగం నుంచి ప్రవహించే నాలాలు ఉన్నట్లు గుర్తించారు. ప్రధానంలో మౌలానా చిల్లా ప్రాంతంలోని గంగానగర్ నాలా పరీవాహక ప్రాంతంలో వర్షాకాలంలో మురుగు నీరు నివాసాలకు చేరి స్థానికులు ఇక్కట్లు పడుతున్నట్లు గ్రహించారు. ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరణ, జీహెచ్ఎంసీ చేపట్టిన నాలా విస్తరణ పనుల కారణంగా సమీప ప్రాంతాల్లో చిన్న చిన్న రెయిన్ వాటర్ డ్రెయిన్లు, సీవరేజీ లైన్లలో పూడిక పెరిగి వర్షాల సమయంలో మురుగు సమస్య తీవ్రమైనట్లు స్థానిక ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. నాలాల పనులు చేపట్టడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఇరుశాఖల అధికారులను ఆయన సూచించారు. నాలా విస్తరణ పనుల సమయంలోని సమాంతరంగా జలమండలి సీవరేజీ లైన్ల నిర్మాణం సైతం పూర్తి చేయాలని అధికారులకు ఎండీ అశోక్ రెడ్డి ఆదేశించారు. కార్యక్రమంలో జలమండలి ఆపరేషన్ డైరెక్టర్ అమరేందర్ రెడ్డి, సీజీఎంలు నాగేంద్ర, వినోద్ భార్గవ్, జీఎంలు సంతోష్‌కుమార్, శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు.

వారానికోరోజు.. ఒక వార్డు

దోమల నియంత్రణకు కొత్త విధానం

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో దోమల వ్యాప్తి నివారణకు ఎన్ని చర్యలు చేపడుతున్నప్పటికీ, ప్రజల నుంచి ఫిర్యాదులు తగ్గడం లేదు. సంబంధిత ఎంటమాలజీ సిబ్బంది దోమల నివారణ కార్యక్రమాలు తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలో సంబంధిత సర్కిల్‌లోని ఎంటమాలజీ సిబ్బంది మొత్తం.. వారంలో ఒకరోజు ఒక వార్డులోనే పని చేయాలని కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. ఇందులో భాగంగా సర్కిల్ పరిధిలో పనిచేసే ఎంటమాలజీ యాంటీలార్వా ఆపరేషన్ సిబ్బంది నుంచి సీనియర్ ఎంటమాలజీ వరకు వివిధ స్థాయిల్లోని దాదాపు 70 మంది ఒకే వార్డులో విధులు నిర్వహిస్తారు. ఉదయం యాంటీ లార్వా ఆపరేషన్లు, రాత్రుళ్లు ఫాగింగ్ సహా అన్ని కార్యక్రమాలు చేస్తారు. అందరూ ఒకే వార్డులో పర్యటించడం వల్ల చేసే పనుల గురించి ప్రజలకు కూడా తెలుస్తుందని, వారి నుంచి కూడా మంచి స్పందన లభిస్తుందని, తద్వారా దోమల నివారణకు సంబంధించిన అవగాహన కార్యక్రమాల్ని విస్తృతం చేయవచ్చని భావిస్తున్నారు.

సత్వర సేవలకు సుస్తీ!

రిజిస్ట్రేషన్ శాఖలో ఈ- చెల్లింపుల్లో ఇబ్బందులు



సాక్షి, సిటీబ్యూరో: స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో వివిధ సేవలకు నగదు రహిత ఈ- చెల్లింపులకు తిప్పలు తప్పడం లేదు. స్థిరాస్తి కొనుగోలు సమయంలో గత లావాదేవీలు తెలుసుకునేందుకు, బ్యాంకు రుణాల కోసం అవసరమయ్యే ఎన్‌కంబరెన్స్ సర్టిఫికెట్ (ఈసీ), సర్టిఫైడ్ కాపీ (సీసీ)ల కోసం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లను ఆశ్రయించే సిటీ జనులకు సత్వర సేవలు అందని ద్రాక్షగా మారాయి. మీ సేవ ద్వారా ఈసీ, సీసీల కోసం దరఖాస్తు చేసుకుంటే జనరేట్‌కు పని దినాల్లో 24 నుంచి 48 గంటలు సమయం పడుతుండటంతో సత్వర సేవల కోసం నేరుగా జిల్లా, సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులను ఆశ్రయించే దరఖాస్తుదారులకు చార్జీల చెల్లింపు ప్రధాన సమస్యగా మారుతోంది. రిజిస్ట్రేషన్ శాఖలో నగదు రహిత చెల్లింపుల విధానం కొనసాగుతుండటంతో మీ సేవ యాప్ ద్వారా చెల్లింపులు చేసుకునే వెసులుబాటు ఉంది. దరఖాస్తుదారు తన మొబైల్‌లో మీ సేవ యాప్ డౌన్ లోడ్ చేసుకుని రిజిస్ట్రేషన్ శాఖ పోర్టల్‌లో వివరాలు సమర్పించి సేవల చార్జీలను చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. అయితే.. కొందరికి మొబైల్ మీ సేవ యాప్ డౌన్ లోడ్‌పై అవగాహన లేకపోవడం, మరికొందరి ఫోన్‌లలో యాప్ డౌన్‌లోడ్ కాకపోవడం ప్రధాన సమస్యగా తయారైంది. దీంతో దళారులను ఆశ్రయించకతప్పని పరిస్థితి నెలకొంది.

చెల్లింపులు ఓకే.. జనరేట్ కానీ ఐడీలు

రిజిస్ట్రేషన్ శాఖలో మీ సేవ యాప్ ద్వారా చెల్లింపులకు కొన్నిసార్లు ఐడీ జనరేట్ కాకపోవడం భారంగా పరిణమించింది. యాప్‌లో వివరాలు నమోదు చేసి పేమెంట్ ఆప్షన్ చెల్లింపులు చేస్తే ఐడీ జనరేట్ అవుతోంది. దాని ఆధారంగా ధ్రువీకరణ పత్రాలు డౌన్‌లోడ్ అవుతాయి. ఐడీ జనరేట్ కాకుంటే మాత్రం ధ్రువీకరణ పత్రాలు డౌన్‌లోడ్ సాధ్యం కాని పరిస్థితి నెలకొంటుంది. ఐడీ జనరేట్ కాని చెల్లింపుదారులకు రోజులు గడుస్తున్నా.. పేమెంట్ వెనక్కి రాకపోవడంతో గగ్గోలు పెడుతున్నారు. దీనిపై రిజిస్ట్రేషన్ శాఖ సిబ్బందికి స్పష్టత లేకుండా పోయింది. మరోవైపు రిజిస్ట్రేషన్‌శాఖ ప్రధాన సర్వర్ పదేపదే మొరాయిస్తుండటంతో సేవలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. రిజిస్ట్రేషన్ శాఖ ఇంటర్నెట్ సేవల వేగం కూడా అంతంత మాత్రంగా తయారైంది. ప్రతిరోజూ కనీసం మూడు నాలుగు గంటలు ఇంటర్నెట్ సేవలకు అంతరాయం తప్పడం లేదని సిబ్బంది చెబుతున్నారు.

చిరుసేవలపైనా దళారుల బాదుడే..

స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ చిన్న చిన్న సేవలకు సైతం డాక్యుమెంట్ రైటర్ల వద్ద పనిచేసే సిబ్బంది చిరు దళారులుగా అవతారమెత్తి దరఖాస్తుదారులను బాదేస్తున్నారు. ప్రతి ఈ- చెల్లింపులపై కనీసం రూ.100 నుంచి రూ. 400 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదేమని నిలదీస్తే.. ఐడీ జనరేట్ కాకుండా నష్టం ఎవరూ భరిస్తారని, దాంతో పాటు యాప్ ద్వారా సేవలు అందిస్తున్నాం కదా.. అని సర్దిచెప్పడం షరా మామూలుగా మారింది.

1 నుంచి ఓయూలో తరగతులు ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌తో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీలలో జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. నెల రోజుల వేసవి సెలవుల అనంతరం తిరిగి తరగతులను పునఃప్రారంభిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వర్సిటీ క్యాంపస్‌లో కాలేజీలతో పాటు హాస్టల్స్, మెస్సులను కూడ పునఃప్రారంభించనున్నారు.

రెట్టింపు డబ్బులు ఇస్తామని ఘరానా మోసం..

- బోర్డు తిప్పేసిన ది పెంగ్విన్ సెక్యూరిటీస్ సంస్థ..
- జీడిమెట్ల పీఎస్‌లో బాధితుల ఫిర్యాదు
- ఇప్పటికే రూ.6.5కోట్ల మోసం వెలుగులోకి
- బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం..

జీడిమెట్ల: పెట్టుబడి పెట్టిన సొమ్ముకు రెట్టింపు డబ్బులు ఇస్తామని ఆశ చూపి ది పెంగ్విన్ సెక్యూరిటీస్ సంస్థ టోకరా వేసింది. మూడు నెలలుగా రిటర్న్స్ ఇవ్వకపోవడంతో మోసపోయినట్లు గుర్తించిన బాధితులు శుక్రవారం జీడిమెట్ల పీఎస్‌లో ఫిర్యాదు చేసేందుకు క్యూ కట్టారు. సదరు సంస్థ చేతిలో మోసపోయిన బాధితులు ఇప్పటికే



స్వాతి



బాలాజీ

13 మంది ఫిర్యాదు చేయగా రూ.6.5కోట్ల మోసం జరిగినట్లు తెలిసింది. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు సమాచారం. బాధితులు, జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గిరినగర్‌కు చెందిన బాలాజీ, మెదక్ జిల్లా, అల్లాదుర్గ్ ప్రాంతానికి చెందిన స్వాతి మూడేళ్ల క్రితం చింతల్ గణేష్‌నగర్‌లోని ఓ కాంప్లెక్స్‌లో ది పెంగ్విన్ సెక్యూరిటీస్ పేరుతో కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. తమ సంస్థలో పెట్టుబడి పెడితే రెట్టింపు లాభాలిస్తామంటూ ప్రచారం చేసుకున్నారు. పెట్టుబడి పెట్టిన వారికి రూ.100 స్టాంప్ పేపర్లపై నోట్ రాసి ఇవ్వడంతో చాలా మంది వారిని నమ్మారు. కొందరు వీరి వద్ద పెట్టుబడి పెట్టగా వారు ఇచ్చిన మొత్తానికి 20నెలల్లో రెట్టింపు డబ్బులు చెల్లించారు. చిన్న మొత్తాలు పెట్టుబడిగా పెట్టిన ఇన్వెస్టర్లు లాభం ఇస్తున్నారని నమ్మి డబ్బు పెద్ద మొత్తంలో పెట్టడమే గాక ఇతరులతో పెట్టించారు. సదరు సంస్థవారు ఇతరులతో పెట్టుబడులు పెట్టిస్తే వారికి 5శాతం కమీషన్ సైతం ఇచ్చేవారు. దీంతో వారు తమ వ్యాపారాన్ని విస్తరించి మూడే బ్రాంచీలను ఏర్పాటు చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచే గాక రాష్ట్ర వ్యాప్తంగా ఇతర జిల్లాలకు చెందిన ప్రజలు సైతం పెట్టుబడులు పెట్టారు. అయితే గత మూడు నెలలుగా సదరు సంస్థ ఇన్వెస్టర్లకు చెల్లింపులు ఆపేసింది. ఈ విషయమై పలువురు సంస్థ కార్యాలయానికి వచ్చి ప్రశ్నించగా ఈనెల షేర్ మార్కెట్ బాగాలేదు త్వరలోనే చెల్లిస్తామని చెప్పారు. శుక్రవారం డబ్బులు చెల్లిస్తామని చెప్పడంతో కొందరు ఇన్వెస్టర్లు కార్యాలయానికి వచ్చారు. అప్పటికే ఆఫీసుకు తాళం వేసి ఉండటంతో నిర్వాహకులను ఫోన్ చేయగా ఎలాంటి సమాధానం రాలేదు. దీంతో తాము మోసపోయినట్లు గుర్తించిన బాధితులు జీడిమెట్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు.దీంతో పోలీసులు డిపాజిట్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. బాధితులు సంఖ్య పెరిగితే కేసును ఈవోడబ్ల్యూఎస్‌కు బదిలీ చేస్తామని పోలీసులు తెలిపారు. కాగా 1500 మందికి పైగా సదరు సంస్థలో రూ.100 కోట్లకు పైగా పెట్టుబడి పెట్టినట్లు సమాచారం. నిందితుల్లో ఒకరిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



సాక్షి,సిటీబ్యూరో: లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి హెచ్చరించారు. స్కానింగ్ సెంటర్లలో అర్హులైన డాక్టర్లు , అనుమతి పొందిన స్కానింగ్ మిషన్లు మాత్రమే ఉండాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాలపై డెకాయ్ ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని, ఇందుకోసం 15 ప్రత్యేక బందాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. సికింద్రాబాద్ లోని న్యూ లైఫ్ ఆసుపత్రిలో అనుమతి లేని స్కానింగ్ మిషన్ ను గుర్తించి సీజ్ చేసి యాజమాన్యంపై ను నమోదు చేయాలని, సైదాబాద్‌లోని వివేకా సుపత్రిలో అనుమతి లేకుండా రెండు స్కానింగ్ మిషన్లు ఏర్పాటు చేసినందుకు రూ.2లక్షలు జరిమానా విధించాలని ఆదేశించారు. నిబంధనలు ఉల్లంఘించిన 26 స్కానింగ్ సెంటర్లకు రూ.50 వేల చొప్పున జరిమానా విధించాలన్నారు. నిబంధనలు అతిక్రమించిన స్కానింగ్ సెంటర్ల రిజిస్ట్రేషన్ రద్దు చేయాలన్నారు. సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు జిల్లా ప్రోగ్రాం అధికారులు అన్ని స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేసి నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్టరీత్యా కేసులు నమోదు చేయాలన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షల సమాచారంపై టోల్ ఫ్రీ నెంబర్ 1800 599 3366 ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ వెంకటి, ఏసీపీ వెంకటేశ్వర్ రెడ్డి స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి వందన, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్లు, జిల్లా మీడియా అధికారి జక్కుల రాములు, టి నరసింహ, అంజయ్య గౌడ్ పాల్గొన్నారు.

రూ.21 వేలతో మొదలుపెట్టి
రూ.61 లక్షలు టోకరా!

ఆన్‌లైన్ ద్వారా ఎర వేసిన సైబర్ నేరగాళ్లు

- ట్రేడింగ్‌లో లాభాలంటూ స్వాహా
- యాప్‌లో బ్యాలెన్స్ చూపిస్తూ వ్యవహారం
- కేసు నమోదు చేసుకున్న సైబర్ క్రైమ్ పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: నగరానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగికి ఆన్‌లైన్ ద్వారా ఎర వేసిన సైబర్ నేరగాళ్లు ట్రేడింగ్ పేరుతో నిండా ముంచారు. భారీ లాభాలు వస్తాయంటూ ఆశపెట్టి, రూ.21 వేలతో మొదలుపెట్టి, వర్చువల్ ఖాతాలో బ్యాలెన్స్ చూపించి రూ.61 లక్షలు స్వాహా చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు శుక్రవారం కేసు నమోదు చేసుకున్న సిటీ సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సికింద్రాబాద్‌కు చెందిన బాధితుడికి (68) ఆన్‌లైన్‌లో వచ్చిన ఎక్స్‌పర్ట్స్ ప్రో లిమిటెడ్ ప్రకటన కనిపించింది. బులియన్ మార్కెట్.కామ్ అనే వెబ్‌సైట్ ద్వారా ట్రేడింగ్ చేస్తే భారీ లాభాలు ఉంటాయని అందులో ఉంది. దీనికి ఆకర్షితుడైన అతను ఆ సంస్థకు చెందిన యాప్‌ను లింకు ద్వారా డౌన్‌లోడ్ చేసుకున్నారు. దీని ద్వారా వర్చువల్ ట్రేడింగ్ అకౌంట్ తెరిచాడు. తొలిసారిగా ఈ ఏడాది మార్చి 27న రూ.21 వేలు పెట్టుబడి పెట్టారు. ఆపై బాధితుడితో ఫోన్ ద్వారా సంప్రదింపులు జరిపిన నేరగాళ్లు స్థానిక మార్కెట్ కాకుండా అంతర్జాతీయ ట్రేడింగ్ చేస్తే డాలర్లలో లాభాలు వస్తాయని, అందుకు అవసరమైన సలహాలు సూచనలు తామే ఇస్తామని నమ్మించారు. ఇలా కొంత పెట్టుబడి పెట్టించిన తర్వాత ఆయా స్టాక్‌లకు సంబంధించిన మార్జిన్ వాల్యూస్ పడిపోతున్నాయని, లాభాలు పొందటంతో పాటు ఉన్న నిధులు కోల్పోకుండా ఉండాలంటే మరికొంత మొత్తం పెట్టుబడిగా పెట్టాలని భయపెట్టారు. ఆ మొత్తం పెట్టిన బాధితుడు తనకు ట్రేడింగ్‌లో ఆసక్తి లేదని, తనకు ఉన్న నిధులు డ్రా చేసుకుని నిష్క్రమించాలని భావిస్తున్నట్లు నేరగాళ్లకు చెప్పాడు. దీనికి అనుమతించని వారు మరికొంత పెట్టుబడి పెట్టాలని బెదిరించారు. తన వద్ద ఉన్న మొత్తం ఇన్వెస్ట్ చేసిన బాధితుడు ఇకపై తాను పెట్టుబడి పెట్టలేనని స్పష్టం చేశాడు. అయినా వారి ఫోన్లు, ట్రేడింగ్ కొనసాగింది. ఈ నెల 21న బాధితుడు తన కుటుంబంతో కలిసి వేరే ఊరు వెళ్లారు. అలా వెళ్తున్న విషయం నేరగాళ్లకు చెప్పి, తన ట్రేడింగ్ ఖాతా నిర్వహించమని కోరారు. అందుకు అంగీకరించిన వారు అతను తిరిగి వచ్చేలోపు అనేక ఫోన్లు చేశారు. ఇంటికి చేరుకున్న బాధితుడు వారిని సంప్రదించగా... అత్యవసరంగా రూ.10 లక్షలు చెల్లించకపోతే ట్రేడింగ్ ఖాతానే కోల్పోవాల్సి వస్తుందని బెదిరించారు. ఈ నేపథ్యంలో వారి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి బాధితుడు చెల్లింపులు ఆపేశాడు. కొన్ని రోజులకు బాధితుడికి ఫోన్ చేసిన మరో నేరగాడు కోల్పోయిన నిధులను తిరిగి వచ్చేలా చేస్తానని నమ్మించాడు. దీనికోసం నామమాత్రం పెట్టుబడి పెట్టాలని, ట్రేడింగ్ యాప్‌లో 75 వేల అమెరికన్ డాలర్లు (రూ.64.16 లక్షలు) ఉన్నాయని చూపించాడు. కొన్నాళ్లుగా ట్రేడింగ్ చేయకపోవడంతో ఆ ఖాతా లాక్ అయిందని, ఆ మొత్తం విత్‌డ్రా చేసుకోవాలంటే అన్‌లాక్ చేయించాలన్నాడు. ఈ పేరుతో మరికొంత మొత్తం స్వాహా చేశారు. ఇలా మొత్తం రూ.61.95 లక్షలు సైబర్ నేరగాళ్లకు చెల్లించిన బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించారు. దీంతో సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆన్‌లైన్‌లో ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న అధికారులు దర్యాప్తు ప్రారంభించారు.

నగరంలో నేడు

- మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మిస్‌వరల్డ్ 2025 పోటీల గ్రాండ్ ఫైనల్ పోటీలు మధ్యాహ్నం 2 గంటల నుంచి జరుగుతాయి.
- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని తాజ్ కృష్ణా హోటల్‌లో ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సూత్రా ఇండియన్ ఫ్యాషన్ ఎగ్జిబిషన్ అందుబాటులో ఉంటుంది.
- మిస్ వరల్డ్ ప్రారంభ వేడుకల్లో భాగంగా గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జానపద కళాకారుల ప్రదర్శన జరుగుతుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో వేసవి సెలవుల సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం1 గంట వరకు సమ్మర్ ఆర్ట్ క్యాంప్ జరుగుతుంది.
- మాదాపూర్‌లోని స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో ఆలిండియా ఆర్ట్ కాంపిటీషన్ ఎగ్జిబిషన్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- పుణ్యశ్లోక, రాజమాత అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సాయంత్రం 4 గంటలకు కవాడిగూడ ప్రధాన రోడ్డులోని సీజీవో టవర్స్ నుంచి శోభాయాత్ర జరుగుతుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

గ్రామీణ పరిస్థితులపై మరింత అధ్యయనం జరగాలి



మాట్లాడుతున్న మంత్రి సీతక్క

సనత్‌నగర్: గ్రామీణ ప్రాంత స్థితిగతులపై మరిన్ని అధ్యయనాలు జరగాలని, వాటి ఆధారంగానే ప్రభుత్వం ప్రత్యేక పాలసీలను తీసుకువచ్చి బడ్జెట్ కేటాయింపులు చేసేందుకు ఆస్కారం ఉంటుందని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం బేగంపేటలోని సెస్ ఆడిటోరియంలో సెంటర్ ఫర్ ఎకనామిక్ అండ్ సోషల్ స్టడీస్ (సెస్) ఆధ్వర్యంలో ఆరోగ్యం, పోషకాహారం , విద్యాభ్యాసం, నైపుణ్యాలు, ఉపాధి, సామాజిక-భావోద్వేగ అభివృద్ధి, పని, కుటుంబ జీవితాలు, గృహ లక్షణాలు తదితర అంశాలపై చేపట్టిన అధ్యయనాలకు సంబంధించి ఫ్యాక్ట్ షీట్స్‌ను విడుదల చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సీతక్క మాట్లాడుతూ సెస్ ఆధ్వర్యంలో చేస్తున్న సర్వేలు, అధ్యయనాలు ప్రభుత్వాలకు మార్గనిర్దేశం చేస్తాయన్నారు. సమాజ పరిస్థితులు ఏ విధంగా ఉన్నాయో ఈ అధ్యయనాలు తెలియజేస్తాయని తద్వారా ప్రభుత్వం బడ్జెట్‌లో ఎంత మేర కేటాయించాలనేది స్పష్టత వస్తుందన్నారు. ప్రభుత్వం తరుపున గిరిజన ప్రాంతాల్లోని 14-18 ఏళ్ల లోపు చిన్నారులకు చిక్కీల రూపంలో బలవర్ధకమైన ఆహారాన్ని అందించే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజలకు ఏది అవసరమో గుర్తించి ఇంకా ఎక్కడ మెరుగ్గా ఉండాలో తెలుసుకుని సమాజంలో అంతరాలను తగ్గించుకుంటూ వెళ్తామన్నారు. అడవిలో పండే ప్రతిదీ అమృతమేనని, సహజసిద్ధంగా పండే పండ్లతోనే ఆరోగ్యంగా ఉంటారన్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నేటితరం రకరకాల జబ్బుల బారిన పడుతున్నారని ఇందుకు మన తీసుకునే ఆహారమే కారణమన్నారు. కార్యక్రమానికి ఇక్ఫాయ్ స్కూల్ ఆఫ్ సోషల్ సైన్సెస్ విశిష్ట ప్రొఫెసర్ మహేంద్రదేవ్ అధ్యక్షత వహించగా ఆర్థిక శాఖ ప్రధాన కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, మహిళా అభివృద్ధి, శిశు, సంక్షేమ కమిషనర్ నిర్మల కాంతివెస్లీ, ఎన్‌హెచ్‌ఎం సీపీఓ డాక్టర్ పద్మజ, సెస్ డైరెక్టర్ ప్రొఫెసర్ రేవతి, ఇతర ప్రభుత్వ అధికారులు, విద్యావేత్తలు, పరిశోధకులు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటోను ఢీ కొన్న రెడీ మిక్స్ లారీ

- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం
- 11 మంది వలస కూలీలకు గాయాలు



దిల్‌కుష్ కుమార్ (ఫైల్)

గచ్చిబౌలి: రెడీమిక్స్ లారీ టాటా ఏసీ ట్రాలీ ఆటోను ఢీ కొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. 11 మందికి గాయాలైన సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఎన్‌టీఆర్‌నగర్‌లో చోటు చేసుకుంది. ఎస్ఐ మహేష్ గౌడ్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. శుక్రవారం ఉదయం గోపన్‌పల్లి ఎన్‌టీఆర్‌నగర్‌లో లేబర్ అడ్డా వద్ద కూలీలను ఎక్కించుకుని టాటా ఏసీ ట్రాలీ ఆటో వట్టినాగులపల్లి వైపు వెళుతోంది. కొద్ది దూరం వెళ్లగానే వెనక నుంచి వేగంగా వచ్చిన రెడిమిక్స్ లారీ ఢీ కొట్టింది. దీంతో ట్రాలీ ఆటో పల్టీ కొట్టి డివైడర్ వరకు దూసుకువెళ్లడంతో అందులో ప్రయాణిస్తున్నవారు ఎగిరి పడ్డారు. బీహార్‌కు చెందిన దిల్‌కుష్ కుమార్(22) తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు అతడిని సిటీజన్ హాస్పిటల్‌కు తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. దిల్‌కుష్‌కు భార్య, కుమార్తె ఉన్నారు.కర్నాటక చింబోలీకి చెందిన కీము(45) తీవ్ర గాయాలు కావడంతో మదీనగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అతని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ట్రాలీ ఆటో డ్రైవర్ దానాతో పాటు లక్ష్మణ్, సువాలీ, చాంధీ, జాను బాయ్, రవి నాయక్, పీరా, రాహుల్, చందు, నార్య, బాదల్ కుమార్‌కు గాయాలయ్యాయి. వారికి సమీపంలో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించి పంపారు. శ్రీ డెక్కన్ రెడీమిక్స్‌కు చెందిన లారీ డ్రైవర్ పరారీలో ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కొచ్చి నేషనల్ వర్సిటీ వీసీగా ఓయూ ప్రొ.జీబీ రెడ్డి



ఉస్మానియా యూనివర్సిటీ: కేరళలోని కొచ్చి నేషనల్ యూనివర్సిటీ ఆఫ్ అడ్వాన్స్ లీగల్ స్టడీస్ (ఎన్‌యూఏఎల్‌ఎస్) వీసీగా ఓయూ ప్రొ.జీబీ రెడ్డి నియమితులయ్యారు. వర్సిటీ క్యాంపస్ న్యాయ కళాశాల అధ్యాపకులుగా పని చేస్తున్న ఆయన ప్రస్తుతం దూరవిద్య కేంద్రం డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు. గతంలో న్యాయ కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు పలు పదవులను నిర్వహించారు. వీసీగా ప్రొ.జీబీ రెడ్డిని నియామకంపై ఓయూ వీసీ ప్రొ.కుమార్‌తో పాటు ఇతర అధికారులు హర్షం వ్యక్తం చేశారు.

విమాన ప్రయాణికుడి వద్ద గంజాయి పట్టివేత

శంషాబాద్: బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడి వద్ద గంజాయి పట్టుబడిన సంఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టులో చోటు చేసుకుంది. వివరాలివీ... గురువారం రాత్రి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న థాయి ఎయిర్‌వేస్‌కు చెందిన 329 విమానంలో వచ్చిన ప్రయాణికుడి కదలికలను అనుమానించిన అధికారులు అతడిని తనిఖీ చేయగా గంజాయి పట్టుబడింది. స్వాధీనం చేసుకున్న గంజాయి 10 కేజీల వరకు ఉండవచ్చునని సమాచారం. నిందితుడిని అదుపులోకి తీసుకున్న కస్టమ్స్ అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం కాపాడిన హైడ్రా

- శుక్రవారం ఒకేసారి రెండుచోట్ల అగ్ని ప్రమాదాలు
- సమాచారం అందటంతోనే రంగంలోకి డీఆర్‌ఎఫ్
- అమీర్‌పేటలో రాజేష్ అనే యువకుడి రెస్క్యూ



సాక్షి, సిటీబ్యూరో: హైడ్రా ఆధీనంలోని డిజాస్టర్ రెస్పాన్స్ టీమ్ (డీఆర్‌ఎఫ్) బృందాలు శుక్రవారం ఓ నిండు ప్రాణాన్ని కాపాడాయి. ఒకే సమయంలో రెండు చోట్ల అగ్ని ప్రమాదాలు జరగడంతో ఎక్కడికక్కడ ఈ బృందాలు రంగంలోకి దిగాయి. అమీర్‌పేటలో జరిగిన ప్రమాదం నుంచి రాజేష్‌ను (25) సురక్షితంగా బయటకు తీసుకువచ్చాయి. శుక్రవారం మధ్యాహ్నం అమీర్‌పేట, పటాన్‌చెరుల్లో ఒకే సమయంలో అగ్గి రాజుకుంది. సారథి స్టూడియో సమీపంలోని ఐదు అంతస్తుల దివ్య శక్తి అపార్ట్‌మెంట్స్ రెండో ఫ్లోర్‌లో మధ్యాహ్నం 3.30 గంటలకు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. అక్కడి ఓ డబ్బింగ్ స్టూడియోలో మంటలు అంటుకోగా... సమాచారం అందుకున్న హైడ్రా కంట్రోల్ రూమ్ డీఆర్‌ఎఫ్ బృందాలను హుటాహుటిన ఆ ప్రాంతానికి పంపింది. ఏసీ యూనిట్‌కు సంబంధించిన కంప్రెషర్ పేలడంతోనే మంటలు వ్యాపించినట్లు గుర్తించాయి. స్టూడియోలో చిక్కుకుపోయిన రాజేష్ చౌదరిని బయటకు తీసుకువచ్చాయి. ఈ మంటలు ఇతర అంతస్తులకు వ్యాపించకుండా డీఆర్‌ఎఫ్, ఫైర్ సిబ్బంది నిలువరించారు. స్టూడియోలో చిక్కుకున్న రాజేష్‌ను ల్యాడర్ ద్వారా వెళ్లి కాపాడిన డీఆర్‌ఎఫ్ సభ్యుడు శ్రీకాంత్‌ను కమిషనర్ ఏవీ రంగనాథ్ అభినందించారు. అలాగే... పటాన్‌చెరు పారిశ్రామికవాడలోని పాటి గ్రామంలో అను ఫర్నీచర్ గోదాంలోనూ అదే సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. అక్కడికి చేరుకున్న మూడు డీఆర్‌ఎఫ్ బృందాలు మంటల వ్యాప్తిని నిలువరించాయి.

మినీ సిలిండర్‌తో మోది యువకుడి హత్య



సాయి కార్తీక్ మృతదేహం

రాజేంద్రనగర్: తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో పాటు తన భార్య తన నుంచి దూరమయ్యేందుకు కారణమని భావించిన ఓ యువకుడు మరో యువకుడిని మినీ సిలిండర్‌తో తలపై మోది హత్య చేసిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై మామిడి కిశోర్ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజేంద్రనగర్ బుద్వేల్ ప్రాంతానికి చెందిన సాయి కార్తీక్ (31), నవీన్ స్నేహితులు. ఇద్దరూ ఓ నెట్‌వర్క్ కంపెనీలో పని చేస్తూ అద్దె గదిలో ఉంటున్నారు. అదే ప్రాంతంలో సిద్ధార్థ్ రెడ్డి తన భార్యతో కలిసి నివాసం ఉంటున్నాడు. సిద్ధార్థ్ రెడ్డి ర్యాపిడో డ్రైవర్‌గా పని చేస్తూ జీవనం సాగించేవాడు. సిద్ధార్థ్ రెడ్డి, సాయి కార్తీక్, నవీన్‌లకు స్నేహం కుదిరింది. ఈ నేపథ్యంలో వ్యక్తిగత అవసరాల నిమిత్తం సాయి కార్తీక్ సిద్ధార్థ్ రెడ్డి నుంచి రూ. 8 లక్షలు అప్పు తీసుకున్నాడు. డబ్బులు తిరిగి ఇవ్వాలని కోరగా కాలయాపన చేస్తున్నాడు. ఈ నేపథ్యంలో సిద్ధార్థ్ రెడ్డి భార్య గత నెలలో అతడితో గొడవ పడి వెళ్లిపోయింది. సాయి కార్తీక్ ఇందుకు కారణమని సిద్ధార్థ్ రెడ్డి భావించాడు. గురువారం రాత్రి ముగ్గురు కలిసి సాయి కార్తీక్ రూమ్‌లో మద్యం తాగారు. ఈ సందర్భంగా సాయి కార్తీక్, సిద్ధార్థ్ రెడ్డి మధ్య మాట మాట పెరిగింది. దీంతో నవీన్ జోక్యం చేసుకుని వారికి నచ్చజెప్పాడు. ఆ తర్వాత ముగ్గురూ కలిసి మళ్లీ వైన్స్ షాప్ వద్దకు వెళ్లి మద్యం కొనుగోలు చేసి గదికి వచ్చి మద్యం తాగారు. అనంతరం మరోసారి సాయి కార్తీక్, సిద్ధార్థ్ రెడ్డి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. నవీన్ సముదాయించేందుకు ప్రయత్నించగా సిద్ధార్థ్ రెడ్డి అతడిని బయటికి పంపించాడు. అర గంట తర్వాత నవీన్ రూమ్ గదికి వెళ్లి చూడగా సాయి కార్తీక్ రక్తపు మడుగులో పడి ఉన్నాడు. పక్కనే కూర్చుని ఉన్న సిద్ధార్థ్ రెడ్డిని ఏం జరిగిందని ప్రశ్నించగా మినీ సిలిండర్‌తో కొట్టి చంపేశానని... నిన్ను కూడా చంపుతానని దాడి చేసేందుకు ప్రయత్నించగా నవీన్ బయటికి పరుగులు తీశాడు. బుద్వేల్ ప్రధాన రహదారిపైకి వచ్చి స్థానికులకు ఈ విషయం చెప్పాడు. దీంతో వారు అక్కడికి వెళ్లి సిద్ధార్థ్ రెడ్డిని పట్టుకుని రాజేంద్రనగర్ పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు పంచనామా నిర్వహించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. సిద్ధార్థ్ రెడ్డిని అరెస్ట్ చేసి శుక్రవారం రిమాండ్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాలు



వేడుకల్లో పాల్గొన్న స్వామి....

రహమత్‌నగర్: సీఐటీయూ ఆవిర్భావ దినోత్సవాలు రహమత్‌నగర్ డివిజన్‌లో శుక్రవారం జూబ్లీహిల్స్ జోన్ సీఐటీయూ కన్వీనర్ జూకంటి స్వామి ఆధ్వర్యంలో ఘనంగా జరిగా యి. ఎస్పీఆర్ హిల్స్‌లో సీఐటీయూ జెండాను ఆవిష్కరించిన అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్వామి మాట్లాడుతూ కార్మికులు పక్షాన నిరంతరం పోరాడుతున్న సీఐటీయూ 1970లో ఏర్పాటైందన్నారు. దాదాపు 55 ఏళ్లుగా కార్మికుల సంక్షేమం కోసం పోరాడుతోందని పేర్కొన్నారు నాయకులు భాగ్యరాజ్, బాలయ్య, ఏఆర్ నరసింహ, లా లు, సమాదానం, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



చెక్కును అందజేస్తున్న సీఎస్ రెడ్డి

రహమత్‌నగర్: ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, కార్పొరేటర్ సి.ఎస్.రెడ్డి కోరారు. రహమత్‌నగర్‌కు చెందిన మల్లేశ్, హెచ్‌హెచ్‌నగర్‌కు చెందిన అమ్జద్‌లకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 1.20 లక్షలకు సంబంధించిన చెక్కులను ఆయన శుక్రవారం తన కార్యాలయంలో వారికి అందజేశారు. కాంగ్రెస్ నాయకులు శరీఫ్, మన్సూర్, నాగరాజు, అహ్మద్, శివ, పల్లె సాయి తదితరులు పాల్గొన్నారు.

'టౌన్ ప్లానింగ్' అక్రమాలపై విచారణ చేపట్టాలి: బీజేపీ

రహమత్‌నగర్: నిజానిజాలు తెలుసుకోకుండా అధికార కాంగ్రెస్ నాయకులు చెప్పిందే చేస్తున్న సర్కిల్–19 టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులు, సిబ్బంది వ్యవహార తీరు, వారి అక్రమాలపై విచారణ చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. బీజేపీ బోరబండ డివిజన్ అధ్యక్షుడు కొత్త వెంకటేశ్ ముదిరాజ్ శుక్రవారం ఇక్కడ మాట్లాడుతూ... కొంత కాలంగా సర్కిల్–19లోని టౌన్ ప్లానింగ్ అధికారుల తీరుపై తమ పార్టీకి పలు ఫిర్యాదు అందుతున్నాయన్నారు. సాంకేతిక అంశాలను సాకుగా చూపుతూ పేదల నివాసాలను ఇష్టారాజ్యంగా కూల్చి వేస్తున్నారని ఆయన ఆరోపించారు. కొంత మంది పంపిస్తున్న వాట్సాప్ ఫొటోల ఆధారంగా వారికి నోటీసులు ఇస్తున్నారని తెలిపారు. బీజేపీ తరఫున సమాచార హక్కు చట్టం ద్వారా ఆరు నెలలుగా ఎవరెవరు ఫిర్యాదు చేశారో వారి వివరాలు తెలుసుకుంటామని స్పష్టం చేశారు. జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు టౌన్ ప్లానింగ్ అధికారులపై విచారణ చేపట్టక పోతే బీజేపీ పక్షాన సర్కిల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు.

జూన్ 3 నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర స్వామి వారి ఆలయ 20వ వార్షిక బ్రహ్మోత్సవాలను జూన్ 3 నుంచి 7వ తేదీ వరకు ఘనంగా నిర్వహించనున్నట్లు హిమయత్‌నగర్ టీటీడీ టెంపుల్ ఏఈవో య.రమేష్ తెలిపారు. బ్రహ్మోత్సవాలకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం టీటీడీలో బ్రహ్మోత్సవాల దాత త్రినాథ్‌బాబు, అర్చకులు కృష్ణమాచార్యులు, ప్రతినిధులు శ్రీనివాస్ ప్రభు, హరికృష్ణలతో కలసి ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఏఈవో రమేష్ మాట్లాడుతూ... జూన్ 2న సాయంత్రం 6 నుంచి రాత్రి 9 గంటల వరకు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, జూన్ 3న ఉదయం 6.30 నుంచి 8.45 గంటల వరకు మిథున లగ్నంలో ధ్వజారోహణం, జూన్ 03న ఉదయం 10–11 గం.ల వరకు శేష వాహన సేవలు ఉంటాయన్నారు. రాత్రి 8 నుంచి 9 గంటల వరకు హనుమంత వాహనం, జూన్ 04న 8.30 గంటలకు సూర్యప్రభ వాహనం, రాత్రి 8 గంటలకు చంద్రప్రభ వాహనం, జూన్ 5వ తేదీ ఉదయం 8.30 గంటలకు గజ వాహనం, ఉదయం 10.30 గంటలకు శ్రీవారి శాంతి కల్యాణం, రాత్రి 8 గంటలకు గరుడ వాహనం , జూన్ 6న ఉదయం 8.30 గంటలకు రథోత్సవం, రాత్రి 8 గంటలకు అశ్వ వాహనం, జూన్ 7న ఉదయం 11.30 గంటలకు చక్రస్నానం, సాయంత్రం 06 గం.లకు పుష్పయాగం, రాత్రి 09 గం.లకు ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని తెలిపారు. రోజూ ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అన్నప్రసాద వితరణ జరుగనుందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం చలువ పందిళ్లు, తాగునీరు, ఆకర్షణీయంగా విద్యుత్ అలంకరణలు తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు.

1523 రేషన్‌కార్డుల తొలగింపు



రేషన్ తీసుకుంటున్న దృశ్యం

- పూర్తయిన సమగ్ర సర్వే
- కేంద్రానికి పంపించిన నివేదిక
- ఖైరతాబాద్ సర్కిల్‌లో మృతుల పేర్లు తొలగింపు

బంజారాహిల్స్: పౌర సరఫరాల శాఖ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధిలో రేషన్‌కార్డుల ఏరివేత ప్రక్రియ పూర్తయ్యింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కార్డుల ఏరివేతకు పౌర సరఫరాలు, రెవెన్యూ అధికారుల ఉమ్మడి పర్యవేక్షణలో ఇటీవలే సర్వే పూర్తయ్యింది.

- రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ, ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, వెంగళరావునగర్, బోరబండ, అమీర్‌పేట, ఎర్రగడ్డ, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో ఉన్న 81 రేషన్ దుకాణాల పరిధిలో 1523 కార్డులను వివిధ కారణాలతో ఏరివేశారు. రెండేళ్లుగా రేషన్ తీసుకోని కార్డుదారుల వివరాలను కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఖైరతాబాద్ సర్కిల్ కార్యాలయానికి అందజేసింది.
- ఖైరతాబాద్ సర్కిల్‌లోని 81 రేషన్ దుకాణాల పరిధిలో ఆర్ఐలు ఇటీవలనే ఈ జాబితా ప్రకారం సర్వే పూర్తి చేశారు. ఇందులో కొంతమంది మృతి చెందడం, మరికొంతమంది కార్డులు వేర్వేరు రాష్ట్రాల్లో ఉండటం, ఇంకొంతమంది రెండేళ్లుగా రేషన్ తీసుకోకపోవడం తదితర కారణాలతో వీటిని తొలగించడం జరిగింది. అయితే కేంద్ర ప్రభుత్వం అందజేసిన జాబితా ప్రకారం కార్డుదారుల ఇంటికి వెళ్లిన అధికారులు వారి వివరాలను పూర్తిగా సేకరించి రేషన్ ఎందుకు తీసుకోవడం లేదో వివరాలు నమోదు చేసుకున్నారు. మృతి చెందితే ఎప్పుడు మృతి చెందారు అన్నది రాసుకున్నారు. రెండు చోట్ల కార్డులు ఉంటే అది నిజమేనా..? కాదా..? అని పరిశీలించి ఆ మేరకు రేషన్ కార్డులను తొలగిస్తూ తిరిగి కేంద్ర ప్రభుత్వానికి సర్వే వివరాలను పంపించారు. త్వరలోనే కేంద్ర ప్రభుత్వం వీరికి సంబంధించి ఉత్తర్వులను జారీ చేయనుంది.
- సర్కిల్–7 పరిధిలో 81 రేషన్ దుకాణాలు ఉండగా, ఇందులో తెల్ల రేషన్‌కార్డులు 79,531 మంది, అంత్యోదయ అన్న యోచన కార్డుదారులు 3481 మంది, అన్నపూర్ణ కార్డు 1 ఉన్నాయి.
- మొత్తం 83,013 ఆహార భద్రత కార్డులు ఉండగా ఇందులో 2,92,882 మంది లబ్ధిదారులు ప్రతినెలా ఒక్కొక్కరికి ఆరు కిలోల చొప్పున ఉచిత సన్నబియ్యం పంపిణీ జరుగుతుంది.
- సర్కిల్ పరిధిలో ప్రతినెలా 18,19,011 కిలోల రేషన్ బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారు.
- ఇదిలా ఉండగా కొంతమంది రేషన్ తీసుకోవడం లేదని కేంద్ర ప్రభుత్వానికి సమాచారం ఉంది. అసలు కారణాలు తెలుసుకోవడానికి అధికారులు ప్రయత్నాలు మొదలుపెట్టారు.
- ఇప్పటికే డీలర్లు తమ పరిధిలోని కార్డుల వివరాలు అందజేశారు. రేషన్ తీసుకోని వారు సర్కిల్ పరిధిలో ఎంతమంది ఉన్నారనే విషయంపై ఇప్పటికే స్పష్టత వచ్చింది.
- ప్రభుత్వం ఏప్రిల్ నుంచి సన్నబియ్యం సరఫరా చేయడంతో రేషన్ తీసుకునే వారి శాతం అమాంతం పెరిగినట్లు డీలర్లు చెబుతున్నారు.
- కేంద్రం రెండేళ్ల నుంచి ఆధార్ కార్డు ఆధారంగా రేషన్ తీసుకోని వారి జాబితాను జిల్లా పౌర సరఫరా శాఖ అధికారులకు అందజేయడం, సర్వే చేయాలని ఖైరతాబాద్ సర్కిల్‌కు ఆదేశాలు రావడంతో ఈ మేరకు పక్కా పారదర్శకంగా ఈ సర్వేను అధికారులు పూర్తి చేశారు.
- కేంద్రం నుంచి వచ్చిన సమాచారం మేరకు రేషన్ తీసుకోని వారి జాబితాపై విచారణ జరిపినట్లు అధికారులు తెలిపారు.
- ఆధార్ నమోదు సక్రమంగా లేనివి, ఇతర కారణాల వల్ల రేషన్ తీసుకోని వారి వివరాలను సేకరించారు. జాబితాలోని కార్డుదారులను విచారించి చర్యలకు ఉపక్రమించారు.

17 రేషన్ దుకాణాలు ఖాళీ

సమీప షాపులకు కార్డుదారులు కేటాయింపు

బంజారాహిల్స్: రేషనింగ్ ఖైరతాబాద్ సర్కిల్–7 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, సోమాజిగూడ,ఖైరతాబాద్, యూసుఫ్‌గూడ, రహమత్‌నగర్, ఎర్రగడ్డ, బోరబండ, వెంగళరావునగర్, అమీర్‌పేట డివిజన్ల పరిధిలో 17 రేషన్ దుకాణాలు వివిధ కారణాల వల్ల మూసివేశారు. కొందరు డీలర్లు రాజీనామా చేయడం, మరికొంతమంది డీలర్లు మృతి చెందడం, శాఖాపరమైన చర్యల్లో భాగంగా కొన్నింటినీ సస్పెండ్ చేయడం తదితర కారణాలతో మొత్తం 17 షాపులు మూసివేశారు. మూసివేసిన షాపుల పరిధిలో ఉన్న రేషన్ కార్డు లబ్ధిదారులను సమీపంలోని రేషన్ షాపులకు కేటాయించారు. సర్కిల్ పరిధిలో ఇంత పెద్ద ఎత్తున రేషన్ షాపులు ఖాళీగా ఉండడం వల్ల లబ్ధిదారులు దూర ప్రాంతాలకు వెళ్లి రేషన్ బియ్యం తీసుకోవాల్సి వస్తోంది.



మూసివేసిన	కేటాయించిన
702	800
708	783
731	813
752	806
753	704
755	768
757	720
761	811
770	719
772	762
775	773
780	778
781	756
796	814
805	828
807	788
829	750

ఎలా నడవాలి సారూ..!



కేబీఆర్ పార్కు ఫుట్‌పాత్‌పై నడవలేని పరిస్థితులు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కు ప్రధాన ద్వారం ముందు ఫుట్‌పాత్‌పై నడవలేని పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఫుట్‌పాత్ రెండువైపులా వివిధ పార్టీలకు చెందిన భారీ రౌండ్ ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండటం వల్ల వీటి వైర్లను నేరుగా ఫుట్‌పాత్ రెయిలింగ్‌తో పాటు దిమ్మెలకు చుట్టేస్తున్నారు. ఫలితంగా పాదచారులు నడవలేని పరిస్థితులు తలెత్తుతున్నాయి.

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిత్యం రాకపోకలు సాగించే కేబీఆర్ పార్కు రోడ్డులోని విశాలంగా, సౌకర్యవంతంగా ఉన్న ఫుట్‌పాత్‌లు పాదచారులకు నడవలేని పరిస్థితులను తెచ్చిపెడుతున్నాయి. రాజకీయ పార్టీల నేతలు ఇష్టారాజ్యంగా ఇక్కడ రౌండ్ ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తున్నారు.
- కార్యకర్తలు సైతం భారీ ఫ్లెక్సీలు ఏర్పాటుచేస్తూ స్థానికంగా అపరిశుభ్రతకు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణలకు తెగిస్తున్నారు. ఏ పదవీ లేనివాళ్లు కూడా పుట్టిన రోజులు, ఇతరత్రా కార్యక్రమాలకు సంబంధించిన ఫ్లెక్సీలు అడ్డదిడ్డంగా ఏర్పాటుచేస్తున్నారు. రోజుల తరబడి ఇవి అలాగే ఉంటున్నాయి. హైడ్రా, డీఆర్ఎఫ్ వాహన సిబ్బంది కూడా ఇక్కడే ఉంటున్నా వారెవరూ వీటిని తొలగించడం లేదు. వీటిని తాము తొలగిస్తే రాజకీయ పార్టీ నేతల నుంచి బెదిరింపులు వస్తున్నాయని డీఆర్ఎఫ్ సిబ్బంది వాపోతున్నారు.
- కేబీఆర్ పార్కుకు రోజూ వందల సంఖ్యలో సందర్శకులు, వాకర్లు వస్తుంటారు. వీరంతా ఇదే ఫుట్‌పాత్‌పై నడవాల్సి ఉండగా అడ్డంగా కట్టిన వైర్లు, తాళ్లు, ఇతరత్రా బ్యానర్లు, ఫ్లెక్సీలతో రోడ్డెక్కాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. కేబీఆర్ పార్కు ప్రధాన గేటు పరిసరాలను ఫ్లెక్సీ రహిత ప్రాంతంగా ప్రకటించాలని వాకర్లు డిమాండ్ చేస్తున్నారు.
- ఇక్కడ ఫ్లెక్సీలు గాలి దుమారానికి కిందపడి పోయి వాహనదారులు గాయాలపాలైన ఘటనలు కూడా చోటుచేసుకున్నాయి. ఫుట్‌పాత్‌పై కట్టిన వైర్ల వల్ల రాత్రిపూట ఇక్కడ నడిచేవారు ఏ క్షణంలో మెడ తెగుతుందోనని బిక్కుబిక్కుమంటూ నడవాల్సి వస్తోంది.
- జీహెచ్‌ఎంసీ అసమర్థతకు కేబీఆర్ పార్కు పరిసరాలు నిలువెత్తు దర్పణంగా నిలుస్తున్నాయని వాకర్లు, పాదచారులు మండిపడుతున్నారు. ప్రభుత్వ తీరును ఎండగడుతున్నారు. కొత్త జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఇక్కడ పర్యటించి పరిస్థితులను సమీక్షించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ధనలక్ష్మి సోనాబాయి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ఆలయ నూతన కమిటీ సభ్యులు

శ్రీనగర్‌కాలనీ: శ్రీ ధనలక్ష్మి సోనాబాయి దేవాలయ నూతన కమిటీని శుక్రవారం నియమించారు. ఎల్లారెడ్డిగూడకు చెందిన చిన్నా ముదిరాజ్ చైర్మన్‌గా, కమిటీ మెంబర్లుగా ఎన్.మధుర, వి.కృష్ణమోహన్, ఎ.హరిశంకర్‌గౌడ్, ఎం.అనిల్‌కుమార్, ఎస్.విజయ్‌యాదవ్, ఎక్స్ అఫిషియో మెంబర్‌గా మధుసూదన్‌రావులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈఓ నరేందర్‌రెడ్డి, సికింద్రాబాద్ థర్డ్ డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మధు, కార్పొరేటర్ వనం సంగీత, మాజీ ఎంపీ మహమ్మద్ అజహరుద్దీన్ కుమారుడు అసద్ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని నూతన కమిటీ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో నేతలు వనం శ్రీనివాస యాదవ్, కిరణ్‌యాదవ్, శరత్‌గౌడ్, గణేష్, నాగరాజు, మహేష్ ముదిరాజ్, చినబాబు, నరేష్ నరికెళ్ల, ప్రసాద్‌యాదవ్, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్ రిటైర్డు ఉద్యోగులకు యాజమాన్యం అండ

లక్డీకాపూల్: నిమ్స్ విశ్రాంత ఉద్యోగులకు యాజమాన్యం అన్ని విధాలా అండగా ఉంటుందని డైరెక్టర్ ప్రొఫెసర్ నగరి బీరప్ప తెలిపారు. వారి సమస్యలు ఏవైనా తన దృష్టికి వచ్చిన తక్షణమే పరిష్కరించడానికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. నిమ్స్ ఆవరణలో ఏర్పాటు చేసిన నిమ్స్ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం (నిమ్స్ రేవా) కార్యాలయాన్ని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... ఇటీవల కాలంలో నిమ్స్‌లో పెద్ద ఎత్తున ఉద్యోగులు పదవీ విరమణ చేస్తున్న నేపథ్యంలో వారికి ఒక కార్యాలయాన్ని కేటాయించాలని చాలా రోజుల నుండి రేవా నాయకుల కోరిక మేరకు నిమ్స్ సెక్యూరిటీ ఆఫీస్ పక్కన ప్రత్యేక కార్యాలయాన్ని కేటాయించినట్లు తెలిపారు. నిమ్స్ రేవా అధ్యక్ష, కార్యదర్శులు హరినాథ్ బాబు, రామరాజు శరత్ మాట్లాడారు.



ఆందోళనకరంగా నోటి కేన్సర్ కేసులు

బంజారాహిల్స్: దేశంలో ప్రతి సంవత్సరం పెరుగుతున్న నోటి కేన్సర్ కేసులు ఆందోళనకరంగా ఉన్నాయని అపోలో ఆస్పత్రి అంకాలజీ వైద్యులు అర్షద్ హకీం అన్నారు. శుక్రవారం అపోలో ఆస్పత్రిలో అంకాలజీ వైద్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఓరల్ కేన్సర్‌ను ముందుగానే గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని అన్నారు. ఇషా ఫౌండేషన్ సహకారంతో అపోలో ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ స్క్రీనింగ్ క్యాంపులను ఏర్పాటు చేస్తామని అన్నారు. ప్రతియేటా ప్రపంచ వ్యాప్తంగా నమోదు అవుతున్న నోటి కేన్సర్ కేసులలో మూడింట ఒక వంతు భారత దేశంలోనే నమోదవుతున్నాయని అన్నారు. ప్రతియేటా 77 వేల కేసులు నమోదు అవుతుండగా 52 వేల మంది మరణిస్తున్నారని అన్నారు. పొగాకు వినియోగం వల్ల కలిగే నష్టాలపై విస్తృతంగా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని యాన ఆయన అన్నారు. ఓరా లైఫ్ పేరుతో తాము పోయాక్టివ్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ద్యులు రవీందర్ బాబు, ఉమానాథ్ నాయక్, డాక్టర్ సుధీర్ తదితరులు పాల్గొన్నారు.



అపోలో ఆస్పత్రిలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైద్యులు

సర్దార్‌కు కొవ్వొత్తులతో నివాళి

రహమత్‌నగర్: బీఆర్ఎస్ మైనార్టీవింగ్ డివిజన్ అధ్యక్షుడు మహ్మద్ సర్దార్ మృతికి కారకులను పోలీసులు తక్షణం అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని అఖిల పక్షం నేతలు డిమాండ్ చేశారు. సర్దార్ మృతికి సంతాపంగా బోరబండలోని ఎస్ఆర్‌టీనగర్‌లో అఖిలపక్ష నేతలు శుక్రవారం రాత్రి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నివాళులు అర్పించారు. ర్యాలీలో అఖిలపక్ష నేతలతోపాటు పలువురు ముస్లిం మత పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుమార్తెను అమెరికా నుంచి రప్పించాలని తండ్రి వేడుకోలు

పంజగుట్ట: భర్త పెట్టే చిత్రహింసలు భరించలేక, అమెరికాలో చిక్కుకున్న తన కుమార్తెను కాపాడాలని ఓ తండ్రి వేడుకుంటున్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బాధితుడు గులాం అఫ్జల్, న్యాయవాది విజయ్‌కుమార్ మాట్లాడుతూ... తన కూతురు ఫాతిమా హస్నాకు 2007లో గుల్బర్గాకు చెందిన డబీరుద్దీన్ అనే డాక్టర్‌తో వివాహం జరిగిందన్నారు. వివాహం అయిన తరువాత అమెరికాకు వెళ్లిపోయి అక్కడ 58 రోజులపాటు బాగానే ఉన్నారని తెలిపారు. తరువాత డబీరుద్దీన్ కేవలం అమెరికా వెళ్లేందుకే ఫాతిమాను వివాహం చేసుకున్నట్లు తెలియడంతో ఇద్దరి మధ్య తగాదాలు జరిగాయని తెలిపారు. దీంతో వెంటనే ఆమె భారతదేశానికి వచ్చి అతనిపై కేసులు వేసి చట్టపరంగా విడాకులు తీసుకున్నారని తెలిపారు. ఉద్యోగ నిమిత్తం తిరిగి అమెరికాకు వెళ్లిన ఫాతిమాను డబీరుద్దీన్ వేధింపులకు గురిచెయ్యడమే కాకుండా ఆమెపైనే తనను మోసం చేసి అమెరికాకు తీసుకువచ్చిందని అమెరికాలో తప్పుడు కేసులు పెట్టాడని తెలిపారు. దీంతో అమెరికా చట్టం ప్రకారం ఆమెపై కేసు నమోదు చేసి డబీరుద్దీన్‌కే భరణం ఇవ్వాలని చెప్పడంతో గత 10 సంవత్సరాల నుంచి ఫాతిమా ఉద్యోగం చేసుకుంటూ భరణం ఇస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెపై కేసులు ఉండటంతో ఇండియాకు రాలేని పరిస్థితి ఉందని అటు భరణం ఇవ్వలేక తన పింఛన్ డబ్బులు కూడా పంపించాల్సి వస్తుందని గులాం అఫ్జల్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తన కుమార్తెను భారత్‌కు రప్పించాలని, అలానే డబీరుద్దీన్‌పై కూడా ఇక్కడ తన కూతురు పెట్టిన కేసులు ఉన్నందున అతన్ని కూడా ఇండియాకు రప్పించాలని విజ్ఞప్తి చేశారు.

ఏసీ పైపులు చోరీ చేసిన బాలుడి అరెస్ట్

హిమాయత్‌నగర్: ఎయిర్ కండిషనర్ (ఏసీ) పైపులు చోరీ చేసిన ఓ నిందితుడిని అరెస్ట్ చేసిన సంఘటన నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. డీఎస్ఐ వెంకటేశ్ సమాచారం మేరకు... చెడు వ్యసనాలకు అలవాటు పడ్డ కాచిగూడలోని రైల్వేస్టేషన్ సమీపంలోని ఫుట్ పాత్ ఉండే మైనర్ బాలుడు(17) దొంగతనాలు చేయడం మొదలు పెట్టాడు. ఈ క్రమంలో హిమాయత్‌నగర్‌లోని ఆల్మండ్ స్వీట్ హౌస్‌కు సంబంధించిన సుమారు రూ. 10 వేల విలువైన ఏసీ పైపులను కట్ చేసి తీసుకెళ్లి వాటిని విక్రయించగా వచ్చిన డబ్బులతో జల్సాలు చేశాడు. స్వీట్ హౌస్‌లో ఏసీలు పనిచేయకపోవడంతో అనుమానం వచ్చి అందులో పనిచేసే సిబ్బంది ఏసీ పైపులను పరిశీలించగా కనిపించక పోవడంతో మేనేజర్ దేవ్ నారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన పోలీసులకు ఫిర్యాదు చేయడంలో క్రైం పోలీస్ సిబ్బంది సంఘటన స్థలంలో ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా ఈ మైనర్ బాలుడు తస్కరించినట్లు గుర్తించారు. శుక్రవారం మైనర్ బాలుడిని అరెస్ట్ చేసి జువైనల్ హోంకు తరలించారు. ఆల్మండ్ స్వీట్ హౌస్ మేనేజర్ దేవ్ నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్ఐ వెంకటేశ్ తెలిపారు.

అపార్ట్‌మెంట్‌లో అగ్ని ప్రమాదం

రూ. 10 లక్షల ఆస్తి నష్టం



ఎగిసిపడుతున్న మంటలు

వెంగళరావునగర్: మధురానగర్‌కాలనీలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుని దాదాపు రూ. 10 లక్షల ఆస్తి నష్టం సంభవించింది. ఫిల్మ్‌నగర్ ఫైర్ ఇన్‌స్పెక్టర్ రమేష్ తెలియజేసిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మధురానగర్ కాలనీలోని దివ్యశక్తి అపార్ట్‌మెంట్స్‌లోని సెకండ్ ఫ్లోర్ 201 ఇంటిని కూకట్‌పల్లికి చెందిన కిశోర్ అనే వ్యక్తి కిరాయికి తీసుకుని కొంతకాలంగా డబ్బింగ్ స్టుడియో నడుపుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం స్టుడియోలోని ఏసీ కంప్రెషర్ ఒత్తిడి కారణంగా ఒక్కసారిగా పేలిపోయింది. అందులో పనిచేస్తున్న ఇద్దరు యువకులు భయపడి బయటకు పరుగులు తీశారు. అగ్ని ప్రమాద విషయాన్ని తెలుసుకుని ఫిల్మ్‌నగర్ ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనా స్థలానికి వచ్చి మంటలను అదుపు చేయడం జరిగింది. ఈ ప్రమాదంలో కొన్ని సిస్టమ్స్, యూపీఎస్‌లు దగ్ధం అయ్యాయి. విషయాన్ని స్టుడియో ఓనర్ కిశోర్‌కు తెలియజేసి, నష్టాన్ని ప్రాథమిక అంచనా వేయగా దాదాపు రూ. 10 లక్షలు నష్టం వాటిల్లినట్టు తెలియజేశారు. మధురానగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెట్ల కొమ్మలు తొలగించే పనుల పరిశీలన

హిమాయత్‌నగర్: హిమాయత్‌నగర్‌లోని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆలయ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ ఏడాది కూడా అట్టహాసంగా నిర్వహించుకునేలా చర్యలు చేపట్టినట్లు కాంగ్రెస్ పార్టీ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జి.రామన్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఏర్పాట్లలో భాగంగా బాలాజీ భవన్, హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెం.1 లో ఉన్న వీధి దీపాలు, మ్యాన్ హోల్స్, అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించే పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రామన్ గౌడ్ మాట్లాడుతూ... భక్తులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు.

మూడు శ్రీగంధం చెట్ల నరికివేత

వెంగళరావునగర్: కేంద్ర ప్రభుత్వ శిక్షణ కేంద్రంలో గ్రంధం చెట్లు నరికివేసి ఎత్తుకెళ్లిన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల సమాచారం మేరకు... యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ మైక్రో స్మాల్ అండ్ మీడియం ఎండర్‌ప్రైజెస్ (నిమ్స్ మే) కేంద్ర ప్రభుత్వ శిక్షణ కేంద్రం ప్రాంగణంలో లక్షలాది రూపాయల విలువజేసే పలు శ్రీగంధం చెట్లు పెరుగుతున్నాయి. శుక్రవారం విధులకు వచ్చిన తోటమాలి సతీష్ వాలీబాల్ కోర్టు సమీపంలో మూడు శ్రీగంధం చెట్లు నరికి ఉండటాన్ని గమనించి అసోసియేట్ ఫ్యాకల్టీ సత్యేంద్రకుమార్‌కు తెలియజేశారు. ఆయన హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని చెట్లు నరికి దొంగిలించిన విషయాన్ని అడ్మిన్ అకౌంట్ ఆఫీసర్ ఎ.శ్రీనివాస్‌వర్మ దృష్టికి తీసుకురాగా ఆయన మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసే నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వివరించారు.

చేప పిల్లల కోసం బడ్జెట్ కేటాయించాలి

పంజగుట్ట: కాంగ్రెస్ పాలనలో మత్స్యరంగానికి గ్రహణం పట్టిందని తెలంగాణ ముదిరాజ్ మహాసభ ఆగ్రహం వ్యక్తం చేసింది. వెంటనే ప్రభుత్వం మత్స్య సహకార సంఘాలకు రూ. 125 కోట్లు విడుదల చేయాలని మహాసభ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ముదిరాజ్ మహాసభ వర్కింగ్ ప్రసిడెంట్ గుర్రాల మల్లేశం ముదిరాజ్, ప్రధాన కార్యదర్శి అశోక్ ముదిరాజ్, మేడ్చెల్ జిల్లా మత్స్య సహకార సొసైటీ చైర్మన్ మన్నె రాజులు మాట్లాడారు. నేతలు బాలరాజ్, సోమన్న, పండుగ భాను ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించాలి

పంజగుట్ట: అన్ని ఉద్యమాలతో సంబంధం ఉన్న ఉద్యమాల పెద్దన్న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఆయనను తెలంగాణ జాతిపితగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు రాపోల్ జ్ఞానేశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన జలదృశ్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించుకుని గౌరవించుకోనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జూన్ 2వ తేదీన జరగనున్న కార్యక్రమ పోస్టర్‌ను ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి జగదీష్, సామాజిక తెలంగాణ వేదిక అధ్యక్షులు నిమ్మల వీరన్న, జాతీయ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్య పోరాటం సహా తెలంగాణ తొలిదశ, మలి దశ ఉద్యమంలో పాల్గొన్న కొండా లక్ష్మణ్ బాపూజీని గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నిర్మల్ లేదా మంచిర్యాల్‌లో ఏదైనా ఒక జిల్లాకు ఆయన పేరును పెట్టాలని, ఆయనకు భారతరత్న ఇచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సిఫార్సు చేయాలని కోరారు. కార్యక్రమంలో నేతలు రఘురామ్ నేత, చిక్కా చంద్రమోహన్, రాజు నేత, వేముల రాముసేత, జెల్లా నరేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

సిటీ ప్లస్

అందం, ఆత్మవిశ్వాసం, సమయస్ఫూర్తి, సామాజిక దీప్తి.. కలగలిసిన అందాల భామలు తలపడుతున్న బ్యూటీ ఫైట్ నేటితో ముగియనుంది. ప్రపంచపు సౌందర్య సింహాసనం అధిరోహించనున్న అందాల రాణి ఎవరో మరికొన్ని గంటల్లో తేలనుంది. మరోవైపు చారిత్రక వైభవాన్ని కాపాడుకుంటూనే తనను తాను అత్యాధునికంగా ఆవిష్కరించుకుంటున్న నగరం.. మరోసారి తన విశ్వనగర సత్తాను సగర్వంగా చాటుకోనుంది. - సాక్షి, సిటీబ్యూరో

బ్యూటీ ఫ్లో.. ఫైనల్.. షో..

మిస్ వరల్డ్ తుది పోటీలకు సర్వం సిద్ధం

- తరలివస్తున్న అంతర్జాతీయ ప్రముఖులు
- గ్లోబల్ అందాల హోరు.. బాలీవుడ్ నృత్యాల జోరు
- దాదాపు 3గంటల పాటు సాగనున్న తుది సమరం







హైటెక్స్‌లో గిగుల్‌ఫెస్ట్

- జూన్ 7,8 తేదీల్లో నిర్వహణ
- అందుబాటులో 150 స్టాల్స్

మాదాపూర్ : మాదాపూర్‌లోని హైటెక్స్‌లో నిర్వహించనున్న గిగుల్‌ఫెస్ట్ సీజన్–2 బ్రోచర్‌ను మాదాపూర్‌లోని కావూరిహిల్స్ వద్ద శుక్రవారం విడుదల చేశారు. ఈ ఫెస్ట్‌కి సంబంధించిన వివరాలను గిగుల్ ఫెస్ట్ కో–ఫౌండర్ వంశీకృష్ణ ఐతా వివరించారు. జూన్ 7,8వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఫెస్ట్‌లో 150కి పైగా ప్రత్యేకంగా ఎంపిక చేసిన స్టాల్స్, లైవ్‌పెర్ఫార్మెన్సులు, ఆసక్తికరమైన వర్క్‌షాపులు, పిల్లలకోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన జోన్‌లు అందుబాటులో ఉంటాయన్నారు. టైటిల్ స్పాన్సర్‌గా సిద్ధిస్ ఫార్మ్ ఎంపికైనట్లు తెలిపారు. అన్ని వయసుల వారినీ అలరించే విధంగా ఫెస్ట్ ఉంటుందన్నారు. ఫెస్ట్‌కి సంబంధించిన బ్రోచర్ విడుదల కార్యక్రమంలో నటి శ్రవంతి చోకరపు, గిగుల్‌ఫెస్ట్ బృందం అఖిల్, శివనారాయణ, శ్రీనివాస్ గుణిశెట్టి, ఆదిత్య, మౌనిక, అనన్య, అఖిల, స్నేహ, శ్రేయ, శివప్రసన్న తెలుకుంట పాల్గొన్నారు.



జాక్వెలిన్ ఫెర్నాండెజ్

వేదికపై.. బాలీవుడ్ గ్లామర్

ప్రతిష్టాత్మకమైన మిస్ వరల్డ్ కిరీటం కోసం అద్భుతమైన ప్రదర్శనలు, స్ఫూర్తిదాయకమైన కథల మేళవింపుగా గ్రాండ్ ఫినాలేలో ఆద్యంతం ఉత్కంఠగా సాగనుంది. ఈ కార్యక్రమంలో మిస్ వరల్డ్ 2016 విజేత స్టెఫానీ డెల్ వల్లే, ప్రముఖ భారతీయ హోస్ట్ సచిన్ కుంభార్, యాంకర్స్‌గా వ్యవహరించనున్నట్లు సమాచారం. ఇందులో బాలీవుడ్ గ్లామర్ స్టార్ జాక్వెలిన్ ఫెర్నాండెజ్, మరో బాలీవుడ్ హీరో, యువ నట సంచలనం ఇషాన్ ఖట్టర్ ప్రత్యక్ష ప్రదర్శనలు ఇస్తారని మిస్ వరల్డ్ ప్రతినిధి తెలిపారు. అదే విధంగా తారల ప్రదర్శనలను మరింత పతాక స్థాయికి చేరుస్తూ మిస్ వరల్డ్ 2017 విజేత, బాలీవుడ్ నటి మానుషి చిల్లర్ ప్రత్యేక ప్రదర్శన ఇవ్వనున్నారు.



మానుషి చిల్లర్

ప్రపంచవ్యాప్తంగా 108 మంది అందాల రాణులు పాల్గొన్న పోటీల శ్రేణిలో నెల రోజుల పాటు రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాల అనంతరం.. చివరగా మిస్ వరల్డ్ పోటీల సంబరం శనివారం గ్రాండ్ ఫినాలేతో ముగియనున్నది. కోట్లాది మంది ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ కార్యక్రమం నగరంలోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో శనివారం రాత్రి ప్రారంభం కానుంది.



మానవత్వానికి సత్కారం..

ప్రముఖ నటుడు, సేవా కార్యక్రమాల ద్వారా దేశవ్యాప్తంగా పేరొందిన సోను సూద్‌ను మిస్ వరల్డ్ హ్యుమానిటేరియన్ అవార్డుతో సత్కరిస్తారు. అంతేకాకుండా ఆయన న్యాయనిర్ణేతల ప్యానెల్‌లో కూడా ఉంటారు.
వీరిలో బ్యూటీ విత్ ఏ పర్పస్ గాలా డిన్నర్‌ను నిర్వహించిన సామాజిక సేవా ప్రముఖులు సుధారెడ్డి, మిస్ ఇంగ్లాండ్ 2014 డాక్టర్ కారీనా టర్రెల్ కూడా ఇదే జ్యూరీలో ఉన్నారు. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ చైర్‌పర్సన్ జూలియా మోర్లీ జ్యూరీకి అధ్యక్షత వహిస్తారు. పోటీదారులను పరిశీలించిన అనంతరం ఈ జ్యూరీ విజేతను ప్రకటించనుంది.

ప్రత్యక్ష ప్రసారం..

ఈ ఫైనల్స్ కార్యక్రమం భారతదేశంలో సోనీలివ్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. అదే విధంగా, ఎంపిక చేసిన దేశాల జాతీయ టెలివిజన్స్‌లో కూడా ప్రసారం అవుతోంది. ప్రపంచవ్యాప్తంగా www. watchmissworld. com. లో అందుబాటులో ఉంటుంది.

జయహో.. భారత్..



సాక్షి, సిటీబ్యూరో : మిస్ వరల్డ్ పోటీల ద్వారా కొత్త ఆశలు పోగు చేసుకుంటున్న నగర ఫ్యాషన్ రంగ మహిళా ప్రముఖులు మిస్ ఇండియా నందినీ గుప్తా విజయాన్ని కోరుకుంటున్నారు. వందకు పైగా దేశాల నుంచి హాజరవుతున్న ఈ పోటీల్లో మన దేశం గెలవాలని, అందుకు మన నగరం వేదికగా నిలవాలని ఆశిస్తున్నారు. తద్వారా మరింతగా గ్లామర్, ఫ్యాషన్ రంగాలు నగరంలో అభివృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నారు.



నగరానికి దక్కిన గౌరవం..

మిస్ వరల్డ్ పోటీలు మన నగరంలో నిర్వహించడం తప్పనిసరిగా మనకు గర్వకారణం. ఇది ఓ గొప్పగౌరవం కూడా. దీని ద్వారా ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలకు చెందిన పోటీదారులు నగర విశిష్టతను తెలుసుకోవడం మాత్రమే కాదు మనదైన ఆత్మీయతను, ప్రేమ/స్నేహ పూర్వక ఆతిథ్యాన్ని అందుకున్నారు. మన రాష్ట్ర, దేశ సంస్కృతీ సంప్రదాయాల గొప్పతనాన్ని తెలుసుకున్నారు. కొన్ని రోజుల పాటు ఆత్మీయ అతిథులతో మనం గడిపి, పరస్పరం గొప్ప జ్ఞాపకాలు పోగు చేసుకున్నాం. ఫైనల్ పోటీల గురించి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. ఒక మహిళగా పోటీదారులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, అదే సమయంలో ఒక భారతీయురాలిగా మన దేశానికి ఈ కిరీటం సొంతం కావాలని ఆశిస్తున్నాను. తుది ఫలితం ఎలా ఉన్నా. ఈ స్థాయి దాకా వచ్చిన వారంతా పోటీలో విజేతలే అనేది వాస్తవం.

– అజితారెడ్డి, నిర్వాహకులు, హామ్‌స్టెక్ ఫ్యాషన్ ఇన్‌స్టిట్యూట్



యువ కలలు గెలవాలి..

ఒక అందమైన, శక్తివంతమైన మహిళగా అంతర్జాతీయ వేదికలపై మన దేశానికి ప్రాతినిథ్యం వహించడం ఎంత గొప్ప సంతృప్తిని అందిస్తుందో నాకు అనుభవకపూర్వకంగా తెలుసు. అది ఎంత మంది భారతీయ యువతులకు స్ఫూర్తిని అందిస్తుందో తెలుసు. అందుకే ఈ పోటీల్లో మన మిస్ ఇండియా నందిని గుప్తా గెలవాలని మన సారా కోరుకుంటున్నా. ఆమె ధరించేది కేవలం కిరీటం కాదు.. యువ కలలు, ఆశయాలు కూడా. వేదికపై ఆమె నడకలో ప్రతి భారతీయ యువతీ తనను తాను చూసుకుంటోంది. ఆత్మ విశ్వాసాన్ని పోగు చేసుకుంటోంది. యావత్ దేశం నీతోనే ఉంది.. నీ తోడై ఉంది. శుభాకాంక్షలతో..

– ఉమా పేరి, మాజీ మిసెస్ వరల్డ్ ఫైనలిస్ట్



ఇషాన్ ఖట్టర్

అందాల జ్ఞాపకాలతో..

సాక్షి, సిటీ బ్యూరో: నెల రోజులుగా అందాల నగరం హైదరాబాద్‌లో ప్రపంచ అందాల తారల సందడి అంతా ఇంతా కాదు.. ఈ సందడి, సంతోషాలు నేటితో ముగియనుండటం విధితమే. ఈ నేపథ్యంలో చివరగా మరొక్కసారి నగరంలో మిస్ వరల్డ్ ఫెస్టివల్ హంగామా, ముద్దుగుమ్మల ఆసక్తికర విశేషాలు నెమరువేసుకుంటే..!!

- నగరంలోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ప్రపంచ దేశాల సుందరీ మణులందరికీ బాగా నచ్చిన అంశం.. 'అద్భుత స్వాగతం, ఇక్కడి ఆతిథ్యం'. ఈ విషయాన్ని పలువురు మిస్ వరల్డ్ కంటెస్టెంట్‌లు పలు మార్లు చెప్పుకొచ్చారు. ఇందులో తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ పాత్ర ఎనలేనిది.
- అతిథులందరికీ హైటెక్ సిటీలోని ట్రైడెంట్ హోటల్ విడిదిగా మారి.. వారికి అనువైన సేవలు, ఆతిథ్యాన్ని అందించింది. అంతర్జాతీయ స్థాయి వసతులు, సౌకర్యాలే కాకుండా అక్కడి ఐటీ వరల్డ్ ఈ ముద్దుగుమ్మలకు విలాసవంతమైన అనుభవాలను అందించింది.
- మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్‌తో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన హెరిటేజ్ వాక్ ఈ ఫ్యాషన్ ఐకాన్‌లకు ఐకానిక్ హిస్టారికల్ మాన్యుమెంట్ చార్మినార్‌ను పరిచయం చేసింది. ఒకానొక సమయంలో చార్మినార్ సౌందర్యం ముందు ఈ ముద్దుగుమ్మల అందం తేలిపోయిందని సోషల్ మీడియా ముచ్చటించుకుంది.
- నగరంలోని అధునాతన రక్షణ వ్యవస్థ కమాండ్ కంట్రోల్ సెంటర్, సెక్రటేరియట్, చౌమహాల్లా ప్యాలెస్, ఎకో ఎక్స్‌పీరియం పార్క్, లాడ్ బజార్.. కంటెస్టెంట్లకు నగర విలాస వైభవాన్ని, విశిష్టతను చాటి చెప్పాయి.
- అత్యాధునిక వైద్య రంగాన్ని మెడికల్ టూరిజం పేరిట ఈ అందాల భామలు తెలుసుకుని వావ్ అన్నారు.
- శిల్పకళా వేదికగా కలియతిరిగి ఇక్కడి మహిళల సాధికారత, సాంస్కృతిక ప్రత్యేకత, హస్తకళా వైభవాలు, ఇక్కడి మూలాల్లోని అరుదైన కళాత్మకతకు ముగ్ధులయ్యారు.
- ప్రధానంగా నగరంలో నోరూరించే వంటకాలు, ఫ్యాషన్ ట్రెండ్స్, సాంస్కృతిక సమ్మేళనం–వైవిధ్యం.. మిస్ వరల్డ్ బృందానికి ఆనందాన్ని, ఆశ్చర్యాన్ని కలిగించాయి.

సాహసాల సోయగం

- ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌లో 'అర్చనా సింగ్'
- తెగువ చాటిన యువ నటి

బంజారాహిల్స్: తెలుగులో ఆమె పేరు ఇంకా పాపులర్ కాలేదు కానీ.. తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఆ అమ్మాయి పేరు సుపరిచితమే. 'బిజినెస్ మేనేజ్మెంట్'లో మాస్టర్స్ (ఎంబీఏ) చేసి, సినిమాలు చేస్తూనే సాహసాలు సైతం చేస్తుండే ఈ యువ నటి పేరు 'అర్చనా సింగ్'. కన్నడ కాంతామణి అయిన అర్చనా సింగ్ ఇటీవల హిమాలయాల్లోని 'ఎవరెస్ట్ బేస్ క్యాంప్'లో పాల్గొని తన తెగువను చాటి చెప్పింది. జీవితంలోనూ సమున్నత శిఖరాలు చేరుకోవడం తన లక్ష్యమని చెప్పకనే చెప్పింది. సినిమా అవకాశాల కోసం ప్రయత్నాలు చేస్తూనే.. 'విప్రో, ఐటీసీ గ్రూప్ ఆఫ్ హోటల్స్'తో పాటు.. కింగ్ ఫిషర్, జెట్ ఎయిర్ లైన్స్‌లో ఎయిర్ హోస్టెస్‌గా పని చేసింది. కన్నడ, తమిళ భాషల్లో పలు సినిమాలు చేసిన ఈ అందాల రాశి.. తెలుగులో 'దమయంతి–కౌశిక్ వర్మ' చిత్రంలో నటించి మెప్పించింది. 'మై ఫాదర్ – మై హీరో' అనే చిత్రంతో మలయాళంలోనూ అరంగేట్రం చేస్తోంది. ఈ చిత్రం ఇంగ్లీషులోనూ తెరకెక్కుతుండడం గమనార్హం. శాస్త్రీయ నృత్యం (క్లాసికల్ డ్యాన్స్)లో ప్రావీణ్యురాలైన అర్చన.. వీలు కుదిరినప్పుడల్లా 'డ్యాన్స్ షోస్' కూడా చేస్తుంది. కన్నడతో పాటు హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్ భాషల్లో అనర్గళంగా మాట్లాడగలిగే ఈ నటికి తెలుగు, తమిళ భాషల్లోనూ మంచి పట్టుంది.





ఎవరెస్ట్ కిక్ ఇచ్చింది..

ఇటీవల తనూ చేపట్టిన 'ఎవరెస్ట్ బేస్ క్యాంప్' గురించి ఈ 'సాహస కన్య' మాట్లాడుతూ.. కెరీర్ ప్రారంభంలో నేను చేసిన ఉద్యోగాలు, తర్వాత వరసగా దక్షిణాది భాషలన్నింట్లో నేను చేస్తున్న సినిమాలు ఇచ్చిన కిక్ కంటే.. ఎవరెస్ట్ ఎక్కడం మరింత కిక్ ఇచ్చింది. జీవితంలో ఇంకా హైట్స్‌కు చేరుకోవాలనే పట్టుదలను, ప్రోత్సాహాన్ని ఇచ్చింది. నాకు తెలియకుండానే నాలో మారుమూల దాక్కుని ఉన్న బెరుకును, భయాన్ని ఈ సాహస యాత్ర పటాపంచలు చేసింది. ఈ అనుభవాన్ని, అనుభూతిని మాటల్లో చెప్పడం కష్టం.

– అర్చనా సింగ్

తొలి గ్లోబల్ అంబాసిడర్‌గా సుధారెడ్డి..

- మిస్ వరల్డ్ చరిత్రలో తెలుగు వారికి దక్కిన అరుదైన గౌరవం..
- 'బ్యూటీ విత్ ఏ పర్పస్'కు ప్రపంచ స్థాయిలో ప్రాతినిథ్యం

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ వేదికగా ప్రపంచ ప్రఖ్యాత మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే జరుగుతుండటం విదితమే. అయితే నగరానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, సామాజికవేత్త సుధారెడ్డి మిస్ వరల్డ్ సంస్థకు మొట్టమొదటి గ్లోబల్ అంబాసిడర్‌గా నియమితులయ్యారు. 72వ మిస్ వరల్డ్ ఫైనల్‌లో సుధారెడ్డికి ఈ గౌరవం లభించనుంది. ఇప్పటికే మెట్ గాలా, కాన్స్ ఫిల్మ్ ఫెస్టివల్, పారిస్ ఒలింపిక్స్ వంటి విశిష్ట కార్యక్రమాల్లో పాల్గొన్నారు. సుధారెడ్డి గ్లోబల్ అంబాసిడర్‌గా నియామకమవ్వడం కేవలం వ్యక్తిగత గౌరవమే కాదు.. దేశానికి, ముఖ్యంగా తెలుగు మహిళల సామర్థ్యానికి అంతర్జాతీయ స్థాయి గుర్తింపుగా నిలుస్తోంది. కాగా 'సుధారెడ్డి దాతృత్వానికి, నాయకత్వ దక్షతకు ఇదే నిజమైన గౌరవం. ఆమె మాతో కలిసి ప్రపంచ వ్యాప్తంగా మార్పుకు కృషి చేయనున్నారు'. అని మిస్ వరల్డ్ చైర్‌పర్సన్ జూలియా మార్లీ అన్నారు.



బ్యూటీ విత్ ఏ పర్పస్..

సుధారెడ్డి కొత్త బాధ్యతలో భాగంగా మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ ఛారిటబుల్ విభాగమైన 'బ్యూటీ విత్ ఏ పర్పస్'కు ప్రపంచ స్థాయిలో ప్రాతినిథ్యం వహించనున్నారు. ఈ విభాగం పిల్లల ఆరోగ్యం, మహిళల హక్కులు, విద్య, విపత్తు వంటి క్లిష్ట సమస్యలను పరిష్కారించే ప్రాజెక్టులకు నిధులు, మద్దతు ఇవ్వనుంది. మిస్ వరల్డ్ విజేత ఎంపికలో తన నైపుణ్యం, ప్రపంచ స్థాయి దృక్పథం తోడుకానుంది. సుధారెడ్డి మెఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ డైరెక్టర్‌గా సేవలందిస్తున్నారు.

సాక్షి రియల్టీ

శనివారం
31-05-2025

సొంతిల్లు.. ఆ తర్వాతే ఏదైనా..

ఓ వైపు నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోంది.. నలువైపులా విస్తరిస్తోంది.. అందుకు తగ్గట్టే నివాస భవనాల ధరలు కూడా పెరిగిపోతున్నాయి. అయినప్పటికీ.. నగరవాసుల్లో సొంతింటి పట్ల ఆసక్తి ఇసుమంతైనా తగ్గలేదు. నా ఇల్లు అనే భావోద్వేగ బంధానికి, సెంటిమెంట్‌కే తొలి ప్రాధాన్యం ఇస్తున్నారు. తాజాగా ఓ సంస్థ నిర్వహించిన 'బియాండ్ బ్రిక్స్: ది పల్స్ ఆఫ్ హోం బయింగ్' అనే అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. – సాక్షి, సిటీబ్యూరో

- నగరవాసుల్లో అత్యధికులకు అదే తొలి ప్రాధాన్యం
- వయసుకు అతీతంగా ఇంటి కొనుగోలుపై ఆసక్తి
- వైద్యం, రవాణా సౌకర్యాలు దగ్గరలోని ప్రాంతాలపై దృష్టి
- ఓ సంస్థ అధ్యయనంలో వెల్లడి

రియల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్నా సొంతింటి కల సాకారం చేసుకోవాలనే తపన మాత్రం నగరవాసుల్లో తగ్గడం లేదని తేల్చిన ఈ అధ్యయనం దేశవ్యాప్తంగా పలు మెట్రో నగరాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా నగరాల్లో ప్రజలు సొంత ఇంటి గురించిన ఆలోచనా విధానాన్ని పరిశీలించారు. ఆ అధ్యయనం వెల్లడించిన విశేషాలివి..





చెన్నై ఫస్ట్, సిటీకి 5వ స్థానం..

సొంతింటిని కోరుకుంటున్న నగరాల వ్యాప్తంగా చూస్తే, అత్యధిక శాతం మందికి అది సెంటిమెంట్‌గా మారిన నగరంగా చెన్నై తొలిస్థానంలో నిలిచింది. ఆ నగరంలో 86శాతం మంది సొంత ఇంటికి జైకొడుతున్నారు. ఆ తర్వాత స్థానాన్ని 85శాతంతో ముంబై దక్కించుకుంది. ఇక అహ్మదాబాద్‌వాసుల్లో 83శాతం మంది నా ఇల్లే నా స్వర్గం అంటుంటే.. ఆ తర్వాత స్థానంలో నిలిచిన మన హైదరాబాద్‌లో 81శాతం మంది ఇల్లు కొనాల్సిందే అని స్పష్టం చేస్తున్నారు. మన నగరం తర్వాత 80శాతంతో కోల్‌కతా, 74శాతంతో ఢిల్లీ, 73శాతంతో బెంగళూర్‌లు సొంతింటి కలలో తేలిపోతున్నాయి.

సొంతిల్లు ఎందుకంటే..

సుదీర్ఘకాలం సురక్షితంగా భద్రంగా జీవించాలి అంటే సొంత ఇల్లు ఉండాల్సిందేనని నగరవాసులు భావిస్తున్నారు. సొంతిల్లు వైపు నడిపిస్తున్న తర్వాతి కారణాల్లో ఆర్థిక స్థిరత్వం.. అంటే ఇల్లు కొనడమేననే ఆలోచన బలంగా ఉండటం, 3వ కారణంగా సంస్కృతి సంప్రదాయాలతో ముడిపడి ఉన్న సొంత ఇల్లు అనే భావన.. వంటివి ఉన్నాయి. విశేషం ఏమిటంటే.. రూ.50 లక్షలు పైబడిన ఆదాయం ఉన్న అధికాదాయ వర్గాల వారిలో 91శాతం మంది సొంతిల్లు కావాలంటుంటే, అత్యల్ప ఆదాయం ఉన్న వారిలోనూ 71శాతం మంది అదే కోరిక వ్యక్తం చేస్తున్నారు.

ఇల్లు కావాలి.. అవి కూడా కావాలి..

ఇల్లు కొనేటప్పుడు ప్రధానంగా ఏం చూస్తారు అనే ప్రశ్నకు సమాధానంగా వైద్య సౌకర్యాలకే అత్యధికులు ప్రాధాన్యత ఇచ్చారు. ఆస్పత్రులకు సమీపంలో నివసించడానికే 58శాతం మంది ఆసక్తి చూపిస్తున్నారు. షాపింగ్‌కు ప్రాధాన్యత ఇచ్చేవారి సంఖ్య కూడా తక్కువేమీ లేదు. తమ ఇల్లు మార్కెట్స్‌కు సమీపంలో ఉండాలని 53శాతం మంది ఆశిస్తుంటే, రవాణా సౌకర్యాలు బాగుండే చోటైతేనే రైటు అంటున్నవారు 40శాతం మంది. అంతేనా ఇరుగు పొరుగుతో కాలక్షేపం ఉండాల్సిందే అంటున్న 23శాతం మంది కమ్యూనిటీ క్లబ్‌లకు సమీపంలోని ఇంటిని ఇష్టపడుతున్నారు. సొంత ఇంటితో పాటే ఆరోగ్యమూ మాతోటే అంటున్న నగరవాసుల్లో 16శాతం మంది జిమ్ తదితర వ్యాయామ సౌకర్యాలు దగ్గరలో ఉన్న ఇంటిని కోరుకుంటున్నారు. నగరంలో అత్యధికులు సొంత ఇంటిని ఇప్పటికీ సెంటిమెంట్‌గా భావిస్తున్న నేపథ్యంలో.. ప్రస్తుతం కనిపిస్తున్న రియల్ ఎస్టేట్ రంగంలోని ఒడిదుడుకులు తాత్కాలికమేనని స్పష్టం అవుతోంది. సొంత ఇంటి కల నిజం చేసుకునేవారి కల సాకారం చేసే విధంగా అందరికీ అందుబాటు ధరల్లో ఇళ్లు అందజేయగలిగితే.. సిటీ రియల్ రంగానికి భవిష్యత్తుకి ఢోకా ఉండదు.



అద్దెకు వీకెండ్ హోమ్స్



ఎక్కడ చూసినా గ్రీనరీనే..

వీకెండ్ హోమ్స్ ప్రాజెక్ట్‌లలో సాధ్యమైనంత స్థలాన్ని గ్రీనరీకే కేటాయిస్తారు. ఒకవేళ వీకెండ్ హోమ్స్‌ను కస్టమర్లు వినియోగించలేని పక్షంలో కంపెనీయే అద్దెకు తీసుకుంటుంది. వాటిని డెస్టినేషన్ వెడ్డింగ్స్ కోసం వినియోగించి.. వచ్చే లాభాలలో కస్టమర్లకు వాటా ఇస్తుంది. వాటి నిర్వహణ బాధ్యత కంపెనీదే. ఒకవేళ కొనుగోలుదారులు ఇంటిని నిర్మించుకునేందుకు వీలుగా తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ వ్యవస్థ, రోడ్లు, వీధి దీపాలు వంటి అన్ని రకాల మౌలిక వసతులను కల్పిస్తారు.



సాక్షి, సిటీబ్యూరో: మెట్రో నగరాలలో వీకెండ్ అంటే సంథింగ్ స్పెషల్.. నిద్ర లేచే సమయం నుంచి తినే తిండి, తిరిగే ప్రాంతం వరకూ.. ప్రతీది డిఫరెంట్‌గా ఉండాలనుకుంటారు. కరోనా తర్వాత నుంచి ఈ అభిరుచికి పర్యావరణం కూడా తోడైంది. దీంతో వారంలో కనీసం రెండు రోజులైనా పచ్చని ప్రకృతిలో సేదతీరాలని భావిస్తున్నారు. చుట్టూ చెట్లు, ఆహ్లాదకరమైన వాతావరణం, రణగొణ ధ్వనులు, కాలుష్యం లేని ప్రాంతం.. ఇంటికి తిరిగొస్తూ వారానికి సరిపడా కూరగాయలు, పండ్లు వెంట తెచ్చుకునే వీలూ ఉండాలని భావిస్తున్నారు. ఈక్రమంలోనే వీకెండ్ హోమ్స్ ఆదరణ పెరిగింది.

ఈ ప్రాంతాల్లో డిమాండ్

కడ్తాల్, తలకొండపల్లి, షాద్‌నగర్, శంకర్‌పల్లి వంటి ప్రాంతాలలో వీకెండ్ హోమ్స్‌కు డిమాండ్ ఉంది. చార్టెడ్ అకౌంటెంట్లు, వైద్యులు, ఐటీ ఉద్యోగులు, వ్యాపారస్తులు ఎక్కువగా వీటిని కొనుగోలు చేస్తున్నారు. వీకెండ్ హోమ్స్ అంటే ఎకరాల కొద్దీ స్థలం అవసరం లేదు. కొద్ది స్థలంలోనే ప్రణాళికబద్ధంగా వినియోగిస్తే.. అందమైన వీకెండ్ హోమ్స్‌ను డిజైన్ చేయవచ్చు. ఈ నిర్మాణంలో వినియోగించే ప్రతి వస్తువూ పర్యావరణ హితమైనవే ఉంటాయి. ఉష్ణోగ్రతను నిరోధించేలా మట్టి ఇటుకలు, కలపతో నిర్మాణం ఉంటుంది. వర్షపు నీటి సేకరణతో పాటు జీవ వైవిధ్యాన్ని కాపాడుతూ సహజ వనరులకు ఏమాత్రం విఘాతం కలిగించకుండా ఉంటుంది.



లగ్జరీ పైపైకి..

విలాసవంతమైన గృహాల ధరల్లో అత్యధిక వృద్ధి

ఐదేళ్లలో 42 శాతం పెరిగిన ఇళ్ల విలువ

హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ కొత్త రికార్డులను సృష్టిస్తోంది. కోకాపేట, మోకిలలో రికార్డు స్థాయిలో భూములు అమ్ముడుపోగా.. తాజాగా లగ్జరీ గృహాల ధరల వృద్ధిలో మరో మైలురాయిని సాధించింది. దేశంలోని ప్రధాన మెట్రో నగరాలతో పోలిస్తే భాగ్యనగరంలో విలాసవంతమైన ఇళ్ల ధరలు 42 శాతం మేర పెరిగాయి. రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర ఉండే ఈ ప్రీమియం యూనిట్ల రేట్లు ఐదేళ్లలో హైదరాబాద్‌లో రికార్డు స్థాయిలో పెరిగాయని ఓ సంస్థ తాజా అధ్యయనంలో వెల్లడైంది. – సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్‌లో 2018లో విలాసవంతమైన ఇళ్ల ధరలు చ.అ.కు రూ.7,450గా ఉండగా.. ప్రస్తుతం ఏకంగా రూ.10,580కి పెరిగాయి. ఇదే సమయంలో బెంగళూరు, ముంబై నగరాలలో లగ్జరీ ఇళ్ల ధరలు 27 శాతం మేర పెరిగాయి. కరోనా తర్వాత నుంచి లగ్జరీ గృహాల సరఫరా, డిమాండ్ పెరగడమే ఈ వృద్ధికి కారణం. 2018లో బెంగళూరులో ప్రీమియం ఇళ్ల ధరలు చ.అ.కు రూ.10,210గా ఉండగా.. ఇప్పుడది రూ.12,970కి పెరిగింది. ముంబై మెట్రోపాలిటన్ రీజియన్ (ఎంఎంఆర్)లో రూ.23,119 నుంచి రూ.29,260కి చేరింది.

దేశంలోని సగటు చూస్తే..

2018 నుంచి 2024 నాటికి దేశంలోని ఏడు ప్రధాన నగరాలలో సరసమైన గృహాల విలువలు సగటున 15 శాతం మేర పెరిగితే.. విలాసవంతమైన గృహాల విలువ 24 శాతం వృద్ధి నమోదైంది. రూ.కోటిన్నర కంటే ఎక్కువ ధర కలిగిన ఇళ్ల ధరలు చ.అ.కు సగటున 2018లో రూ.12,400గా ఉండగా.. 2024 నాటికి రూ.15,350కి పెరిగాయి.

అందుబాటు గృహాలలో 15 శాతం

ఏడు ప్రధాన నగరాలలో రూ.40 లక్షలలోపు ధర ఉండే సరసమైన గృహాల విలువలు 15 శాతం మేర పెరిగాయి. 2018లో సగటు ధర చ.అ.కు రూ.3,750గా ఉండగా.. ఇప్పుడది రూ.4,310కి పెరిగింది. అఫర్డబుల్ కేటగిరీలో అత్యధికంగా ఎన్సీఆర్‌లో అత్యధికంగా 19 శాతం మేర ధరలు పెరిగాయి. ఈ విభాగంలో ధరల వృద్ధిలో హైదరాబాద్ రెండో స్థానంలో నిలిచింది. ఐదేళ్లలో మన నగరంలో 16 శాతం మేర ధరలు పెరిగాయి. అందుబాటు గృహాల ప్రారంభ ధర చ.అ.కు రూ.4 వేలుగా ఉంది.



మధ్యతరగతిలో 18 శాతం

ఐదేళ్ల కాలంలో టాప్–7 నగరాలలో రూ.80 లక్షల నుంచి రూ.కోటిన్నర మధ్య ధర ఉండే మధ్యతరగతి విభాగంలోని ఇళ్ల విలువలలో 18 శాతం మేర వృద్ధి చెందాయి. 2018లో సగటు ధర చ.అ.కు రూ.6,050లుగా ఉండగా.. ఇప్పుడది రూ.7,120కి పెరిగింది. ఈ విభాగంలోనూ అత్యధికంగా 23 శాతం ధరల వృద్ధి హైదరాబాద్‌లోనే నమోదైంది. మన నగరంలో మిడ్‌సైజ్ గృహాల ప్రారంభ ధర చ.అ.కు రూ.5,780గా ఉంది.

హోమ్ గార్డెనింగ్

- ఆరోగ్యంతో పాటు అలంకారం కోసం..
- పచ్చదనం పెంచేందుకు ఆసక్తి చూపుతున్న నగరవాసులు

సాక్షి, సిటీబ్యూరో: ఇంట్లో స్వచ్ఛమైన గాలి కోసం మొక్కలను పెంచుకుంటున్నారు. దాంతో అందం, ప్రశాంతమైన వాతావరణం ఏర్పడుతుందని నిపుణులు సూచిస్తున్నారు. హోమ్ గార్డెనింగ్ మొక్కల ప్రత్యేకత ఏంటంటే.. వీటికయ్యే వ్యయం చాలా తక్కువ. నిర్వహణ కూడా తేలికే. పైగా అందంగా, అద్భుతమైన డిజైన్లతో అలంకారప్రాయంగా ఉంటాయి. ఇండోర్ గార్డెనింగ్‌పై ఆసక్తి ఉన్న వాళ్ల తొలి ప్రాధాన్యం స్నేక్ ప్లాంట్‌కే. నిర్వహణ అత్యంత సులువు. తక్కువ నీటి అవసరం ఉంటుంది. చీకటి ప్రదేశంలో, గది మూలల్లోనూ ఇది పెరుగుతుంది. తక్కువ కాంతిలో ఉంచినప్పటికీ.. స్వచ్ఛమైన ఆక్సిజన్ విడుదల చేస్తుంది. నిలువుగా పెరుగుతుంది.

- మధ్యస్థ స్థాయిలో సూర్యరశ్మి లేదా పరోక్ష పద్ధతిలో సూర్యకాంతిలోనూ పెరగడం రబ్బర్ ప్లాంట్ ప్రత్యేకత. దీనికి ఆకులు పెద్ద సైజ్‌లో ఉంటాయి. అందువల్ల గాలి నుంచి వచ్చే వ్యర్థాలు, దుమ్ము, ధూళి కణాలను సులువుగా గ్రహిస్తాయి. ఈ మొక్క ఆకులను తరుచూ శుభ్రం చేస్తుండాలి. ప్రతిరోజూ ఒకే సమయంలో ఒకే పరిమాణంలో నీటిని పోయాలి. లేకపోతే ఆకులు రాలిపోయే ప్రమాదం ఉంది.
- గార్డెనింగ్ ఔత్సాహికులు, అనుభవజ్ఞులకు మనీ ప్లాంట్ సరైన మొక్క. నిర్వహణ కోసం పెద్దగా కష్టపడాల్సిన పనిలేదు. అంత త్వరగా ఎండిపోదు. ఇంటి గాలిలోని బెంజెన్లు, ఫార్మాల్డిహైడ్ వంటి విష రసాయనాలను మనీ ప్లాంట్ గ్రహిస్తుంది. వీటిని కుండీల్లో, బుట్టల్లో ఎక్కడైనా వేలాడదీయవచ్చు లేదా నీటి గిన్నెలలో కూడా పెంచుకోవచ్చు. ఇవి నిలువుగా పెరుగుతుంటాయి. ఇంటి లోపల, ఆరుబయట, ప్రవేశ ద్వారం వద్ద వీటిని ఉంచుకోవచ్చు. ఏ మొక్కకైనా సరే అతిగా నీళ్లు పోయకూడదు. ఎంత పరిమాణంలో నీటిని పోయాలో తెలుసుకోవాలంటే అది ఉండే మట్టిని పరిశీలించాలి.
- కాలుష్య కారకాలను తొలగించడం, కార్బన్ మోనాక్సైడ్, అమ్మోనియా ఫార్మాల్డిహైడ్, ట్రైక్లోరైథిలీన్‌లను పీల్చుకోవటంలో, ఇండోర్‌లోని గాలిని శుభ్రం చేయడంలో పీస్ లిల్లీలు అద్భుతంగా పనిచేస్తాయన్న విషయం చాలా మందికి తెలియదు. ఇది పుష్పించే మొక్క కాదు. ఇది ఉష్ణమండల ప్రాంతాల నుంచి వస్తుంది. ఇది పెరగాలంటే నేల, తేమ అవసరం. దీనికి తరుచూ నీళ్లు పోస్తుండాలి. ఆకులు పడిపోతున్నాయంటే నీటి అవసరం ఉందన్న విషయం మీరు గ్రహించాలి.
- ఈ మొక్కలు ఆకుపచ్చ, ఎరుపు రంగులతో పాటు అనేక రకాలుగా వస్తాయి. చైనీస్ ఎవర్‌గ్రీన్ లేదా ఆగ్లోనెమాస్ బహుముఖ ప్రయోజనాలు ఉండే మొక్కలు. వీటి నిర్వహణ సులువు. అందంగా, ఆకర్షణీయంగా కనిపిస్తుంటాయి. వీటిని ఇంటీరియర్ డిజైనింగ్‌లో వినియోగించుకోవచ్చు. అధిక స్థాయిలో ఆక్సిజన్‌ను విడుదల చేయడంతో పాటు హానికారక రసాయనాలను పీల్చుకుంటాయి. అన్ని వాతావరణ పరిస్థితుల్లో.. ఇంట్లో ఎక్కడైనా ఈ మొక్కలు పెరుగుతాయి.



గ్లోబల్ సిటీస్..

గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లకు ఇండియా అడ్డా

2025 క్యూ1లో 83.5 లక్షల చ.అ. స్పేస్ లీజు

ఇందులో దక్షిణాది వాటా 64 శాతంపైనే..

హైదరాబాద్‌లో 8.2 లక్షల చ.అ. స్థలం లీజు

సాక్షి, సిటీబ్యూరో: కొన్నేళ్లుగా దేశంలోని ప్రధాన నగరాల్లోని వాణిజ్య స్థిరాస్తి రంగంలో గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల (జీసీసీ) జోరు కొనసాగుతోంది. హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి దక్షిణాది నగరాలు గ్లోబల్ కేపబులిటీ సెంటర్ల(జీసీసీ)లకు అడ్డాగా మారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాలలో 2025 తొలి త్రైమాసికం(క్యూ1)లో 1.94 కోట్ల చ.అ. ఆఫీసు స్పేస్ లావాదేవీలు జరగగా.. ఇందులో 43 శాతం వాటా జీసీసీలదేనని అనరాక్ రీసెర్చ్ రిపోర్ట్ వెల్లడించింది.

సౌత్ జోరు..

2025 క్యూ1లో జీసీసీలు 83.5 లక్షల చ.అ. స్థలాన్ని లీజుకు తీసుకున్నాయి. అదే 2024 క్యూ1లో జరిగిన 48.7 లక్షల చ.అ. జీసీసీ లావాదేవీలతో పోలిస్తే ఇది 72 శాతం అధికం. అత్యధికంగా దక్షిణాది నగరాలలో 64 శాతం వాటా 53.4 లక్షల చ.అ. లావాదేవీలు పూర్తయ్యాయి. ఢిల్లీ–ఎన్సీఆర్‌లో 19.5 లక్షల చ.అ. లీజులు జరిగాయి. జీసీసీ లావాదేవీల్లో అత్యధికంగా ఐటీ, ఐటీఈఎస్ రంగం వాటా 35 శాతం కాగా.. బీఎఫ్ఎస్ఐ రంగం 22 శాతం, తయారీ, పారిశ్రామిక రంగం వాటా 13 శాతంగా ఉంది.

నగరాల వారీగా జీసీసీ లీజులు (చ.అ.లు లక్షల్లో..)


నగరం	2024 క్యూ1	2025 క్యూ1
బెంగళూరు	28.2	33
హైదరాబాద్	12.2	8.2
ఢిల్లీ–ఎన్సీఆర్	4.9	19.1
ముంబై	2.4	6
పుణె	1	4.5
చెన్నై	0	12.2
కోల్‌కతా	0	50 వేలు

100–110 బిలియన్ డాలర్లకు..

- 2024 ముగింపు నాటికి ఏడు నగరాలలో మొత్తం 1,700 గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు ఉన్నాయి. వీటి మార్కెట్ విలువ సుమారు 52
- బిలియన్ డాలర్లు. ఆయా జీసీసీలలో 17–18 లక్షల మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. 2030 నాటికి 2,200–2,300 జీసీసీ సెంటర్లకు చేరుతుందని
- అంచనా. వాటి మార్కెట్ విలువ 100–110 బిలియన్ డాలర్లకు చేరుతుంది. అలాగే ఆయా జీసీసీలలో ఉద్యోగుల సంఖ్య 24–28 లక్షలకు చేరుతుంది.

జీసీసీ అంటే?

జీసీసీలకు ఇండియా ప్రధాన కేంద్రంగా మారింది. అంతర్జాతీయ బహుళ జాతి సంస్థలు ఇక్కడ జీసీసీ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు ముందకొస్తున్నాయి. అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలకు చెందిన అంతర్జాతీయ కార్పొరేట్ సంస్థలు తమ ప్రధాన కార్యాలయాలకు పొరుగు, ప్రాసెస్ సేవలను అందించేందుకు నైపుణ్యంతో పాటు చవకగా మానవ వనరులు లభించే ఇతర దేశాల్లో ఏర్పాటు చేసుకునే ఉప కార్యాలయాలనే గ్లోబల్ కేపబులిటీ సెంటర్లు (జీసీసీ)లుగా పేర్కొంటారు.



ప్రపంచ సుందరి ఎవరో తేలేది నేడే

సాక్షి, హైదరాబాద్: ప్రపంచ సుందరి ఎవరో శనివారం తేలబోతోంది. హైదరాబాద్‌లో అట్టహాసంగా జరుగుతున్న మిస్ వరల్డ్ 72వ ఎడిషన్ పోటీల గ్రాండ్ ఫినాలె (ఫైనల్స్) శనివారం రాత్రి జరగబోతోంది. హైటెక్స్ వేదికగా సాగే ఈ కార్యక్రమంలో వివిధ దేశాలకు చెందిన 40 మంది పోటీలో నిలవబోతున్నారు. వారిలో ఒకరు ప్రతిష్టాత్మక ప్రపంచ సుందరి బ్లూ క్రౌన్‌ను సొంతం చేసుకోనున్నారు. ఈ పోటీలను ప్రత్యక్షంగా దాదాపు మూడున్నర వేల మంది తిలకించనుండగా, టీవీల్లో ప్రత్యక్ష ప్రసారాన్ని ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది వీక్షించనున్నారు. మిస్ వరల్డ్ సంస్థ ఈ మేరకు భారీ ఏర్పాట్లు చేసింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సహా పలువురు మంత్రులు, వివిధ రంగాల ప్రముఖులు వేడుకను ప్రత్యక్షంగా తిలకించనున్నారు. విజేతగా నిలిచే కొత్త ప్రపంచ సుందరికి ప్రస్తుత మిస్ వరల్డ్ క్రిస్టీనా పిష్కోవా (చెక్ రిపబ్లిక్) దాదాపు రూ.6.21 కోట్ల విలువైన బ్లూ క్రౌన్‌ను అలంకరించనుంది. శనివారం సాయంత్రం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి వరకు గ్రాండ్ ఫినాలే కొనసాగనుంది. విజేతకు దాదాపు రూ.ఎనిమిదిన్నర కోట్ల ప్రైజ్ మనీ దక్కనుంది.

10 మందికి బెర్తులు ఖరారు

తుది పోటీ 40 మంది మధ్య సాగనుంది. ప్రస్తుతం పోటీలో ఉన్న 108 దేశాల సుందరీమణులను నాలుగు ఖండాల వారీగా విభజించిన విషయం తెలిసిందే. ఇప్పటికే ఐదు చాలెంజ్‌ల ద్వారా ఫాస్ట్ ట్రాక్ పద్ధతిలో 16 మంది ఎంపికయ్యారు. మిగతా 24 మందిని శనివారం జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో న్యాయనిర్ణేతలు ఎంపిక చేస్తారు. మొత్తం 40 మంది నుంచి వివిధ పద్ధతుల ద్వారా ఒక్కో ఖండం నుంచి ఐదుగురు చొప్పున మొత్తం 20 మందిని షార్ట్ లిస్టు చేస్తారు. సెమీ ఫైనల్స్‌లో ఒక్కో ఖండం నుంచి ఇద్దరు చొప్పున మొత్తం 8 మందిని ఫైనల్స్‌కు ఎంపిక చేస్తారు. వీరినుంచి విజేతను, మొదటి, రెండు, మూడో రన్నరప్‌లను ప్రకటిస్తారు.

- హైటెక్స్‌లో సాయంత్రం 6 గంటల నుంచి గ్రాండ్ ఫినాలే
- తుది పోటీలో మిస్ ఇండియా నందినీ గుప్తా సహా 40 మంది సుందరీమణులు
- ప్రత్యక్షంగా వీక్షించనున్న మూడున్నర వేల మంది
- ప్రత్యక్ష ప్రసారం ద్వారా తిలకించనున్న కోట్లాది మంది
- ప్రధాన న్యాయ నిర్ణేతగా సినీ నటుడు సోనూసూద్
- విజేతకు బ్లూ క్రౌన్ అలంకరించనున్న మిస్ వరల్డ్–2024 క్రిస్టీనా



అలరించనున్న బాలీవుడ్ తారలు

మిస్ వరల్డ్ 2016 స్టెఫానీ డెల్ వాలె, భారతీయ ప్రెజెంటర్ సచిన్ కుంభర్ హోస్టులుగా వ్యవహరిస్తారు. బాలీవుడ్ తారలు జాక్వెలిన్ ఫెర్నాండెజ్, ఇషాన్ ఖట్టర్ ఫైనల్స్‌లో స్టేజ్ పైన లైవ్ ప్రదర్శనలు ఇవ్వనున్నారు. ప్రపంచ సుందరి పోటీలకు ప్రధాన న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తున్న సినీ నటుడు సోనూసూద్‌కు ఈ సందర్భంగా మానవతావాది పురస్కారాన్ని మిస్ వరల్డ్ సంస్థ అందించనుంది. కోవిడ్ సహా వివిధ సందర్భాల్లో ఆయన చేసిన సామాజిక సేవా కార్యక్రమాలకు గాను ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు. సోనూసూద్ కాకుండా, ఇతర జ్యూరీలుగా సుధా రెడ్డి, డాక్టర్ కారినా టర్రెల్ (మిస్ ఇంగ్లాండ్ 2014), మిస్ వరల్డ్ సీఈఓ జూలియా మోర్లీ, మిస్ వరల్డ్ 2017, బాలీవుడ్ నటి మానుషి చిల్లర్ వ్యవహరించనున్నారు.

వివిధ చాలెంజ్‌ల ద్వారా ఎంపికైన వారు వీరే..

స్పోర్ట్స్ చాలెంజ్: విజేత మిస్ ఎస్తోనియా ఎలిస్ రాండ్‌మా
టాలెంట్ చాలెంజ్: విజేత మిస్ ఇండోనేసియా మోనికా కెజియా సెంబిరింగ్
హెడ్ టు హెడ్ చాలెంజ్: విజేతలు మిస్ వేల్స్, మిస్ తుర్కియే, మిస్ ట్రినిడాడ్–టొబాగో, మిస్ జాంబియా
ఫైనల్ పోటీలో ఆసియా నుంచి తుర్కియే భామ ఇదిల్ బిల్గెన్, ఆఫ్రికా నుంచి ఫెయిత్ బ్వాల్వా, అమెరికా–కరీబియన్ దీవుల నుంచి ట్రినిడాడ్ అండ్ టొబాగోకు చెందిన అన్నా లిసే నాన్టన్, యూరప్ నుంచి వేల్స్ ముద్దుగుమ్మ మిల్లీ మీ ఆడమ్స్ ఎంపికయ్యారు.
టాప్ మోడల్ చాలెంజ్: విజేతలు: మిస్ ఇండియా, మిస్ నమీబియా, మిస్ మార్టినిక్, మిస్ ఐర్లాండ్
రెండు రోజుల క్రితం జరిగిన మల్టీమీడియా చాలెంజ్‌లో ఆఫ్రికా నుంచి కామెరూన్ సుందరి ఇస్సీ ప్రిన్సెస్, అమెరికా నుంచి డొమినిక్ రిపబ్లిక్ నుంచి మాయ్‌రా డెల్‌గాడో, ఏషియా–ఓషియానియా నుంచి థాయ్‌లాండ్ ముద్దుగుమ్మ సుచతా చౌంగ్‌శ్రీ, యూరప్ నుంచి మోంటెనిగ్రో సుందరి ఆండ్రీ నికోలిక్‌లు విజయం సాధించారు.

మిల్లా మాగీపై మిస్ వరల్డ్ సంస్థ చర్యలు: జయేశ్ రంజన్

పోటీల నుంచి అర్ధాంతరంగా నిష్క్రమించి పోటీల తీరుపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీపై మిస్ వరల్డ్ సంస్థ న్యాయపరంగా చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ తెలిపారు. లండన్ కోర్టులో కేసు దాఖలు చేసిందని వెల్లడించారు. అక్కడి ప్రభుత్వం కూడా ఆమెపై చర్యలకు ఉపక్రమించిందని చెప్పారు. ఆమె చేసిన వ్యాఖ్యలపై రాష్ట్ర ప్రభుత్వం కూడా విచారణ జరిపినా ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదని స్పష్టం చేశారు.

న్యూయార్క్ టైమ్‌స్క్వేర్‌పై తెలంగాణ సోయగం

సాక్షి, హైదరాబాద్: అమెరికాలోని న్యూయార్క్ నగరంలో ఉన్న ప్రఖ్యాత టైమ్స్‌స్క్వేర్‌పై తెలంగాణ సంస్కృతి తళుక్కున మెరిసింది. 'తెలంగాణ– జరూర్ ఆనా' అంటూ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న 72వ మిస్ వరల్డ్ –2025 పోటీల వీడియోను టైమ్స్‌స్క్వేర్‌పై ప్రదర్శించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉన్న ఆ వీడియో న్యూయార్క్ వాసులను ఎంతగానో ఆకట్టుకుంది.



2న రాజ్‌భవన్‌కు కొత్త ప్రపంచ సుందరి

హైటెక్స్‌లో జరిగే మిస్ వరల్డ్ తుది పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జయేశ్ రంజన్ తెలిపారు. శనివారం విజేతగా నిలిచి కొత్త ప్రపంచ సుందరిగా అవతరించే యువతి జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజ్‌భవన్‌లో జరిగే ప్రభుత్వ అధికారిక కార్యక్రమానికి హాజరవుతుందని వెల్లడించారు.

గ్రామపాలనాధికారుల ఫలితాలు విడుదల

- 3,560 మంది ఉత్తీర్ణులు
- జూన్ 1 లేదా 2 నియామక పత్రాలు
- మిగతా గ్రామాలకు కూడా రెవెన్యూ వ్యవస్థ నుంచే: పొంగులేటి



సాక్షి, హైదరాబాద్: గ్రామపాలనాధికారుల (జీపీవో) నియామకం కోసం నిర్వహించిన పరీక్ష ఫలితాలను ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. 3,560 మంది ఉత్తీర్ణులైనట్లు రెవెన్యూ శాఖ వెల్లడించింది. గత ప్రభుత్వ హయాంలో రద్దయిన వీఆర్వో, వీఆర్ఏ వ్యవస్థలను గ్రామ స్థాయిలో పునరుద్ధరించడంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం నియమించ తలపెట్టిన జీపీవోల కోసం గతంలో వీఆర్వో, వీఆర్ఏలుగా పనిచేసిన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానించారు. వారిలో 5,300 మంది దరఖాస్తు చేసుకోగా, 4,558 మంది పరీక్ష రాశారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణులైన వారికి జూన్ 1 లేదా 2వ తేదీల్లో నియామక పత్రాలు అందజేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని 10,956 రెవెన్యూ గ్రామాలకు గాను ఈ జీపీవోలను నియమిస్తామని, ఇప్పుడు ఉత్తీర్ణులయిన వారు పోను మిగతా గ్రామాలకు కూడా రెవెన్యూ వ్యవస్థ నుంచే నియమిస్తామని వెల్లడించారు. జీపీవోల నియామక ప్రక్రియను వేగవంతంగా చేపడుతున్నందుకు తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసింది. సంఘం అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం శుక్రవారం సచివాలయంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసి శాలువాతో సత్కరించింది. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ..జూన్ 3వ తేదీ నుంచి జీపీవోలు విధుల్లో చేరే అవకాశమున్నందున, అదే రోజున రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న రెవెన్యూ సదస్సులను విజయవంతం చేయాలని కోరారు. రెవెన్యూ ఉద్యోగ సంఘాల నేతలు కె.రామకృష్ణ, ఎస్.రాములు, పాక రమేశ్, బాణాల రాంరెడ్డి, వి.భిక్షం, గరికె ఉపేందర్‌రావు, లక్ష్మీనర్సింహ, పూల్‌సింగ్ చౌహాన్, ఎం.రాధ, సుజాత చౌహాన్, శ్రీనివాస్, రాఘవేందర్ తదితరులు మంత్రిని కలిశారు.

స్త్రీనిధి బ్యాంకులో 163 ఖాళీల భర్తీ

- 'స్త్రీనిధి' సమావేశంలో మంత్రి సీతక్క వెల్లడి



సాక్షి, హైదరాబాద్: స్త్రీనిధి క్రెడిట్ కోఆపరేటివ్ ఫెడరేషన్ లిమిటెడ్‌లో 163 ఖాళీలను అతి త్వరలో భర్తీ చేస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. శుక్రవారం స్త్రీనిధి కార్యాలయంలో జరిగిన మేనేజింగ్ కమిటీ సమావేశానికి మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ, స్త్రీనిధి ప్రధాన కార్యాలయం కోసం హిమాయత్ నగర్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని కేటాయిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా త్వరలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి స్వయం సహాయక సంఘాల్లో కొత్త సభ్యులను చేర్చుకుంటామన్నారు. సుప్రీంకోర్టు అనుకూల తీర్పు ఇవ్వటంతో రాష్ట్రంలో మైక్రోఫైనాన్స్ సంస్థలు అడుగుపెట్టాయని, 26% వడ్డీలు వసూలు చేస్తూ మహిళా సంఘాలను వేధిస్తున్నాయని అన్నారు. ఈ నేపథ్యంలో మైక్రోఫైనాన్స్ సంస్థల వైపు మహిళలు వెళ్లకుండా సెర్ప్, మెప్మా, స్త్రీనిధి బ్యాంకు కృషి చేయాలన్నారు. మహిళలు మైక్రోఫైనాన్స్ సంస్థలను ఆశ్రయించవద్దని సూచించారు. ఎలాంటి వేధింపులు, వడ్డీల భారం లేకుండా మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజీ రుణాలు ఇస్తున్నట్లు వివరించారు. ఈ అవకాశాన్ని మహిళా సంఘాలు వినియోగించుకోవాలన్నారు. ఈ సమావేశంలో సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్, స్త్రీ నిధి ఎండీ విద్యాసాగర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూర్పు కుదిరినట్టేనా!

- పీసీసీ కొత్త కమిటీలపై భిన్నాభిప్రాయాలు
- 66 మందిలో 40 వరకు బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ నేతలు
- జూనియర్లకు ప్రాధాన్యం ఇవ్వటంపై సీనియర్ల పెదవి విరుపు

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘ ఎదురుచూపుల తర్వాత కాంగ్రెస్ అధిష్టానం ప్రకటించిన పీసీసీ కమిటీల కూర్పుపై ఆ పార్టీ నేతల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రాజకీయ వ్యవహారాలు, సలహా, డీలిమిటేషన్, సంవిధాన్ బచావో, క్రమశిక్షణ కమిటీలను గురువారం ఏర్పాటుచేసిన విషయం విదితమే. ఈ కమిటీల్లో మొత్తం 66 మందికి చోటు కల్పించారు. ఈ కమిటీల్లో సామాజిక న్యాయానికి గతం కంటే పెద్దపీట వేశారనే చర్చ ఓ వైపు జరుగుతుండగా, కమిటీల కూర్పు బాగా లేదని కొందరు పెదవి విరుస్తున్నారు. కొందరు నేతలకు పునరావాసం కల్పించేందుకే సలహా కమిటీని ఏర్పాటు చేశారని విమర్శిస్తున్నారు. పీఏసీలో జూనియర్లకు, ఇతర పార్టీల నుంచి వచ్చిన ప్యారాచూట్లకు స్థానం కల్పించడం సరైంది కాదని అంటున్నారు.

బీసీలకు ప్రాధాన్యం

సామాజిక వర్గాలవారీగా పరిశీలిస్తే మొత్తం 66 మంది నేతల్లో 20 మంది వరకు బీసీలున్నారు. అంటే దాదాపు 30 శాతానికిపైగా బీసీలకు ప్రాతినిధ్యం కల్పించారు. ఒక కమిటీకి బీసీ నేత వినయ్‌కుమార్‌ను చైర్మన్‌గా నియమించారు. ఎస్సీ, ఎస్టీలు కలిపి 15 మంది, నలుగురు మైనార్టీలు కూడా ఉన్నారు. మొత్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు కలిపి దాదాపు 40 మందికి కమిటీల్లో స్థానం లభించింది. మిగిలిన ఓసీ నేతల్లో రెడ్డి సామాజిక వర్గానికి ఎప్పటిలాగే అధిక ప్రాధాన్యం లభించింది. కమ్మ, బ్రాహ్మణ, వెలమ వర్గాలకు కూడా స్థానం కల్పించారు. పీఏసీతోపాటు మరో రెండు కమిటీల్లో కమ్మ సామాజిక వర్గం నేతలకు అవకాశం కల్పించడం ద్వారా ఏఐసీసీ గతం కంటే ఆ సామాజిక వర్గానికి ప్రాధాన్యతం ఇచ్చినట్టయ్యింది. కీలకమైన పీఏసీ కూర్పులో సామాజిక న్యాయమే ఎజెండాగా అధిష్టానం ముందుకెళ్లినట్టు అర్థమవుతోందని సీనియర్ కాంగ్రెస్ నేతలు చెపుతున్నారు.

ట్రిపుల్ ఎల్‌పై చర్చ

కూర్పులో అధిష్టానం తీరును కొందరు సీనియర్లు తప్పుపడుతున్నారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన నాటినుంచి లాంగివిటీ, లాయల్టీలను పట్టించుకోకుండా లాబీయిస్టు (ట్రిపుల్ ఎల్)లకు అవకాశాలిస్తున్నారని, ఈ కమిటీల్లో కూడా ఇదే జరిగిందని విమర్శిస్తున్నారు. జూనియర్లకు, ప్యారాచూట్లకు పీఏసీలో అవకాశమిచ్చి.. సీనియర్లను సలహా కమిటీ పేరుతో బయటకు పంపినట్టుగా కనిపిస్తోందని అంటున్నారు. సీనియర్లకు గౌరవం ఇవ్వాలనుకుంటే పార్టీకి, ప్రభుత్వానికి సలహాలిచ్చేందుకు నలుగురైదుగురు ముఖ్యులతో కమిటీ ఏర్పాటు చేసి ఉంటే బాగుండేదని చెబుతున్నారు. 16 మందితో ఏర్పాటుచేసిన కమిటీ ఏం సలహాలిస్తుందని ప్రశ్నిస్తున్నారు. కొన్నిపేర్లు రెండు కమిటీల్లో ఉన్నాయని, రాష్ట్ర పార్టీలో నాయకులే లేనట్టు ఒకే పేరు రెండు కమిటీల్లో పెట్టడమెందుకనే ప్రశ్న కూడా వినిపిస్తోంది. అసలు క్షేత్రస్థాయి నాయకత్వానికి పదవులు ఇచ్చే టీపీసీసీ కార్యవర్గాన్ని ప్రకటించకుండా ఎప్పుడూ పదవులు వచ్చే నేతల పేర్లతో కమిటీలు ఏర్పాటు చేయడం వల్ల ప్రయోజనమేంటని కొందరు ప్రశ్నిస్తున్నారు. అయితే, పీసీసీ కార్యవర్గానికి కొద్ది సమయమే పడుతుందని, త్వరలోనే ఆ కమిటీలు కూడా వస్తాయని పీసీసీ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ తెలిపారు. కమిటీల కూర్పులో అధిష్టానం అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుంటుందని, ముఖ్యంగా సామాజిక న్యాయానికి ఈసారి పెద్దపీట వేసిందని 'సాక్షి'తో మాట్లాడుతూ వెల్లడించారు.

క్లుప్తంగా...



బాసరలో భారీగా అక్షరాభ్యాసాలు

బాసర: వేసవి సెలవులు ముగింపు దశకు రావడంతో.. నిర్మల్ జిల్లా బాసర జ్ఞాన సరస్వతీదేవి ఆలయానికి భక్తులు పోటెత్తుతున్నారు. అమ్మవారిని దర్శించుకుని పిల్లలకు అక్షరాభ్యాస పూజలు చేయిస్తున్నారు. శుక్రవారం భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరిలో పుణ్యస్నానాలు చేసి అమ్మవారి దర్శనానికి బారులు తీరారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక నుంచి భక్తులు వేల సంఖ్యలో తరలి వచ్చారు. వారికి ఇబ్బంది కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. సుమారు వెయ్యి మంది అక్షరాభ్యాస పూజలు చేయించారు.

వరంగల్‌లో ఉగ్ర కదలికలు

హసన్‌పర్తి: వరంగల్‌లో ఉగ్రవాదుల కదలికలు ఉన్నట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) గుర్తించింది. శుక్రవారం నగరంలోని ఎల్‌బీ నగర్‌కు చెందిన ఓ యువకుడిని అదుపులోకి తీసుకుంది. ఆ యువకుడిని విచారించగా అతడు మరో ఇద్దరి పేర్లను వెల్లడించినట్లు తెలిసింది. ఈ బృందం దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పేలుళ్లకు కుట్ర పన్నుతున్నటలే సమాచారం. ఈ బృంద సభ్యులు ఆత్మహత్యాదళంగా కూడా పనిచేస్తారని తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న యువకుడి వివరాలు వెల్లడించాల్సి ఉంది.

గోదావరిలో కాలుష్యంపై ఎన్జీటీ ఆగ్రహం

- తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలికి నోటీసులు

సాక్షి, న్యూఢిల్లీ: గోదావరి నదిలో నీటి కాలుష్యంపై జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి, తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలితోపాటు ఇతర సంబంధిత అధికారులకు నోటీసులు జారీ చేసింది. గోదావరి ప్రవాహం మానవ చర్యల వల్ల భయంకర స్థాయిలో కలుషితమవుతోందని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో గోదావరి నదిలో కాలుష్యం తీవ్రంగా పెరిగినట్టు ఒక మీడియా నివేదిక పేర్కొనగా, దానిపై ఎన్జీటీ సుమోటోగా తీసుకొని స్పందించింది 'భద్రాచలం వద్ద గోదావరి నీరు నలుపుగా మారి దుర్గంధం రావడం, మానవ వినియోగానికి వీలులేకుండా పోవటం భయానక పరిణామం'అని ఎన్జీటీ చైర్‌పర్సన్ జస్టిస్ ప్రకాశ్ శ్రీవాస్తవ, ఎక్స్‌పర్ట్ మెంబర్ ఏ.సెంటిల్ వెల్ నేతృత్వంలోని బెంచ్ గురువారం ఇచ్చిన ఆదేశంలో పేర్కొంది.

మహారాష్ట్రలో నాసిక్ నుంచి పైఠాన్ వరకు గోదావరి ప్రవాహం 300 కి.మీ. దూరం అధిక స్థాయిలో సేంద్రియ కాలుష్యం ఉందని, ఇది జలచరాల జీవనానికి ముప్పు తెస్తోందని ఆందోళన వ్యక్తంచేసింది. ఏపీలోని రాజమహేంద్రవరం నుంచి ధవళేశ్వరం బరాజ్ వరకు గోదావరి ప్రవాహం అత్యంత కలుషితమైందని పేర్కొంది. నాసిక్, నాందేడ్ వంటి ప్రాంతాల్లో వ్యవసాయ భూముల నుంచి రసాయన ఎరువులు, పురుగుమందులు నేరుగా గోదావరి నదిలో కలుస్తున్నాయని తెలిపింది. ఈ కేసులో తెలంగాణ, కేంద్ర కాలుష్య నియంత్రణ మండళ్లతోపాటు గోదావరి నది యాజమాన్య బోర్డు చైర్మన్‌ను ప్రతివాదులుగా చేర్చి నోటీసులు జారీచేసింది. కాలుష్యంపై సమాధానమివ్వాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఆగస్టు 1న చెన్నైలోని దక్షిణ బెంచ్ ముందు జరగనుంది.

స్పెల్లింగ్ బీ విజేత హైదరాబాదీ

అమెరికాలో 13 ఏళ్ల జకీ ఘనత • తన ప్రత్యర్థులవీ భారత మూలాలే



ఓక్సన్ హిల్ (అమెరికా): హైదరాబాద్‌కు చెందిన ఫైజన్ జకీ అనే 13 ఏళ్ల బాలుడు అమెరికా జాతీయ స్పెల్లింగ్ బీ చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచాడు. ఫైనల్లో జకీతో పోటీపడ్డ మరో ఇద్దరు చిన్నారులు సర్వజ్ఞ కదం, సర్వ్ ధరవనెవి కూడా భారత మూలాలే కావడం విశేషం. గురువారం రాత్రి జరిగిన ఫైనల్లో వారిద్దరినీ జకీ అలవోకగా ఓడించాడు. తద్వారా గతేడాది వెంట్రుకవాసిలో తప్పిపోయిన స్క్రిప్స్ నేషనల్ స్పెల్లింగ్ బీ చాంపియన్‌షిప్‌ను ఈసారి సగర్వంగా సాధించాడు. రెండో స్థానంలో నిలిచిన 14 ఏళ్ల కదం కాలిఫోర్నియావాసి. కాగా మూడో స్థానంలో నిలిచిన సర్వ్ వయసు కేవలం 11 ఏళ్లే. జార్జియాకు చెందిన అతనికి మరో మూడేళ్లు పోటీల్లో పాల్గొనే అవకాశముంది. అత్యంత కఠినమైన, ప్రతిష్టాత్మకమైన స్పెల్లింగ్ బీ పోటీలకు ఇది 100వ ఏడాది కావడం విశేషం. ఈసారి పోటీ 21 రౌండ్ల పాటు హోరాహోరీగా సాగింది. 18వ రౌండ్లోనే జకీకి గెలిచేందుకు సువర్ణావకాశం వచ్చింది. కదం, సర్వ్ వరుసగా రెండు స్పెలింగులు తప్పు చెప్పారు. కానీ జకీ కూడా తనకిచ్చిన పదం తాలూకు వివరణ కూడా వినకుండానే బదులిచ్చేందుకు తొందరపడ్డాడు. కానీ తొలి అక్షరమే తప్పుగా చెప్పాడు. అయినా నిరాశ పడకుండా మరో మూడు రౌండ్ల తర్వాత 'ఎక్లెయిర్‌సిస్‌మెంట్'పదం స్పెలింగ్ సరిగా చెప్పడం ద్వారా విజయపతాక ఎగురవేశాడు. ఆ వెంటనే ఆనందం పట్టలేక వేదికపై కుప్పకూలిపోయాడు. ''గెలుస్తానని అనుకోలేదు. ఈ అనుభూతిని వర్ణించేందుకు మాటల్లేవు''అంటూ సంబరపడిపోయాడు. జకీ కొంతకాలంగా ఫ్రెంచ్ నేర్చుకుంటున్నాడు. దాంతో ఫ్రెంచ్ మూలాలున్న 'ఎక్లెయిర్‌సిస్‌మెంట్'స్పెల్లింగ్ చెప్పడం సులువుగా మారింది. ప్రైజ్‌మనీ కింద అతనికి 50 వేల డాలర్లు (దాదాపు రూ.42 లక్షలు) లభించాయి. అందులో అధిక మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు విరాళంగా ఇస్తానని జకీ ప్రకటించాడు. ఈసారి తుది రౌండ్లకు అర్హత సాధించిన చిన్నారుల్లో మరో నలుగురు భారతీయులుండటం విశేషం.

గతేడాది రన్నరప్

స్పెల్లింగ్ బీ పోటీల్లో పాల్గొనడం జకీకి ఇది నాలుగోసారి. ఇందుకోసం ఏడేళ్ల వయసు నుంచే కఠోరంగా సాధన చేస్తూ వచ్చాడు. 2019లో ఏడేళ్ల వయసులోనే తొలిసారి పోటీల్లో పాల్గొన్నా 370వ స్థానంతో సరిపెట్టుకున్నాడు. 2023లో రెండోసారి సెమీస్ దాకా చేరి 21వ స్థానంలో నిలిచాడు. 2024లో మాత్రం ఒక్క స్పెల్లింగ్ కూడా తప్పు చెప్పకుండా ఫైనల్ రౌండ్ దాకా దూసుకెళ్లాడు. అక్కడ తాను సాధన చేయని లైటెనింగ్ రౌండ్ ఎదురైంది. అయినా హోరాహోరీ తలపడి టై బ్రేకర్ దాకా తీసుకెళ్లినా చివరికి రెండో స్థానంతో సరిపెట్టుకున్నాడు. అతనిపై నెగ్గిన బృహత్ సోమవి కూడా భారత మూలాలే. ఈసారి టైటిల్ సాధనలో జకీకి అతను అండదండగా నిలిచాడు. జకీ కుటుంబం టెక్సాస్‌లో డాలస్‌లోని అలెన్‌లో నివసిస్తోంది. స్థానిక సీఎం రైస్ మిడిల్ స్కూల్లో అతను సెవెన్త్ గ్రేడ్ చదువుతున్నాడు. ''మావాడు రెండేళ్లకే చదవడం మొదలు పెట్టాడు. చూస్తుండగానే ఇంగ్లిష్ డిక్షనరీ మొత్తాన్నీ బట్టీ పట్టేశాడు''అని జకీ తల్లిదండ్రులు అర్షియా, అన్వర్ ఆనందంగా చెప్పుకొచ్చారు. ఇప్పుడిక మ్యాథ్స్ ఒలింపియాడ్ తన తదుపరి లక్ష్యమని వివరించారు. జకీ తాత, నానమ్మ కూడా హైదరాబాద్ నుంచి ఫైనల్‌ను ఆసాంతం వీక్షించారు.

మనోళ్లదే హవా

అమెరికా జాతీయ స్పెల్లింగ్ బీ పోటీల్లో ఏళ్ల తరబడి భారత సంతతి బాలలే ఆధిపత్యం చలాయిస్తున్నారు. గత 36 పోటీల్లో ఏకంగా 30 సార్లు విజేతలుగా నిలిచి సత్తా చాటారు.

ప్రపంచ బైక్ రైడర్.. సన్నీ యాదవ్

- ఇప్పటివరకు 40కిపైగా దేశాల్లో బైక్ రైడింగ్
- అక్కడి విశేషాలను తన యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తూ భారీగా సంపాదన
- బెట్టింగ్ ప్రమోషన్స్‌పై సన్నీ యాదవ్‌పై కేసు నమోదు
- తాజాగా చెన్నైలో అదుపులోకి తీసుకున్న ఎన్ఐఏ



తల్లిదండ్రులతో బయ్యా సన్నీ యాదవ్(ఫైల్)

సూర్యాపేటటౌన్/నూతనకల్: యూట్యూబ్ వ్లాగర్, బైక్ రైడర్ అనగానే గుర్తొచ్చే పేరు బయ్యా సన్నీ యాదవ్. సూర్యాపేట జిల్లా నూతనకల్‌కు చెందిన ఈ కుర్రాడు తనకున్న ఆసక్తితో బైక్ రైడ్‌తో ప్రపంచ దేశాలను చుట్టేశాడు. 40కి పైగా దేశాలు తిరిగి అక్కడి విశేషాలను తన యూట్యూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేశాడు. దీంతో సోషల్ మీడియాలో లక్షల్లో వ్యూస్ వచ్చాయి. బెట్టింగ్ ప్రమోషన్స్ సైతం చేస్తుండటంతో ఇటీవల నూతనకల్ పోలీస్ స్టేషన్‌లో అతనిపై కేసు నమోదైంది. ఇటీవల పాకిస్తాన్‌లో బైక్ రైడ్ చేసి ఆ వీడియోలను తన యూట్యూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేశాడు. ఓ నెటిజన్ ఫిర్యాదు మేరకు తాజాగా చెన్నైలో ఎన్ఐఏ అధికారులు అతడిని అదుపులోకి తీసుకొని ఢిల్లీ కార్యాలయంలో విచారిస్తున్నట్టు సమాచారం.

పాలిటెక్నిక్ ఆపేసి..

బయ్యా రవీందర్–శ్రీదేవి దంపతులకు ఇద్దరు కుమారులు. వీరిలో పెద్ద కుమారుడు సన్నీ యాదవ్, చిన్న కుమారుడు కళ్యాణ్. సన్నీ పాఠశాల విద్యను నూతనకల్‌లో, సూర్యాపేటలో చదవగా, ఖమ్మంలో పాలిటెక్నిక్ కోర్సులో చేరాడు. చదువును మధ్యలోనే ఆపేసి ఓపెన్ విధానంలో డిగ్రీ పూర్తి చేశాడు. సన్నీకి చిన్నప్పటి నుంచి బైక్ రైడింగ్ అంటే ఇష్టం. పాలిటెక్నిక్ చేస్తున్న సమయంలోనే తన తండ్రి సహకారంతో పల్సర్ బైక్ కొన్నాడు. అదే సమయంలో 2012లో బయ్యా సన్నీ యాదవ్ పేరుతో యూట్యూబ్ చానల్ ఏర్పాటు చేశాడు. దేశంలో పలు ప్రాంతాల్లో బైక్ రైడింగ్ చేస్తూ తన వీడియోలను యూటూబ్ చానల్‌లో అప్‌లోడ్ చేసేవాడు. కానీ అప్పటి వరకు పెద్దగా వ్యూస్ రాలేదు. ముంబై నిఖిల్ రైడర్ వీడియోలను చూసి.. అతడిని ఆదర్శంగా తీసుకుని 2021లో లద్దాఖ్‌కు బైక్‌పై వెళ్లి అక్కడి ప్రాంతాలను వీడియో తీసి తన చానల్‌లో అప్‌లోడ్ చేశాడు. దీంతో తన చానల్‌కు 2 లక్షల వ్యూస్ వచ్చాయి. దీంతో ఆదాయం కూడా రావడంతో భారత్ నుంచి అమెరికా వరకు బైక్ రైడింగ్ చేస్తూ వెళ్లాడు. ఆ తర్వాత సన్నీ 40కి పైగా దేశాల్లో బైక్ రైడింగ్ చేసి పేరు గడించాడు.

ఆర్నెల్లకో.. ఏడాదికో ఇంటికి..

సన్నీ నిత్యం బైక్ రైడింగ్‌తో బిజీగా ఉంటాడని, విదేశాలకు వెళితే ఆర్నెల్లకో ఏడాదికో గానీ ఇంటికి రాడని కుటుంబ సభ్యులు చెప్పారు. వచ్చినా వారంకన్నా ఎక్కువ రోజులు ఉండడని తెలిపారు. ప్రస్తుతం సన్నీ యూట్యూబ్ చానల్‌కు 4.7 మిలియన్స్ వ్యూస్ రావడంతో లక్షల్లో ఆదాయం వస్తున్నట్టు తెలిసింది. వీటికితోడు పలు ప్రైవేట్ కంపెనీలతో అగ్రిమెంట్ కుదుర్చుకొని ప్రమోషన్స్ చేస్తున్నట్టు సమాచారం. అలాగే బెట్టింగ్ యాప్ ప్రమోషన్లతో భారీగానే డబ్బులు సంపాదించినట్టు పోలీసులు గుర్తించారు. సన్నీ తన ఆదాయం గురించి ఎప్పుడూ చెప్పడని తల్లిదండ్రులు తెలిపారు. ప్రస్తుతం నూతనకల్‌లో నూతన ఇంటిని కూడా తామే సొంతంగా నిర్మించుకుంటున్నామని, సన్నీకి సంబంధం లేదన్నారు.

మా కుమారుడి ఆచూకీ చెప్పండి: బయ్యా రవీందర్, సన్నీ తండ్రి

సన్నీ ఏ తప్పు చేయలేదు. వివిధ దేశాల్లో బైక్ రైడ్ చేస్తూ అక్కడి సంస్కృతి, జీవనశైలిపై వీడియోలు చేస్తూ యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నాడు. పాకిస్తాన్‌కు ఫిబ్రవరి 6న వెళ్లి ఏప్రిల్ 10న ఇంటికి వచ్చాడు. కానీ అక్కడ బైక్ రైడ్ చేసిన వీడియోలను ఈ మధ్యనే అప్‌లోడ్ చేశాడు. నా కుమారుడు ఇక్కడికి వచ్చిన తర్వాతే పహల్గాం దాడి జరిగింది. వారం క్రితమే చెన్నైలో తన ఫ్రెండ్‌ను కలిసేందుకు వెళ్లాడు. ఈ నెల 27న కూడా నాతో ఫోన్‌లో మాట్లాడాడు. ఆ తర్వాత ఫోన్ కలవడం లేదు. ఎన్ఐఏ అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు వార్తల్లో చూశా. కానీ మాకు ఎలాంటి సమాచారం లేదు. మా కుమారుడి ఆచూకీ తెలిపి మాకు అప్పగించాలి.

జూరాలకు తగ్గిన వరద ప్రవాహం



జూరాల ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదలవుతున్న నీరు

ధరూరు/దోమలపెంట: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గుముఖం పట్టినట్లు అధికారులు తెలిపారు. గురువారం రాత్రి వరకు ప్రాజెక్టుకు లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. శుక్రవారం రాత్రి 7 గంటలకు 60 వేల క్యూసెక్కులకు తగ్గినట్లు ప్రాజెక్టు అధికారులు చెప్పారు. దీంతో ప్రాజెక్టు 5 క్రస్టు గేట్లను ఎత్తి 20,155 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. అయితే రాత్రి 10 గంటల సమయంలో ఇన్‌ఫ్లో 50 వేల క్యూసెక్కులకు తగ్గడంతో ఈ గేట్లను మూసివేశారు. కాగా, ఎగువ, దిగువ జల విద్యుత్ కేంద్రంలో ఆరు యూనిట్లలో విద్యుదుత్పత్తిని కొనసాగిస్తున్నారు. అలాగే కుడి కాల్వ ద్వారా 150 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 1,500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 7.627 టీఎంసీల నీరు నిల్వ ఉంది.


శ్రీశైలంకు నీటి ప్రవాహం: శ్రీశైలం ప్రాజెక్టుకు వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 37,082 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 4,345.. మొత్తం 41,427 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం జలాశయానికి వచ్చి చేరుతోంది. ప్రస్తుతం శ్రీశైలంలో 821.9 అడుగుల వద్ద 42.2774 టీఎంసీల నీటి నిల్వ ఉంది. భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేసి సాగర్‌కు 3,617 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

సింగూరు.. వరద నీరు..

- ప్రాజెక్టులోకి తొలిసారిగా మే నెలలో వరద
- 4,316 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

పుల్‌కల్(అందోల్): సింగూరు ప్రాజెక్టు కు జలకళ వచ్చింది. తొలిసారి మే నెలలోనే ఇన్‌ఫ్లో చేరింది. మహారాష్ట్రలోని లాతూర్‌లో కురిసిన భారీ వర్షాల వల్ల మంజీరా నదిలోకి వరదలు రావడంతో.. సింగూరు ప్రాజెక్టులోకి 4,316 క్యూసెక్కుల నీరు చేరింది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 523.600 మీటర్లకు 29.917 టీఎంసీలు కాగా ప్రస్తుతం డ్యామ్‌లో 520.745 మీటర్లకు 17.360 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు ఏఈ మహిపాల్‌రెడ్డి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలోని ఆయకట్టు కాలువలకు సిమెంట్ లైనింగ్ చేస్తున్నందున.. గత యాసంగి నుంచి క్రాప్ హాలీడే ప్రకటించారు. దీంతో రైతులు బోరు బావుల కింద పంటలు సాగు చేస్తున్నారు.

సింగూరు ప్రాజెక్టులో వరద నీరు





కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లో జరిగిన సభలో గూగీ

● స్మరణ

ఆ అక్షరం అమ్మ గోరుముద్ద

స్త్రీ హృదయం, ఉద్యమం తెలిసిన మహా రచయిత గూగీ వా థియాంగో. గూగీని అక్షర ప్రపంచంలోకి తీసుకువచ్చింది... మహిళ. అతడి అక్షర బలానికి ఇంధనం... మహిళా చైతన్యం...

అమ్మ లేకపోతే 'గూగీ' ప్రపంచ సాహిత్యానికి పరిచయం కాకపోయేవారేమో! 'నాయనా... నాకు అక్షరం ముక్క రాదు. ఏంచేస్తావో, ఎలా చేస్తావో... నువ్వు మాత్రం బాగా చదువుకోవాలి' అని ఎప్పుడూ అంటూ ఉండేది. 'అమ్మ కోరుకున్నట్లే బాగా చదువుకున్నాను. మంచి స్థితిలో ఉన్నాను' అని సంతృప్తి పడి ఆకాశం వైపు మాత్రమే చూస్తూ కూర్చోలేదు గూగీ. వెనక్కి తిరిగి చూశారు.

'నాయనా... నువ్వు ఇంకా చదువుకోవాలి' అని అమ్మ అడిగినట్లు అనిపించింది. ఈసారి విశ్వ విద్యాలయం చదువులు కాదు తన కెన్యా జాతిజనుల జీవితాలను లోతుగా, మరింత లోతుగా చదివారు. కలానికి పదును పెట్టారు. మూలాలు మరవని గూగీ ప్రపంచ ప్రసిద్ధ రచయిత అయ్యారు.

అమ్మ నా హీరో

'నా హీరోలు ఇద్దరు. ఒకరు జోమో కెన్‌యట్టు. రెండో వ్యక్తి వాన్‌జీకూ' అనేవారు గూగీ. కెన్యన్ ప్రజల కోసం పోరాడిన యోధుడు జోమో కెన్‌యట్టు. రెండో వ్యక్తి గూగీ అమ్మ. వాన్‌జీకూ ప్రసిద్ధ ఉద్యమ నాయకురాలు కాకపోవచ్చు. అయితే ఉద్యమ చైతన్యం ఆమె వ్యక్తిత్వంలో మెరిసిపోయేది. ఆమె విద్యాధికురాలు కాకపోవచ్చు. అయితే ఆమె మాటల్లో, విశ్లేషణల్లో మేధస్సు కనిపించేది. ఆమెకు అక్షరం ముక్క కూడా తెలియదు. అయితే అక్షరం విలువ తెలుసు.

'మా అమ్మకు చదవడం, రాయడం రాదు. అయితే నేను బాగా చదువుకోవాలని కోరుకునేది.



బాగా చదువుకోవాలనే తన కలను నా ద్వారా నిజం చేసుకోవాలనుకునేది' అంటారు గూగీ. గూగీ నాన్నకు నలుగురు భార్యలు. 28 మంది పిల్లలు. వాన్‌జీకూ (గూగీ అమ్మ) మూడో భార్య. తనది రాజ్యహింస బాధిత కుటుంబం అనవచ్చు.

'కెన్యా ల్యాండ్ అండ్ ఫ్రీడమ్ ఆర్మీ'లో పనిచేస్తున్న ఒక సోదరుడు, స్టేట్ ఎమర్జెన్సీ సమయంలో మరో సోదరుడు హత్యకు గురయ్యారు. హోమ్ గార్డ్‌లు(కికుయూ హోంగార్డ్) చేతిలో తల్లి చిత్రహింసలకు గురైంది. గూగీ తొలి నవల 'వీప్, నాట్ చైల్డ్'లో అమ్మ కనిపిస్తుంది. ఇందులో కథానాయకుడి కల... ఎలాంటి పరిస్థితుల్లో అయిన బాగా చదువుకోవాలని. ఎందుకంటే అది తన తల్లి కల.

చిన్న వాళ్లు అయినా... పెద్ద మనసుతో...

'నేను ప్రసిద్ధ రచయితను' అనే అహం గూగీలో కనిపించేది కాదు. తన కంటే వయసులో చాలా చిన్న వాళ్ల నుంచి అయినా నేర్చుకునే, ఆలోచన తీరును మార్చుకునే, అభినందించే మంచి పద్ధతి గూగీలో ఉంది. దీనికి ఉదాహరణ నైజీరియన్ రచయిత్రి చిమమాండా అదిచే. 1977లో పుట్టింది. నాలుగు నవలలు, రెండు చిన్న కథా సంకలనాలు, వ్యాసాల పుస్తకాలు తీసుకువచ్చింది.

ఆమె నవలల్లో ఒకటైన 'హాఫ్ ఆఫ్ ఏ యెల్లో సన్' గూగీకి ఇష్టమైన నవల. నైజీరియన్ అంతర్యుద్ధానికి సంబంధించి తండ్రి చెప్పిన విషయాల ఆధారంగా ఈ నవల రాసింది. 'ఆమె నవలలోని పాత్రల గురించి ఆలోచించకుండా బియాఫ్రాన్ యుద్ధం గురించి ఎప్పుడూ ఆలోచించలేదు' అంటారు గూగీ. అమెరికన్ న్యూస్ టెలివిజన్ ప్రోగ్రాం....రేచల్ మాదో షో(టీఆర్‌ఎంఎస్). రేచల్ మాదో నిర్వహించే ఈ పోగ్రాం అంటే గూగీకి చాలా ఇష్టం. 'డ్రిఫ్ట్: ది అన్ మోర్నింగ్ ఆఫ్ అమెరికన్ మిలిటరీ పవర్' 'బ్లోఅవుట్: కరప్టెడ్ డెమోక్రసీ' 'బ్యాగ్‌మ్యాన్: ది వైల్డ్‌క్రైమ్స్' 'ప్రీక్వెల్: యాన్ అమెరికన్ ఫైట్ అగేనెస్ట్ ఫాసిజం' పుస్తకాలు రాసింది రేచల్.

'ఎంతటి జటిలమైన విషయాలను అయినా సులభంగా అర్థమయ్యేలా చెప్పడంలో రేచల్ దిట్ట. ఆమె అద్భుతమైన కథకురాలు. రేచల్ ప్రోగ్రామ్‌లో కనిపించాలనేది నా కల' అన్నారు గూగీ.

ఆమె సలహా ఎప్పుడూ గుర్తుపెట్టుకునేవారు

గ్రామీణుల మాటల్లో విలువైన జీవిత సత్యాలు, అనుసరించదగిన మాటలు ఉంటాయి. అందుకే వారి మాటలు వినడం అంటే గూగీకి ఇష్టం. కెన్యాలో మహిళా రైతు అయిన నెరి వాచాంగ ఇలా అన్నది... 'మరో అయిదు పనులు నీ మీద పడకముందే నీ ముందు ఉన్న అయిదు పనులు పూర్తి చెయ్యి. అలా కాకుండా ఒకేసారి పది పనులు చేయడం ఎంత భారం!' 'వాచాంగ ఇచ్చిన సలహాను పాటిస్తుంటాను. పాటిస్తే ఎలాంటి ఇబ్బంది ఉండదు. పాటించకపోతేనే ఇబ్బంది' అంటుండేవారు గూగీ.

ఉద్యమ మహిళల గొంతుక

అద్భుత చైతన్యం ఉన్న ఎన్నో తరాల మహిళలను ప్రత్యక్ష్యంగా చూశారు గూగీ. అందుకే ఆయన రచనల్లో పోరాట పటిమ ఉన్న మహిళలు, సామాజిక, రాజకీయ మార్పు కోసం చేసే ఉద్యమాలలో క్రియాశీల పాత్ర పోషించే మహిళలు, పురుషాధిపత్యాన్ని కాలదన్ని తమదైన మార్గంలో నడిచి స్ఫూర్తినిచ్చే మహిళలు ఉంటారు. స్త్రీలపై సాగే దోపిడి, అణచితవేతను అక్షరబద్ధం చేశారు గూగీ. కష్టాలు, కన్నీళ్లు మహిళలను ఉద్యమపథంలోకి వెళ్లకుండా అడ్డుపడలేవని తన నవలల ద్వారా చెప్పారు గూగీ.

బులియన్

30న ముగింపు (బంగారం 10 గ్రా.: వెండి కిలో) రూ.లలో

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

హైదరాబాద్		**రాజమండ్రి**	
బంగారం (24 క్యారెట్లు)	96,110	బంగారం (24 క్యారెట్లు)	98,140
బంగారం (22 క్యారెట్లు)	89,430	బంగారం (22 క్యారెట్లు)	91,880
వెండి	99,000	వెండి	99,500
విజయవాడ		**ప్రొద్దుటూరు**	
బంగారం (24 క్యారెట్లు)	98,140	బంగారం (24 క్యారెట్లు)	95,600
బంగారం (22 క్యారెట్లు)	89,200	బంగారం (22 క్యారెట్లు)	87,950
వెండి	99,500	వెండి	98,700
విశాఖపట్నం		**చెన్నై**	
బంగారం (24 క్యారెట్లు)	97,310	బంగారం (24 క్యారెట్లు)	97,300
బంగారం (22 క్యారెట్లు)	89,200	బంగారం (22 క్యారెట్లు)	89,200
వెండి	1,10,900	వెండి	1,11,000

● కిచెన్ టిప్స్



మిగిలిపోయిన చపాతీ, బ్రెడ్‌స్లైసులు గట్టిగా అయిపోయి తినడానికి పనికిరావు. వీటిని ప్లేటులో పెట్టి, ఈ ప్లేటులోనే అరగ్లాసు నీటిని కూడా ఉంచి, మైక్రోవేవ్‌లో పదినిమిషాలు ఉంచాలి. ఇలా చేయడం వల్ల నీళ్ల ఆవిరిగా మారి చపాతి, బ్రెడ్‌స్లైసులు మెత్తబడి, అప్పుడే చేసినవాటిలా తాజాగా ఉండి, తినడానికి పనికొస్తాయి.



● వేపుడు కూరలు వండేటప్పుడు టీస్పూను వెనిగర్ వేస్తే కూర అంతగా నూనె పీల్చుకోదు.

● సన్నని మంట మీద యాపిల్ తొక్కలు మరిగించిన నీటితో అల్యూమినియం పాత్రలను తోమితే మొండి మరకలు ఇట్టే పోతాయి.

మిస్ వరల్డ్ 2025



నేడు ఫినాలే
బ్యూటీ కిరీటం ఎవరికి?

అందం అంటే ఆత్మవిశ్వాసం..
అందం అంటే ఓ సామాజిక బాధ్యత..
అందం అంటే సాధికారత..
అందం అంటే ఎమోషనల్ బ్యాలెన్స్, ఫిజికల్ ఫిట్‌నెస్..

అనే అందమైన నిర్వచనాలను స్థిరపరుస్తూ సాగుతున్న మిస్ వరల్డ్ పోటీలకు ఈసారి హైదరాబాద్ వేదికైంది! ఈ పోటీలు ఫైనల్‌కి వచ్చాయి.

మిస్ వరల్డ్ కిరీటం ఎవరికి దక్కనుందో తేలేది నేడే! నూటఎనిమిది దేశాలకు చెందిన సుందరీమణులు పోటీ పడుతున్న ఆ బ్యూటీ పాజెంట్ ఫైనల్ ఎలా ఉండబోతోంది, మిస్ వరల్డ్‌గా ఎంపికైన సుందరి ఏడాదంతా ఏం చేస్తుంది లాంటివి ఆసక్తిని రేకెత్తిస్తాయి.



మిస్ వరల్డ్ పోటీకి విచ్చేసిన వివిధ దేశాలకు చెందిన సుందరీమణులు

హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో సాయంత్రం ఆరున్నరకు మొదలవనున్న మిస్ వరల్డ్ గ్రాండ్ ఫినాలే వేడుకను మిస్ వరల్డ్ 2016 స్టెఫనీ డెల్ బాయే (Stephanie del valle), యాంకర్, వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ సచిన్ కుంబార్.. ఇద్దరూ కలిసి హోస్ట్ చేస్తున్నారు.

ఎంపిక ఇలా..

ముందుగా 108 దేశాల సుందరీమణులు వేదిక మీదికి వస్తారు. అమెరికా– కరిబియన్, ఆఫ్రికా, యూరప్, ఆసియా– ఓషియానియాల నుంచి ఖండానికి పది మంది చొప్పున మొత్తం నలభై మందిని క్వార్టర్ ఫైనల్‌కిసెలెక్ట్ చేస్తారు. అయితే ఇప్పటికే రకరకాల పోటీల్లో ఈ నాలుగు ఖండాల నుంచి పద్దెనిమిది మంది క్వార్టర్ ఫైనల్‌కి చేరుకున్నారు. మిగిలినవారిని పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా సెలెక్ట్ చేసిన జ్యూరీ ఈ రోజు వాళ్ల పేర్లను ప్రకటించి వేదిక మీదికి ఆహ్వానిస్తుంది. ఈ నలభై మంది లోంచి ప్రతి ఖండానికి టాప్ ఫైవ్ చొప్పున, మళ్లీ అందులోంచి ప్రతి ఖండానికి టాప్ 2 లెక్కన సెలెక్ట్ చేస్తారు.

ఫైనల్‌గా..

ఫైనల్‌రౌండ్ వచ్చేసరికి మొత్తం నలుగురు మాత్రమే మిగులుతారు. ఈ నలుగురిని జ్యూరీ ఓ ప్రశ్న అడుగుతుంది. ఆ జవాబును బట్టి మిస్ వరల్డ్‌ను ఎంపిక చేస్తారు. విజేతకు కిందటేడు మిస్ వరల్డ్ క్రిస్టినా పిజ్కోవా అందాల కిరీటాన్ని తొడుగుతుంది. జ్యూరీలో నటుడు సోనూ సూద్, సుధారెడ్డి, మిస్ ఇంగ్లండ్ 2014 డాక్టర్ కెరీనా టరెల్, మిస్ వరల్డ్ చైర్‌పర్సన్ జూలియా మోర్లే సభ్యులుగా ఉంటారు.



● ఐశ్వర్యా రాయ్



● ప్రియాంకా చోప్రా



● రీటా ఫారియా



● హెలెన్ మోర్గన్

గెలిచిన తర్వాత..

మిస్ వరల్డ్ టైటిల్ విజేత తన దేశం తరపున ప్రపంచవ్యాప్త సాంస్కృతిక కార్యక్రమాలు, అధికారిక వేడుకలు, సంబరాలకు ప్రాతినిధ్యం వహిస్తుంది. పలు చారిటీ ప్రోగ్రామ్స్, ప్రాజెక్ట్స్‌లో పాల్గొంటుంది. మిస్ వరల్డ్ సంస్థ తరపున ప్రపంచ యాత్ర చేస్తూ ఆ సంస్థ లక్ష్యాలను ప్రచారం చేస్తుంది. అక్షరాస్యత, పలు సామాజిక అంశాల అవగాహన కార్యక్రమాల్లో పాల్గొంటుంది.

ఇంకా...

● మిస్ వరల్డ్ విజేతకు తొడిగే అందాల కిరీటం ధర రూ. 85 లక్షల పైచిలుకే! 18 క్యారట్ల గోల్డ్‌తో చేసిన ఆ కిరీటం మధ్యలో 62.83 క్యారట్ల డైమండ్ చుట్టూ 1770 చిన్న చిన్న డైమండ్స్ పొదిగి ఉంటాయి. వాటన్నిటి బరువు 175.49 క్యారట్లుంటాయి. దీన్ని ఆ విజేత ముఖ్యమైన ఈవెంట్స్‌లో మాత్రమే ధరిస్తుంది. ప్రపంచ యాత్రలో అసలైన కిరీటాన్ని పెట్టుకోదు. మిస్ వరల్డ్ విజయానికి చిహ్నంగా విజేతకు రెప్లికా క్రౌన్‌ను ఇస్తారు. అసలు కిరీటం మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ దగ్గరే ఉంటుంది. ఈ పోటీలకు వయోపరిమితి 17 ఏళ్ల నుంచి 27 ఏళ్లు.

● టర్మ్ అవకముందే మిస్ వరల్డ్ హోదాకు రాజీనామా చేసిన తొలి మిస్ వరల్డ్ 1974 సంవత్సర విజేత హెలెన్ మోర్గన్. టైటిల్ గెలిచిన నాలుగు రోజులకు ఆమె ఏడాదిన్నర బిడ్డకు తల్లి అని తెలిసిందట. మిస్ వరల్డ్ పోటీల్లో అవివాహితలు మాత్రమే పాల్గొనాలనే నియమాన్ని ఉల్లంఘించినందువల్ల ఆమె రాజీనామా చేయాల్సి వచ్చింది.

● అమెరికా – వియత్నాం యుద్ధంలో అప్పటి మన ప్రభుత్వం వియత్నాం పక్షాన నిలబడింది. దీనికి విరుద్ధంగా మన తొలి మిస్ వరల్డ్ రీటా ఫారియా అమెరికన్ ఎంటర్‌టైనర్ బాబ్ హోప్‌తో కలిసి అమెరికా సైనికులను ఎంటర్‌టైన్ చేసిందని ఆమె చర్య పట్ల అప్పుడు మన ప్రభుత్వం అసంతృప్తి వ్యక్తం చేసింది.

● మిస్ వరల్డ్ పోటీలు మొదలైన నాటి (1951) నుంచి ఈరోజు దాకా మన దేశం ఆరుసార్లు కిరీటాన్ని గెలిచి రికార్డ్ సృష్టించింది.



● డయానా హెడెన్

● విజేతల్లో ఐశ్వర్యా రాయ్‌ను మోస్ట్ బ్యూటిఫుల్ అండ్ మోస్ట్ సక్సెస్‌ఫుల్ మిస్ వరల్డ్‌గా చెబుతుంటారు.

● ఫెయిర్‌నెస్ క్రీమ్ ప్రకటనలకు నో చెప్పిన తొలి మిస్ వరల్డ్‌గా డయానా హెడెన్ (మిస్ వరల్డ్ 1997)ను ప్రస్తావిస్తారు. 'నా ఒంటి రంగు పట్ల నాకెలాంటి రిగ్రెట్స్ లేవు. ఛాయ తక్కువగా ఉండటాన్ని నేను ఆత్మన్యూనతగా ఎప్పుడూ భావించలేదు. ఆ స్కిన్‌టోన్‌తోనే నేను మిస్ వరల్డ్‌గా గెలిచాను. నా దృష్టిలో ఆత్మవిశ్వాసమే అసలైన అందం. కాబట్టి దాన్నే ప్రమోట్ చేస్తాను ఫెయిర్‌నెస్ క్రీమ్స్‌ని కాదు' అని చెప్పింది డయానా.

● అందాల పోటీల్లో చమత్కారం, సునిశిత దృష్టి గల జవాబులకు ప్రియాంక చోప్రా పెట్టింది పేరుగా ఖ్యాతినార్జించింది.

– సరస్వతి రమ
ఫొటో: ఎస్.ఎస్. ఠాకూర్

వంటిల్లు

మష్రూమ్ మేనియా

ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పుట్టగొడుగులతో కేవలం కూరలే కాకుండా, రుచికరమైన చిరుతిళ్లు కూడా చేసుకోవచ్చు. నిజానికి మాంసాహారం తినని వారికి ఇవి చక్కటి ప్రత్యామ్నాయం అంటుంటారు చాలామంది. అలాంటి మష్రూమ్‌తో ఈ టేస్టీ స్నాక్స్ మీకోసం...



మష్రూమ్ పిజ్జాలు

కావలసినవి: పెద్ద పోర్ట బెల్లా పుట్టగొడుగులు– 4 (లోపలి భాగం తొలగించి గుంతలా చేసుకోవాలి); టమాటో సాస్ – 3 టేబుల్ స్పూన్స్; మొజారెల్లా చీజ్ తురుము – అర కప్పు; ఆలివ్ ఆయిల్ – ఒక టేబుల్ స్పూన్; వెల్లుల్లి రెబ్బలు – 2 రెబ్బలు (సన్నగా తరిగినవి); ఉల్లిపాయ ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు, మొక్కజొన్న గింజలు, చిల్లీ ఫ్లేక్స్, పుదీనా తురుము, టమాటో ముక్కలు – కొద్దికొద్దిగా (అభిరుచిని బట్టి); ఉప్పు – సరిపడా; మిరియాల పొడి – చిటికెడు.

తయారీ: ముందుగా ఓవెన్‌ను 200 డిగ్రీల సెల్సియస్‌లో ప్రీహీట్ చేసి పెట్టుకోవాలి. పుట్టగొడుగులకు అన్నివైపులా కొద్దిగా ఆలివ్ ఆయిల్ రాసి, బేకింగ్ ట్రేలో ఉంచి, 5 లేదా 7 నిమిషాలు బేక్ చేసి, బయటికి తీసుకోవాలి. ఇప్పుడు ఆ పుట్టగొడుగుల లోపల పిజ్జా సాస్ రాసి, వాటిలో మొజారెల్లా చీజ్‌తో పాటు ఉల్లిపాయ ముక్కలు, టమాటో ముక్కలు, క్యాప్సికమ్ ముక్కలు, స్వీట్ కార్న్ (వీటితో పాటు అదనంగా నచ్చినవి జోడించుకోవచ్చు) వంటివి వేసుకోవాలి. మళ్ళీ ఓవెన్‌లో పెట్టి, చీజ్ కరిగే వరకూ బేక్ చేసుకుని, వేడి వేడిగా సర్వ్ చేసుకోవచ్చు.



మష్రూమ్ బజ్జీ

కావలసినవి: మష్రూమ్స్ – ఒక కప్పు (శుభ్రం చేసుకుని పెట్టుకోవాలి); శనగపిండి – ఒక కప్పు; బియ్యప్పిండి – 2 టేబుల్ స్పూన్లు; మసాలా, అల్లం వెల్లుల్లి పేస్ట్ – ఒక టీ స్పూన్ చొప్పున; కారం, పసుపు, వాము పొడి, ఉప్పు – కొద్దికొద్దిగా; నీరు, నూనె – సరిపడా; వంట సోడా – కొద్దిగా.

తయారీ: ముందుగా శనగపిండి, బియ్యప్పిండి, అల్లం –వెల్లుల్లి పేస్ట్, కారం, పసుపు, వాము పొడి, ఉప్పు, వంట సోడా వేసుకుని, తగినంత నీళ్లు పోసుకుంటూ బజ్జీల పిండిలా చిక్కగా కలుపుకోవాలి. అనంతరం ఒక్కో పుట్టగొడుగును శనగపిండి మిశ్రమంలో ముంచి నూనెలో డీప్ ఫ్రై చేసుకోవాలి. వేడివేడిగా తింటే భలే రుచిగా ఉంటాయి ఇవి.



మష్రూమ్ కట్లెట్స్

కావలసినవి: పుట్టగొడుగులు – 200 గ్రాములు; బంగాళాదుంపలు – 4 చిన్నవి (ఉడికించి, తొక్క తీసి మెత్తగా గుజ్జులా చేసుకోవాలి); ఉల్లిపాయ – ఒకటి (చిన్నగా తరగాలి); నూనె – సరిపడా; పచ్చిమిర్చి – ఒకటి (సన్నగా తరగాలి); కొత్తిమీర పొడి – ఒక టేబుల్ స్పూన్; ఇంగువ, పసుపు – అర టీస్పూన్ చొప్పున; జీలకర్ర పొడి – ఒక టేబుల్ స్పూన్; గరం మసాలా పొడి – అర టేబుల్ స్పూన్; కొత్తిమీర తరుగు – అర కప్పు; శనగ పిండి – 3 టేబుల్ స్పూన్లు; పాలు – 2 టేబుల్ స్పూన్లు; గుడ్డు – ఒకటి; బ్రెడ్ పౌడర్ – కొద్దిగా; ఉప్పు – తగినంత.

తయారీ: ముందుగా పుట్టగొడుగులను శుభ్రం చేసి, తడిలేకుండా తుడిచి, చిన్న ముక్కలుగా కట్ చేసుకుని నూనెలో డీప్ ఫ్రై చేసుకుని పక్కనపెట్టుకోవాలి. అనంతరం పాన్‌లో నూనె వేడి చేసుకుని ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి ముక్కలు వేయించుకోవాలి. తర్వాత ఇంగువ, పుట్టగొడుగు ముక్కలు, పసుపు, కొత్తిమీర తరుగు, గరం మసాలా, జీలకర్ర పొడి వేసి 2–3 నిమిషాలు ఉడికించి, చల్లారనివ్వాలి. ఇప్పుడు ఆ మిశ్రమంలో బంగాళదుంప గుజ్జు, శనగపిండి, ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి.

ఇప్పుడు చిన్న చిన్న ఉండలుగా చేసుకుని నచ్చిన షేప్‌లో కట్లెట్స్‌లా ఒత్తుకోవాలి. ఇప్పుడు ఒక చిన్న పాత్రలో గుడ్డు, పాలు వేసి బాగా కలిపి, దానిలో ఈ కట్లెట్స్ ముంచి, బ్రెడ్ పౌడర్ పట్టించి, వాటిని నూనెలో దోరగా వేయించుకుంటే సరిపోతుంది. వీటిని టమాటో సాస్‌లో ముంచి తింటే భలే రుచిగా ఉంటాయి.

– సన

● నయా వంచన

అయ్ బాబోయ్... ఏఐ వాయిస్ క్లోనింగ్!



ఆరోజు... ముంబైలో ఉండే కేశవ్‌కు ఫోన్‌కాల్ వచ్చింది. దుబాయ్‌లోని భారత రాయబార కార్యాలయం నుంచి కాల్ చేస్తున్నట్లు చెప్పారు. కొన్ని సెకన్ల తరువాత... ఫోన్‌లో తన కుమారుడు శ్రీకర్ అరుపులు విని కేశవ్ షాక్ అయ్యాడు. 'దయచేసి నాకు బెయిల్ ఇప్పించండి' ఏడుస్తూనే అంటున్నాడు శ్రీకర్. 'మీరు 80,000 రూపాయలు చెల్లించాలి' అని ఫోన్ చేసిన వాళ్లు కేశవ్‌ను డిమాండ్ చేశారు. ఆ భయంలో, బాధలో ఏమీ తోచని కేశవ్ వారు చెప్పినట్లే చేశాడు. అయితే అది మోసం అని తెలుసుకోవడానికి కేశవ్‌కు ఎంతో టైమ్ పట్టలేదు. తన కుమారుడు సురక్షితంగానే ఉన్నాడు.

మరి వాయిస్ మాటేమిటి?

శ్రీకర్ వాయిస్‌ను అనుసరిస్తూ ఏఐ ద్వారా సృష్టించిన ఫేక్ వాయిస్ అది. సైబర్ మోసాలలో ఒకటి... ఏఐ వాయిస్ క్లోనింగ్. ప్రజల భావోద్వేగాలను, బలహీనతలను ఆసరాగా చేసుకొని అడ్వాన్స్‌డ్ టెక్నాలజీతో మోసం చేస్తున్నారు స్కామర్స్. గత కొంతకాలంగా 'వాయిస్ క్లోనింగ్' ఊపందుకుంది. అయితే విద్యావంతులు, విద్యావంతులు కాని వారు అనే తేడా లేకుండా డెబ్బైశాతం మంది క్లోన్ వాయిస్‌లను గుర్తించలేపోతున్నారు. ఒక వ్యక్తి వాయిస్‌ను క్లోన్ చేయడానికి స్కామర్‌లకు జస్ట్ మూడు సెకన్ల సమయం చాలు.

మోసగాళ్ల బారిన పడకుండా కొన్నిచిట్కాలు

'అయ్యో... నన్ను గుర్తుపట్టలేదా!' అంటూ మోసగాళ్లు మాటలు కలుపుతారు.

'సారీ... గుర్తుపట్టలేదు' అంటే ఏమనుకుంటారో అని మొహమాటం కొద్దీ మాట్లాడడం మొదలుపెడతారు కొందరు. అలా చేస్తే మోసగాళ్లకు అవకాశం ఇచ్చినట్లే.

అందుకే... 'నేను ఫలానా...' అని అవతలి వ్యక్తి చెప్పినప్పుడు మీ ఇద్దరికి మాత్రమే తెలిసిన ఒక విషయం గురించి అడగండి. అతను కరెక్ట్ అని చెబితే ఓకే. కానిపక్షంలో అనుమానించాల్సిందే.

● స్నేహితుడు, బంధువు... మొదలైన వారి పేరుతో వచ్చిన కాల్ చాలా తక్కువ టైమ్ మాత్రమే ఉంటే అది వార్నింగ్ సైన్ అనుకోవచ్చు.

● ఏఐ స్కామ్ వాయిస్‌లు తెలియని నంబర్ నుంచి జరుగుతుంటాయి.

● ఆన్‌లైన్‌లో అపరిచితులకు వాయిస్ నోట్స్, వీడియో షేరింగ్ చేయకూడదు.

● నో టొబాకో డే నేడు



బలంగా లాగే ఒక సిగరెట్ దమ్ము... ఆ తర్వాత దమ్మునూ దగ్గునూ తెచ్చిపెట్ట వచ్చు. కేవలం దగ్గూ, దమ్ముతో సరిపెట్ట దది. క్యాన్సర్ లాంటి వాటిని తెచ్చిపెడితే ఇక బాధితుడికి చికిత్స కోసం ఖర్చు పెట్టే దమ్ము కూడా మిగలదు. ఒక సిగరెట్ పఫ్‌తో మన దేహంలోకి వెళ్లే రసాయనాల సంఖ్య దాదాపు ఏడు వేల పైగానే. అందులో ఆరోగ్యానికి కీడు చేసే క్రోమియం, ఆర్సినిక్, లెడ్, క్యాడ్మియం వంటి ప్రమాదకరమైన లోహాల మాట ఎలా ఉన్నా... క్యాన్సరును కలిగించే కార్సినోజెనిక్ పదార్థాలు 60కి పైగానే ఉంటాయి. వాటితో నోరు మొదలుకొని అన్ని రకాల క్యాన్సర్లూ రావడానికి అవకాశాలు చాలా ఎక్కువ. నేడు 'నో టొబాకో డే' సందర్భంగా పొగాకుతో ఆరోగ్యానికి ఒనగూరే దుష్ప్రభావాలను తెలుసుకుందాం. ఇప్పటికైనా ఈ అలవాటు వదులుకునేలా అవగాహన పెంచుకుందాం.

పొగాకు కాదు.. బాకు



పొగాకు వినియోగం అనేక రకాలుగా జరుగుతుంటుంది. ఉదాహరణకు సిగరెట్, బీడీ, చుట్ట, హుక్కా, పైప్, వేపింగ్... ఇలాంటి పొగ పీల్చేవీ; వాటికి తోడు జర్దా, ఖైనీ లంటూ ముసుగులో పొగాకు నమిలేవీ ముక్కుతో పీల్చే నశ్యం వంటివి... ఇలా ఎన్నెన్నో రూపాల్లో పొగాకు వినియోగం జరుగుతుంటుంది. వీటితో ఎన్ని రకాల క్యాన్సర్లు వస్తాయో తెలుసుకుంటే పొగాకు గురించి తలచుకుందామన్నా భయమేస్తుంది.

పొగలో ఉండే విషాలివే...

● **పొలోనియమ్:** రేడియోధార్మిక పదార్థాల్లోని రేడియో యాక్టివ్ మెటీరియల్ క్యాన్సర్‌కు కారణమవుతుందన్న విషయం తెలిసిందే. సిగరెట్ పొగలో ఈ రేడియో ధార్మిక పదార్థం ఉంటుంది. అది క్యాన్సర్ కారకం.

● **బెంజీన్:** మనం రోజూ వాడే పెట్రోలు, గ్యాస్‌లలోంచి వెలువడే అత్యంత వ్యర్థపదార్థమిది.

● **ఫార్మాల్డిహైడ్:** సిగరెట్ పొగలోని ఫార్మాల్డిహైడ్ అనే రసాయనాన్ని మృతదేహాలను సంరక్షించేందుకు వాడతారు. అనేక జువాలజీ ల్యాబ్‌లలో జీవుల మృతదేహాలను గాజుకుప్పెల్లో భద్రపరిచేందుకు వాడే రసాయన పదార్థం ఫార్మాల్డిహైడ్ ద్రావణమే.

● **వినైల్ క్లోరైడ్:** ప్లాస్టిక్ పైపులు, ప్లాస్టిక్ పదార్థాలు తయారు చేయడానికి వినైల్ క్లోరైడ్ వాడతారు. సిగరెట్ తాగడం అంటే ఈ ప్లాస్టిక్‌ను దేహంలోకి తీసుకోవడమే. ఇది కూడా క్యాన్సర్‌కు కారణమయ్యే అంశాల్లో ఒకటి.

ఎన్ని రకాల క్యాన్సర్లు వస్తాయంటే...

నోటి ద్వారా పొగపీల్చే పొగాకుతో నోటి (ఓరల్) క్యాన్సర్లు, గొంతు (ఓరో ల్యారింగ్స్, ఓరో ఫ్యారింగ్స్, హైపోఫ్యారింగ్స్) క్యాన్సర్లు, పొగ నేరుగా వెళ్లే ప్రమాదకరమైన ఊపిరితిత్తుల క్యాన్సర్లు ప్రధానంగా వచ్చే అవకాశముంది. దీంతో పాటు పరోక్షంగా కడుపు క్యాన్సర్లు, పెద్దపేగు క్యాన్సర్లు, బ్లాడర్ క్యాన్సర్లతో పాటు మరీ ముఖ్యంగా ప్రోస్టేట్ గ్రంథికి వచ్చే క్యాన్సర్లు ముఖ్యం. పొగ కారణంగా వచ్చే క్యాన్సర్లు దేహంలోని ఏ భాగాన్నీ వదిలిపెట్టవంటే అది అతిశయోక్తి కాదు.



పొగాకు తెచ్చిపెట్టే మరికొన్ని వ్యాధులు..

పొగతాగడం కేవలం క్యాన్సర్లనే కాకుండా... చాలా రకాల వ్యాధులనూ ప్రేరేపిస్తుంది. గుండెపోటు, రక్తపోటు, పక్షవాతంతో పాటు మధుమేహమూ వచ్చేలా చేస్తుందీ అలవాటు. మామూలు వారితో పోలిస్తే పొగతాగే అలవాటు ఉన్నవారిలో టైప్-2 డయాబెటిస్ వచ్చేందుకు అవకాశాలు 30 నుంచి 40 శాతం మేరకు ఎక్కువ.

ధూమపానం మానేస్తే కలిగే ప్రయోజనాలివి...

● ఆహారం రుచి తెలియడం
● వాసన గ్రహించే శక్తి సాధారణ స్థాయికి రావడం
● చెమట, శ్వాస, జుట్టు, బట్టలు తాజా వాసనతో ఉండటం,
● పళ్లు, గోళ్లు పచ్చబారకుండా ఉండటం
● మెట్టెక్కేటప్పుడు, దిగే సమయంలో, చిన్న చిన్న పనులకు ఆయాసం లేకుండా తేలిగ్గా చేయగలగడం.

దీర్ఘకాలిక ప్రయోజనాలు...

సిగరెట్ మానేసిన తొమ్మిది నెలల్లో దగ్గు, ఆయాసం తగ్గుతాయి. ఊపిరితిత్తులు బలపడతాయి. దేహంలో ఇన్‌ఫ్లమేషన్, ఇన్ఫెక్షన్స్ ముప్పు తగ్గుతుంది. పొగతాగడం మానేసిన ఏడాది తర్వాత కరోనరీ హార్ట్ డిసీజ్ వచ్చే అవకాశాలు గణనీయంగా తగ్గుతాయి. అందుకే ఈరోజు నుంచే పొగతాగడమే కాదు... పొగాకును ఏ రూపంలో వినియోగిస్తున్నా మానేయడమే మంచిది.



డా. బట్టు చైతన్య,
సీనియర్ కన్సల్టెంట్
పల్మునాలజిస్ట్

పీల్చే వారికి ప్రాణాంతకం

ఇంట్లోని కుటుంబ సభ్యుల్లో ఒకరు సిగరెట్ తాగినా అది ఇంటిల్లిపాదీ ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుంది. పక్కనుండేవారు తాగే సిగరెట్ పొగను ఇతరులు పీల్చాల్సి వస్తుండటాన్ని 'ప్యాసివ్ స్మోకింగ్' అంటారు. నేరుగా పొగతాగడం వల్ల కలిగే హాని ఎంతో ప్యాసివ్ స్మోకింగ్ వల్ల కూడా అంతే హాని జరుగుతుందని పరిశోధనల్లో తేలింది. ఒక అధ్యయనంలో తేలిన విషయం ఏమిటంటే... ప్రతి ఏడాదీ ప్యాసివ్ స్మోకింగ్ వల్ల 34,000 మంది ఊపిరితిత్తుల క్యాన్సర్‌తోనూ, 46,000 మంది గుండెజబ్బులతోనూ మృత్యువాతపడుతున్నారని తేలింది. అంతేకాదు... ఇంట్లో ఇతరులు తాగే సిగరెట్‌తో కలిగే ఈ ప్యాసివ్ స్మోకింగ్ ప్రభావం వల్ల ఇంట్లోని పొగతాగని ఇతర కుటుంబ సభ్యులకు... ఆస్తమా, నిమోనియా, బ్రాంకైటిస్, తలనొప్పి, దగ్గు వంటి అనారోగ్యాలు కలుగుతున్నాయని స్పష్టమైంది.



లైఫ్@360

ఈ శునకం గారు హ్యాపీనెస్ ఆఫీసర్





పెట్స్ పేరుకే పెంపుడు జంతువులు కానీ వాటిని సొంత మనుషుల్లా చూసుకునే వాళ్లే ఎక్కువ. వాటికి పేర్లు పెట్టి, పుట్టినరోజులు చేసి ఎంతో ప్రేమగా చూసుకుంటారు చాలామంది. ఇంటిలో పెట్స్‌ను పెంచుకోవడం మామూలే కానీ ఒక ఆఫీసులో స్ట్రెస్ రిలీవర్‌గా.. చీఫ్ హ్యాపీనెస్ ఆఫీసర్‌గా ఒక ఉత్తమజాతికి చెందిన శునకాన్ని నియమించింది ఒక స్టార్టప్ కంపెనీ. అది ఎక్కడో కాదు... హైదరాబాద్‌లోనే.

ఆఫీసులో పని ఒత్తిడి సర్వసాధారణం. ఆ ఒత్తిడి నుంచి ఉద్యోగులను బయట పడేయడం ఎలా? ఆఫీస్‌లో రిక్రియేషన్ క్లబ్ పెట్టడం కన్నా ఓ మేలు జాతి శునకాన్ని రిక్రియేషన్ ఆఫీసర్‌గా నియమిస్తే కాస్త వెరయిటీగా ఉంటుంది కదా అని ఆలోచించింది ఆ స్టార్టప్ కంపెనీ. ఇంకెందుకాలస్యం.... వెంటనే డెన్వర్ అనే ఒక శునకాన్ని కంపెనీలో చీఫ్ హ్యాపీనెస్ ఆఫీసర్‌గా నియమించేసింది. ఇంతకూ ఈ డెన్వర్ ఉద్యోగుల ఒత్తిడిని ఎలా తొలగించగలదు? సంతోషాన్ని ఎలా ఇవ్వగలదనే కదా సందేహం? అక్కడికే వద్దాం...

ఉద్యోగులందరి దగ్గరకూ వరసబెట్టి వస్తారు ఈ ఆఫీసర్‌గారు... అందరినీ ప్రేమగా పలకరిస్తారు. స్నేహపూరితంగా షేక్ హ్యాండ్ (సారీ... ఇక్కడ లెగ్ అనాలి కాబోలు) ఇస్తారు. వీలయితే తనతో ఆడుకోవడానికి రమ్మని బాల్ తెచ్చి ఇస్తారు. ఆడుకున్న వారికి ఆడుకున్నంత సంతోషం. అన్నట్టు గూగుల్ సీయీవో సుందర్ పిచాయ్ కూడా తన స్ట్రెస్ బస్టర్ అయిన పెంపుడు శునకాన్ని తనతోపాటు ఆఫీసుకు తీసుకువస్తారట. ఒత్తిడిగా అనిపించినప్పుడు దానితో ఆడుకుంటారట. మరో విషయం... డెన్వర్‌కు లింక్డ్ ఇన్‌లో ప్రొఫైల్ కూడా ఉంది.. ఫలానా కంపెనీలో చీఫ్ హ్యాపీనెస్ ఆఫీసర్‌గా పని చేస్తున్నట్టుగా.. బాగుంది కదూ...

ఇంట్లో పెట్స్ ఉన్నవాళ్లు ఒత్తిడి లేకుండా.. సంతోషంగా ఉంటారని, ఎక్కువ పని చేస్తారని అధ్యయనాలు చెబుతున్నాయి. అంతేకాదు.. దానిని వాకింగ్‌కి తీసుకెళ్లడం, ఫుడ్ పెట్టడం వంటి వాటివల్ల బీపీ, షుగర్ వంటివి దరిచేరవట.

అందుకే కొన్ని కంపెనీలు తమ ఉద్యోగులను వారి పెట్స్‌తో సహా ఆఫీసుకు వచ్చేందుకు అనుమతిస్తున్నాయట! బాగుంది కదూ...

● యోగా

నిద్రించే ముందు

రాత్రి నిద్రించడానికి ముందు చేసే కొన్ని యోగాసనాల వల్ల జీర్ణక్రియ పనితీరు మెరుగ్గా ఉంటుంది. గ్యాస్ట్రిక్, పొట్ట భాగంలో అధిక కొవ్వు సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుంది. భోజనం చేసిన రెండు గంటల తర్వాతనే ఈ ఆసనాలను సాధన చేయాలి. అప్పుడే నిద్ర, ఉదరకోశ సమస్యలకు సరైన ఫలితాలను పొందుతారు.

పవన ముక్తాసన

యోగా మ్యాట్‌పైన వెల్లకిలా పడుకోవాలి. మోకాళ్లను వంచి, వాటిని ఛాతీ వైపు తీసుకురావాలి. మోకాళ్లను చేతులతో కౌగిలించుకుని, 20 నుండి 30 సెకన్ల పాటు అదే స్థితిలో ఉండాలి. తర్వాత సాధారణ స్థితికి రావాలి. ఈ ఆసనాన్ని 3 నుండి 5 సార్లు పునరావృతం చేయాలి.



సేతు బంధాసన

మ్యాట్‌పైన పడుకొని పాదాల మధ్య కొంత స్పేస్ ఉంచుతూ, తుంటి భాగాన్ని పైకి ఎత్తాలి. రెండు చేతులతో కాలి మడమలను పట్టుకోవాలి. ఈ భంగిమలో శరీరం వంతెన భంగిమను తలపిస్తుంది. 20 నుండి 30 సెకన్ల పాటు అలాగే ఉండి, తర్వాత తుంటిని తిరిగి కిందకు దించాలి. ఈ ఆసనాన్ని 3 నుంచి 5 సార్లు పునరావృతం చేయాలి.

వజ్రాసన

మోకాళ్లను వంచి, పాదాల మీదుగా హిప్ భాగం వచ్చేలా కూర్చోవాలి. వెన్నును నిటారుగా ఉంచాలి. రెండు చేతులను పొట్ట దగ్గరగా ఉంచాలి. దీర్ఘ శ్వాస తీసుకుంటూ, వదలాలి. ఈ ఆసనంలో సౌకర్యంగా ఉన్నంత సేపు కూర్చోవచ్చు.

సాక్షి సినిమా

సూపర్ స్టార్ కృష్ణపై పాట



● వరలక్ష్మి

వరలక్ష్మీ శరత్‌కుమార్ లీడ్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'పోలీస్ కంప్లైంట్'. సంజీవ్ మేగోటి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో నవీన్ చంద్ర, కృష్ణ సాయి, రాగిణి ద్వివేది తదితరులు కీలక పాత్రధారులు. సింగపూర్ బాలకృష్ణ, మల్లెల ప్రభాకర్ నిర్మిస్తున్నారు. మే 31న సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఈ సినిమాలోని వరలక్ష్మి లుక్‌ను విడుదల చేశారు. సంజీవ్ మేగోటి మాట్లాడుతూ– ''మనం చేసే ప్రతి చర్యకి ఫలితంగా అదే తిరిగి మనకు వస్తుందనే కాన్సెప్ట్‌తో హారర్ థ్రిల్లర్ బ్యాక్‌డ్రాప్‌లో సరికొత్తగా చూపించే ప్రయత్నం చేస్తున్నాం'' అని చెప్పారు. సింగపూర్ బాలకృష్ణ, మల్లెల ప్రభాకర్ మాట్లాడుతూ– ''మా సినిమాలో సూపర్ స్టార్ కృష్ణగారి మీద స్పెషల్ సాంగ్ చిత్రీకరించాం. అది సినిమాకే మెయిన్ హైలెట్‌గా నిలవడంతో పాటు అందరికీ గుర్తుండిపోయేలా ఉంటుంది'' అన్నారు. ఈ సినిమాకి కెమేరా: ఎస్ఎన్ హరీష్, సంగీతం: ఆరోహణ సుధీంద్ర, సుధాకర్ మారియో, సంజీవ్ మేగోటి.

సిటీలో మిస్



● జగదీష్, నవీన్ చంద్ర, ఆకాశ్ చల్లా

జగదీష్ ఆమంచి హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'యముడు'. 'ధర్మో రక్షతి రక్షితః' అన్నది ఉపశీర్షిక. ఈ చిత్రంలో శ్రావణి శెట్టి హీరోయిన్‌గా నటించగా, ఆకాశ్ చల్లా మరో లీడ్ రోల్‌లో నటించారు. ఈ సినిమా టీజర్‌ను హీరో నవీన్ చంద్ర విడుదల చేసి, చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. 'అసలేం జరుగుతుందయ్యా సిటీలో..., అసలు విశ్వకి, ఈ ఊరికి సంబంధం ఏమిటి?' అనే డైలాగ్స్ ఈ సినిమా టీజర్‌లో ఉన్నాయి. సిటీలో వరుసగా అమ్మాయిలు మిస్ అవుతూ ఉండటం, యముడు వేషం వేసే వ్యక్తికి, మిస్ అవుతున్న అమ్మాయిలకు ఏమైనా సంబంధం ఉందా? అనేలా ఈ సినిమా కథనం సాగుతుందని విడుదలైన టీజర్‌లోని విజువల్స్ స్పష్టం చేస్తున్నాయి.

మంచి సినిమాలు నిర్మించాలన్నదే లక్ష్యం



● జేజే

''కొత్తవారిని ప్రోత్సహించడం, కొత్త కథల్ని తెరపైకి తీసుకు వచ్చే ప్రయత్నంలో భాగంగా మా 'సోమో బిరానిక్ ఆర్ట్ క్రియేషన్స్' బ్యానర్‌ను ప్రారంభించడం జరిగింది'' అని అన్నారు ఈ సంస్థ అధినేత జేజే. ఈ బేనర్ లోగో లాంచ్ ఈవెంట్‌లో జేజే మాట్లాడుతూ– ''పరిశ్రమలో పరస్పర సహకారం, ఎదుగుదల అనే కాన్సెప్ట్‌తో మా సంస్థ లోగోను డిజైన్ చేయించాం. టాలీవుడ్‌లోకి నిర్మాతగా వస్తుండటం చాలా ఆనందంగా ఉంది. ఇక్కడి పెద్దలు మాకు ఎంతో గైడెన్స్ ఇచ్చారు. ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో మా సంస్థను రిజిస్టర్ చేశాం. త్వరలో మా బ్యానర్‌లో ఓ భారీ సినిమాని ప్రారంభిస్తాం. మంచి సినిమాలు నిర్మించాలన్నదే మా లక్ష్యం'' అని తెలిపారు.

అవార్డులు గౌరవం ఇస్తాయి

– మురళీమోహన్



● అవార్డు జ్యూరీ చైర్మన్ మురళీమోహన్, ఎఫ్‌డీసీ చైర్మన్ 'దిల్' రాజుతో జ్యూరీ సభ్యులు

''రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఇటు తెలంగాణ రాష్ట్రం అటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పదేళ్లుగా అవార్డులు ఇవ్వడం మానేశాయి. ప్రభుత్వం నుంచి ఒక అవార్డు రావాలి, ఆ అవార్డుని ఇంట్లో పెట్టుకోవాలని ఆశిస్తాం. అంతేకానీ డబ్బుల గురించి కాదు... అవార్డులనేవి గౌరవం ఇస్తాయి'' అని నటుడు, నిర్మాత మురళీమోహన్ అన్నారు. తెలంగాణ ప్రభుత్వం అందించనున్న 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్' (2014–2023)కి సంబంధించి జ్యూరీ చైర్మన్‌గా మురళీమోహన్ వ్యవహరించారు. జూన్ 14న హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఈ అవార్డుల వేడుక జరగనుంది. ఈ అవార్డుల వివరాలను ప్రకటించేందుకు తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్, నిర్మాత 'దిల్' రాజుతో కలిసి శుక్రవారం హైదరాబాద్‌లోని ఎఫ్‌డీసీ కార్యాలయంలో మురళీమోహన్ విలేకరులతో మాట్లాడుతూ– ''ప్రతి ఏటా అవార్డులు ఇవ్వాలని ఈ పదేళ్లల్లో ముఖ్యమంత్రులందర్నీ కలిసి విన్నవించాం. అప్పుడు అందరూ ఇద్దాం, చేద్దాం అన్నారు కానీ ఎవ్వరూ ఇవ్వలేదు. ఇప్పుడు రేవంత్ రెడ్డి గారు ఓ స్ఫూర్తితో ప్రజాగాయకుడు గద్దర్‌గారి పేరిట 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'ని ప్రకటించడం సంతోషం. ఈ కమిటీకి 'దిల్' రాజుగారు నన్ను చైర్మన్‌ని చేశారు. మా జ్యూరీలో అందరూ అనుభవం ఉన్నవారిని, సినిమాకి సంబంధం ఉన్న వ్యక్తులనే నియమించారు. అందరం కలిసి చర్చించుకుని ఏకాభిప్రాయంతోనే అవార్డులు ఎంపిక చేశాం. గురువారం సాయంత్రం ఈ అవార్డుల జాబితాను రేవంత్ రెడ్డిగారికి సమర్పించాం. 2014 జూన్ 2 నుంచి సెన్సార్ అయిన సినిమాలను పరిగణనలోకి తీసుకున్నాం. ఈ అవార్డుల ప్రదానానికి కృషి చేస్తున్న రేవంత్ రెడ్డిగారికి తెలుగు చలనచిత్ర పరిశ్రమ తరఫున ధన్యవాదాలు.

తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాలూ కావాలి

అవార్డుల ప్రదానం విషయంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాలు చర్చించుకుని, ఒక అవగాహనకు రావాలి. ఒక్కో ఏడాది ఒక్కో రాష్ట్ర ప్రభుత్వం పురస్కారాలను ప్రకటిస్తే బాగుంటుంది. ఒకే తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాల ప్రభుత్వాలు అవార్డులు ఇవ్వడం బాగుండదు. తెలుగు సినిమాకు రెండు రాష్ట్రాలూ కావాలి. ఒక రాష్ట్రం ఎక్కువ, మరో రాష్ట్రం తక్కువ కాదు'' అని పేర్కొన్నారు.

తెలంగాణ ఎఫ్‌డీసీ చైర్మన్, నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''2014 నుంచి 2023 వరకు ప్రతి ఏడాది మూడు అవార్డుల చొప్పున (తొలి ఉత్తమ చిత్రం, ద్వితీయ ఉత్తమ చిత్రం, తృతీయ ఉత్తమ చిత్రం) ఈ పదేళ్లకు సంబంధించిన సినిమాలను జ్యూరీ చైర్మన్ మురళీమోహన్‌గారి ఆధ్వర్యంలోని జ్యూరీ ఎంపిక చేసింది. అలాగే ఆరు ప్రత్యేక అవార్డులు ఇవ్వనున్నాం. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో నంది అవార్డుల్లో ఉన్న నాలుగు ప్రత్యేక అవార్డు (రఘుపతి వెంకయ్య, బీఎన్ రెడ్డి, నాగిరెడ్డి–చక్రపాణి, ఎన్టీఆర్ జాతీయ అవార్డులు) లతో పాటు అదనంగా తెలంగాణకి చెందిన పైడి జైరాజ్, కాంతారావు పేర్లతోనూ అవార్డులను ఇవ్వనున్నాం. జూన్ 14న 2024కి సంబంధించిన 'గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్'తో పాటు ఈ పదేళ్లకి సంబంధించిన అవార్డులను కలుపుకుని మొత్తం 11 ఏళ్లకి సంబంధించి అదే రోజు ప్రదానం చేస్తాం'' అని తెలిపారు.

ఈ సమావేశంలో జ్యూరీ సభ్యులు కె. దశరథ్, డీవీకే రాజు, ఊహ, ఉమామహేశ్వర రావు, వనజా ఉదయ్, కూచిపూడి వెంకట్, కె. శ్రీధర్ రెడ్డి, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ డా. హరీశ్ తదితరులు పాల్గొన్నారు.

అవార్డుకి ఎంపికైన చిత్రాలు

2014
1. రన్ రాజా రన్ 2. పాఠశాల 3. అల్లుడు శీను

2015
1. రుద్రమదేవి 2. కంచె 3. శ్రీమంతుడు

2016
1. శతమానం భవతి 2. పెళ్ళి చూపులు 3. జనతా గ్యారేజ్

2017
1. బాహుబలి 2, 2. ఫిదా 3. ఘాజీ

2018
1. మహానటి 2. రంగస్థలం 3. కేరాఫ్ కంచరపాలెం

2019
1. మహర్షి 2. జెర్సీ 3. మల్లేశం

2020
1. అల వైకుంఠపురములో.. 2. కలర్ ఫోటో 3. మిడిల్ క్లాస్ మెలోడీస్

2021
1. ఆర్ఆర్ఆర్ 2. అఖండ 3. ఉప్పెన

2022
1. సీతారామం 2. కార్తికేయ 2 3. మేజర్

2023
1. బలగం 2. హనుమాన్ 3. భగవంత్ కేసరి


స్పెషల్ జ్యూరీ అవార్డు: ప్రజాకవి కాళోజీ

ప్రత్యేక అవార్డులు...

ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు: నందమూరి బాలకృష్ణ (హీరో)
పైడి జైరాజ్ ఆల్ ఇండియా ఫిల్మ్ అవార్డు: మణిరత్నం (డైరెక్టర్)
బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు: సుకుమార్ (డైరెక్టర్)
నాగిరెడ్డి–చక్రపాణి ఫిల్మ్ అవార్డు: అట్లూరి పూర్ణచంద్రరావు (నిర్మాత)
కాంతారావు ఫిల్మ్ అవార్డు: విజయ్ దేవరకొండ (హీరో)
రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు: యండమూరి వీరేంద్రనాథ్ (రచయిత)



ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలు పూర్తి చేసుకున్న అద్భుతమైన ఘడియలు ఒక వైపు... ఎన్టీఆర్ నట ప్రస్థాన 75 సంవత్సరాల అమృతోత్సవాలు జరుగుతున్న శుభ ఘడియలు మరోవైపు... నటుడిగా నేను 50 ఏళ్ల స్వర్ణోత్సవం పూర్తి చేసుకున్న శుభ సందర్భం ఇంకోవైపు... కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పద్మభూషణ్‌తో సత్కరించిన ఇలాంటి తరుణంలోనే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నుండి 'ఎన్టీఆర్ జాతీయ అవార్డు'ని నాకు ప్రకటించడం నా అదృష్టంగా, దైవ నిర్ణయంగా, నాన్నగారి ఆశీర్వాదంగా భావిస్తున్నాను. ఇంతటి ప్రతిష్ఠాత్మకమైన పురస్కారానికి నన్ను ఎంపిక చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారికి, జ్యూరీ సభ్యులకు నా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. ప్రపంచం నలుమూలలా ఉన్న తెలుగు ప్రజల దీవెనలు, నాన్నగారి చల్లని కృప, భగవంతుని ఆశీర్వాదాలు నాకు ఎల్లవేళలా ఇలానే ఉండాలని కోరుకుంటున్నాను. – హీరో బాలకృష్ణ



గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్‌లో 'శ్రీమంతుడు, మహర్షి, మేజర్' సినిమాలకు అవార్డులు వచ్చినందుకు సంతోషంగా ఉంది. నా దర్శకులకు, ఈ అవార్డులకు కారణమైన ప్రతి ఒక్కరికీ థ్యాంక్స్. సినిమాను సెలబ్రేట్ చేసే ప్రతిష్ఠాత్మకమైన గౌరవ పురస్కారాలను ఇనిషియేట్ చేసిన తెలంగాణ ప్రభుత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు. – హీరో మహేశ్‌బాబు



తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన అవార్డుల్లో నట ప్రపూర్ణ కాంతారావు ఫిల్మ్ అవార్డుకు నేను ఎంపిక అవడం చాలా ఆనందంగా ఉంది. ఈ అవార్డుని ఎంతో గౌరవంగా భావిస్తున్నా. నాపై నమ్మకంతో ఈ అవార్డుకు నన్ను ఎంపిక చేసిన తెలంగాణ ప్రభుత్వానికి, జ్యూరీ సభ్యులకు కృతజ్ఞతలు. అదే విధంగా 2016కి సంబంధించి రెండో ఉత్తమ సినిమాగా 'పెళ్ళి చూపులు' ఎంపికవడంపై సంతోషంగా ఉన్నాను. ఈ చిత్రానికి నా హృదయంలో ఎప్పటికీ ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈ విజయం నా అభిమానులకు చెందుతుంది. ఎందుకంటే వారి ప్రేమ, అభిమానాలే నన్ను నిరంతరం ముందుకు నడిపిస్తున్నాయి. ఈ ప్రయాణంలో భాగమైన నా దర్శక–నిర్మాతలు, కుటుంబ సభ్యులు, ఇతర చిత్రయూనిట్‌కి థ్యాంక్స్. – హీరో విజయ్ దేవరకొండ



2015వ సంవత్సరానికిగాను మా గుణ టీమ్ వర్క్స్ బ్యానర్ మీద రాగిణి గుణ, నీలిమ గుణ, యుక్త గుణ నిర్మించిన 'రుద్రమ దేవి'కి ఉత్తమ చిత్రంగా గద్దర్ సినిమా అవార్డుని ప్రకటించడం ఆనందంగా, ప్రోత్సాహకరంగా ఉంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారికి, జ్యూరీ చైర్మన్ మురళీమోహన్‌గారికి, మిగతా సభ్యులకు కృతజ్ఞతలు. రుద్రమ దేవిగా అనుష్క అద్భుతంగా నటించారు. గోన గన్నారెడ్డి పాత్రలో మెప్పించిన అల్లు అర్జున్ తెర ముందు, తెర వెనక మా చిత్రానికి వెన్నెముకగా నిలిచారు. సినిమాకు పని చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు. – దర్శక–నిర్మాత గుణశేఖర్



తెలుగు సినిమా మార్గదర్శకులలో బీఎన్ రెడ్డి గారు ఒకరు. ఆయన పేరు మీద అవార్డు అందుకోనుండటం చాలా గౌరవం. నన్నెంతగానో సపోర్ట్ చేస్తున్న నా నిర్మాతలు, నటీనటులు, సాంకేతిక నిపుణులు, ప్రేక్షకులకు ధన్యవాదాలు. తెలంగాణ ప్రభుత్వానికి, గౌరవ జ్యూరీకి నా ధన్యవాదాలు. – దర్శకుడు సుకుమార్

సాక్షి
బిజినెస్
శనివారం
31-5-2025

స్టాక్ మార్కెట్లు
(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
182	83
81,451	24,751

విదేశీ సూచీలు

నాస్‌డాక్	18,920	▽	255
డోజోన్స్	42,077	▽	138
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,772	△	56
డాక్స్	23,998	△	64
షాంఘై	3,347	▽	16
నికాయ్	37,965	▽	469

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	84.90	85.92
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	113.60	116.52
€	యూరో	ఎస్‌బీఐ	95.61	98.31
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.60	60.13
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	53.80	56.00
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.00	68.68
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.93	23.43
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.41	24.19
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.01	12.83

అపోలో హాస్పిటల్స్ లాభం జూమ్

- క్యూ4లో రూ. 390 కోట్లు
- షేరుకి డివిడెండ్ రూ. 10



ముంబై: ఆరోగ్య పరిరక్షణా సేవల దిగ్గజం అపోలో హాస్పిటల్స్ గతేడాది(2024–25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి–మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 54 శాతం జంప్‌చేసి రూ. 390 కోట్లను తాకింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు సహకరించింది. అంతక్రితం ఏడాది(2023–24) ఇదే కాలంలో కేవలం రూ. 254 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 10 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం రూ. 4,944 కోట్ల నుంచి రూ. 5,592 కోట్లకు ఎగసింది. పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం 61 శాతం దూసుకెళ్లి రూ. 1,446 కోట్లను తాకింది. 2023–24లో రూ. 899 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం రూ. 19,059 కోట్ల నుంచి రూ. 21,974 కోట్లకు బలపడింది. రానున్న ఐదేళ్లలో రూ. 8,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు సంస్థ చైర్మన్ ప్రతాప్‌.సి.రెడ్డి పేర్కొన్నారు.


ఫలితాల నేపథ్యంలో సంస్థ షేరు బీఎస్‌ఈలో 0.7% బలపడి రూ. 6,878 వద్ద ముగిసింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

ఇక్రా డివిడెండ్ రూ. 60	గృహాల పొదుపు రూ.22 లక్షల కోట్లు

జీడీపీ వృద్ధి 7.4%

- జనవరి–మార్చి త్రైమాసికంలో నమోదు
- 2023–24 క్యూ4లో 8.4 శాతం
- 2024–25లో 6.5 శాతం
- నాలుగేళ్ల కనిష్టానికి వృద్ధి



న్యూఢిల్లీ: దేశ జీడీపీ వృద్ధి రేటు ఈ ఏడాది జనవరి–మార్చి త్రైమాసికంలో (2024–25 ఆర్థిక సంవత్సరం క్యూ4) 7.4 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది తొలి మూడు నెలల్లో నమోదైన వృద్ధి రేటు 8.4 శాతంతో పోల్చితే ఒక శాతం క్షీణించింది. 2024–25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి వృద్ధి రేటు 6.5 శాతానికి తగ్గింది. ఇది నాలుగేళ్ల కనిష్ట వృద్ధి రేటు కావడం గమనార్హం. అంతకుముందు ఆర్థిక సంవత్సరంలో (2023–24) 9.2 శాతంగా ఉంది. క్యూ4తోపాటు గత ఆర్థిక సంవత్సరం మొత్తం మీద తయారీ రంగం డీలా పడడం వృద్ధి రేటును ప్రభావితం చేసింది. అదే సమయంలో వ్యవసాయ రంగం బలమైన పనితీరు నమోదు చేయడం ఊరటనిచ్చే అంశం. 2024–25 ఆర్థిక సంవత్సరానికి జీడీపీ 330.68 లక్షల కోట్లు (3.9 ట్రిలియన్ డాలర్లు)గా నమోదైంది. వచ్చే ఐదేళ్లలో 5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకునేందుకు మార్గం సుగమమైంది. ''రియల్ జీడీపీ (ప్రామాణిక) లేదా స్థిరమైన ధరల ఆధారిత జీడీపీ 2024–25లో 187.97 లక్షల కోట్లుగా ఉంది. 2023–24 సంవత్సరానికి జీడీపీ సవరించిన అంచనాల ప్రకారం 176.51 లక్షల కోట్లుగా ఉంది. అంటే 6.5 శాతం వృద్ధి రేటు నమోదైంది. నామినల్ జీడీపీ (వస్తు సేవల తుది ధరల ఆధారంగా) 2024–25లో రూ.330.68 లక్షల కోట్లుగా వచ్చింది. 2023–24 సంవత్సరానికి రూ.301.23 లక్షల కోట్లుగా ఉంది. అంటే 9.8 శాతం వృద్ధి రేటు నమోదైంది'' అని జాతీయ గణాంక కార్యాలయం (ఎన్‌ఎస్‌వో) ప్రకటించింది.

2024 అక్టోబర్–డిసెంబర్ త్రైమాసికంలో జీడీపీ వృద్ధి రేటు 6.4 శాతంగా ఉంటే, 2024 జూలై–సెప్టెంబర్ క్వార్టర్‌కు 5.6 శాతం, 2024 ఏప్రిల్–జూన్ త్రైమాసికానికి 6.5 శాతం చొప్పున ఉండడం గమనార్హం. ఈ ఏడాది మొదటి మూడు నెలల్లో చైనా జీడీపీ 5.4 శాతం వృద్ధిని సాధించింది.

డీలా పడిన తయారీ రంగం

- ముఖ్యంగా గత ఆర్థిక సంవత్సరంలో తయారీ రంగం ఎక్కువ క్షీణతను చవిచూసింది. ఈ రంగం 2023–24 ఆర్థిక సంవత్సరంలో 12.3 శాతం వృద్ధి రేటు నమోదు చేయగా, గత ఆర్థిక సంవత్సరంలో 4.5 శాతానికి పరిమితమైంది.
- ఇదే కాలంలో వ్యవసాయ రంగం మెరుగైన వృద్ధితో ఆదుకుంది. 2023–24 సంవత్సరంలో వ్యవసాయ రంగంలో వృద్ధి రేటు 2.7 శాతమే కాగా, గత ఆర్థిక సంవత్సరంలో 4.6 శాతానికి పుంజుకున్నది.
- గత ఆర్థిక సంవత్సరం క్యూ4లో తయారీ రంగం వృద్ధి రేటు 4.8 శాతానికి పరిమితమైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం క్యూ4లో నమోదైన 11.3 శాతంతో పోల్చి చూస్తే గణనీయంగా తగ్గింది. ఈ గణాంకాల ఆధారంగా తయారీ రంగం ఇంకా కుదుటపడలేదని తెలుస్తోంది.
- ఇక వ్యవసాయ రంగం గత ఆర్థిక సంవత్సరం క్యూ4లోనూ మెరుగైన పనితీరు చూపించింది. వృద్ధి రేటు 5.4 శాతానికి చేరింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం చివరి క్వార్టర్‌కు ఇది 0.9 శాతంగా ఉంది.
- నిర్మాణ రంగంలో వృద్ధి రేటు 10.8 శాతంగా నమోదైంది. అంతకుముందు ఏడాది ఇదే కాలంలో 8.7 శాతంగా ఉంది.
- విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర యుటిలిటీ సేవల్లో వృద్ధి రేటు జనవరి–మార్చి త్రైమాసికంలో 5.4 శాతంగా ఉంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరం క్యూ4లో వృద్ధి రేటు 8.8 శాతంగా ఉంది.
- క్యూ4లో సేవల రంగంలో (ట్రేడ్, హోటల్, రవాణా, కమ్యూనికేషన్, ప్రసార సేవలు) జీవీఏ వృద్ధి (స్థూల విలువ జోడింపు) రేటు అంతకుముందు ఆర్థిక సంవత్సరం క్యూ4లో ఉన్న 8.8 శాతం నుంచి 5.4 శాతానికి తగ్గింది.
- ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, వృత్తి సేవల పరంగా వృద్ధి క్యూ4లో 7.8 శాతానికి పరిమితమైంది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం ఇదే కాలంలో ఇది 9 శాతంగా ఉంది.

నాలుగో ఏడాది వేగవంతమైన వృద్ధి



భారత్ వరుసగా నాలుగో ఏడాదీ అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా తన వృద్ధి క్రమాన్ని కొనసాగించినట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. గత ఆర్థిక సంవత్సరం జీడీపీ గణాంకాలు వెలువడడంతో ఆమె స్పందించారు. క్యూ4లో తయారీ రంగం చక్కని పనితీరు చూపించడం జీడీపీ వృద్ధి రేటు పూర్తి ఆర్థిక సంవత్సరానికి 6.5% చేరడానికి దారితీసినట్టు చెప్పారు. ''భారత్ నాలుగో ఏడాది వేగవంతమైన ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది. చిన్న, మధ్య, భారీ పరిశ్రమల కృషి వల్లే ఇది సాధ్యమైంది. మన తయారీ, సేవల సామర్థ్యాలు చురుగ్గానే ఉన్నాయి. వ్యవసాయం సైతం స్థిరమైన వృద్ధిని చూపిస్తోంది''అని మంత్రి చెప్పారు.

అంచనాల మేరకే ద్రవ్యలోటు

2024–25లో 4.8 శాతం

గత ఆర్థిక సంవత్సరానికి (2024–25) జీడీపీలో ద్రవ్యలోటును 4.8 శాతానికి కట్టడి చేయాలన్న లక్ష్యాన్ని కేంద్ర ప్రభుత్వం సాధించింది. రూ.15,77,270 కోట్లుగా నమోదైనట్టు కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్ (సీజీఏ) ప్రకటించింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో పార్లమెంట్‌కు ప్రభుత్వం సమర్పించిన సవరించిన అంచనాల ప్రకారం ద్రవ్యలోటు రూ.15,69,527 కోట్ల కంటే కేవలం రూ.7వేల కోట్ల మేర (లక్ష్యంలో 105 శాతం) అదనంగా నమోదైంది.



ఇక గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ ఆదాయం రూ.30.36 లక్షల కోట్లుగా ఉంది. సవరించిన బడ్జెట్ అంచనాల్లో ఇది 98.3 శాతానికి సమానం. 2024–25లో ప్రభుత్వ వ్యయం రూ.46.55 లక్షల కోట్లుగా ఉందని, సవరించిన బడ్జెట్ అంచనాల్లో ఇది 98.7 శాతానికి సమానమని సీజీఏ తెలిపింది. ఇక 2023–24 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వ ద్రవ్యలోటు 5.63 శాతంగా ఉండడం గమనార్హం.

తయారీ రంగ దన్ను కావాలి

- విప్లవాత్మక మార్పులకు తెరతీయాలి
- నీతి ఆయోగ్ సీఈవో సుబ్రహ్మణ్యం



న్యూఢిల్లీ: అభివృద్ధి చెందిన దేశంగా భారత్ ఆవిర్భవించాలంటే ప్రధానంగా తయారీ రంగం అండగా నిలవాల్సి ఉంటుందని నీతి ఆయోగ్ సీఈవో బీవీఆర్ సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా తయారీ రంగంలో విప్లవాత్మక మార్పులకు తెరతీయవలసి ఉన్నదని సలహా ఇచ్చారు. తద్వారా 2047కల్లా భారత్ అభివృద్ధి చెందిన దేశంగా అవతరించడంలో తయారీ రంగం కీలక పాత్ర పోషించనున్నట్లు అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా వ్యవసాయ రంగం నుంచి ప్రజలను మళ్లించవలసి ఉన్నట్లు పరిశ్రమల సమాఖ్య(సీఐఐ) ఇక్కడ ఏర్పాటు చేసిన ఒక సదస్సులో సుబ్రహ్మణ్యం ప్రస్తావించారు. దేశీయంగా మొత్తం నైపుణ్య వ్యవస్థను పునర్వ్యవస్థీకరించే యోచనలో ఉన్నట్లు వెల్లడించారు.

స్వల్ప నష్టాలతో ముగిసిన మార్కెట్లు

- సెన్సెక్స్ 182 పాయింట్లు డౌన్
- 81,451 వద్ద ముగింపు



ముంబై: స్టాక్ సూచీలకు లాభాలు ఒక రోజుకే పరిమితమయ్యాయి. ప్రపంచ దేశాలపై సుంకాల విధింపునకు సంబంధించి అప్పీల్స్ కోర్టులో ట్రంప్ ప్రభుత్వానికి సానుకూలంగా తీర్పురావడంతో మరోసారి వాణిజ్య ఉద్రిక్తతలు తెరపైకి వచ్చాయి. ఫలితంగా ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాలు తలెత్తడంతో శుక్రవారం సెన్సెక్స్ 182 పాయింట్లు నష్టపోయి 81,451 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 83 పాయింట్లు పతనమై 24,751 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి ప్రతికూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయమే బలహీనంగా మొదలయ్యాయి. దేశీయ జీడీపీ గణాంకాల వెల్లడికి ముందు ఇన్వెస్టర్లు అప్రమత్తత వహించడంతో సూచీలు పరిమిత శ్రేణిలో ట్రేడయ్యాయి.

చిన్న రుణ గ్రహీతలను మినహాయించండి

- పసిడి రుణాల్లో సామాన్యులకు ఊరట
- ఆర్‌బీఐ నిబంధనలపై ఆర్థిక శాఖ



న్యూఢిల్లీ: బంగారం రుణాల విషయంలో సామాన్యులకు ఊరట కలిగించే దిశగా కేంద్ర ఆర్థిక శాఖ కీలక సూచన చేసింది. ఆర్‌బీఐ ముసాయిదా నిబంధనలను పరిశీలించిన కేంద్ర ఆర్థిక శాఖ రూ.2 లక్షల వరకు బంగారం రుణాలు తీసుకునే వారిని ప్రతిపాదిత నిబంధనల నుంచి మినహాయించాలని కోరింది. చిన్న రుణ గ్రహీతలకు సకాలంలో, వేగంగా రుణ వితరణ జరిగేందుకు ఈ సూచన చేసినట్టు తెలిపింది. తమిళనాడులో రాజకీయ పార్టీల నుంచి దీనిపై విమర్శలు వ్యక్తమవుతున్న వేళ ఆర్థిక శాఖ ఈ సూచన చేయడం గమనార్హం. బంగారం రుణాల్లో మరింత పారదర్శకత పెంపొందించే దిశగా ఆర్‌బీఐ ఈ ఏడాది ఏప్రిల్ 9న ముసాయిదా నిబంధనలు విడుదల చేయడం గమనార్హం.

సాక్షి స్పోర్ట్స్



సెమీస్‌లో సాత్విక్ సాయిరాజ్‌-చిరాగ్ శెట్టి జంట

సింగపూర్: భారత స్టార్ బ్యాడ్మింటన్ పురుషుల డబుల్స్ జోడీ సాత్విక్ సాయిరాజ్‌–చిరాగ్ శెట్టి సింగపూర్ ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లింది. వరల్డ్ టూర్ సూపర్‌–750 టోర్నీలో భాగంగా శుక్రవారం క్వార్టర్స్‌లో సాత్విక్‌–చిరాగ్ జంట 21–17, 21–15తో ప్రపంచ నంబర్‌వన్ జోడీ గోహ్ జ్ ఫెయి–నూర్ ఇజుద్దీన్ (మలేసియా)పై గెలుపొందింది. గాయాల కారణంగా మూడు నెలల విరామం అనంతరం బరిలోకి దిగిన తొలి టోర్నమెంట్‌లో భారత జంట అదరగొడుతోంది. క్వార్టర్స్‌లో సంపూర్ణ ఆధిపత్యం కనబరుస్తూ వరల్డ్ నంబర్‌వన్ జోడీని వరుస గేమ్‌ల్లో చిత్తుచేసింది. 'ఇది పెద్ద గెలుపు. ప్రస్తుతం మేం 27వ ర్యాంక్‌లో ఉన్నాం. అగ్ర స్థానంలో ఉన్న ప్లేయర్లపై గెలవడం ఎప్పుడూ ఆనందంగానే ఉంటుంది. మా ప్రదర్శనతో సంతృప్తిగా ఉన్నాం. మిగిలిన మ్యాచ్‌ల్లోనూ ఇదే తీవ్రత కొనసాగిస్తూ టైటిల్ అందుకోవాలనుకుంటున్నాం' అని సాత్విక్‌–చిరాగ్ వెల్లడించారు.

'చాలా బాగా ఆడుతున్నావు'



ఐపీఎల్‌లో చెలరేగి అందరి దృష్టిలో పడిన 14 ఏళ్ల వైభవ్ సూర్యవంశీకి నేరుగా ప్రధాని నరేంద్ర మోదీ నుంచి ప్రత్యేక ప్రశంస లభించింది. పట్నా విమానాశ్రయంలో శుక్రవారం తారసపడిన వైభవ్‌ను మోదీ అభినందించారు. వైభవ్ వెంట అతని తల్లిదండ్రులు కూడా ఉన్నారు. 'వైభవ్ క్రికెట్ నైపుణ్యంపై దేశమంతా గొప్పగా చెబుతున్నారు. భవిష్యత్తులో అతను మరింత బాగా రాణించాలని ఆకాంక్షిస్తున్నా' అని మోదీ ట్వీట్ చేశారు.

కరుణ్ నాయర్ సెంచరీ

తొలి రోజు భారత్ 'ఎ' 409/3



కాంటర్‌బరీ: ఇంగ్లండ్ 'ఎ'తో ప్రారంభమైన తొలి అనధికారిక టెస్టులో భారత 'ఎ' బ్యాటర్లు రాణించారు. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత 'ఎ' జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 90 ఓవర్లలో 409 పరుగులు చేసింది. అజేయ సెంచరీతో చెలరేగిన కరుణ్ నాయర్ (246 బంతుల్లో 186 బ్యాటింగ్; 24 ఫోర్లు, 1 సిక్స్) ద్విశతకం దిశగా దూసుకుపోతున్నాడు. సర్ఫరాజ్ ఖాన్ (119 బంతుల్లో 92; 13 ఫోర్లు), ధ్రువ్ జురేల్ (104 బంతుల్లో 82 బ్యాటింగ్; 9 ఫోర్లు, 1 సిక్స్) కూడా చక్కటి బ్యాటింగ్‌తో భారీ స్కోరులో కీలక పాత్ర పోషించారు. 51 పరుగుల వద్ద భారత జట్టు యశస్వి జైస్వాల్ (24), కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (8) వికెట్లు కోల్పోయింది. అయితే ఆ తర్వాత రెండు భారీ భాగస్వామ్యాలు నమోదయ్యాయి. సర్ఫరాజ్‌తో మూడో వికెట్‌కు 181 పరుగులు జోడించిన నాయర్...జురేల్‌తో నాలుగో వికెట్‌కు అభేద్యంగా 177 పరుగులు జత చేశాడు. ఇంగ్లండ్ బౌలర్లలో జోష్ హల్ 2 వికెట్లు పడగొట్టాడు.

ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అగసార నందిని 'పసిడి' వెలుగులు
ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ ఫలితాలు సహా
మరిన్ని క్రీడా వార్తలు | సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

ముంబై ముందుకు... గుజరాత్ ఇంటికి

ఎలిమినేటర్‌లో హార్దిక్ బృందం ఘన విజయం

ఒత్తిడితో కూడిన మ్యాచ్‌లు ఆడటంలో ఆరితేరిన ముంబై ఇండియన్స్... గుజరాత్ టైటాన్స్‌ను చిత్తు చేసి క్వాలిఫయర్‌–2కు చేరింది. బ్యాటింగ్‌లో రోహిత్ శర్మ దూకుడుకు... బెయిర్‌స్టో, సూర్యకుమార్ మెరుపులు తోడవడంతో మొదట భారీ స్కోరు చేసిన ముంబై... ఆ తర్వాత బౌలింగ్‌లోనూ ఆకట్టుకొని ముందంజ వేసింది. టాప్‌–3 ఆటగాళ్లపైనే ఎక్కువ ఆధారపడిన గుజరాత్... కీలక ఎలిమినేటర్ పోరులో అది సాధ్యపడక పరాజయంతో లీగ్ నుంచి నిష్క్రమించింది.

- మెరిసిన రోహిత్, బెయిర్‌స్టో, బుమ్రా
- సుదర్శన్ పోరాటం వృథా
- ఆదివారం పంజాబ్‌తో క్వాలిఫయర్‌–2 పోరు




రోహిత్ శర్మ

ముల్లాన్‌పూర్: ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన ముంబై ఇండియన్స్ జట్టు ఐపీఎల్ క్వాలిఫయర్‌–2కు అర్హత సాధించింది. శుక్రవారం జరిగిన ఎలిమినేటర్ పోరులో ముంబై 20 పరుగుల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించింది. మొదట ముంబై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 228 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' రోహిత్ శర్మ (50 బంతుల్లో 81; 9 ఫోర్లు, 4 సిక్స్‌లు) దుమ్మురేపగా... జానీ బెయిర్‌స్టో (22 బంతుల్లో 47; 4 ఫోర్లు, 3 సిక్స్‌లు), సూర్యకుమార్ యాదవ్ (20 బంతుల్లో 33; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ధాటిగా ఆడారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిధ్‌కృష్ణ, సాయి కిషోర్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో గుజరాత్ 20 ఓవర్లలో 6 వికెట్లకు 208 పరుగులు చేసింది. సాయి సుదర్శన్ (49 బంతుల్లో 80; 10 ఫోర్లు, 1 సిక్స్) టాప్ స్కోరర్ కాగా... వాషింగ్టన్ సుందర్ (24 బంతుల్లో 48; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. ముంబై బౌలర్లలో బౌల్ట్ 2... బుమ్రా, గ్లీసన్, సాంట్నర్, అశ్వని కుమార్ తలా ఒక వికెట్ తీశారు. ఆదివారం జరగనున్న క్వాలిఫయర్‌–2లో పంజాబ్ కింగ్స్‌తో ముంబై ఇండియన్స్ తలపడనుంది.

దంచుడే దంచుడు...

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్‌కు దిగిన ముంబై జట్టుకు ఓపెనర్లు రోహిత్, బెయిర్‌స్టో మెరుపు ఆరంభాన్నిచ్చారు. రికెల్టన్ అందుబాటులో లేకపోవడంతో... ఈ సీజన్‌లో తొలి మ్యాచ్ ఆడిన బెయిర్‌స్టో తన విలువ చాటుకున్నాడు. ప్రసిధ్ కృష్ణ వేసిన రెండో ఓవర్‌లో ఫోర్‌తో దూకుడు పెంచిన బెయిర్‌స్టో... ప్రసిధ్ కృష్ణ వేసిన నాలుగో ఓవర్‌లో పరుగుల పండగ చేసుకున్నాడు. వరసగా 6, 4, 6, 6, 4... 26 పరుగులు పిండుకున్నాడు. సిరాజ్ ఓవర్‌లో రెండు ఫోర్లతో టచ్‌లోకి వచ్చిన రోహిత్ సాయి కిషోర్ బౌలింగ్‌లో 6, 4, 4తో గేర్ మార్చాడు. 3 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద రోహిత్ ఇచ్చిన క్యాచ్‌ను కోట్జీ వదిలేయగా... 12 పరుగుల వద్ద మెండిస్ మరో సులువైన క్యాచ్‌ను నేలపాలు చేశాడు. దీన్ని పూర్తిగా వినియోగించుకున్న రోహిత్ భారీ షాట్లతో విరుచుకుపడ్డాడు. దీంతో పవర్ ప్లే ముగిసే సరికి ముంబై జట్టు 79/0తో నిలిచింది. స్పిన్నర్ల రాకతో స్కోరు వేగం మందగించగా... బెయిర్‌స్టోను అవుట్ చేసి సాయి కిషోర్ గుజరాత్‌కు బ్రేక్ ఇచ్చాడు. రషీద్ ఓవర్‌లో 4, 6 ద్వారా ఐపీఎల్లో 7 వేల పరుగులతో పాటు 300 సిక్స్‌లు పూర్తి చేసుకున్న రోహిత్... 28 బంతుల్లో హాఫ్‌సెంచరీ మార్క్ అందుకున్నాడు. క్రీజులో ఉన్నంతసేపు భారీ షాట్లతో విరుచుకుపడిన సూర్యకుమార్‌ను సాయి కిషోర్ పెవిలియన్ పంపగా... ఈ సీజన్‌లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన హైదరాబాద్ ఆటగాడు తిలక్ వర్మ (11 బంతుల్లో 25; 3 సిక్స్‌లు) కొన్ని చక్కటి షాట్లు ఆడాడు. స్లో బంతితో రోహిత్‌ను ప్రసిధ్ కృష్ణ బుట్టలో వేసుకోగా... చివరి ఓవర్‌లో మూడు సిక్స్‌లు కొట్టిన కెప్టెన్ హార్దిక్ పాండ్యా (9 బంతుల్లో 22 నాటౌట్; 3 సిక్స్‌లు) జట్టుకు భారీ స్కోరు అందించాడు.

సుదర్శన్ పోరాడినా...

భారీ లక్ష్యఛేదనలో గుజరాత్‌కు శుభారంభం లభించలేదు. కెప్టెన్ గిల్ (1) ఇన్నింగ్స్ నాలుగో బంతికే వికెట్ల ముందు దొరికిపోయాడు. దీంతో మరో ఓపెనర్ సుదర్శన్ బాధ్యతగా ముందుకు సాగాడు. ఐపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడిన కుశాల్ మెండిస్ (10 బంతుల్లో 20; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కాస్త సహకరించగా... సుదర్శన్ క్లాస్ కవర్ డ్రైవ్‌లతో ఆకట్టుకున్నాడు. భారీ లక్ష్యం కళ్లముందు ఉన్నా... ఏమాత్రం వెరవని టైటాన్స్ పవర్‌ప్లే ముగిసేసరికి 66/1తో నిలిచింది. గ్లీసన్, హార్దిక్, బుమ్రా, సాంట్నర్ ఓవర్లలో రెండేసి ఫోర్లు కొట్టిన పసుదర్శన్ 28 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. మెండిస్ వెనుదిరిగాక క్రీజులోకి వచ్చిన వాషింగ్టన్ సుందర్ కూడా ఆకట్టుకున్నాడు. ప్రమాదకర బుమ్రా బంతులను కాచుకున్న ఈ జంట... మిగిలిన ఓవర్లలో ధాటిగా పరుగులు రాబట్టింది. దీంతో 13 ఓవర్లు ముగిసేసరికి టైటాన్స్ 148/2తో నిలిచింది. విజయానికి 42 బంతుల్లో 81 పరుగులు కావాల్సిన దశలో... బుమ్రా అద్భుత యార్కర్‌తో సుందర్‌ను క్లీన్ బౌల్డ్ చేయడంతో పరిస్థితి మారిపోయింది. సుదర్శన్‌ను గ్లీసన్‌ను అవుట్ చేయగా... రూథర్‌ఫోర్డ్ (24; 4 ఫోర్లు) ఎక్కువసేపు నిలవలేకపోయాడు. చివర్లో రాహుల్ తెవాటియా (16; 1 ఫోర్, 1 సిక్స్), షారుక్ ఖాన్ (13; 1 సిక్స్) మెరుపులు జట్టును గెలిపించలేకపోయాయి.

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: రోహిత్ (సి) రషీద్ (బి) ప్రసిధ్ కృష్ణ 81; బెయిర్‌స్టో (సి) కోట్జీ (బి) సాయి కిషోర్ 47; సూర్యకుమార్ (సి) సుందర్ (బి) సాయి కిషోర్ 33; తిలక్ (సి) మెండిస్ (బి) సిరాజ్ 25; హార్దిక్ (నాటౌట్) 22; నమన్ ధీర్ (సి) రషీద్ (బి) ప్రసిధ్ కృష్ణ 9, సాంట్నర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (20 ఓవర్లలో 5 వికెట్లకు) 228. వికెట్ల పతనం:** 1–84, 2–143, 3–186, 4–194, 5–206. **బౌలింగ్:** సిరాజ్ 4–0–37–1; ప్రసిధ్ కృష్ణ 4–0–53–2; సాయి కిషోర్ 4–0–42–2; రషీద్ ఖాన్ 4–0–31–0; కోట్జీ 3–0–51–0; సుందర్ 1–0–7–0.

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాయి సుదర్శన్ (బి) గ్లీసన్ 80; గిల్ (ఎల్బీ) (బి) బౌల్ట్ 1; మెండిస్ (హిట్ వికెట్) (బి) సాంట్నర్ 20; సుందర్ (బి) బుమ్రా 48; రూథర్‌ఫోర్డ్ (సి) తిలక్ (బి) బౌల్ట్ 24; తెవాటియా (నాటౌట్) 16; షారుక్ ఖాన్ (సి) సూర్యకుమార్ (బి) అశ్వని కుమార్ 13; రషీద్ ఖాన్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 208. వికెట్ల పతనం:** 1–3, 2–67, 3–151, 4–170, 5–193, 6–208. **బౌలింగ్:** బౌల్ట్ 4–0–56–2; బుమ్రా 4–0–27–1; గ్లీసన్ 3.3–0–39–1; హార్దిక్ పాండ్యా 3–0–37–0; సాంట్నర్ 1–0–10–1; నమన్ ధీర్ 1–0–9–0; అశ్వని కుమార్ 3.3–0–28–1.

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

బక్రీద్ సందర్భంగా డీజీపీ జితేందర్ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: జూన్ 7న బక్రీద్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా అన్ని చర్యలు తీసుకున్నట్లు డీజీపీ జితేందర్ తెలిపారు. శాంతిభద్రతలకు ఆటంకం కలిగించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గోరక్షక బృందాలకు ఏ వాహనాన్ని ఆపే లేదా తనిఖీ చేసే అధికారం లేదని, గోవులు, ఇతర జంతువుల అక్రమ రవాణా గురించి సమాచారం ఉంటే వారు సంబంధిత పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని సూచించారు. అక్రమంగా రవాణాచేసే గోవులు, వాహనం స్వాధీనం చేసుకుంటామన్నారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వ్యాఖ్యలు, పుకార్లు వ్యాప్తి చేసే వారిపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్టు హెచ్చరించారు. ఈ మేరకు డీజీపీ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇప్పటికే శాంతి కమిటీలు, గోవుల రవాణాదారులు, కసాయిలతో సమావేశాలు నిర్వహించి, చట్టపరమైన అంశాలపై, అక్రమ కార్యకలాపాలకు పాల్పడితే జరిగే పరిణామాలపై అవగాహన కల్పించినట్టు వెల్లడించారు. అంతర్రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో 24 గంటలపాటు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని, ప్రతి చెక్‌పోస్టుకు పశువైద్యులను నియమించినట్టు తెలిపారు. గోవులు, జంతువుల రవాణా నియంత్రణకు ట్రాన్స్‌పోర్టేషన్ ఆఫ్ యానిమల్స్ రూల్స్–1978, ప్రివెన్షన్ ఆఫ్ క్రూయల్టీ టు యానిమల్స్ యాక్ట్–1960, తెలంగాణ ప్రొహిబిషన్ ఆఫ్ కౌ స్లాటర్ అండ్ యానిమల్ ప్రిజర్వేషన్ యాక్ట్–1977, తెలంగాణ యానిమల్స్ అండ్ బర్డ్స్ సాక్రిఫైసెస్ ప్రొహిబిషన్ యాక్ట్–1950 వంటి పలు చట్టాలు అమల్లో ఉన్నాయన్నారు.

వ్యవసాయ వర్సిటీలో కోర్సులకు నోటిఫికేషన్ జారీ

సాక్షి, హైదరాబాద్: ఈఏపీసీఈటీ–2025లో అర్హత సాధించిన విద్యార్థులు బీఎస్సీ (ఆనర్స్) అగ్రికల్చర్, వెటర్నరీ సైన్సెస్, బీఎస్సీ (హానర్స్) ఉద్యానవన, బీటెక్ (అగ్రికల్చర్ టెక్నాలజీ), బీటెక్ (ఫుడ్ టెక్నాలజీ), బీఎస్సీ (ఆనర్స్) కమ్యూనిటీ సైన్సెస్, బీఎఫ్ఎస్సీ కోర్సుల్లో చేరేందుకు ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ జారీ చేసింది. ఆన్‌లైన్‌లో జూన్ 28 వరకు దరఖాస్తులను సమర్పించాలని సూచించింది. www.pjtau.edu.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొంది.

ముక్క లేనిదే ముద్ద దిగడం లేదు!



దేశంలో పెరిగిన మాంసాహార వాడకం

- తగ్గిన కూరగాయల వినియోగం
- తొలి స్థానంలో పాలు, పాల ఉత్పత్తులు
- వినియోగ వ్యయంలో టాప్‌లో ఆహారం
- దుస్తులు, పాదరక్షలకు ఖర్చు తగ్గించిన జనం

సాక్షి, స్పెషల్ డెస్క్: ముక్క లేనిదే ముద్ద దిగని కుటుంబాలు మన దేశంలో ఎన్నో. భారతీయులు ఆహారంపై ఏటా చేస్తున్న వ్యయంలో మాంసాహారం వాటా దశాబ్ద కాలంలో 8 నుంచి 10.8 శాతానికి ఎగబాకింది. కేంద్ర గణాంక శాఖ ఇటీవల విడుదల చేసిన 'నేషనల్ అకౌంట్స్ స్టాటిస్టిక్స్–2025' ప్రకారం.. ఈ పదేళ్లలో కూరగాయల స్థానాన్ని వెనక్కినెట్టి మాంసాహారం ఒక మెట్టు ఎక్కడం ఆసక్తికరమైన విషయం. దేశంలో మొత్తం వినియోగ వ్యయంలో తొలి స్థానం ఆహారానిదే. ఆహార పదార్థాలకు భారతీయ కుటుంబాలు ఏటా చేస్తున్న వ్యయంలో పాలు, పాల ఉత్పత్తులు; బ్రెడ్, తృణధాన్యాలు, పప్పులు; పండ్లు తొలి మూడు స్థానాలను కైవసం చేసుకున్నాయి. భారతీయుల ఆహారపు అలవాట్లు గత పదేళ్లలో చాలా మారాయి. కొత్త తరం.. కొత్తకొత్త ఆహార ఉత్పత్తులు తయారుచేసే సంస్థలు.. సరికొత్త వెరైటీలు.. ఇవన్నీ మన ఆహారపు అలవాట్లను ప్రభావితం చేశాయి. పదేళ్ల కిందట దేశంలో కూరగాయల వినియోగమే ఎక్కువగా ఉండేది. ఆ తరువాతి స్థానం మాంసాహారానిది. 2013–14లో 10.8 శాతం వాటాతో నాలుగో స్థానంలో ఉన్న కూరగాయలను అదే వాటాతో దశాబ్ద కాలంలో మాంసాహారం భర్తీ చేసింది. 10.6 శాతం వాటాతో కూరగాయలు 5వ స్థానానికి దిగొచ్చాయి.

పెరిగిన ఆహార స్పృహ

కరోనా తరువాత ప్రజల్లో ఆహార స్పృహ బాగా పెరిగింది. ముఖ్యంగా ప్రోటీన్, విటమిన్లు.. ఇలా పోషకాలమీద అవగాహన పెంచుకుని, అవి ఎక్కువగా ఉండే ఆహార పదార్థాలవైపు మళ్లారు. అందుకేనేమో.. 2013–14తో పోలిస్తే 2023–24 నాటికి ఆహార పదార్థాలకు వెచ్చించిన మొత్తంలో పాలు, పాల ఉత్పత్తులు, చేపలు, సముద్ర ఉత్పత్తులు, మాంసం, గుడ్ల వాటా గణనీయంగా పెరిగింది. అలాగే బ్రెడ్, తృణధాన్యాలు, పప్పులు, పండ్లు, కూరగాయలు, నూనెలు, కొవ్వులు, చక్కెర, జామ్, చాకోలెట్స్, కన్ఫెక్షనరీకి చేస్తున్న ఖర్చులను జనం తగ్గించారు.

ఖర్చుకు వెనుకాడడం లేదు..

గతంతో పోలిస్తే ప్రజలు.. ఖర్చుకు ఏమాత్రం వెనుకాడడం లేదని గణాంకాలు చెబుతున్నాయి. దేశవ్యాప్తంగా మొత్తం కుటుంబాల వినియోగ వ్యయం 2023–24లో రూ.99,10,363 కోట్లకు చేరుకుంది. 2013–14లో ఇది రూ.55,93,183 కోట్లు మాత్రమే. గత దశాబ్దంలో సగటున 5.9% వార్షిక రేటుతో వృద్ధి నమోదు కావడం గమనార్హం. గృహాలు, గృహాలకు సేవలందించే లాభాపేక్షలేని సంస్థలు.. ఆహారం, దుస్తులు, గృహ నిర్మాణం, ఆరోగ్య సంరక్షణ, విద్య, వినోదం వంటి వస్తు, సేవలపై చేసే మొత్తం ఖర్చును ప్రైవేట్ తుది వినియోగ వ్యయం అంటారు. పదేళ్లలో ఈ వ్యయం 77 శాతం పెరిగిందంటే అతిశయోక్తి కాదు.

రెస్టారెంట్లలో తాకిడి..



మొత్తం కుటుంబాల వినియోగ వ్యయంలో 2013–14తో పోలిస్తే 2023–24 నాటికి ఆహారం, నాన్ ఆల్కహాల్ పానీయాల వాటా తగ్గినప్పటికీ ఈ విభాగం 26.4 శాతంతో తొలి స్థానంలో నిలిచింది. ఇంటి వంటకంటే... రెస్టారెంట్లు, హోటళ్లలో తినడాన్ని ప్రజలు ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అందుకే, బయటి టిఫిన్లు, భోజనాల కోసం చేస్తున్న ఖర్చులు గతంతో పోలిస్తే పెరిగాయి. మొత్తం వినియోగ వ్యయంలో రవాణా ఖర్చుల వాటా 14.3 శాతం నుంచి దాదాపు 19 శాతానికి ఎగబాకడం విశేషం. ఆరోగ్యం, విద్యకు చేసిన వ్యయాల వాటా పెరిగింది. ఆల్కహాల్, పొగాకు, నార్కోటిక్స్ వ్యయాల వాటా 21.7 శాతం క్షీణించింది. కమ్యూనికేషన్, గృహాలంకరణకు చేసే ఖర్చులు ఎక్కువయ్యాయి. దుస్తులు, పాదరక్షల కోసం ఖర్చులు తగ్గించారు.

ఖర్చులో అధిక'పాలు'!

ఆహారానికి చేసిన వ్యయంలో పదార్థాల వారీగా ఖర్చుల శాతం

	2013–14	2023–24
పాలు, పాల పదార్థాలు	20.5	22.0
బ్రెడ్, తృణధాన్యాలు, పప్పులు	26.0	21.6
పండ్లు	15.6	13.5
కూరగాయలు	10.8	10.6
చేపలు, సముద్ర ఉత్పత్తులు	5.0	6.5
నూనెలు, కొవ్వులు	6.4	5.2
మాంసం	3.0	4.3
చక్కెర, జామ్, చాకోలెట్స్, కన్ఫెక్షనరీ	4.9	4.3
గుడ్లు	0.8	1.0

ఆరోగ్యమే ప్రధానం

విభాగాల వారీగా 2013-14 నుంచి 2023-24 మధ్య వివిధ ఖర్చుల సగటు వార్షిక వృద్ధి రేటు

ఆరోగ్యం	9.1
రవాణా	8.9
కమ్యూనికేషన్	8.5
రెస్టారెంట్లు , హోటళ్లు	8.1
విద్య	7.8
ఇతర వస్తు, సేవలు	7.5
గృహాలంకరణ, ఇంటి నిర్వహణ	6.6

భోజన ప్రియులు

వినియోగ వ్యయంలో విభాగాల వారీగా వాటా శాతాల్లో

	2013–14	2023–24
ఆహారం, నాన్ ఆల్కహాల్ పానీయాలు	30.5	26.4
రవాణా	14.3	18.9
ఇతర వస్తు, సేవలు	13.7	15.9
హౌసింగ్, నీరు, ఎలక్ట్రిసిటీ, గ్యాస్, ఇతర ఇంధనం	16.2	12.9
ఆరోగ్యం	3.9	5.2
దుస్తులు, పాదరక్షలు	6.7	4.6
విద్య	3.7	4.4

ఫ్యూస్‌లేజ్‌ల తయారీకి రోబోలు

- యుద్ధవిమానంలో కీలకమైన ఈ భాగాన్ని నెలకొకటి రూపొందిస్తాం
- వెమ్ టెక్నాలజీస్ సీఎండీ వెంకట రాజు ప్రకటన
- హెచ్ఏఎల్‌కు తేజస్ ఫ్యూస్‌లేజ్ అప్పగింత



అప్పగింత పత్రాలను హెచ్ఏఎల్‌కు అందిస్తున్న వెమ్ టెక్నాలజీస్ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: దేశ రక్షణకు కీలకమైన తేలికపాటి యుద్ధ విమానం తేజస్ కోసం అత్యంత సంక్లిష్టమైన ఫ్యూస్‌లేజ్ వ్యవస్థను ఇకపై వేగంగా ఉత్పత్తి చేస్తామని హైదరాబాద్‌కు చెందిన వెమ్ టెక్నాలజీస్ సంస్థ ప్రకటించింది. తొలి ఫ్యూస్‌లేజ్‌ను హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్)కు అప్పగించిన సందర్భంగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో సంస్థ సీఎండీ వెంకట్ రాజు మాట్లాడుతూ 2025 చివరికి కనీసం 8 ఫ్యూస్‌లేజ్‌ల నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఆ తరువాత నెలకు ఒకటి చొప్పున తయారుచేసి హెచ్ఏఎల్‌కు అందిస్తామని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేట్ రంగం కలిసికట్టుగా పనిచేస్తే జరిగే అద్భుతాలకు ఈ ఫ్యూస్‌లేజ్ తార్కాణంగా నిలుస్తుందని తెలిపారు. ఫ్యూస్‌లేజ్‌ల ఉత్పత్తి కోసం ప్రస్తుతం వెమ్ టెక్నాలజీస్‌లో రెండు ప్రత్యేక 'జిగ్'లు ఉండగా.. త్వరలో రోబోలతో పనిచేసే మూడో జిగ్‌ను ఏర్పాటు చేస్తున్నామని ప్రకటించారు. రోబోలతో నడిచే జిగ్ కారణంగా ఉత్పత్తి మరింత వేగవంతమవుతుందని తెలిపారు. అత్యాధునిక ఆయుధ వ్యవస్థల తయారీ కోసం 5 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో జహీరాబాద్ సమీపంలో చేపట్టిన ఫ్యాక్టరీ నిర్మాణం వచ్చే ఏడాదికి పూర్తవుతుందన్నారు. ఈ ఫ్యాక్టరీలో యాంటీ ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ అసిబల్‌తోపాటు అత్యాధునిక ఆయుధ వ్యవస్థలను తయారు చేస్తామని చెప్పారు.

ఆత్మనిర్భరతకు తార్కాణం

కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆత్మనిర్భర భారత్ సత్ఫలితాలిస్తోందని, ఇటీవలి ఆపరేషన్ సిందూర్‌లో ఈ విషయం స్పష్టమైందని హెచ్ఏఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డీకే సునీల్ తెలిపారు. రక్షణ రంగంలో ప్రైవేట్ కంపెనీల భాగస్వామ్యం ఏటికేడాదీ పెరుగుతోందని, హెలికాప్టర్‌సహా ఎన్నో వ్యవస్థల నిర్మాణాన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు కలిసి చేపడుతున్నాయని ఆయన తెలిపారు. కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి డాక్టర్ సంజీవ్ కుమార్ మాట్లాడుతూ.. రక్షణ రంగ ఉత్పత్తుల తయారీకి హైదరాబాద్ కేంద్రంగా మారుతోందని కొనియాడారు. పదేళ్ల కాలంలో రక్షణ రంగ ఉత్పత్తులు ఏటా పది శాతం చొప్పున పెరుగుతున్నాయని, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు మరింత సమన్వయంతో పనిచేస్తూ దేశ రక్షణ అవసరాలను తీర్చాలని కోరారు. కార్యక్రమంలో బీడీఎల్ సీఎండీ కమడోర్ ఏ మాధవరావు, డీజీఏక్యూఏ సంజయ్ చావ్లా, ఎల్‌సీఏ తేజస్ జనరల్ మేనేజర్ అబ్దుల్ సలామ్ తదితరులు పాల్గొన్నారు.

రేపే టీజీఎడ్‌సెట్–2025 ఎంట్రన్స్

ఆన్‌లైన్‌లో రెండు సెషన్‌లలో పరీక్ష

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో బీఈడీ కళాశాలల్లో ఈ విద్యాసంవత్సరం (2025–2026)లో ప్రవేశాలకుగాను టీజీఎడ్‌సెట్–2025ను జూన్ 1న నిర్వహించనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తిచేసినట్లు టీజీఎడ్‌సెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ బి.వెంకట్రామ్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆన్‌లైన్ కంప్యూటర్ బేస్డ్‌గా రెండు సెషన్లలో ఈ పరీక్ష జరగనుందని చెప్పారు. 38,758 మంది అభ్యర్థులు హాజరుకానుండగా, వీరిలో పురుషులు 7,218 మంది, మహిళలు 31,539 మంది, ట్రాన్స్‌జెండర్ ఒకరు ఉన్నారన్నారు. వీరికోసం 74 సెంటర్లను ఏర్పాటుచేశామని వెల్లడించారు. 74 మంది అబ్జర్వర్లను నియమించామన్నారు. జూన్ 1న మొదటి సెషన్‌ను ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహిస్తారని కన్వీనర్ తెలిపారు. అభ్యర్థులు ఉదయం 8 గంటలకే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలన్నారు. ఉదయం 9.30 గంటలకు కేంద్రాల గేట్లు మూసివేస్తారని, ఒక్క నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోనికి అనుమతించబోరని స్పష్టం చేశారు.

రెండో సెషన్‌లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. 12 గంటల నుంచే కేంద్రాలకు అనుమతిస్తారు. 1.30 గంటల తర్వాత గేట్లు మూసివేస్తారన్నారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్ కార్డు లేదా పాన్‌కార్డు లేదా ఓటర్ ఐడీకార్డు, ఏదైనా ప్రభుత్వ గుర్తింపు పొందిన కార్డు, బ్లూ లేదా బ్లాక్‌పెన్‌ను వెంట తీసుకొని రావాలని కన్వీనర్ సూచించారు. అభ్యర్థుల హాల్‌టికెట్‌తోపాటు హాల్‌టికెట్ వెనకవైపున ఉన్న క్యూఆర్ కోడ్ ద్వారా పరీక్షకేంద్రం లొకేషన్‌ను కూడా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించబోరన్నారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.


తంగిడి సంగమ క్షేత్రంలోని దత్త భీమేశ్వర ఆలయం


కృష్ణా, భీమా నదులు కలిసే సంగమ క్షేత్రం

సంగమ క్షేత్రం.. తంగిడి

తెలంగాణ సరిహద్దులో కృష్ణా, భీమా నదుల కలయిక
దేవతలు నడయాడిన స్థలంగా ప్రసిద్ధి
రుషులు, మునులు తపస్సు ఆచరించిన ప్రాంతం
సంగమ ప్రాంతంలో స్నానం ఆచరిస్తే పాపాల నివృత్తి అని నమ్మకం

నారాయణపేట/కృష్ణా: నారాయణపేట జిల్లా కృష్ణా మండలం తంగిడి గ్రామ సమీపంలోని కృష్ణా, భీమా నదుల సంగమ ప్రాంతం ఓ విశిష్టమైన పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతోంది. ఇక్కడే భీమా నది తెలంగాణలోకి ప్రవేశించి.. తంగిడి క్షేత్రంలోనే కృష్ణానదిలో విలీనమవుతుంది. దేవతలు నడయాడిన స్థలంగా, రుషులు, మునులు తపస్సు ఆచరించిన దైవభూమిగా, ఎన్నో అద్భుతాలు, మహిమలు జరిగిన క్షేత్రంగా తంగిడికి ఘన చరిత్ర ఉంది. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు పర్యాటకులు ఆసక్తి చూపుతున్నారు.

ఇక్కడే రెండు పుష్కరాలు..
తెలంగాణ, కర్ణాటక సరిహద్దులోని కృష్ణా మండలం తంగిడి వద్ద కృష్ణా, భీమా నదులు కలుస్తాయి. 12 ఏళ్లకు ఒకసారి నిర్వహించే పుష్కరాలకు కృష్ణా, భీమా సంగమ ప్రాంతం ప్రత్యేకత చాటుతోంది. 2016, ఆగస్టు 12 నుంచి 23 వరకు 12 రోజులపాటు పుష్కరాలు జరిగాయి. 2028లో ఆగస్టు 12 నుంచి 23వ తేదీ వరకు జరిగే పుష్కరాలకు సిద్ధమవుతోంది. భీమా పుష్కరాలు 2018, అక్టోబర్ 11 నుంచి 22వ తేదీ వరకు తంగిడి, కుసుమూర్, శుక్రలింగంపల్లి గ్రామాల్లో జరిగాయి. 2030, అక్టోబర్ 11 నుంచి 22వ తేదీ వరకు పుష్కరాలు జరగనున్నాయి. అయితే సంగమ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు.

దక్షిణం వైపు ప్రవాహం..
భీమానది దక్షిణం వైపు ప్రవహిస్తుంది. ఇది కాశీలోని గంగానదితో సమానం. గయాలోని హోళీ స్థలమైన ప్రజలు పుష్కర స్నానం ఆచరించడం స్వచ్ఛమైనదని, పవిత్రమైన ప్రదేశమని హిందువులు భావిస్తారు. తంగిడి వద్ద కృష్ణా, భీమా నదుల సంగమాన్ని నివృత్తి సంగమం అని పిలుస్తారు. గత చరిత్ర ప్రకారం దత్తాత్రేయ అవతారమెత్తిన స్వామి శ్రీపాదవల్లభ కురువపురం అనే ప్రదేశం ఈ సంగమానికి చాలా దగ్గరగా ఉంది. ఈ ప్రదేశం ప్రత్యేకత కలిగి ఉండటం, తెలంగాణ రాష్ట్రంలోకి కృష్ణానది ప్రవేశ స్థలం కావడంతో ఈ సంగమం ఎంతో విశిష్టతను సంతరించుకుంది.

ఇక్కడే విద్యుత్ శక్తి పుట్టింది..
సాక్షాత్ జగద్గురు శ్రీదత్తాత్రేయ మహాస్వామి మొదటి అవతార పురుషుడైన శ్రీపాద వల్లభుడు తంగిడి క్షేత్రంలోని కృష్ణా, భీమా నదుల సంగమక్షేత్రంలో స్నానం ఆచరించి తపస్సు చేసినట్లు వేదాల్లో పేర్కొనబడింది. అప్పటి నుంచి ఈ క్షేత్రాన్ని నివృత్తి సంగమంగా పేరు గాంచిందని దత్త పీఠాధిపతులు చెబుతుంటారు. అలాగే ఈ ప్రాంతంలో సంగమేశ్వరుడి ఆలయం ఉంది. ఇది అతి పురాతనమైన దేవాలయం. ఇక్కడ కొడెకల్ స్వామీజీ చెప్పినట్లు ఈ నది నీటి ద్వారానే ఓ శక్తి పుడుతుంది. ఆ తర్వాత సంగమంలోని రాతి కోడి కూస్తుంది. ఆ కోడి కూసిన రోజు ఈ ప్రపంచం మునిగిపోతుందని ఓ శిలాశాసనం ఉంది. ఆ శాసనంలో చెప్పినట్లే ఇక్కడున్న బురుజుపై రాతి కోడి ఉండేది. అది ప్రస్తుతం శిథిలమైంది. అలాగే శాసనం కూడా శిథిలమైపోయింది. కానీ ఈ మాటలను మాత్రం ఈ ప్రాంత ప్రజలు ఎప్పుడూ అంటుంటారు. అలాగే ఆ స్వామీజీ చెప్పినట్లు ఈ నీటి ద్వారానే శక్తి పుడుతుందని చెప్పినట్లే కర్ణాటకలోని శక్తినగర్‌లో పవర్ ప్లాంట్ ద్వారా విద్యుత్‌శక్తి ఉత్పత్తి అవుతోంది.

సంగమ క్షేత్రం ప్రత్యేకతలివీ..
కృష్ణా మండలం తంగిడి వద్ద కృష్ణా, భీమా నదులు కలిసే ప్రాంతమే సంగమ క్షేత్రం. ఈ క్షేత్రానికి ఓ ప్రత్యేకమైన స్థానం ఉందని, అక్కడ దేవతలు, రుషులు, మునులు తపస్సు ఆచరించినట్లు పురాణాల్లో పేర్కొన్నారు. ఈ ప్రాంతం ఒకప్పుడు దివ్యక్షేత్రంగా వెలుగొందిందని ప్రసిద్ధి. దత్తాత్రేయ మొదటి మానవ అవతారం ఎత్తిన శ్రీపాద వల్లభుడు ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా పిఠాపురంలో జన్మించారు. ఇప్పటికీ ఆయన జన్మించిన ఇల్లు అక్కడ ఉండటం విశేషం. అక్కడ 16 ఏళ్ల వరకు ఉండి దేశ సంచారం నిమిత్తం వెళ్లిపోయారు. అలా వెళ్లిన వ్యక్తి.. కొన్నేళ్ల పాటు ఎవరికీ కనిపించకుండా మాయమయ్యారు. ఆ తర్వాత కార్తీక పౌర్ణమి నాడు తంగిడిలోని నివృత్తి సంగమంలో ప్రత్యక్షమయ్యారు. ఇక్కడ కొన్ని సంవత్సరాల పాటు తపస్సు ఆచరించి.. ఇక్కడి నుంచి కర్ణాటకలోని కుర్మగడ్డకు వెళ్లారని చారిత్రక ఆధారాలున్నాయి. ఇప్పటికీ ఈ సంగమంలో శ్రీపాదుడు తపస్సు చేసిన వినాయక విగ్రహం, ఆయన పాదుకలు, శివలింగం ఉన్నాయి. ఆయన ఇక్కడి నుంచి కుర్మగడ్డకు నడుచుకుంటూ వెళ్లిన మార్గంలో నదిలో నల్లరాయితో రోడ్డు వేసినట్లు ఇప్పటికీ ఇక్కడ ప్రత్యక్షంగా కన్పిస్తాయి. ఇంతటి విశేషమైన ఈ ప్రాంతాన్ని తెలుసుకున్న విఠల్‌బాబా అప్పట్లో దత్త భీమేశ్వర ఆలయం నిర్మించారు. ఈ నివృత్తి సంగమంలో స్నానం ఆచరించిన భక్తులకు పాపాలు నివృత్తి అవుతాయని ప్రసిద్ధి. ఈ స్థానం తెలంగాణకు ఓ వరంలాంటిది. ఇలాంటి క్షేత్రం మరెక్కడా లేదని, ఇది ఓ మానస సరోవరం అని దత్త పీఠాధిపతులు అంటున్నారు. 1557–58లో విజయనగర రాజు రామరాయ బహమన్ సుల్తానులను ఓడించి ఈ సంగమం ఒడ్డున కుతుబ్‌షాహీ, ఆదిల్‌షాహీ, నిజాంషాహీ, బరీద్ షాహీ సుల్తానులతో ఒక ఒప్పందాన్ని కుదుర్చుకున్నారు.

బ్రిడ్జి నిర్మించాలి



నది అటువైపు కర్ణాటకలో ఉన్న సంగమ క్షేత్రానికి ఇటు వైపు ఉన్న భక్తులు వెళ్లేందుకు బ్రిడ్జిని నిర్మించాలి. అప్పుడే అక్కడి భక్తులు ఇక్కడికి, ఇక్కడి భక్తులు అక్కడికి వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. ఇందుకు కర్ణాటక, తెలంగాణ ప్రభుత్వాలు కృషి చేయాలి.

– శ్రీకాంత్‌చారి, పురోహితుడు

పర్యాటకంగా తీర్చిదిద్దాలి



తంగిడి వద్ద ఉన్న సంగమ క్షేత్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయాలి. ఇక్కడికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలి. కృష్ణా, భీమా నదుల సంగమం వద్ద స్నానాల గదులతో పాటు దుస్తులు మార్చుకునేందుకు గదులు నిర్మించాలి.

– అమర్‌కుమార్ దీక్షిత్, కృష్ణా


కృష్ణానదిలో శ్రీపాద వల్లభుడు నడిచిన దారిలో నల్లటి రాతిబండ.


నది అటువైపు కర్ణాటకలోని సంగమ క్షేత్ర ఆలయం

‘దళిత బంధు’పై విచారణ చేపట్టండి

సీఎంకు ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ లేఖ

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన దళిత బంధు పథకం నిధుల విడుదలపై విచారణ జరిపించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం ఆయన సీఎంకు లేఖ రాశారు. దళిత కుటుంబాల ఆదాయ వనరుల పెంపునకు గత ప్రభుత్వం దళితబంధు కార్యక్రమం 2021లో చేపట్టిందని తెలిపారు. ఎలాంటి బ్యాంకు రుణం లేకుండా లబ్ధిదారు ఖాతాలో రూ.10 లక్షలు జమ చేయాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఈ పథకం అమలుకు 2022–23లో రూ.17,700 కోట్లు కేటాయించారని వివరించారు. అయిదేళ్లలో రూ.1.7 లక్షల కోట్లు వెచ్చించాలని నిర్ణయించారని తెలిపారు. కలెక్టర్లు కాకుండా రాజకీయ నాయకులు లబ్ధిదారులను ఎంపిక చేయడంతో.. శాసనసభ్యులు, వారి అనుచరగణం తమ వారిని ఎంపిక చేశారని విమర్శించారు. కొందరు రూ.2 లక్షలు వసూలు చేసి ఎంపిక చేశారని ఆరోపించారు. ఈ పథకంతో ప్రజాధనం వృథా అవుతోందని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అర్జీ ఇచ్చినా.. ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. దళితబంధును మొదట తుర్కపల్లి మండలం వాసాలమర్రి గ్రామంలో అమలు చేశారని తెలిపారు. ఇదే గ్రామాన్ని తాము మదింపు చేయగా చాలా తప్పులు జరిగినట్లు తెలిసిందని వెల్లడించారు. గ్రామంలో 52 ఎస్సీ కుటుంబాలు ఉండగా, 73 యూనిట్లు ఇచ్చినట్లు లెక్కలు చెబుతున్నాయని, డబ్బు ఖర్చయినా కొన్ని యూనిట్లు పూర్తి కాక లబ్ధిదారులకు ప్రయోజనం చేకూరలేదని వివరించారు. రాష్ట్రమంతా ఇదే పరిస్థితి ఉందని స్పష్టం చేశారు. ఇప్పటివరకు దళితబంధు పేర రూ.3,884 కోట్ల ప్రజాధనం ఖర్చు చేసినా ప్రయోజనం లేకపోయిందని పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని విజ్ఞప్తి చేశారు.

బ్యాంకు గ్యారంటీ బదులు ఐఆర్డీఏఐ బాండ్లు

బోర్డు ఆఫ్ చీఫ్ ఇంజనీర్ల భేటీలో నిర్ణయం

సాక్షి, హైదరాబాద్: నిర్మాణ పనులకు బ్యాంకు గ్యారంటీల బదులు ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఐఆర్డీఏఐ) జారీ చేసే బాండ్లను సమర్పించడానికి అనుమతించాలని బిల్డర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) ప్రతిపాదనలపై బోర్డు ఆఫ్ చీఫ్ ఇంజనీర్ల కమిటీ (బీవోసీఈ) సానుకూలంగా స్పందించింది. దీనిపై నీటిపారుదల శాఖతోపాటు రోడ్లు భవనాలు, జెన్‌కో, పురపాలక, పంచాయతీరాజ్ శాఖల అధికారులతో కమిటీ వేయాలని నిర్ణయించింది. శుక్రవారం కమిటీ చైర్మన్, నీటిపారుదల శాఖ ఈఎన్సీ (అడ్మిన్) మహ్మద్ అంజద్ హుస్సేన్ అధ్యక్షతన బీవోసీఈ సమావేశం జరిగింది. ఇందులో ప్రధానంగా బ్యాంకు గ్యారంటీల బదులు ఐఆర్డీఏఐ బాండ్లపై చర్చించారు. బ్యాంకు గ్యారంటీల కోసం కొల్లేటరేల్ సెక్యూరిటీ ఇవ్వాల్సి ఉంటుందని, దీనికి బదులుగా ఐఆర్డీఏఐ బాండ్లను అనుమతించాలని బాయ్ కోరింది. జాతీయ హైవే అథారిటీతోపాటు ప్రభుత్వ రంగ సంస్థలతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా వీటిని అనుమతిస్తోందని బాయ్ నివేదించగా... దీనిపై కమిటీ అధ్యయనం చేసి, తగిన సిఫారసులు చేయాలని బీవోసీఈ చెప్పింది. ఇక నిర్మాణ పనులు జరుగుతున్నప్పుడు వినియోగించే సామగ్రి ధరల పెరుగుదలకు అనుగుణంగా కాస్ట్ ఎస్కలేషన్ 1 శాతం పెంచడానికి అవకాశం ఇవ్వాలని కోరగా.. దీనిపై చర్చించి, అధ్యయనం చేసి, నివేదిక అందించే బాధ్యతను కమిటీకి అప్పగించారు. ఈ సమావేశానికి వివిధ శాఖల అధికారులతో పాటు నీటిపారుదల శాఖ ఈఎన్సీ(జనరల్) అనిల్‌కుమార్ తదితరులు హాజరయ్యారు.

బీఆర్‌ఎస్ పదేళ్ల దోపిడీపై విచారణ కోరండి

కవితకు భువనగిరి ఎంపీ చామల సూచన



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో జరిగిన దోపిడీపై సీబీఐ విచారణ కోరాలని, లేదంటే ఆ సొమ్ములో వాటా ఎంతో చెప్పాలని ఎమ్మెల్సీ కవితకు.. భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి సూచించారు. పదేళ్ల బీఆర్‌ఎస్ దోపిడీపై విచారణ కోరితే ప్రజల్లో ఆమెపై నమ్మకం ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. కావాలంటే తోటి ఎంపీగా సీబీఐ వద్దకు వస్తానని వ్యాఖ్యానించారు. ఆయన శుక్రవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ.. బీజేపీ వారికి ప్యాకేజీలు ఇస్తే ఎవరితోనైనా స్నేహం చేస్తారని ఆ పార్టీ ఎమ్మెల్యే రాజాసింగ్ వ్యాఖ్యానించారని ఎద్దేవా చేశారు. అలాంటప్పుడు బీజేపీలో బీఆర్‌ఎస్ విలీనమా.. లేదంటే అమ్మకమా అన్నది రెండు పార్టీల నేతలు ప్రెస్‌మీట్ పెట్టి వెల్లడించాలని కోరారు. తెలంగాణకు చెందిన 8 మంది ఎంపీల్లో.. ఒక్కరు కూడా ఆపరేషన్ సిందూర్ గురించి విదేశాలకు వివరించేందుకు పనికిరారా? అని ప్రశ్నించారు. విమానం కొనాలన్న ఆలోచన రాష్ట్ర ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. బీఆర్‌ఎస్ ఎలక్ట్రోరల్ బాండ్ నిధులతో ఒక విమానం ప్రభుత్వానికి కొనిస్తే తీసుకుంటామని ఎంపీ చామల వ్యాఖ్యానించారు.

సైన్యంపై ముఖ్యమంత్రి అవమానకర వ్యాఖ్యలు

బీజేపీ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్



సాక్షి, హైదరాబాద్: ఆపరేషన్ సిందూర్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను బీజేపీ ఎంపీ, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తీవ్రంగా ఖండించారు. పాక్ చేతిలో రాఫెల్ యుద్ధ విమానాలను కోల్పోయామని, భారత సైన్యాన్ని అవమానించేలా సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ఈ వ్యాఖ్యలు దేశ రక్షణ దళాల మనోబలం, దేశ గౌరవాన్ని దెబ్బ తీస్తున్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో కాంగ్రెస్ నేతలు ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీపై అక్కసును భారత ఆర్మీ, దేశంపై ప్రదర్శించడం దారుణమన్నారు. ప్రధాని మోదీ నేతృత్వంలో భారత సైన్యం ఉగ్రవాదాన్ని కఠినంగా ఎదుర్కొంటోందని, యూరి, పుల్వామా దాడులకు ప్రతిగా పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలను ధ్వంసం చేసిందని ఆయన గుర్తు చేశారు. భారత్ సత్తాను పాకిస్తాన్ ప్రధానమంత్రి అంగీకరించినా.. తెలంగాణ ముఖ్యమంత్రి అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు.

చిన్నవ్యాధులకు ‘సింగరేణి’లోనే చికిత్స

- ఇకపై సూపర్‌స్పెషాలిటీ వైద్యమైతేనే కార్పొరేట్‌కు రిఫర్
- సీఎండీ బలరాం మౌఖిక ఆదేశాలు
- రిఫర్ కేసులకు మూడేళ్లలో రూ.30 కోట్లు.. ఆర్నెల్లలో రూ.వంద కోట్లా?
- వైద్యాధికారులపై సీఎండీ ఆగ్రహం

గోదావరిఖని: చిన్న వ్యాధులకు ఇక సింగరేణి ఆస్పత్రుల్లోనే వైద్య చికిత్సలు అందించనున్నారు. సంస్థ వ్యాప్తంగా ఉన్న ఏడు ఏరియా ఆస్పత్రులను స్పెషాలిటీస్‌గా తీర్చిదిద్దిన క్రమంలో.. సూపర్‌స్పెషాలిటీ వైద్యమైతేనే రిఫర్ చేయాలని సీఎండీ ఎస్.బలరాం ఆదేశించారు. ఆ దిశగా వైద్య యంత్రాంగం ప్రణాళిక రూపొందిస్తోంది. చిన్న చికిత్సలకు ఇక రిఫర్ చేయాలంటే కుదరదని సీఎండీ స్పష్టం చేశారు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉండి కూడా.. రిఫరల్ వైద్యం కోసం రూ.కోట్లు వెచ్చించడంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. ఈమేరకు సీఎండీ బుధవారం వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వారి తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రిఫర్ చేసే వైద్యం కోసం మూడేళ్లలో రూ.30 కోట్లు వెచ్చిస్తే, గత ఆర్నెళ్లలో రూ.వంద కోట్లు ఖర్చు చేయడమేమిటని మండిపడ్డారని, ఈ క్రమంలో రిఫర్‌పై విధివిధానాలు మారబోతున్నాయని వెల్లడించారు. వైద్య పరీక్షల యంత్రాలు, ఔషధాలు సమకూర్చడానికి యాజమాన్యం సిద్ధంగా ఉన్నా.. కొన్ని ఏరియా ఆస్పత్రుల నుంచి ప్రతిపాదనలు పంపకపోవడం, తనిఖీల సమయంలో చేతులెత్తేయడాన్ని సీఎండీ తీవ్రంగా పరిగణిస్తున్నారు.

వైద్య పరికరాలకు గ్రీన్‌సిగ్నల్
సింగరేణి కార్మిక కుటుంబాలకు వైద్యం అందించేందుకు.. కనీస వైద్య పరికరాలు, మందుల కోసం వెంటనే ప్రతిపాదనలు పంపించాలని సీఎండీ ఆదేశించారు. తనిఖీల సమయంలో.. ఏ ఒక్క పరికరం అందుబాటులో లేదనే మాట వస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఏరియా ఆస్పత్రులకు వైద్యుల్ని కేటాయించామని, ఇంకా అవసరమైన వైద్యుల్ని, టెక్నీషియన్లను నియమించేందుకు సిద్ధంగా ఉన్నామని వెల్లడించారు.

వైద్యులు సమర్థతను నిరూపించుకోవాలి
కార్మిక కుటుంబాలకు ఏరియా ఆస్పత్రుల్లో వైద్యం అందించే అవకాశం ఉన్నా వెంటనే హైదరాబాద్ ఆస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని సీఎండీ పేర్కొన్నారు. తద్వారా మూడేళ్లలో రూ.30 కోట్ల వరకు ఉన్న రిఫర్ బిల్లులు.. ఇప్పుడు రూ.100 కోట్లకు చేరాయని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ డాక్టర్లు తమ సమర్థతను, నైపుణ్యాన్ని చూపించకుండా ప్రతీ చిన్న కేసును రిఫర్ చేయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. ఏటా సింగరేణి ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ కోసం రూ.400 కోట్లు వెచ్చిస్తోందన్నారు. హైదరాబాద్‌లోనూ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఏర్పాటుకు యత్నాలు సాగుతున్నాయన్నారు.

కరోనాను ఎదుర్కొనేందుకు సిద్ధం..
దేశవ్యాప్తంగా కరోనా కేసులు వెలుగు చూస్తున్న క్రమంలో.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని సీఎండీ బలరాం సూచించారు. వైరస్ వ్యాప్తి జరిగితే ఎదుర్కొనేందుకు అన్ని ఏరియా ఆస్పత్రుల్లో తగిన విధంగా సంసిద్ధమై ఉండాలని, ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆదేశించారు.

కార్పొరేట్‌కు దీటైన వైద్యం

సింగరేణిలో వైద్యులు ఉన్నారు. పరికరాలు, సదుపాయాలు కల్పించాం. ఏడు ఏరియా ఆస్పత్రులు, 21 డిస్పెన్సరీలు ఉన్నాయి. సుమారు 170 మంది వైద్య సిబ్బంది ఉన్నారు. కార్పొరేట్ ఆస్పత్రితో సమానంగా స్పెషాలిటీ వైద్యం అందుబాటులో ఉంది. చిన్న వైద్య సేవలు ఇక్కడే పొందాలి. దీన్ని గమనించి సింగరేణి వైద్యుల సేవలను ఉపయోగించుకోవాలి. ఏటా రూ.400 కోట్లు వైద్యం కోసం వెచ్చిస్తున్నాం. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అంతా ఉండి కూడా చిన్న వైద్యానికి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులు రిఫర్ చేయడం సరికాదు. ఉద్యోగుల్లో వైద్యులు నమ్మకాన్ని పెంచుకోవాలి. సంస్థపై ఆర్థిక భారం పడకుండా చూడాలి.

– కిరణ్‌రాజ్ కుమార్, చీఫ్ మెడికల్ సూపరింటెండెంట్, సింగరేణి

జాగర్లమూడి మృతిపై సీఎం సంతాపం

సాక్షి, హైదరాబాద్: సీనియర్ జర్నలిస్ట్ జాగర్లమూడి రామకృష్ణ మరణంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆయన మరణం పత్రికా రంగానికి తీరని లోటని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జాగర్లమూడి కుటుంబానికి సీఎం ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

జూన్ 2న హైకోర్టులో రాష్ట్రావతరణ దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని జూన్ 2న హైకోర్టు ఆవరణలో నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ తెలిపారు. ఉదయం 8.30 గంటలకు వేడుకలు ప్రారంభమవుతాయని.. 9.30 గంటలకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తారని వివరించారు. న్యాయమూర్తులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, అధికారులు, కోర్టు సిబ్బంది హాజరుకావాలని శుక్రవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో ఏ జిల్లాకు అతిథి ఎవరంటే!

జిల్లా	అతిథి
ఆదిలాబాద్	షబ్బీర్‌అలీ, ప్రభుత్వ సలహాదారు
భద్రాద్రి కొత్తగూడెం	తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి
హనుమకొండ	కొండా సురేఖ, మంత్రి
జగిత్యాల	ఎ.లక్ష్మణ్‌కుమార్, ప్రభుత్వ విప్
జయశంకర్ భూపాలపల్లి	పొదెం వీరయ్య, కార్పొరేషన్ చైర్మన్
జనగామ	బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్
జోగులాంబ గద్వాల	ఎ.పి. జితేందర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు
కామారెడ్డి	పటేల్ రమేశ్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్
కరీంనగర్	డి.శ్రీధర్‌బాబు, మంత్రి
ఖమ్మం	భట్టి విక్రమార్క, ఉప ముఖ్యమంత్రి
కుమురంభీం ఆసిఫాబాద్	బండ ప్రకాశ్, మండలి డిప్యూటీ చైర్మన్
మహబూబాబాద్	జె.రాంచందర్ నాయక్, ప్రభుత్వ విప్
మహబూబ్‌నగర్	జూపల్లి కృష్ణారావు, మంత్రి
మంచిర్యాల	హర్కర వేణుగోపాల్‌రావు, ప్రభుత్వ సలహాదారు
మెదక్	కె. కేశవరావు, ప్రభుత్వ సలహాదారు
మేడ్చల్	పట్నం మహేందర్ రెడ్డి, మండలి చీఫ్ విప్
ములుగు	సీతక్క, మంత్రి
నాగర్‌కర్నూల్	జి.చిన్నారెడ్డి, ప్లానింగ్ కమిషన్ వైస్ చైర్మన్
నల్లగొండ	కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మంత్రి
నారాయణపేట	గురునాథ్‌రెడ్డి, కార్పొరేషన్ చైర్మన్
నిర్మల్	సిరిసిల్ల రాజయ్య, కార్పొరేషన్ చైర్మన్
నిజామాబాద్	ఈరవత్రి అనిల్, కార్పొరేషన్ చైర్మన్
పెద్దపల్లి	నేరెళ్ల శారద, మహిళా కమిషన్ చైర్‌పర్సన్
రాజన్న సిరిసిల్ల	ఆది శ్రీనివాస్, ప్రభుత్వ విప్
రంగారెడ్డి	వేం నరేందర్‌రెడ్డి, సీఎం సలహాదారు
సంగారెడ్డి	దామోదర రాజనర్సింహ, మంత్రి
సిద్దిపేట	పొన్నం ప్రభాకర్, మంత్రి
సూర్యాపేట	ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మంత్రి
వికారాబాద్	గడ్డం ప్రసాద్‌కుమార్, అసెంబ్లీ స్పీకర్
వనపర్తి	ఎస్.ప్రీతం, కార్పొరేషన్ చైర్మన్
వరంగల్	పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రి
యాదాద్రి భువనగిరి	గుత్తా సుఖేందర్‌రెడ్డి, మండలి చైర్మన్



ఆదివాసీలు పూజించే వన్యప్రాణుల విగ్రహాలు

ప్రకృతి ఆరాధకులు

వన్యప్రాణులే వలస ఆదివాసీల ఆరాధ్య దైవం

ప్రకృతితో మమేకమైన వలస ఆదివాసీలు ఆరాధ్య దైవంగా వన్యప్రాణులను పూజిస్తారు. ఛత్తీస్‌గఢ్ నుంచి వలస వచ్చిన వీరంతా అల్లూరి జిల్లాలోని గొల్లగుప్ప, ఎర్రగుంట, ఎర్రగుంట పాడు, జగ్గారం, కామంతోగు, చిమిలివాగు, దొరగుట్ట తదితర అటవీ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఆదివాసీలతో పోలిస్తే వీరి జీవనం విభిన్నంగా ఉంటుంది. నిత్యం కొండకోనలు, అడవి జంతువుల మధ్య జీవనం సాగించే వీరు ఏనుగు, తాబేలు, చేప, ఆవు, కప్ప తదితర వాటిని విగ్రహాలుగా తయారుచేసుకుని దేవుళ్లుగా ఆరాధిస్తారు. తొలకరిలో ఈ విగ్రహాలకు పూజలు నిర్వహించి సంబరాలు చేస్తారు. గ్రామంలోనే వెదురు కర్రలతో ఓగుడి కట్టి ఈ విగ్రహాలను అందులో ఉంచి పూజించడం ఆనవాయితీగా వస్తోంది. ప్రకృతి ప్రేమికులుగా ముద్రపడిన వీరి జీవనశైలి ఎంతో ప్రత్యేకంగా ఉంటుంది. – ఎటపాక



వెదురు కర్రలతో ఏర్పాటుచేసిన గుడిలో తాబేలు, చేప, ఆవు తదితర విగ్రహాలు

క్లుప్తంగా...

సత్యసాయి జిల్లాలో ఎన్‌ఏసీఐఎన్ ఏర్పాటు గర్వకారణం

సీతారామన్‌ను కలిసిన బీజేపీ నేత విష్ణువర్ధన్‌రెడ్డి కృతజ్ఞతలు

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోనే ప్రతిష్టాత్మక శిక్షణ సంస్థల్లో ఒకటైన నేషనల్ అకాడమీ ఆఫ్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ నార్కోటిక్స్ (ఎన్‌ఏసీఐఎన్)ను శ్రీ సత్యసాయి జిల్లా పాలసముద్రం వంటి వెనుకబడిన ప్రాంతంలో ఏర్పాటుచేయడం ఎంతో గర్వకారణమని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఎన్‌ఏసీఐఎన్ కేంద్రం ఏర్పాటు, విస్తరణకు కృషి చేసిన కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ని శుక్రవారం ఢిల్లీలో విష్ణువర్ధన్‌రెడ్డి కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కేంద్రాన్ని అభివృద్ధి చేయడానికి కేంద్ర ప్రభుత్వం రూ.729 కోట్ల మేర నిధులు కేటాయించిందని ఆయన చెప్పారు.

ఆర్‌సీఎస్ కమిషనర్‌గా ఆనందబాబు

సెలవుపై జపాన్‌కు అహ్మద్‌బాబు

సాక్షి, అమరావతి: కో ఆపరేషన్ అండ్ రిజిస్ట్రార్ ఆఫ్ కో ఆపరేటివ్ సొసైటీస్(ఆర్‌సీఎస్) ఇన్‌చార్జి కమిషనర్‌గా ఎన్‌వీఆర్ ఆనందబాబును నియమిస్తూ సహకార శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్‌సీఏస్ కమిషనర్‌గా వ్యవహరిస్తున్న అహ్మద్‌బాబు కుటుంబ సభ్యులతో కలిసి పదిరోజుల పర్యటనకు జపాన్ వెళ్తున్నారు. ఆయన స్థానంలో సహకార శాఖ అదనపు రిజిస్ట్రార్‌గా పనిచేస్తోన్న ఎన్‌వీఆర్ ఆనందబాబుకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

ఆర్థిక శాఖలో పీ4 సెల్ బలోపేతం

ఆరుగురు నిపుణులకు బాధ్యతలు

సాక్షి, అమరావతి : ఆర్థిక శాఖలో పబ్లిక్, ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం (పీ4) ఆర్థిక శాఖలో ఈ పీ4 విభాగాన్ని బలోపేతం చేస్తూ ఆ శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. పీ4 నిపుణుడు డి. షాలెం రాజు, జాయింట్ ఫైనాన్షియల్ అడ్వైజర్ డి. సురేంద్ర, సెక్షన్ ఆఫీసర్ సీహెచ్ శ్రీనివాసులు, అకౌంట్స్ ఆఫీసర్ వి. సత్యనారాయణ, మిడిల్ లెవల్ కన్సల్టెంట్ బి. శోభన్, కన్సల్టెంట్ ఎం. వంశీకృష్ణారెడ్డిలను పీపీపీ విభాగంలో నియమించారు. వీరు రెగ్యులర్ విధులకు హాజరవుతూనే అదనంగా పీ4 ప్రాజెక్టుల అమలు విధులను నిర్వహించాల్సిందిగా ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

24న గోదావరి-కావేరీ అనుసంధానంపై భేటీ

సాక్షి, అమరావతి: గోదావరి-కావేరీ నదుల అనుసంధానంపై జాతీయ నీటి అభివృద్ధి సంస్థ టాస్క్‌ఫోర్స్ జూన్ 24వ తేదీన హైదరాబాద్‌లోని జలసౌధలో సమావేశం కానుంది. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు ప్రస్తావించిన అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఈ టాస్క్‌ఫోర్స్ గోదావరి-కావేరీ నదుల అనుసంధాన ప్రాజెక్టుపై ఏకాభిప్రాయం సాధించేందుకు కృషి చేయనుంది.

విద్యుత్ ప్రాజెక్టుల సత్వర పూర్తికి ఆదేశం

సాక్షి, అమరావతి: ఏపీజెన్‌కో ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టులను నిర్ణీత కాల వ్యవధిలో పూర్తిచేయాలని మరో సమావేశంలో సంబంధిత అధికారులను సీఎస్ ఆదేశించారు. సీఎస్ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన జెన్కో, ట్రాన్స్‌కో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరమని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు.

క్షమాపణలు చెప్పను

సాక్షి బెంగళూరు: కన్నడ భాషపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన నటుడు కమల్ హాసన్ క్షమాపణలు చెప్పబోనని తేల్చి చెప్పారు. కమల్ హాసన్ వ్యాఖ్యలపై కర్ణాటకలో తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. శుక్రవారంలోగా తమ రాష్ట్రానికి క్షమాపణలు చెప్పాలని కన్నడిగులు డిమాండ్ చేస్తుండటంతో చెన్నైలో కమల్ హాసన్ స్పందించారు. తాను ఏ తప్పు చేయలేదని, కర్ణాటకకు క్షమాపణలు చెప్పబోనని అన్నారు. ప్రజాస్వామ్యంలో తాను చట్టాన్ని, న్యాయాన్ని నమ్ముతానని, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, కేరళపై తన ప్రేమ నిజమని తెలిపారు.

'నవ' మోసాలు

సామాజిక మాధ్యమాల వేదికగా ఉద్యమిస్తున్న ఉపాధ్యాయులు

- తెరపైకి తొమ్మిది రకాల పాఠశాలలు
- ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించాలని మంత్రి నారా లోకేశ్‌కి లేఖలు
- తొమ్మిది అంశాలతో సంతకం చేసిన లేఖలతో మెయిల్స్, వాట్సాప్ సందేశాలు

అవనిగడ్డ: జీవో 117ని రద్దు చేయకుండా రెక్టిఫికేషన్ పేరుతో పాఠశాలల సంఖ్యను తొమ్మిది రకాలుగా మార్చడాన్ని ఉపాధ్యాయులు తప్పు పడుతున్నారు. ఎన్నికలకు ముందు చెప్పిన మాటలకు, అధికారంలోకి వచ్చిన తరువాత చేస్తున్న చేతలకు పొంతన లేని తీరుపై వారు మండిపడుతున్నారు. ఇలాంటి తరుణంలో ఉద్యమమే సరైన మార్గమని, లేకపోతే భవిష్యత్ లేదని ఉపాధ్యాయులంతా ఏకమవుతున్నారు. వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, టెలిగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాల్లో స్వచ్ఛందంగా ముందుకువచ్చి ఉద్యమబాటకు సై అంటున్నారు.

నాటి లోకేశ్ వీడియో వైరల్

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ఇంగ్లిష్ మీడియం ఏర్పాటు సమయంలో ప్రస్తుత మంత్రి నారా లోకేశ్ మాట్లాడిన వీడియోని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు వాట్సాప్ గ్రూపుల్లో విపరీతంగా వైరల్ చేస్తున్నారు. గౌరవ శ్రీనారా లోకేశ్ గారు ఎన్నికలకు ముందు..అంటూ ఇంగ్లిష్, తెలుగు మీడియం ఆప్షన్‌పై మాట్లాడిన వీడియో ఉపాధ్యాయ సంఘాల గ్రూపుల్లో చక్కర్లు కొడుతుంది. అలాగే తెలుగు, ఇంగ్లిష్ మీడియంపై ఆనాడు పవన్ కళ్యాణ్ ఎలా మాట్లాడారు? ఇప్పుడెలా స్పందిస్తున్నారనే వీడియో సైతం అందరి గ్రూపుల్లో ప్రత్యక్షమవుతోంది.



మంత్రి నారా లోకేశ్ కి లేఖలు రాయాలని కోరుతూ ఏపీటీఎఫ్ గ్రూపులో పోస్టింగ్‌లు



డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ గతంలో ఇంగ్లీష్ మీడియంపై మాట్లాడిన వీడియో యూటీఎఫ్ గ్రూపులో వైరల్



గతంలో నారా లోకేశ్ మాట్లాడిన వీడియో ఉపాధ్యాయ సంఘం గ్రూపులో వైరల్

సంతకాలతో మంత్రి లోకేశ్‌కు లేఖలు

ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్(ఏపీటీఎఫ్) యూనియన్ నేతలు ఒకడుగు ముందుకేసి 9 అంశాలపై సంతకాలు చేసిన లేఖలను మంత్రి నారా లోకేశ్‌కు మెయిల్స్, వాట్సాప్‌ల ద్వారా పంపిస్తున్నారు.

ఆ తొమ్మిది అంశాలివే

1. ప్రతి గ్రామంలో ప్రతిపాదిత ఫౌండేషన్ స్కూల్ స్థానంలో 1 నుంచి 5 తరగతులుండేలా ప్రాథమిక పాఠశాలలు విధిగా కొనసాగించాలి. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులుండాలి.
2. విద్యార్థులకు తెలుగు మాధ్యమంలో చదువుకునే అవకాశం కోసం తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలను కొనసాగించాలి. మైనారిటీ భాషల మాధ్యమాలను కొనసాగించాలి.
3. ఎస్‌జీటీలకు ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా ఉద్యోగోన్నతి కల్పించాలి.
4. మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో 120 మంది విద్యార్థులు దాటితే 5 ప్లస్ 1 ఉపాధ్యాయులను నియమించాలి.
5. ఉన్నత పాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులను విలీనం చేసే ప్రతిపాదనను విరమించుకోవాలి.
6. ప్రతిపాదిత ప్రభుత్వ ఉత్తర్వు 21లో ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులకు పడనున్న 40 పీరియడ్ల భారాన్ని 32 పీరియడ్‌లకు మించకుండా చూడాలి.
7. ఉన్నత పాఠశాలలో 45 మంది విద్యార్థులు దాటిన చోట రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలి.
8. క్లస్టర్లలో ఉపాధ్యాయులు మిగులు చూపించకుండా వారిని విద్యార్థుల సంఖ్యను బట్టి అవరోహణ క్రమం (ఎక్కువ నుంచి తక్కువ స్థాయి)లో పాఠశాలలకు కేటాయించాలి.
9. పెరిగిన జనాభా మేరకు మునిసిపాలిటీ, కార్పొరేషన్, నూతనంగా వెలిసిన ఆవాసాలతో నూతన పాఠశాలలను ఏర్పాటు చేయాలి.

ప్రకాశం జిల్లా ఉపాధ్యాయుల వాట్సాప్ లేఖ

సీఎస్‌పురం(పామూరు): ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం చర్యలు చేపట్టాలని కోరుతూ విద్యాశాఖ మంత్రి నారాలోకేశ్‌కు ప్రకాశం జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు వాట్సాప్ ద్వారా విజ్ఞప్తులు పంపారు. అన్ని గ్రామాల్లో 1 నుంచి 5 తరగతులకు ప్రాథమిక పాఠశాలలు, విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రతి ప్రాథమిక పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు ఉండాలంటూ పలు అంశాలపై ఏకరువుపెడుతూ వాట్సాప్ చేశారు. విద్యార్థులకు తెలుగు, ఇంగ్లిష్ మాధ్యమాలను కొనసాగించాలని కోరారు. ఎస్‌జీటీలకు పీఎస్ హెచ్‌ఎంలుగా పదోన్నతులు, ఉన్నతపాఠశాలల్లో 1 నుంచి 5 తరగతులు విలీనం చేసే ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఉన్నత పాఠశాలల్లో 45 మంది విద్యార్థులు దాటిన చోట రెండో సెక్షన్ ఏర్పాటు చేయాలంటూ వాట్సాప్ ద్వారా మంత్రికి వినతులు పంపినట్లు ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి షేక్. నాయబ్‌రసూల్, సీఎస్‌పురం మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట శ్రీనివాసులు, జె.ఎస్.ఆనంద్‌బాబు పేర్కొన్నారు.

ఔషధం.. ప్రాపగండం

మార్కెట్‌ను ఆక్రమించిన పీడీసీ మందులు

- కొన్ని మెడికల్ షాపుల్లో కొనసాగుతున్న దందా
- బ్రాండెడ్ మందుల కంటే అధికంగా ఎమ్మార్పీలు
- భారీగా డిస్కౌంట్ ఇస్తున్నట్లు హంగామా
- నాణ్యత లేదని తేలితేనే చర్యలు ఉంటాయన్న అధికారులు



కర్నూలు(హాస్పిటల్): పీడీసీ(ప్రాపగండ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ) మందులను కొన్ని మెడికల్ షాపుల్లో విక్రయిస్తున్నారు. వాటిపై భారీగా ఎంఆర్‌పీలు ముద్రించి.. డిస్కౌంట్‌లు సైతం భారీగా ఇస్తున్నట్లు హంగామా చేస్తున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో మూడు వేలకు పైగా రిటైల్, హోల్‌సేల్ మెడికల్ షాపులు ఉన్నాయి. ఇందులో కర్నూలు నగరంలోనే అధికంగా ఉన్నాయి. ఇక్కడి నుంచే హోల్‌సేల్ దుకాణాల ద్వారా జిల్లాలోని నలుమూలల్లో ఉండే రిటైల్ దుకాణాలకు మందులు వెళ్తుంటాయి. అయితే ఇటీవల కాలంలో సొంతంగా మందులు తయారు చేయించుకుని విక్రయించే విధానం తెరపైకి వచ్చింది. అంటే మార్కెట్‌లో లభించే బ్రాండెడ్ మందులే గాకుండా మందులు తయారు చేసే కంపెనీలతో మాట్లాడుకుని వారికి అవసరమైన ఔషధాలను తయారు చేయించుకుని విక్రయించుకునే అవకాశం వచ్చింది.

నాణ్యత అనుమానమే!

పీడీసీ(ప్రాపగండ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ) మందులను ఆయా ఫార్మాకంపెనీలతో మాట్లాడుకుని తయారు చేయించుకోవచ్చు. వాటిపై ఎంఆర్‌పీలు అవి తయారు చేయించుకునే వారి ఇష్టం. వాటిపై ఎంతైనా వేసుకోవచ్చు. ఎంతంటే బ్రాండెడ్ మందుల కంటే అధికంగా ఉండేటంత. ఏదైనా ఔషధాన్ని కనిపెట్టాలంటే సదరు ఫార్మా కంపెనీ ఎన్నో సంవత్సరాలు కష్టపడి తయారు చేస్తుంది. ఈ మేరకు కొన్ని నిర్ణీత సంవత్సరాల పాటు ఆ మందుకు పేటెంట్ తీసుకుంటుంది. ఆ పేటెంట్ కాలం ముగిసిన తర్వాత ఆ మందు ఫార్ములా తీసుకుని ఎవ్వరైనా తయారు చేసుకోవచ్చు. ఇతర బ్రాండెడ్ కంపెనీలతో పాటు ఊరు పేరు తెలియని కంపెనీలు కూడా మందులు తయారు చేసి జనంపైకి వదులుతున్నాయి. ఈ మేరకు భారీగా మందులపై ఎంఆర్‌పీలు ముద్రించి దోచుకుంటున్నాయి. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కొన్ని ప్రధాన దుకాణాల్లో మందుల కొనుగోలుపై 10 శాతం డిస్కౌంట్ ఇస్తున్నారు. కానీ వైద్యులకు అటాచ్‌గా ఉన్న మందుల దుకాణాల్లో లభించే ఈ పీడీసీ మందులపై ఎలాంటి డిస్కౌంట్స్ ఉండవు. పైగా సదరు డాక్టర్ రాసిన మందులు అక్కడ మాత్రమే లభిస్తాయి. అయితే ఈ మందులు ఎంత మేరకు పనిచేస్తాయి. వాటి నాణ్యత ఎంత అనేది ప్రతి దాన్ని ల్యాబ్‌లో పరీక్షిస్తే గానీ తెలియని పరిస్థితి.

అ'ధన'పు లాభాలు

ఉదాహరణకు ఒక బ్రాండెడ్ ఔషధం ధర రూ.300లు ఉందంటే...అందులో కంపెనీకి సంబంధించి తయారీ ఖర్చులు, ప్రచార ఖర్చులు, మార్కెటింగ్ ఖర్చులు అన్నీ కలిపి ఉంటాయి. కానీ పీడీసీ కంపెనీకి ఇలాంటి ఖర్చులేమీ ఉండవు. ఆ మందులపై భారీగా తగ్గింపు ఉండాలి. అంటే ఆ ఔషధం రూ.100లోపు ఉండాలి. కానీ పీడీసీ విషయంలో మాత్రం ఆ మందు ధర రూ.400 నుంచి రూ.600 వరకు ఉంటోంది. దీనిని బట్టి ఈ మందులపై ఎంతమేరకు లాభం ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఒకప్పుడు హోల్‌సేల్ ఏజెన్సీలు ఉన్న వారు ఇలాంటి మందులను వైద్యులున్న మెడికల్ షాపులకు పంపేవారు. ఇప్పుడు నేరుగా వైద్యులే ఏజెన్సీలు ఏర్పాటు చేసుకుని ఆ అదనపు లాభాలు కూడా వారే పొందుతున్నారు.


నకి'లీలలు'

- ఒకవైపు పీడీసీ మందుల దందా జోరుగా సాగుతున్న వేళ ఇమిటేషన్ డ్రగ్స్(నకిలీ) కొత్త వ్యాపారాన్ని ప్రారంభమైంది.
- మార్కెట్‌లో బాగా పేరున్న బ్రాండ్‌ల మందులను అచ్చుగుద్దినట్లు తయారు చేసి విక్రయిస్తున్నారు.
- గతంలో జాన్సన్ కంపెనీకి చెందిన అల్ట్రాసెట్ మాత్రలను విజయవాడ కేంద్రంగా తయారు చేసి తెలుగు రాష్ట్రాల్లో విక్రయించి పట్టుబడ్డారు.
- మూడు రోజుల క్రితం హైదరాబాద్‌లో ఓ వ్యక్తి అబాట్ కంపెనీ తయారు చేసిన థైరోనామ్ అనే థైరాయిడ్ టాబ్లెట్లను నకిలీవి తయారు చేసి విక్రయిస్తూ పట్టుబడ్డాడు.
- ఇటీవల కర్నూలులో ఓ దుకాణంలో సిస్టోపిక్ కంపెనీ గ్యాస్ట్రబుల్ కోసం తయారు చేసిన సైరా-డి అనే క్యాప్సుల్‌ను నకిలీగా తయారు చేశారు. ఎంఆర్‌పీ మాత్రం తప్పుగా ముద్రించి పట్టుబడ్డాడు.
- ఇటీవల కాలంలో నకిలీ మందుల వ్యాపారం కూడా జోరుగా సాగుతోంది. అచ్చుగుద్దినట్లు బ్రాండ్‌ను పోలి ఉండటంతో సామాన్య ప్రజలతో పాటు వ్యాపారులు కూడా గుర్తించలేని విధంగా ఆ మందులు ఉంటున్నాయి.

ఇలా చేయాలి..

నకిలీ మందుల మోసాలను అరికట్టేందుకు సదరు కంపెనీలు ఇటీవల మందుల స్ట్రిప్‌పై క్యూఆర్ కోడ్‌ను ముద్రిస్తున్నాయి. ఈ క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే అవి నకిలీవా అసలువా అనేది తెలిసిపోతుంది.

కేసులు నమోదు చేశాం



మార్కెట్‌లో లభించే అన్ని మందుల కంపెనీలు అనుమతి తీసుకునే తయారు చేస్తాయి. వాటిపై ఎంఆర్‌పీలు ఆయా కంపెనీలు ఇష్టం. ఎంఆర్‌పీలు, డిస్కౌంట్‌లను ప్రశ్నించలేం. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ విక్రయిస్తే కేసులు నమోదు చేస్తాం. పీడీసీ మందుల నాణ్యతపై తరచూ శాంపిల్స్ తీసి పంపిస్తున్నాం. ఇందులో ఇటీవల నంద్యాలలో రెండు, ఆదోనిలో ఒక శాంపిల్ సబ్ స్టాండర్డ్(నాణ్యతా ప్రమాణాలు లేనివి) అని నివేదికలు వచ్చాయి. ఈ మేరకు ఆయా దుకాణాలు, కంపెనీలపై కేసులు నమోదు చేశాం.

–రమాదేవి, ఔషధ నియంత్రణ శాఖ ఏడీ, కర్నూలు

మారుమూల ప్రాంతాల్లో రియల్ టైమ్ అలర్ట్స్

- ప్రత్యేకంగా అటానమస్ అలర్ట్ బ్రాడ్ కాస్టింగ్ సిస్టమ్ ఏర్పాటు
- డిజిటల్ కనెక్టివిటీ లేని గ్రామాల్లో మైక్‌ల ద్వారా అత్యవసర సమాచారం
- పైలట్ ప్రాజెక్టు కింద జిల్లాకు ఒక గ్రామాన్ని ఎంపిక చేసిన ఆర్టీజీఎస్
- విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా అమలుకు ప్రణాళిక
- ఆసక్తిగల సంస్థల నుంచి బిడ్లకు ఆహ్వానం

సాక్షి, అమరావతి : డిజిటల్ కనెక్టివిటీ తక్కువగా ఉన్న గ్రామాల్లో రియల్ టైమ్‌లో అలర్ట్స్‌ను అందించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక వ్యవస్థను అభివృద్ధి చేస్తోంది. మానవ ప్రమేయం లేకుండా గ్రామమంతా మైకుల ద్వారా అత్యవసర సమాచారమందించేలా అటానమస్ అలర్ట్ బ్రాడ్ కాస్టింగ్ సిస్టమ్ (ఏఏబీఎస్)ను ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం జిల్లా నుంచి ఒక గ్రామం చొప్పున మొత్తం 26 గ్రామాలను ఎంపిక చేసి, పైలట్ ప్రాజెక్టు కింద దీన్ని అమలు చేయనుంది. ఇది విజయవంతమైతే రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఈ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఇందుకోసం ఏఏబీఎస్‌ను అభివృద్ధి చేసి, అమలు చేయడానికి ఆసక్తిగల సంస్థ నుంచి రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) బిడ్లను ఆహ్వానిస్తోంది. ఆసక్తిగల సంస్థలు జూన్ 3లోగా బిడ్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. గ్లోబల్ సిస్టమ్ ఫర్ మొబైల్ కమ్యూనికేషన్స్ (జీఎస్‌ఎం) సిస్టమ్ ద్వారా వచ్చే అలెర్ట్‌లను అన్ని కాలాల్లో స్వీకరించి మానవ ప్రమేయం లేకుండా వెంటనే లౌడ్ స్పీకర్ల ద్వారా ఆడియో మెసేజ్‌లను ప్రసారం చేసేలా ప్రత్యేక వ్యవస్థను.. ఆ మేరకు సాఫ్ట్‌వేర్‌ను అభివృద్ధి చేస్తారు. ఇది పూర్తిగా సోలార్ విద్యుత్‌తో నడిచేలా బ్యాటరీ వ్యవస్థను కలిగి ఉండాలి. బిడ్ గెలుచుకున్న సంస్థ ఎటువంటి అవాంతరాలు లేకుండా ఏబీబీఎస్ వ్యవస్థ 24 గంటలు పనిచేసే విధంగా నిర్వహించాల్సి ఉంటుంది. ఆయా ప్రాంతాల్లో మాట్లాడే భాషలను పరిగణనలోకి తీసుకొని వివిధ భాషల్లో అలెర్ట్స్‌ను అందించనున్నారు.

రాష్ట్రపతి విశాఖ పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

సీఎస్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జూన్ 10వ తేదీన విశాఖపట్నం విచ్చేస్తున్న నేపథ్యంలో వివిధ శాఖల అధికారులు ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం పటిష్ట ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.విజయానంద్ ఆదేశించారు. రాష్ట్రపతి పర్యటన ఏర్పాట్లపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. విశాఖలో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం మొదటి స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొననున్న రాష్ట్రపతి, అనంతరం ఝార్ఖండ్ రాష్ట్ర పర్యటనకు వెళతారు.

యోగాంధ్ర–2025 విజయవంతం చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 21 నుంచి నిర్వహిస్తున్న యోగాంధ్ర–2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్లతో జరిగిన వీడియో కాన్ఫరెన్సులో సీఎస్ నిర్దేశించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో కనీసం 2 కోట్ల మంది అంతర్జాతీయ యోగా కార్యక్రమంలో పాల్గొనే విధంగా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

పంచాయతీరాజ్ చట్టాన్ని ఎమ్మెల్యేలు హైజాక్ చేస్తున్నారు

ఏపీ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మెండెం సంతోష్‌కుమార్ విమర్శ

ఏలూరు (టూటౌన్): పంచాయతీరాజ్ చట్టాన్ని ఎమ్మెల్యేలు హైజాక్ చేస్తూ సర్పంచ్‌ల విధులు, హక్కులకు భంగం కలిగిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మెండెం సంతోష్ కుమార్ విమర్శించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1994 పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి వచ్చిన రోజును పురస్కరించుకుని ఏలూరు ఎన్ఆర్‌పేటలోని కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేలు అధికారులను అడ్డంపెట్టుకుని పంచాయతీల్లో సర్పంచ్‌లకు ఉన్న హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు పంచాయతీ రాజ్ చట్టాన్ని సక్రమంగా అమలుచేయాలని సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. సమావేశంలో సర్పంచ్ చిలకా సుబ్బారావు, నాయకులు నూకపెయ్యి కార్తీక్, కనికెళ్ళ రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంతోష్ కుమార్



● తెలుసుకుందాం

కార్టూన్ పితామహుడు

బాల్యానికి, కార్టూన్ చిత్రాలకీ విడదీయలేని అనుబంధం ఎప్పుడూ ఉంటుంది. మనిషి ఆకారాన్ని పోలిఉండే ఆ బొమ్మలు, వాటికి ఉండే మానవాతీత శక్తులు, ఆ చిత్రాల తాలూకా సన్నివేశాలు, సంభాషణలు అన్నీ అబ్బురపరుస్తాయి. అలాంటి కార్టూన్ చిత్రాలు ఎప్పుడు, ఎక్కడ, ఎలా మొదలయ్యాయనేది మాత్రం చాలామందికి తెలియదు. అది ఇప్పుడు తెలుసుకుందాం.


యానిమేషన్ చరిత్రలో మొదటి కార్టూన్‌గా పరిగణించబడే 'Humorous Phases of Funny Faces' 1906లో అమెరికాలోని న్యూయార్క్‌లో జేమ్స్ స్టువర్ట్ బ్లాక్‌టన్ చేత సృష్టించబడింది. ఇది ఒక మూకీ చలన చిత్రంగా ప్రారంభమై నేటి ఆధునిక యానిమేషన్‌కు ఆద్యంగా నిలిచింది. చాక్‌బోర్డ్‌పై గీసిన బొమ్మలను కదిలినట్లు చూపించడానికి స్టాప్-మోషన్ టెక్నిక్‌ను ఉపయోగించి దాన్ని కార్టూన్ గా, సుమారు మూడు నిమిషాల నిడివితో తెరకెక్కించాడు ఈ అమెరికన్ చలన చిత్ర దర్శకుడు. ఈ చిత్రంలో, బ్లాక్‌టన్ చాక్‌బోర్డ్‌పై హాస్యభరితమైన ముఖాలను గీసి, వాటిని కెమెరాతో ఫ్రేమ్-బై-ఫ్రేమ్ చిత్రీకరించాడు. ఈ ఫ్రేమ్‌లను వేగంగా ప్లే చేయడం ద్వారా, ముఖాలు కదులుతున్నాయనే భ్రమను సృష్టించాడు.



ఈ చిత్రం థియేటర్లలో ప్రదర్శించబడినప్పుడు, ప్రేక్షకులు- బొమ్మలు 'జీవం' పొందినట్లు చూసి ఆశ్చర్యపోయారు. బ్లాక్‌టన్ ఈ టెక్నిక్‌ను అభివృద్ధి చేయడం ద్వారా యానిమేషన్‌కు ఒక కొత్త దిశను చూపించాడు. ఈ చిత్రం తర్వాత వచ్చిన యానిమేటెడ్ చిత్రాలకు ఇది పునాది వేసింది. అంతేకాకుండా వాల్ట్ డిస్నీ వంటి యానిమేటర్లకు స్ఫూర్తినిచ్చింది.

● మహనీయులు

● 'దేశభక్త' కొండా వెంకటప్పయ్య



తెలుగు నేలపై ఎంతో మంది మహనీయులు దేశానికి స్వాతంత్ర్యం రావాలని పోరాడారు. వారి పోరాటాల ఫలితంగానే మన దేశం స్వతంత్ర్య దేశంగా మారింది. అటువంటివారిలో ఒకరు కొండా వెంకటప్పయ్య. దేశానికి ఆయన చేసిన సేవలకు గానూ ఆయనకు 'దేశభక్త' అనే బిరుదును ఇచ్చారు. 1866లో ఫిబ్రవరి 22న కొండా వెంకటప్పయ్య పాత గుంటూరులో జన్మించారు.

గుంటూరు మిషన్ స్కూలులో ప్రాథమిక విద్య పూర్తి చేసిన ఆయన మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో ఉన్నత విద్య పూర్తిచేశారు. ఆ తర్వాత బి.ఎల్. పట్టా పొంది బందరులో లాయరు వృత్తిని చేపట్టారు. బ్రిటీషు వారి అధీనంలో భారతదేశ ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన ఆయన దేశానికి స్వాతంత్ర్యం రావాలని కాంక్షించేవారు. తెలుగు వారిని చైతన్యవంతం చేయడానికి 1902లో వాసు నారాయణరావుతో కలిసి కృష్ణా పత్రిక ప్రారంభించారు. న్యాయవాద వృత్తిలో వచ్చే ఆదాయాన్ని స్వాతంత్ర్య ఉద్యమానికే వెచ్చించేవారు. అనేకమందికి దానధర్మాలు చేశారు. 1910లో బందరులో జాతీయ కళాశాలకు ఆయనే ప్రారంభోత్సవం చేశారు.

1921లో వెంకటప్పయ్య ఆధ్వర్యంలోనే మహాత్మాగాంధీ ఆంధ్రదేశంలో పర్యటించారు. ఆ సమయంలో వేలాది రూపాయల విరాళాలు సేకరించి స్వరాజ్యనిధికి సమర్పించారు. గాంధీజీ తలపెట్టిన ప్రతి ఉద్యమానికి ఆంధ్ర ప్రాంతంలో కొండా వెంకటప్పయ్యే నాయకత్వం వహించేవారు. 1933లో తన భార్య మరణించే స్థితిలో ఉన్నా, వెంకటప్పయ్య దళితుల సేవకే అంకితమయ్యారు. ఈ విషయాన్ని మహాత్మాగాంధీ ప్రత్యేకంగా ప్రశంసించారు. కొండా వెంకటప్పయ్య కడలూరు జైలులో ఉన్న సమయంలో 'డచ్ రిపబ్లిక్' అనే పుస్తకాన్ని రాశారు. రెండు భాగాలుగా తన స్వీయచరిత్రను రాశారు. దేశప్రగతికి జీవితాంతం కృషి చేసిన వెంకటప్పయ్య 1949 ఆగస్టు 15న కన్నుమూశారు.



9 ఏళ్లకే గిన్నిస్ రికార్డు 'యోగం'

● వండర్ కిడ్






యోగాసనాలు వేయడం పూర్తిగా నేర్చుకోవాలంటే చాలా కాలం పడుతుంది. యోగా హెల్త్‌కు మంచిదని మనకు తెలుసు కదా. యోగాను తప్పకుండా గురువు దగ్గరే నేర్చుకోవాలి. అయితే రేయాంశ్ సురాని అనే బాలుడు తొమ్మిదేళ్లకే యోగా గురువుగా మారాడు. గిన్నిస్ బుక్‌లో చోటు కూడా సంపాదించాడు. ఇది చాలా ఇన్‌స్పైర్ చేసే విషయం మనకు.

మన చెందిన రేయాంశ్ సురాని తల్లిదండ్రులతో కలిసి దుబాయిలో ఉంటున్నాడు. నాలుగేళ్ల వయసులో నానమ్మ, తాతయ్య యోగాసనాలు వేయడం చూశాడు. తనూ వారిని అనుసరించడం మొదలుపెట్టాడు. దీంతో వారు యోగాసనాలు నేర్పించారు. ఆ తర్వాత తల్లిదండ్రులతో కలిసి మన దేశంలోని రిషికేశ్ వచ్చి యోగా కోర్సులో చేరాడు. అక్కడ నెల రోజులు ఉండి శ్రద్ధగా యోగాసనాలు నేర్చుకున్నాడు. రోజూ ఉదయం 7 నుంచి సాయంత్రం ఏడున్నర దాకా యోగా క్లాసులోనే గడిపేవాడు. అక్కడ వారిని చూసి తను కూడా యోగా శిక్షకుడిగా మారాలని భావించాడు.

అందుకోసం సుమారు 200 గంటల కోర్సు చేశాడు. ఎన్ని ఇబ్బందులు వచ్చినా లెక్క చేయలేదు. ఆ తర్వాత పూర్తిస్థాయిలో యోగా శిక్షకుడిగా మారాడు. ఆ సమయానికి అతని వయసు 9 ఏళ్లు. దీంతో 2021 జులైలో 'ప్రపంచంలో అతి చిన్న వయసున్న యోగా శిక్షకుడు'గా గిన్నిస్ ప్రతినిధులు రికార్డు అందించారు. గాలిలో నిలబడి యోగాసనాలు వేయడాన్ని సైతం రేయాంశ్ సాధన చేశాడు. దీంతోపాటు 'The Avid World of Reyansh' పేరుతో 2022లో ఓ పుస్తకం రాశాడు. ప్రస్తుతం అతనికి 13 ఏళ్లు. యోగాలో మరింత సాధన చేసి, ఉత్తమ శిక్షకుడిగా పేరు తెచ్చుకోవాలని ఆశపడుతున్నాడు.


● పుస్తకాలు

అలతి మాటల 'బాల గేయాలు'



పిల్లలూ... మీకు గేయాలంటే చాలా ఇష్టం. వాటిని పాడుకుంటూ మైమరిచిపోతుంటారు. అటువంటి మీ కోసం బాలసాహిత్య రచయిత కలువకొలను సదానంద సరళమైన భాషలో రాసిన బాల గేయాలు, గేయకథలు ఈ పుస్తకంలో ఉన్నాయి. ఇవన్నీ అలతి మాటలతో సాగుతూ ఎంతో ఆకట్టుకుంటాయి. ఆ గేయాల్లో ఎన్నో మేలైన విషయాలున్నాయి. వాటికి బొమ్మలు కూడా చేర్చడంతో మరింత నిండుతనం వచ్చింది.

మంచువాన- బాలుడి సాహసం



పీటర్ అనే ఆఫ్రికన్ అమెరికన్ పిల్లాడికి లోకంలో జరిగే విషయాల మీద అమితాసక్తి. చలికాలంలో కురిసిన తొలి మంచు వాన తర్వాత తమ ఇంటి చుట్టూ ఉన్న ప్రాంతాలు, అక్కడి విశేషాలను అన్వేషిస్తూ వెళ్తాడు. అతనికి ఎదురైన అనుభవాలే ఈ నవల. ఎజ్రా జాక్ కీట్స్ అనే అమెరికన్ రచయిత, చిత్రకారుడు 1962లో రాసిన ఈ పుస్తకం నేటికీ పిల్లల్ని ఆకట్టుకుంటోంది. ఇప్పటిదాకా ఈ పుస్తకం మిలియన్ల కాపీలు అమ్ముడుపోవడంతోపాటు అనేక భాషల్లోకి అనువాదమైంది.

గడ్డితో వంతెన

భారీ వంతెనలను ఎలా కడతారు? సిమెంటు, ఇసుక, కంకర, ఇనుము..ఇలాంటి మిశ్రమాలతో కదా? అయితే గడ్డితో కట్టే వంతెన గురించి ఎప్పుడైనా విన్నారా? పెరూ దేశంలోని కుస్కో ప్రాంతంలో అపురిమక్ నది ఒడ్డున గడ్డితాళ్ళతో వంతెన అల్లుతారు. ఈ వంతెనను ప్రతి సంవత్సరం తొలగించి కొత్తది ఏర్పాటు చేస్తుంటారు. దాదాపు 600 ఏళ్ల నుంచి ఇలా చేస్తున్నారు. ఆధునిక యంత్రాలు, సామగ్రి అందుబాటులో ఉన్న ఈ కాలంలో కూడా ఇంకా వాళ్లు ఎందుకిలా చేస్తున్నారో తెలుసా?

ఒకప్పుడు ఆ ప్రాంతంలో ప్రధాన నగరాలు, పట్టణాలను అనుసంధానించడానికి ఇలాంటి వంతెనలనే వాడేవారు. ఈ వంతెనలను యునెస్కో 2013లో ప్రపంచ వారసత్వ సంపదగా ప్రకటించింది. ఇలా గడ్డితో వంతెన తయారు చేసే నైపుణ్యం అంతరించిపోకుండా ఇక్కడి ప్రజలు దాన్ని సంప్రదాయంగా కొనసాగిస్తున్నారు. ఏటా జూన్ నెల రెండో ఆదివారానికి నాలుగు రోజుల ముందు వంతెన పని మొదలవుతుంది. ముందుగా గతేడాది నిర్మించిన వంతెనను తెంచేసి నదిలో వదిలేస్తారు. ఆ తర్వాత ఈ నదికి ఇరువైపులా ఉన్న ప్రజలు కలిసి కొత్త వంతెన పని మొదలుపెడతారు. పురుషులు మాత్రమే ఈ వంతెనను నిర్మించాలన్న సంప్రదాయం ఉంది. దీంతో మహిళలు నదికి కొంతదూరంలో కూర్చుని చిన్న చిన్న తాళ్లను తయారుచేస్తారు. మొదటిరోజు మగవారంతా కలిసి 120 చిన్న చిన్న తాళ్లను కలిపి లావైన తాళ్లను తయారుచేస్తారు. ఆ తాళ్ల తయారీకి 'కోయా ఇచు' అనే దృఢమైన గడ్డిని వాడతారు. వంతెన పని చేసేవారి కోసం చుట్టుపక్కల ఊళ్ల జనం రకరకాల మాంసాలతో వంటకాలు వండుకుని తీసుకొస్తారు. ఆరు తాళ్లలో నాలుగింటిని వంతెనపై నడిచే భాగంలో వాడతారు. మిగిలిన రెండింటిని వంతెనకు ఇరువైపులా నడిచేవారికి పట్టుకోడానికి వాడతారు. ఈ పనంతా పూర్తవ్వడానికి ఒక రోజంతా పడుతుంది. ఈ వంతెన తయారీలో కేవలం రాళ్లు, గడ్డి మాత్రమే వాడతారు. వంతెన ఏర్పాటు చేసిన తర్వాత నాలుగో రోజు పాటలు పాడుతూ, వివిధ రకాల వంటకాలు వండుకుని పండుగ చేసుకుంటారు.



● వండర్ వరల్డ్

● మన సినిమా

ఆస్ట్రిక్స్ అండ్ ఓబ్లిక్స్ బిగ్ ఫైట్

మహా యుద్ధం చూస్తారా?





హేయ్ కిడ్స్.... ఈ వీక్ మీకో సూపర్ మూవీ సజెస్ట్ చేయబోతున్నాను. ఇదో సూపర్ ఫైట్ మూవీ. నెట్‌ఫ్లిక్స్‌లో 3డి యానిమేటెడ్ సీరీస్‌గా రిలీజ్ అయింది. పేరు 'ఆస్ట్రిక్స్ అండ్ ఓబ్లిక్స్ బిగ్ ఫైట్'. దీని కథేంటంటే 50ఆఇలో రోమన్ సామ్రాజ్యాన్ని ఎదిరించే గాలిష్ విలేజ్ ఒక పెద్ద సమస్యలో ఇరుక్కుంది. ఒబెలిక్స్ అనే వ్యక్తి అనుకోకుండా ఒక భారీ రాయిని గెటాఫిక్స్ మీదకు విసురుతాడు. దీంతో గెటాఫిక్స్ తన మెమరీని అలాగే తనకున్న శక్తులను కోల్పోతాడు. ఇదే టైంలో రోమన్లు గాలిష్ విలేజ్‌లో ఓ బిగ్ ఫైట్ అనౌన్స్ చేస్తారు. గాలిష్ విలేజ్ లీడర్ విటల్ స్టాటిస్టిక్స్‌ను రోమన్ ఫేవరేట్ గాలిష్ సింగర్ అయిన కాసియస్ సెరామిక్స్‌తో ఫైట్ చేయాలని డిసైడ్ చేస్తారు. కాకపోతే విటల్ స్టాటిస్టిక్స్ ఓడిపోతే గాలిష్ విలేజ్ రోమన్లు తీసుకుంటారు. ఈ టైంలో ఆస్టెరిక్స్ అలాగే ఒబెలిక్స్ గెటాఫిక్స్ మెమరీని వెనక్కి తీసుకవచ్చి తమ గ్రామాన్ని ఎలా కాపాడుకుంటారు అన్నదే ఈ సిరీస్. ఈ సిరీస్ మొత్తం చాలా థ్రిల్లింగ్ గా సూపర్ గా ఉంటుంది. సో కిడ్స్ వై వెయిట్. తప్పక చూడండి.

- హరికృష్ణ ఇంటూరు

● బాలల కథ

పెద్దల మాట





అనగనగా ఒక అడవిలో పక్కపక్కనే రెండు రావిచెట్లు ఉండేవి. వాటి మీద పక్షులు గూళ్లు కట్టుకొని నివసిస్తున్నాయి. వాటిల్లో ఒక గుడ్లగూబ కూడా ఉండేది. అక్కడున్న పక్షుల్లో అదే పెద్ద వయసున్న పక్షి కావడంతో అప్పుడప్పుడూ మిగిలిన వాటికి సలహాలు, సూచనలు ఇచ్చేది. ఆ మాటల్ని కొన్ని పక్షులు వినేవి. మరికొన్ని మాత్రం లక్ష్యపెట్టేవికావు.

రెండు రావిచెట్లు గుబురుగా పెరగడంతో ఒకదాని కొమ్మలు మరొక చెట్టుతో రాసుకుంటూ ఉండేవి. భారీ గాలివానలొచ్చినప్పుడు చెట్లు కూలిపోతాయేమో అన్నంతగా కదిలిపోయేవి. ఆ పరిస్థితి చూసిన గుడ్లగూబ 'ఈ చెట్లు చాలా ఏళ్ల నాటివి. ఎప్పుడైనా ఇవి కూలిపోయే ప్రమాదం ఉంది. మనందరం కొత్త చెట్టు చూసుకోవాలి' అని చెప్పేది. కొన్ని పక్షులు బద్ధకంతో 'తర్వాత చూసుకుందాం' అన్నాయి. మరికొన్ని పక్షులు 'నీదంతా చాదస్తం. మరో వందేళ్లయినా ఈ చెట్టుకు ఏమీ కాదు' అని చెప్పాయి.

వానాకాలం మొదలైంది. కొద్దిగా జల్లులు కురుస్తున్న సమయంలో గుడ్లగూబ మరోసారి రెండు చెట్ల మీదున్న పక్షుల వద్దకు వెళ్లి- 'వానలు మొదలయ్యాయి. ఈ రెండు చెట్లు ఇప్పటికే బలహీనంగా తయారయ్యాయి. వాటి వేర్లు భూమిలోనుంచి బయటకు వచ్చేశాయి. వెంటనే మనమంతా మరో చెట్టు చూసుకుందాం' అని చెప్పింది. కానీ ఎవరూ ఆ మాట లక్ష్యపెట్టలేదు. దీంతో చేసేది లేక గుడ్లగూబ దగ్గర్లో ఉన్న మరో చెట్టు మీద కొత్తగా గూడు కట్టుకుని అక్కడికి వెళ్లిపోయింది. గుడ్లగూబ కొత్త గూడును చూసి కొన్ని పక్షులు నవ్వుకున్నాయి.

మరో నెల రోజుల తర్వాత వానలు ఉధృతంగా కురిశాయి. పక్షులు గూళ్లు వదిలి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. హోరుగాలికి రావిచెట్లు బలంగా ఊగి, వేర్లతో సహా కూలిపోయాయి. దీంతో చెట్టు మీదున్న పక్షుల గూళ్లన్నీ నీటిలో కొట్టుకుపోయాయి. ఆ కొమ్మల కిందపడి ఎన్నో పక్షులు మరణించాయి. మిగిలిన పక్షులు గుడ్లగూబ ఉన్న చెట్టు మీదకు చేరాయి. ఆ వర్షంలో గూడు కట్టుకునే వీలు లేక వానకు తడుస్తూ ఇబ్బంది పడ్డాయి. ముందే గుడ్లగూబ మాటలు విని ఉంటే తమకు ఈ అవస్థ వచ్చి ఉండేది కాదని, తమ మిత్రులు బతికేవారని అనుకొని బాధపడ్డాయి.

నీతి:
పెద్దల మాట వినాలి

● ఎందుకు ఏమిటి ఎలా?

కొత్త పుస్తకాలు ఎందుకు సువాసన వెదజల్లుతాయి?



పుస్తకాలు మన జీవితంలో స్నేహితుల లాంటివి. అవి విజ్ఞానాన్ని అందించడమే కాకుండా అనేక కథలు, కవితలతో మనల్ని వినోదపరుస్తాయి. అయితే మీరెప్పుడైన కొత్త పుస్తకం తెరిచి చదివారా? పుస్తకం తెరిచినప్పుడు వచ్చే ఆ ప్రత్యేకమైన వాసనను ఎప్పుడైనా గమనించారా? ఈ వాసన పుస్తకాలను మరింత ఆకర్షణీయంగా చేస్తుంది. అయితే ఆ వాసనకు గల శాస్త్రీయ కారణాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

మొదటగా పుస్తకాలు కాగితాలతో తయారవుతాయి. కాగితాలు చెట్లనుండి తయారు చేస్తారని మనందరికీ తెలుసు. అలా తయారు చేసేటప్పుడు లిగ్నిన్ అనే రసాయనాన్ని ఉపయోగించడం వలన చెక్క వంటి ఒక వాసన ఏర్పడుతుంది. ఇంకొక కారణం, పుస్తకంలోని అక్షరాలు, చిత్రాలు ముద్రించడానికి ఉపయోగించే సిరాలో రసాయనాలు ఉంటాయి. ఈ సిరా కొత్తగా ముద్రించినప్పుడు ఒక సుగంధం లాంటి వాసనను వెదజల్లుతుంది. ఇది కొంచెం రబ్బరు లేదా రంగుల వాసనలా ఉంటుంది. మరొక కారణం పుస్తకం యొక్క పేజీలను కలిపి బైండ్ చేయడానికి గ్లూ ఉపయోగిస్తారు. ఈ గ్లూ కూడా తయారీలో ఉపయోగించే రసాయనాల వల్ల ఒక ప్రత్యేకమైన వాసనను వెదజల్లుతుంది.

చివరగా, పుస్తకాలు ముద్రించే యంత్రాలు, కాగితం లేదా కవర్‌పై ఉపయోగించే రసాయనాలు కూడా ఈ వాసనకు కారణమవుతాయి. కొత్తగా ముద్రించిన పుస్తకం తెరిచినప్పుడు ఈ రసాయనాలు గాలిలో కలిసి ఆ వాసనను ఇస్తాయి!

గృహాల పొదుపు రూ.22 లక్షల కోట్లు

- 2024-25లో ఉండొచ్చన్న ఎస్‌బీఐ రీసెర్చ్
- జీఎస్‌డీపీలో 6.5 శాతానికి సమానం

కోల్‌కతా: గృహాల నికర పొదుపులు గత ఆర్థిక సంవత్సరంలో (2024-25) రూ.22 లక్షల కోట్ల మేర ఉండొచ్చని ఎస్‌బీఐ రీసెర్చ్ తన అంచనాలు ప్రకటించింది. జాతీయ స్థూల ఖర్చు చేయతగిన ఆదాయం (జీఎన్‌డీఐ)లో ఇది 6.5 శాతానికి సమానమని పేర్కొంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో గృహ నికర పొదుపులు జీఎన్‌డీఐలో 5.1 శాతంగా ఉంటే, దీంతో పోల్చితే గత ఆర్థిక సంవత్సరంలో 4.9 శాతం మేర పెరిగినట్టు తెలిపింది. ఆర్థిక పొదుపులు పెరగడం అన్నది ప్రభుత్వం, కార్పొరేట్ నిధుల లోటును భర్తీ చేసేందుకు, స్థూల ఆర్థిక స్థిరత్వానికి ఎంతో కీలకమని ఎస్‌బీఐ రీసెర్చ్ రిపోర్ట్ తెలిపింది.



ఈ సందర్భంగా ఆర్‌బీఐ మిగులు నిల్వలను ప్రస్తావించింది. రూపాయి అస్థిరతల కట్టడికి సెంట్రల్‌బ్యాంక్ తీసుకునే చర్యలు ఈ పరిమాణాన్ని నిర్దేశిస్తాయని తెలిపింది. 2024-25లో ఆర్‌బీఐ బ్యాలన్స్ షీటు 8.19 శాతం విస్తరించగా.. అదే ఏడాది జీడీపీ వృద్ధి రేటు 9.9 శాతం కంటే తక్కువగా ఉన్నట్టు పేర్కొంది. ఆర్‌బీఐ మిగులు నిల్వలు రూ.2.69 లక్షల కోట్లను ప్రభుత్వానికి బదిలీ చేయడం (డివిడెండ్) ద్రవ్య వెసులుబాటును ఇస్తుందని తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో మోసాల కేసులు తగ్గినప్పటికీ.. మోసపోయిన మొత్తం మూడు రెట్లు పెరిగి రూ.36,014 కోట్లకు చేరినట్టు గుర్తు చేసింది.

బంగారం ఆభరణాల వినియోగం నెమ్మదించొచ్చు

- 2025-26లో 9-10 శాతం తక్కువ
- ధరలు పెరగడం ప్రభావం చూపించొచ్చు
- పెట్టుబడుల డిమాండ్ కొనసాగుతుంది
- రేటింగ్స్ సంస్థ ఇక్రా అంచనా



ముంబై: బంగారం ధరల పెరుగుదలతో ఆభరణాల వినియోగం ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ 9-10 శాతం మేర తగ్గిపోవచ్చని రేటింగ్స్ ఏజెన్సీ ఇక్రా అంచనా వేసింది. ముఖ్యంగా బంగారం ధరలు 33 శాతం పెరగడం వినియోగం తగ్గుముఖం పట్టడానికి కారణంగా పేర్కొంది. గత ఆర్థిక సంవత్సరంలోనూ (2024-25) ఆభరణాల వినియోగం 7 శాతం తగ్గడం గమనార్హం. 2023-24లో బంగారం బిస్కెట్లు, కాయిన్ల డిమాండ్ 17 శాతం, 2024-25లో 25 శాతం చొప్పున పెరిగినట్టు ఇక్రా నివేదిక వెల్లడించింది. అంతర్జాతీయంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు, భౌగోళిక, వాణిజ్య ఉద్రిక్తతల మధ్య సురక్షిత సాధనమైన బంగారానికి పెట్టుబడుల డిమాండ్ పెరగడమే వృద్ధిని ఇతోధికం చేసినట్టు వివరించింది. పెట్టుబడుల పరంగా పసిడికి డిమాండ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనూ (2025-26) కొనసాగుతుందని అంచనా వేసింది. బంగారం బిస్కెట్ల డిమాండ్ 10 శాతం, కాయిన్ల డిమాండ్ 35 శాతం వరకు పెరగచొచ్చని తెలిపింది. ఇక 2025-26లో బంగారం ఆభరణాల వినియోగం విలువ పరంగా 12-14 శాతం వృద్ధిని చూడొచ్చని పేర్కొంది. ధరల పెరుగుదల ఫలితమే ఇదని వివరించింది. గత ఆర్థిక సంవత్సరంలోనూ ధరలు 33 శాతం పెరగడంతో విలువ పరంగా 28 శాతం వృద్ధి నమోదైనట్టు గుర్తు చేసింది.

సంఘటిత జ్యుయలర్లకు సానుకూలం..

''సంఘటిత రంగంలోని పెద్ద స్థాయి రిటైల్ జ్యుయలర్ల ఆదాయం ఈ ఆర్థిక సంవత్సరంలో 14-16 శాతం మేర పెరుగుతుందని ఇక్రా అంచనా వేసింది. ధరల పెరుగుదలకుతోడు, ప్రణాళికబద్ధమైన స్టోర్ల విస్తరణ, అసంఘటిత రంగంలోని వర్తకుల నుంచి మార్కెట్ వాటాను క్రమంగా సొంతం చేసుకుంటుండడం, ఈ ఏడాది పర్వదినాలు ఎక్కువగా ఉండడం డిమాండ్‌కు మద్దతునిస్తాయి''అని ఇక్రా సీనియర్ వైస్ ప్రెసిడెంట్, గ్రూప్ హెడ్ జితిన్ మక్కర్ తెలిపారు. దూకుడుగా స్టోర్లను విస్తరించే కొన్ని సంఘటిత జ్యుయలరీ సంస్థలకు మినహా ఎక్కువ జ్యుయలర్లకు అమ్మకాల పరిమాణం తగ్గొచ్చని ఇక్రా అంచనా వేసింది.

ధరలు ఈ స్థాయిలో స్థిరపడొచ్చు

బంగారం ధరలు ప్రస్తుత స్థాయిలో స్థిరపడొచ్చని ఇక్రా తెలిపింది. అంతర్జాతీయంగా ఊహించని ఏవైనా పెద్ద ఘటనలు జరిగితే తప్పించి ఇదే స్థాయిలో ఉండొచ్చని అంచనా వేసింది. సంఘటిత రంగంలోని జ్యుయలరీ సంస్థల నిర్వహణ మార్జిన్లు 30 బేసిస్ పాయింట్లు పెరిగి 7.2 శాతంగా ఉంటాయని తెలిపింది. రుణ వ్యయాల పెరుగుదలతో నికర మార్జిన్ల విస్తరణ 10 బేసిస్ పాయింట్లు మించకపోవచ్చని పేర్కొంది. తమ మూలధన అవసరాలకు జ్యుయలర్లు బంగారం తనఖా రుణాలను వినియోగిస్తుంటారు.

టెక్‌యేతర రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం

- 14 శాతానికి పెరిగిన ప్రాతినిధ్యం
- బీఎఫ్ఎస్ఐలో అత్యధికం
- టీమ్‌లీజ్ డిజిటల్ నివేదిక



ముంబై: టెక్‌యేతర రంగాల్లో మహిళా టెకీల ప్రాతినిధ్యం క్రమంగా పెరుగుతోంది. 2020 తర్వాత నుంచి ఈ ధోరణి మరింత ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. 2020లో టెక్నాలజీ ఉద్యోగాల్లో మహిళల వాటా 1.90 శాతంగా ఉండగా, 2023లో 11.8 శాతానికి, 2024 నాటికి 14 శాతానికి పెరిగిందని టీమ్‌లీజ్ డిజిటల్ ఒక నివేదికలో వెల్లడించింది. 2020-2024 మధ్యకాలంలో 13,000 మంది టీమ్‌లీజ్ డిజిటల్ టెక్ కాంట్రాక్ట్ సిబ్బంది డేటా విశ్లేషణ ఆధారంగా దీన్ని రూపొందించారు. దీని ప్రకారం పురుషాధిక్యత ఉండే కాంట్రాక్ట్ ఉద్యోగాల్లో మహిళల వాటా 2020లో 9.51 శాతంగా ఉండగా 2024లో 27.98 శాతానికి పెరిగింది. నాన్-టెక్ రంగాల్లో టెక్నాలజీపరమైన విధుల్లో మహిళల నియామకాలు మెరుగుపడుతుండటాన్ని ఇది సూచిస్తోందని రిపోర్ట్ పేర్కొంది.

నివేదికలోని మరిన్ని విశేషాలు..

- హోదాపరంగా చూస్తే సీనియర్ స్థాయుల్లో మహిళల ప్రాతినిధ్యం 3.35 శాతానికే పరిమితం కాగా, మిడ్-లెవెల్లో 4.07 శాతంగా, ఎంట్రీ స్థాయిలో 3.03 శాతంగా ఉంది. లీడర్‌షిప్ హోదాలను చేరుకోవడంలో మహిళలకు ఇప్పటికీ సవాళ్లు ఎదురవుతున్నాయనడానికి ఇది నిదర్శనం.
- పరిశ్రమలవారీగా నైపుణ్యాల ఆధారిత విశ్లేషణ ప్రకారం, బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగంలో ఇటు నాన్-టెక్నికల్, అటు టెక్నికల్ నైపుణ్యాల్లో మహిళల ప్రాతినిధ్యం అత్యధికంగా ఉంది. ఇది వరుసగా 49.28 శాతం, 44.31 శాతంగా నమోదైంది. 47.32 శాతం, 34.58 శాతం వాటాతో లైఫ్ సైన్సెస్ అండ్ హెల్త్‌కేర్ ఆ తర్వాత స్థానంలో నిల్చింది.
- టెక్నాలజీయేతర రంగాల్లో టెకీ ఉద్యోగాల్లో మహిళల వాటా 14 శాతానికి చేరడమనేది సమ్మిళితత్వం పెరుగుతుండటాన్ని సూచిస్తోంది. అయితే, లీడర్‌షిప్ హోదాల్లో వారికి అంతగా ప్రాతినిధ్యం ఉండటం లేదు. ఈ అంతరాలను సరిచేసేందుకు తగు చర్యలు తీసుకోవాలి.
- మహిళలకు కూడా అవకాశాలు ..వనరులు సమానంగా అందుబాటులో ఉండేలా, పరిశ్రమపరమైన అవరోధాలను పరిష్కరించేలా, సిబ్బందిలో వారి సంఖ్య మరింత పెరిగేలా చూడటంపై కంపెనీలు మరింత దృష్టి పెట్టాలి.

రెన్యూ ఫొటోవోల్టెయిక్స్‌లో వాటాలపై బీఐఐ కసరత్తు

న్యూఢిల్లీ: సోలార్ మాడ్యూల్స్ తయారీ సంస్థ రెన్యూ ఫొటోవోల్టెయిక్స్‌లో వాటాలు కొనుగోలు చేసే ప్రక్రియను బ్రిటీష్ ఇంటర్నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ (బీఐఐ) వేగవంతం చేసింది. ఒప్పందానికి అనుమతుల కోసం గుత్తాధిపత్య నియంత్రణ సంస్థ కాంపిటీషన్ కమిషన్ (సీసీఐ)కి దరఖాస్తు చేసింది. రెన్యూ ఫొటోవోల్టెయిక్స్‌లో బ్రిటన్ ప్రభుత్వ డెవలప్‌మెంట్ ఫైనాన్స్ సంస్థ అయిన బీఐఐ రూ. 870 కోట్లు ఇన్వెస్ట్ చేస్తోంది. బీఐఐ పోర్ట్‌ఫోలియోలోని కంపెనీల్లో కొన్ని సౌర విద్యుత్ రంగానికి చెందినవి కూడా ఉన్నాయి. దీంతో డీల్ విషయంలో సీసీఐ అనుమతి తీసుకోవాల్సి వస్తోంది. ఈ ఒప్పందం వల్ల భారత్‌లో పోటీ కంపెనీలపై ప్రతికూల ప్రభావమేమీ ఉండదని ఇరు సంస్థలు సీసీఐకి తెలియజేశాయి. 2021లో ఏర్పాటైన రెన్యూ ఫొటోవోల్టెయిక్స్‌కి రాజస్థాన్, గుజరాత్‌లో వరుసగా 6.4 గిగావాట్ల సోలార్ పీవీ మాడ్యూల్స్ ప్లాంటు, 2.5 గిగావాట్ల సోలార్ సెల్ ప్లాంటు ఉంది.



కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

31-5-2025

విశాఖ	535-00
చిత్తూరు	613-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	510-00
విజయవాడ	525-00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	525-00
వరంగల్	527-00
రిటైల్ ధర	5.85

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	239.75	4.98
SBIN	814	2.09
HDFCBANK	1,941.50	0.73
LT	3,672.00	0.46
DRREDDY	1,251.00	0.22

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
BAJAJ-AUTO	8,599.00	-3.1
HINDALCO	633.7	-2.51
HCLTECH	1,631.50	-1.99
SHRIRAMFIN	639.35	-1.98
NESTLEIND	2,393.80	-1.69

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	8,610
ఎన్ఎస్ఈ	1,68,795
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,56,236
ఎఫ్ఐఐ	-6,450
డీఐఐ	+ 9,096

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	60.58 (రాత్రి 11.30కు)	$ 60.94 (క్రితం ముగింపు)
బ్రెంట్	62.67 (రాత్రి 11.30కు)	$ 63.35 (క్రితం ముగింపు)

ఎంఎస్ఎంఈలు నాణ్యత ప్రమాణాలను అనుసరించాలి

- స్వచ్ఛందంగా ఇందులో భాగస్వాములు కావాలి
- వినియోగ వ్యవహారాల శాఖ కార్యదర్శి ఖరే



న్యూఢిల్లీ: సూక్ష్మ, చిన్న, మధ్య తరహా సంస్థలు (ఎంఎస్ఎంఈలు) ఉత్పత్తుల తయారీలో స్వచ్ఛంద, తప్పనిసరి ప్రమాణాలను పాటించాలని కేంద్ర వినియోగ వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖరే సూచించారు. ఢిల్లీలో జరిగిన ఓ సదస్సును ఉద్దేశించి ఆమె మాట్లాడారు. భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించనున్నట్టు చెబుతూ.. ఈ లక్ష్య సాధనలో ఎంఎస్ఎంఈల పాత్ర ప్రధానంగా ఉంటుందన్నారు. ఎంఎస్ఎంఈలు తమ సమస్యల గురించి తెలియజేయడం, సత్వర పరిష్కారాలను పొందే విషయంలో మరింత చురుగ్గా ఉండాలని పిలుపునిచ్చారు. కొత్త ప్రమాణాల కోసం పరిశ్రమ డిమాండ్ చేయాలని.. వాటిని రూపొందించడంలో పాలు పంచుకోవాలని కోరారు. భారతీయ ప్రమాణాల మండలి (బీఐఎస్) వేగంగా ప్రమాణాలను రూపొందించగలదంటూ.. ప్రమాణాల విషయంలో పరిశ్రమ పాత్ర ప్రముఖంగా ఉండాలని ఆశిస్తున్నట్టు చెప్పారు. ఈ విషయంలో ఏవైనా ఇబ్బందులు ఎదుర్కొంటుంటే ప్రభుత్వాన్ని సంప్రదించాలని సూచించారు. నాణ్యమైన ఉత్పత్తుల దిశగా గత కొన్నేళ్లలో ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకున్నట్టు గుర్తు చేశారు. ప్రస్తుతమున్న టెస్టింగ్ ల్యాబ్‌లను బలోపేతం చేయడంతోపాటు, కొత్త వాటిని ఏర్పాటు చేసేందుకు రూ.78 కోట్ల నిధులకు ఇటీవలే ఆమోదం తెలిపినట్టు చెప్పారు. ఏ దేశం అయినా అంతిమంగా తన ఉత్పత్తులు, సేవల్లో విశ్వసనీయతతోనే వృద్ధి చెందగలదని గుర్తు చేశారు. దిగుమతయ్యే నాసిరకం ఉత్పత్తులను తిరస్కరించే ప్రమాణాలను భారత్ కలిగి ఉండాలని అభిప్రాయపడ్డారు. ఉగాండా, రువాండాలకు సైతం నాణ్యత నియంత్రణలు ఉన్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం 23,000 వరకు భారతీయ ప్రమాణాలు ఉండగా, అవన్నీ స్వచ్ఛందమేనన్నారు.

రిలయన్స్ డిజిటల్ 'బూట్ అప్ ఇండియా' సేల్



ముంబై: రిలయన్స్ డిజిటల్ ఇండియా 'బూట్ అప్ ఇండియా' పేరుతో అతిపెద్ద ల్యాప్‌టాప్ సేల్స్ ప్రకటించింది. వ్యాపారపరంగా మాత్రమే కాకుండా 'నేటి విద్యార్థులను రేపటి అవకాశాలకు సన్నద్ధం చేయడం' అనే గొప్ప సంకల్పంతో క్యాంపెన్ నిర్వహించనుంది. సేల్స్‌లో భాగంగా ల్యాప్‌ట్యాప్‌లు, ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్ ఉపకరణాలు తక్కువ ధరకే లభిస్తాయి. దేశవ్యాప్తంగా విద్యార్థులకు ఒక కోటి రూపాయల ఉపకార వేతనాలు ఇవ్వనుంది. అలాగే 25 కార్లు, 40 బైకులు, 450 పైగా ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులు గెలుచుకునే అవకాశం కల్పిస్తుంది.

మెట్రోల్లో తగ్గిన బ్యాంకు రుణాలు!

ముంబై: మెట్రోపాలిటన్ నగరాల్లో బ్యాంకుల రుణాల వాటా చెప్పుకోతగ్గ మేర క్షీణించింది. ఐదేళ్ల క్రితం బ్యాంకుల మొత్తం రుణాల్లో 63.5 శాతంగా ఉంటే 2025 మార్చి చివరికి 58.7 శాతానికి తగ్గినట్టు ఆర్‌బీఐ డేటా వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లో, చిన్న పట్టణాల్లో రుణ వితరణ పెరగడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. డిపాజిట్ల విషయంలో దీనికి విరుద్ధమైన పరిస్థితి నెలకొంది. గ్రామీణ ప్రాంతాలతో పోల్చితే మెట్రోపాలిటన్ శాఖల్లోనే అధికంగా 11.7 శాతం వృద్ధి 2025 మార్చిలో నమోదైంది. ఇదే కాలంలో గ్రామీణ శాఖల్లో 10.1 శాతం, సెమీ అర్బన్ శాఖల్లో 8.9 శాతం, అర్బన్ శాఖల్లో 9.3 శాతం నమోదైంది.

బ్లాక్ బాక్స్ లాభం జూమ్

- క్యూ4లో రూ. 60 కోట్లు
- షేరుకి రూ. 1 డివిడెండ్



న్యూఢిల్లీ: ఎస్సార్ గ్రూప్ ఐటీ కంపెనీ బ్లాక్ బాక్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 47 శాతం జంప్‌చేసి రూ. 60 కోట్లను అధిగమించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 41 కోట్లు ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 1 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం 4 శాతం వృద్ధితో రూ. 1,545 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 1,480 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఈ కాలంలో రూ. 1,550 కోట్ల విలువైన కొత్త డీల్స్ కుదుర్చుకుంది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి కంపెనీ నికర లాభం 49% జంప్‌చేసి రూ. 205 కోట్లకు చేరింది. 2023-24లో రూ. 138 కోట్లు మాత్రమే ఆర్జించింది. ప్రస్తుతం కంపెనీలో ప్రపంచవ్యాప్తంగా 3,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2.5 శాతం పెరిగి రూ. 517 వద్ద ముగిసింది.

జువారీ ఇండస్ట్రీస్‌కు నష్టాలు

- క్యూ4లో రూ. 21 కోట్లు



న్యూఢిల్లీ: షుగర్ తయారీ కంపెనీ జువారీ ఇండస్ట్రీస్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన లాభాలను వీడి రూ. 21 కోట్ల నికర నష్టం ప్రకటించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 63 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం మాత్రం రూ. 262 కోట్ల నుంచి రూ. 272 కోట్లకు పుంజుకుంది. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి సైతం అనుకోని ఐటమ్స్ కారణంగా రూ. 94 కోట్లకుపైగా నికర నష్టాలు నమోదు చేసింది. మొత్తం ఆదాయం రూ. 838 కోట్ల నుంచి రూ. 970 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 1 శాతం పతనమై రూ. 282 వద్ద ముగిసింది.

మార్చి త్రైమాసిక ఫలితాలు

ఇక్రా డివిడెండ్ రూ. 60

క్యూ4 లాభం రూ. 56 కోట్లు



ముంబై: రేటింగ్ ఏజెన్సీ ఇక్రా గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 19 శాతం ఎగసి రూ. 56 కోట్లకు చేరింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 47 కోట్లు మాత్రమే ఆర్జించింది. వాటాదారులకు కంపెనీ బోర్డు షేరుకి రూ. 60 చొప్పున తుది డివిడెండ్ ప్రకటించింది. కాగా.. మొత్తం ఆదాయం 10 శాతం వృద్ధితో రూ. 136 కోట్లను అధిగమించింది. అంతక్రితం క్యూ4లో రూ. 124 కోట్ల టర్నోవర్ సాధించింది. పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం దాదాపు 13 శాతం పుంజుకుని రూ. 171 కోట్లను తాకింది. 2023-24లో రూ. 152 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం 12% ఎగసి రూ. 498 కోట్లకు చేరింది. 2023-24లో రూ. 446 కోట్ల టర్నోవర్ నమోదైంది.

ఫలితాల నేపథ్యంలో ఇక్రా షేరు బీఎస్ఈలో 3 శాతం బలపడి రూ. 6,735 వద్ద ముగిసింది.

నైకా లాభం హైజంప్

క్యూ4లో రూ. 20 కోట్లు



న్యూఢిల్లీ: ఫ్యాషన్, బ్యూటీ రిటైలర్ నైకా గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం దాదాపు మూడు రెట్లు ఎగసి రూ. 20 కోట్లను అధిగమించింది. ఆదాయం పుంజుకోవడం ఇందుకు ప్రధానంగా సహకరించింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో కేవలం రూ. 7 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం 24 శాతం జంప్‌చేసి రూ. 2,062 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 1,668 కోట్ల టర్నోవర్ సాధించింది. అయితే త్రైమాసికవారీ(క్యూ3)గా లాభం 22 శాతం, ఆదాయం 9 శాతం చొప్పున క్షీణించినట్లు నైకా మాతృ సంస్థ ఎఫ్ఎస్ఎన్ ఈకామర్స్ వెంచర్స్ వెల్లడించింది. కాగా.. పూర్తి ఏడాదికి నైకా కన్సాలిడేటెడ్ నికర లాభం రెట్టింపై రూ. 66 కోట్లను తాకింది. 2023-24లో రూ. 32 కోట్లు మాత్రమే ఆర్జించింది. మొత్తం ఆదాయం 24 శాతం ఎగసి రూ. 7,950 కోట్లకు చేరింది. 2023-24లో రూ. 6,386 కోట్ల టర్నోవర్ నమోదైంది. ఈ కాలంలో 50 రిటైల్ స్టోర్లను జత కలుపుకోవడంతో వీటి సంఖ్య 237కు చేరినట్లు నైకా వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో నైకా షేరు బీఎస్ఈలో 0.7 శాతం నష్టంతో రూ. 203 వద్ద ముగిసింది.

సన్ టీవీ లాభం నేలచూపు

క్యూ4లో రూ. 372 కోట్లు



న్యూఢిల్లీ: మీడియా రంగ దిగ్గజం సన్ టీవీ నెట్‌వర్క్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 10 శాతంపైగా క్షీణించి రూ. 372 కోట్లకు పరిమితమైంది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 415 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం స్వల్పంగా 2 శాతం నీరసించి రూ. 941 కోట్లకు చేరింది. అంతక్రితం క్యూ4లో రూ. 961 కోట్ల ఆదాయం సాధించింది. మొత్తం వ్యయాలు 15 శాతం పెరిగి రూ. 632 కోట్లకు చేరాయి. ఇతర ఆదాయంతో కలసి మొత్తం టర్నోవర్ 7 శాతం వృద్ధితో రూ. 1,180 కోట్లను తాకింది. కాగా.. పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం 12 శాతం వెనకడుగుతో రూ. 1,704 కోట్లకు పరిమితమైంది. 2023-24లో రూ. 1,926 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం స్వల్పంగా 2 శాతం నీరసించి రూ. 4,713 కోట్లకు చేరింది. ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ క్రికెట్ ఫ్రాంచైజీని కంపెనీ కలిగి ఉంది. కంపెనీ తమిళ్, తెలుగుసహా పలు స్థానిక భాషలలో శాటిలైట్ టీవీ చానళ్లను నిర్వహించే సంగతి తెలిసిందే.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2 శాతం నష్టంతో రూ. 629 వద్ద ముగిసింది.

ప్రెస్టీజ్ ఎస్టేట్స్ లాభం డౌన్

- క్యూ4లో రూ. 25 కోట్లు
- ముంబైలో కొత్త ప్రాజెక్ట్



ముంబై: రియల్టీ రంగ దిగ్గజం ప్రెస్టీజ్ ఎస్టేట్స్ గతేడాది(2024-25) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. జనవరి-మార్చి(క్యూ4)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 82 శాతం పడిపోయి రూ. 25 కోట్లకు పరిమితమైంది. ఆదాయం క్షీణించడం ప్రభావం చూపింది. అంతక్రితం ఏడాది(2023-24) ఇదే కాలంలో రూ. 140 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 2,233 కోట్ల నుంచి రూ. 1,589 కోట్లకు నీరసించింది. కాగా.. పూర్తి ఏడాదికి కన్సాలిడేటెడ్ నికర లాభం సగానికిపైగా క్షీణించి రూ. 468 కోట్లకు చేరింది. 2023-24లో రూ. 1,374 కోట్లు ఆర్జించింది. మొత్తం ఆదాయం సైతం రూ. 9,425 కోట్ల నుంచి రూ. 7,736 కోట్లకు వెనకడుగు వేసింది. ముంబైలో రూ. 4,500 కోట్ల విలువైన ఆఫీస్ కాంప్లెక్స్ అభివృద్ధికి వేలర్ గ్రూప్‌తో చేతులు కలిపినట్లు ప్రెస్టీజ్ ఎస్టేట్స్ వెల్లడించింది. అనుబంధ కంపెనీల ద్వారా వేలర్ ఎస్టేట్‌తో కలసి అంధేరీ వెస్ట్‌లో 21,978 చదరపు మీటర్లలో సంయుక్తంగా ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేయనున్నట్లు తెలియజేసింది. ప్రాజెక్టులో భాగంగా 1.5 మిలియన్ చదరపు అడుగులలో లీజ్‌కు వీలయ్యే భూభాగాన్ని అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొంది. రూ. 4,500 కోట్ల స్థూల డెవలప్‌మెంట్ విలువ(జీడీవీ)ను కలిగి ఉంటుందని తెలియజేసింది. వేలర్ గ్రూప్, ప్రెస్టీజ్ ఎస్టేట్స్ సమాన భాగస్వామ్యంతో ప్రాజెక్టును చేపడుతున్నట్లు పేర్కొంది. ఇందుకు ఏర్పాటు చేసే ఎస్‌పీవీలో రూ. 504 కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు వెల్లడించింది.

ఫలితాల నేపథ్యంలో కంపెనీ షేరు బీఎస్ఈలో 2.3% బలహీనపడి రూ. 1,468 వద్ద ముగిసింది.

ఏజాక్స్ ఇంజినీరింగ్ లాభం రూ. 91 కోట్లు



ముంబై: గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికంలో ఏజాక్స్ ఇంజినీరింగ్ ఆదాయం 3 శాతం పెరిగి రూ. 91 కోట్లకు చేరింది. ఆదాయం 15 శాతం వృద్ధి చెంది రూ. 657 కోట్ల నుంచి రూ. 756 కోట్లకు పెరిగింది. మరోవైపు, పూర్తి ఆర్థిక సంవత్సరానికి గాను ఆదాయం 19 శాతం పెరిగి రూ. 1,741 కోట్ల నుంచి రూ. 2,074 కోట్లకు చేరింది. లాభం 15 శాతం వృద్ధితో రూ. 225 కోట్ల నుంచి రూ. 260 కోట్లకు పెరిగింది. సవాళ్లు నెలకొన్నప్పటికీ పటిష్టమైన వృద్ధి సాధించామని, రూ.2,000 కోట్ల ఆదాయం మైలురాయిని అధిగమించి, లాభదాయకతను కొనసాగించగలిగామని సంస్థ ఎండీ శుభబ్రత సాహా తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్థంలో ఆదినారాయణహోసహళ్లి ప్లాంటు అందుబాటులోకి వస్తే ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరుగుతుందని వివరించారు.

వీనస్ పైప్స్ మిశ్రమ పనితీరు



న్యూఢిల్లీ: స్టెయిన్‌లెస్ స్టీల్ పైపులు, ట్యూబుల తయారీ సంస్థ వీనస్ పైప్స్ అండ్ ట్యూబ్స్ మార్చి త్రైమాసికంలో మిశ్రమ పనితీరు చూపించింది. నికర లాభం స్వల్పంగా తగ్గి రూ.24 కోట్లుగా నమోదైంది. ఆదాయం 15 శాతం తగ్గి రూ.258 కోట్లుగా ఉంది. క్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.25 కోట్లు, ఆదాయం రూ.224 కోట్ల చొప్పున ఉన్నాయి. ఇక 2024-25 పూర్తి ఆర్థిక సంవత్సరానికి కంపెనీ నికర లాభం రూ.93 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంలో లాభం రూ.86 కోట్లతో పోల్చితే 8 శాతం పెరిగింది. ఆదాయం ఇదే కాలంలో 19 శాతం వృద్ధితో రూ.802 కోట్ల నుంచి రూ.958 కోట్లకు చేరింది. విలువ ఆధారిత ఉత్పత్తుల వ్యాపారంలోకి గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ ప్రవేశించడం గమనార్హం. 3,600 ఎంటీపీఏ సామర్థ్యంతో వెల్డింగ్ ట్యూబుల తయారీ కార్యకలాపాలను సంస్థ ఇటీవలే ఆరంభించింది. బలమైన ఆర్డర్‌బుక్‌తో కొత్త ఆర్థిక సంవత్సరంలోకి ప్రవేశించినట్లు వీనస్ పైప్స్ అండ్ ట్యూబ్స్ ఎండీ అరుణ్ కొఠారి తెలిపారు.

కంపెనీ షేరు బీఎస్ఈలో 2.5 శాతానికి పైగా పెరిగి రూ.1,424 వద్ద స్థిరపడింది.



నేటి నుంచి అల్టిమేట్ టేబుల్ టెన్నిస్

ఆరో సీజన్‌కు సిద్ధమైన 8 జట్లు

అహ్మదాబాద్: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) ఆరో సీజన్‌కు రంగం సిద్ధమైంది. గుజరాత్ వేదికగా జరగనున్న ఈ లీగ్‌లో ఎనిమిది ఫ్రాంచైజీలు పాల్గొంటుండగా... గత రెండు పర్యాయాలు చాంపియన్‌గా నిలిచిన గోవా చాలెంజర్స్ జట్టు 'హ్యాట్రిక్'పై కన్నేసింది. భారత స్టార్ ప్లేయర్ హర్మీత్ దేశాయ్ ప్రాతినిధ్యం వహిస్తున్న గోవా చాలెంజర్స్... 2023 ఫైనల్లో చెన్నై లయన్స్‌పై, 2024లో దబంగ్ ఢిల్లీపై గెలిచి టైటిల్స్ గెలుచుకుంది. 'యువకులు, అనుభవజ్ఞులతో జట్టు సమతూకంగా ఉంది. వరుసగా మూడో టైటిల్ సాధించేందుకు ప్రయత్నిస్తాం' అని గోవా చాలెంజర్స్ ప్లేయర్ హర్మీత్ దేశాయ్ అన్నాడు. లీగ్‌లో గోవా, చెన్నై, ఢిల్లీతో పాటు అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్, కోల్‌కతా థండర్‌బ్లేడ్స్, పుణే జాగ్వార్స్, జైపూర్ పాట్రియాట్స్, యూ ముంబా జట్లు పోటీ పడుతున్నాయి. 8 జట్లను రెండు గ్రూప్‌లుగా విభజించి మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ప్రతి జట్టు గ్రూప్‌లోని మిగిలిన మూడు జట్లతో ఒక్కో మ్యాచ్ ఆడుతుంది. లీగ్ దశలో అగ్రస్థానంలో నిలిచిన 4 జట్లు నాకౌట్ దశకు అర్హత సాధించనున్నాయి. జూన్ 15న జరగనున్న ఫైనల్‌తో సీజన్ ముగియనుంది. లీగ్‌ను మరింత ఆసక్తికరంగా మార్చేందుకు నిర్వాహకులు కొత్త నిబంధనలు ప్రవేశపెట్టగా... ఈసారి నుంచి యూటీటీ జూనియర్స్ పోటీలు కూడా జరుగుతున్నాయి. టోర్నీ తొలి రోజు శనివారం దబంగ్ ఢిల్లీతో జైపూర్ పాట్రియాట్స్, అహ్మదాబాద్ ఎస్‌జీ పైపర్స్‌తో డిఫెండింగ్ చాంపియన్ గోవా చాలెంజర్స్ తలపడనున్నాయి.

ఫైనల్లో దీపక్, కిరణ్





బ్యాంకాక్: థాయిలాండ్ ఓపెన్ ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో మరో ఇద్దరు భారత బాక్సర్లు ఫైనల్లోకి ప్రవేశించారు. పురుషుల విభాగంలో దీపక్, మహిళల విభాగంలో కిరణ్ తుది పోరుకు అర్హత సాధించారు. పురుషుల 75 కేజీల కేటగిరీ సెమీఫైనల్ బౌట్‌లో దీపక్ 5-0 తేడాతో పీర్‌పట్ యీసూ (థాయిలాండ్)ను చిత్తు చేయగా...మహిళల 75 కేజీల విభాగం పోరులో కిరణ్ 5-0తో పాలినా చెర్నస్ (ఉక్రెయిన్)పై ఘన విజయం సాధించింది. మహిళల బాక్సింగ్‌లో మరో ఇద్దరు భారత బాక్సర్లు ప్రియ (57 కేజీలు), సనేహ (70 కేజీలు) తమ సెమీ ఫైనల్ బౌట్‌లలో ఓడారు.

యువ భారత్ పరాజయం


కనిక

రొసారియో (అర్జెంటీనా): నాలుగు దేశాల జూనియర్ మహిళల హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టుకు తొలి పరాజయం ఎదురైంది. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో గెలిచిన యువ భారత్... శుక్రవారం నాలుగో పోరులో షూటౌట్‌లో పోరాడి ఓడింది. భారత్, చిలీ మధ్య జరిగిన మ్యాచ్ నిర్ణీత సమయంలో 2-2 గోల్స్‌తో సమం కాగా... విజేతను తేల్చేందుకు నిర్వహించిన షూటౌట్‌లో యువ భారత్ 1-3తో వెనుకబడి టోర్నీలో తొలి ఓటమి ఖాతాలో వేసుకుంది. మ్యాచ్‌లో భారత్ తరఫున సుఖ్‌వీర్ కౌర్ (35వ నిమిషంలో), కనిక సివాచ్ (47వ నిమిషంలో) చెరో గోల్ సాధించారు. చిలీ తరఫున జసింట సాలారీ (27వ నిమిషంలో), లౌరా ముల్లర్ (42వ నిమిషంలో) ఒక్కో గోల్ కొట్టారు. హోరాహోరీగా సాగిన పోరు షూటౌట్‌కు దారితీయగా... ఒత్తిడిలో భారత స్ట్రయికర్లు తడబడ్డారు. తదుపరి మ్యాచ్‌లో ఆదివారం ఉరుగ్వేతో భారత్ తలపడుతుంది.

'స్వర్ణ' నందిని

గుల్వీర్, పూజలకు పసిడి పతకాలు
- పారుల్ చౌదరికి రజతం
- ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

హెప్టాథ్లాన్‌లో బంగారం నెగ్గిన తెలంగాణ అథ్లెట్



గుమి (దక్షిణ కొరియా): తెలుగు రాష్ట్రాల అథ్లెట్లు ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పసిడి మెరుపులతో అదరగొడుతున్నారు. పోటీల మూడో రోజు ఆంధ్ర అథ్లెట్ జ్యోతి యర్రాజీ బంగారు పతకం సాధిస్తే... ఇప్పుడు నాలుగో రోజు శుక్రవారం తెలంగాణ అథ్లెట్ నందిని అగసార స్వర్ణ పతకం సాధించింది. మొత్తం మీద కొరియన్ గడ్డపై భారత బృందం స్వర్ణభేరి మోగిస్తోంది. నాలుగో రోజు పోటీల్లో మన నందినితో పాటు... లాంగ్ డిస్టెన్స్ రన్నర్ గుల్వీర్ సింగ్, హైజంపర్ పూజ సింగ్‌లు కూడా బంగారు పతకాలు గెలుపొందారు. దీంతో భారత్ ఇప్పటికే 18 పతకాలు సాధించింది. ఇందులో 8 స్వర్ణాలు, 7 రజతాలు, 3 కాంస్య పతకాలున్నాయి. ఇదే జోరు కొనసాగితే... గత 2023-బ్యాంకాక్ చాంపియన్‌షిప్‌లో పట్టుకొచ్చిన 27 పతకాల రికార్డును భారత్ అధిగమించే అవకాశముంది. ఇదివరకు 100 మీటర్ల హర్డిల్స్‌లో విజేతగా నిలిచిన జ్యోతి యర్రాజీ మరో పతకంపై గురిపెట్టింది. ఆమె 200 మీటర్ల పరుగులో ఫైనల్స్‌కు అర్హత సంపాదించింది. నిత్య గంధే కూడా ఫైనల్ చేరింది. పురుషుల 200 మీటర్ల స్ప్రింట్‌లో అనిమేశ్ కుజూర్ ఫైనల్ పరుగుకు సిద్ధమయ్యాడు.


నందిని

క్రీడాంశం	ప్రదర్శన
100 మీ. హర్డిల్స్	13.67 సె.
హైజంప్	1.69 మీ.
షాట్‌పుట్	13.54 మీ.
200 మీ. పరుగు	24.20 సె.
లాంగ్‌జంప్	6.13 మీ.
జావెలిన్ త్రో	34.18 మీ.
800 మీ. పరుగు	2 ని.15.54 సె.

చైనా అథ్లెట్‌ను అధిగమించి...

తెలంగాణ తేజం నందిని హెప్టాథ్లాన్‌లో పతకం కోసం పెద్ద పోరాటమే చేసింది. ఏడు క్రీడాంశాల సమాహారమైన ఈ ఈవెంట్‌లో నందిని చైనా అథ్లెట్ ఇచ్చిన గట్టి పోటీని తట్టుకొని... అగ్రస్థానం సాధించడం గొప్ప విశేషం. అందుకే ఎనిమిదేళ్ల తర్వాత ఈ క్లిష్టమైన హెప్టాథ్లాన్‌లో భారత్ బంగారు పతకం సాధించగలిగింది. 2017లో స్వప్న బర్మన్ తర్వాత ఆసియా ఈవెంట్‌లో బంగారం నెగ్గిన ఘనత మన నందినిదే కావడం గమనార్హం. సోమ బిస్వాస్ (2005లో) తర్వాత సుదీర్ఘ నిరీక్షణకు ఆమె తెరదించితే... నందిని తాజాగా భారత్‌కు పసిడి పతకం తీసుకొచ్చింది. 100 మీటర్ల హర్డిల్స్, హైజంప్, షాట్‌పుట్, 200 మీటర్ల పరుగు, లాంగ్‌జంప్, జావెలిన్ త్రో, 800 మీటర్ల పరుగు ఇలా... ఈ ఏడు క్రీడాంశాల్లో మొత్తంగా కలిపి నందిని 5941 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. ఆరో ఈవెంట్ అయిన జావెలిన్ త్రోలో కేవలం 34.18 మీటర్ల పేలవ ప్రదర్శన తర్వాత రేసు (మొత్తం పాయింట్లు)లో వెనుకబడిన తెలంగాణ అథ్లెట్ ఆఖరి పోటీ అయిన 800 మీటర్ల పరుగును 2 నిమిషాల 15.54 సెకన్లలో పూర్తి చేసి విజేతగా నిలువడంతో తిరిగి అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. నందినికి ఆఖరిదాకా సవాల్ విసిరిన చైనా హెప్టాథ్లెట్ లియు జింగ్‌యి 5869 పాయింట్లతో రజత పతకానికి పరిమితమైంది. నిజానికి చైనా క్రీడాకారిణి జావెలిన్ త్రో తర్వాత ఆధిక్యంలోకి వచ్చింది. అయితే నందిని 800 మీటర్ల పరుగులో పుంజుకోవడంతో చైనా అథ్లెట్ 'బంగారు' ఆశలు గల్లంతయ్యాయి.

అనర్హతకు గురైన పురుషుల రిలే జట్టు

మూడో రోజు పోటీల్లో మహిళలు, పురుషుల రిలే జట్లు పతకాలు సాధించగా... తాజాగా 4×100 మీటర్ల రిలే ఈవెంట్‌లో భారత పురుషుల జట్టు అనర్హతకు గురైంది. ప్రణవ్ గౌరవ్, రాహుల్, మణికంఠ, అమ్లన్ బొర్గొహైన్‌లతో కూడిన రిలే జట్టు ప్రిలిమినరీ రౌండ్‌లోనే అనర్హతకు గురైంది. ఒకరి నుంచి మరొకరు బ్యాటన్‌ను అందుకునేందుకు అనుమతించే చోటు (చేంజ్ ఓవర్ జోన్)ని దాటి బ్యాటన్‌ను తీసుకోవడంతో (ప్రణవ్‌నుంచి రాహుల్) టీమ్ డిస్క్వాలిఫై అయింది. అయితే పురుషుల జావెలిన్ త్రోలో సచిన్, యశ్‌వీర్ ఫైనల్ పోటీలకు అర్హత సాధించారు.


గుల్వీర్ అ'ద్వితీయ'ం

ఆసియా చాంపియన్‌షిప్ మొదలైన రోజే 10 వేల మీటర్ల సుదీర్ఘ పరుగులో బంగారు పతకం సాధించిన గుల్వీర్ సింగ్ నాలుగో రోజు మరో పసిడిని పట్టాడు. శుక్రవారం పురుషుల 5000 మీటర్ల పరుగులో అతను విజేతగా నిలిచాడు. గుల్వీర్ 13 నిమిషాల 24.77 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచాడు. వెంట్రుక వాసిలో థాయ్‌లాండ్ అథ్లెట్ కీరన్ తుంతివతే (13:24.97 సెకన్లు)ను రజతానికి పరిమితం చేశాడు.

పూజ 'హై'జంప్


పూజ

హరియాణాకు చెందిన 18 ఏళ్ల టీనేజ్ అథ్లెట్ పూజ సింగ్ హైజంప్‌లో పసిడి శోభ తెచ్చింది. మహిళల హైజంప్‌లో ఆమె తన ఐదవ ప్రయత్నంలో 1.89 మీటర్ల ఎత్తులో జంప్ చేయడం ద్వారా తన వ్యక్తిగత ఉత్తమ ప్రదర్శన నమోదు చేసింది. దీంతో ఆమెకు బంగారు పతకం లభించింది. పూజ 'షో'తో ఉజ్బెకిస్తాన్ హైజంపర్ సఫీనా సదుల్లెవా (1.86 మీటర్లు) రెండో స్థానంలో నిలిచి రజతంతో సరిపెట్టుకుంది. భవన నిర్మాణ కూలీ కుమార్తె అయిన పూజ రెండేళ్ల క్రితం ఆసియా అండర్-23 చాంపియన్‌షిప్ (2023)లోనూ బంగారు పతకంతో సత్తా చాటుకుంది. మహిళల 3000 మీటర్ల స్టీపుల్‌చేజ్‌లో పారుల్ చౌదరి రజతం గెలుపొందింది. 9 నిమిషాల 12.46 సెకన్లలో పోటీని పూర్తిచేసిన ఆమె జాతీయ రికార్డు నెలకొల్పింది. కేవలం 2 సెకన్ల తేడాతో పారుల్ స్వర్ణావకాశం చేజారింది. కజకిస్తాన్ అథ్లెట్ నోరా జెరుతో తనుయ్ (9:10.46 సెకన్లు) బంగారు పతకం గెలుచుకుంది.


పారుల్

ప్రిక్వార్టర్స్‌లో సబలెంక, స్వియాటెక్



సబలెంక

- పావొలిని, రిబాకినా కూడా...
- పురుషుల్లో రూన్, ముసెట్టి
- ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్

పారిస్: ప్రపంచ నంబర్‌వన్ అరియాన సబలెంక, డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టారు. వీరిద్దరితో పాటు నాలుగో సీడ్ పావొలిని, ఎనిమిదో సీడ్ క్విన్‌వెన్ జెంగ్, 12వ సీడ్ రిబాకినాలు కూడా ప్రిక్వార్టర్స్ చేరారు. పురుషుల సింగిల్స్‌లో ఎనిమిదో సీడ్ లొరెంజో ముసెట్టి, పదో సీడ్ హోల్గర్ రూన్‌లు కూడా ప్రిక్వార్టర్స్ సమరానికి అర్హత సంపాదించారు. పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యూకీ బాంబ్రీ తన అమెరికన్ భాగస్వామితో కలిసి ప్రిక్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించాడు.

అలవోక విజయంతో...

మహిళల సింగిల్స్‌లో శుక్రవారం జరిగిన మూడో రౌండ్ పోటీల్లో నిరుటి క్వార్టర్ ఫైనలిస్ట్, తాజా ఆస్ట్రేలియన్ ఓపెన్ రన్నరప్ సబలెంక (బెలారస్) 6-2, 6-3తో సెర్బియన్ ప్లేయర్ ఓల్గా డానిలోవిచ్ అలవోక విజయం సాధించింది. కేవలం గంటా 19 నిమిషాల్లోనే సెర్బియన్ ప్రత్యర్థి ఆట కట్టించింది. గతేడాది ప్రిక్వార్టర్ ఫైనల్ దాకా పోరాడిన ఓల్గా ఈసారి మూడో రౌండ్లోనే ఇంటిదారి పట్టింది. ఫ్రెంచ్ ఓపెన్‌లో హ్యాట్రిక్ చాంపియన్ (2022, 2023, 2024), పోలండ్ స్టార్ స్వియాటెక్ వరుసగా నాలుగో టైటిల్ దిశగా అడుగులు వేస్తోంది. మూడో రౌండ్లో ఐదో సీడ్ స్వియాటెక్ 6-2, 7-5తో జాక్వెలైన్ క్రిస్టిన్ (రొమేనియా)పై గెలుపొందగా, నిరుటి రన్నరప్, నాలుగో సీడ్ జాస్మిన్ పావొలిని (ఇటలీ) 6-4, 6-1తో ఉక్రెయిన్‌కు చెందిన యులియా స్టారొడుబ్త్సెవాను ఓడించింది. 12వ సీడ్ ఎలీనా రిబాకినా (కజకిస్తాన్) 6-2, 6-2తో జెలీనా ఒస్టాపెంకో (లాత్వియా)పై గెలుపొందగా, ఆస్ట్రేలియన్ ఓపెన్ మాజీ రన్నరప్, చైనా స్టార్ క్విన్‌వెన్ జెంగ్ 6-3, 6-4తో విక్టోరియా ఎంబొకొ (కెనడా)పై విజయం సాధించింది.

చెమటోడ్చిన రూన్

పురుషుల సింగిల్స్‌లో జరిగిన మూడో రౌండ్ మ్యాచ్‌లో హోల్గర్ రూన్ (డెన్మార్క్) 4-6, 6-2, 5-7, 7-5, 6-2తో క్వెంటిన్ హలైస్ (ఫ్రాన్స్)పై చెమటోడ్చి నెగ్గాడు. ఎనిమిదో సీడ్ లొరెంజో ముసెట్టి (ఇటలీ) 4-6, 6-4, 6-3, 6-2తో మరియానో నెవొన్ (అర్జెంటీనా) గెలుపొందగా, 12వ సీడ్ టామీ పాల్ (అమెరికా) 6-3, 3-6, 7-6 (9/7), 3-6, 6-3తో కరెన్ కచనొవ్ (రష్యా)పై పోరాడి గెలిచాడు.

ప్రిక్వార్టర్ ఫైనల్లో యూకీ జోడీ

భారత డబుల్స్ టెన్నిస్ స్టార్ యూకీ బాంబ్రీ ఫ్రెంచ్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్‌లో ప్రిక్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. పురుషుల డబుల్స్ రెండో రౌండ్లో యూకీ-గాలోవే (అమెరికా) ద్వయం 6-7 (4/7), 7-6 (7/4), 6-3తో ఏడో సీడ్ నికోల మెక్టిక్ (క్రొయేషియా)-మైకేల్ వీనస్ (ఆస్ట్రేలియా) జంటపై ఆఖరిదాకా పోరాడి గెలిచింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో యూకీ-గాలోవే జోడీ... అమెరికాకు చెందిన తొమ్మిదో సీడ్ క్రిస్టియన్ హ్యారీసన్-ఇవాన్ కింగ్ జంటతో తలపడుతుంది.

కార్ల్‌సన్ చేతిలో అర్జున్ ఓటమి



స్టావెంజర్: వరల్డ్ చాంపియన్ దొమ్మరాజు గుకేశ్ నార్వే చెస్ టోర్నమెంట్‌లో వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసుకున్నాడు. శుక్రవారం జరిగిన నాలుగో రౌండ్ పోరులో ఫాబియానా కరువానా (అమెరికా)పై గుకేశ్ గెలుపొందాడు. తొలి రెండు రౌండ్‌లలో ఓడిన తర్వాత అతను తర్వాతి రెండు రౌండ్‌లు గెలిచాడు. మరో భారత ఆటగాడు, తెలంగాణకు చెందిన అర్జున్ ఇరిగేశికి నాలుగో రౌండ్‌లో ఓటమి ఎదురైంది. అర్జున్‌పై వరల్డ్ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) విజయం సాధించాడు. ప్రస్తుతం టోర్నీలో కార్ల్‌సన్ 8 పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. మహిళల విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ కోనేరు హంపి తన సంయుక్త ఆధిక్యాన్ని నిలబెట్టుకుంది. వరల్డ్ చాంపియన్ వెంజున్ జు చేతిలో హంపి ఓటమిపాలైనా... హంపి ఇంకా ముందంలోనే ఉంది.





గాజాలో ఛిద్రమైన బాల్యం
శుక్రవారం జాబాలియాలో వైమానిక దాడుల్లో ధ్వంసమైన భవన శిథిలాల్లో వస్తువులను సేకరిస్తున్న ఓ బాలిక. దెయిర్ అల్ బలాహ్‌లో ఆహార పంపిణీ కేంద్రం వద్ద నెత్తిపై గిన్నె బోర్లించుకుని నిరీక్షిస్తున్న ఓ చిన్నారి. ఐరాస గోదాం నుంచి ఆహారం బ్యాగ్‌ను మోసుకెళ్తున్న బాలుడు. ఇజ్రాయెల్ యుద్ధోన్మాదం కారణంగా గాజాలోని ఛిద్రమవుతున్న బాల్యానికి ఈ దృశ్యాలు ప్రతీకగా నిలిచాయి.

పులితో సెల్ఫీకి ప్రయత్నం

దాడిలో స్వల్పంగా గాయపడ్డ భారతీయుడు

థాయ్‌లాండ్‌లోని ఫుకెట్‌లో ఘటన

ఫుకెట్: పులితో సెల్ఫీ తీసుకోవాలన్న అత్యుత్సాహం ఓ భారతీయుడి ప్రాణాల మీదకు తెచ్చింది. అక్కడే ఉన్న ట్రెయినర్ సకాలంలో జోక్యం చేసుకోవడంతో ఆ వ్యక్తి కొద్దిపాటి గాయాలతో బయటపడ్డాడు. లేకుంటే ప్రాణాలే పోయేవి..! థాయ్‌లాండ్‌లోని ఫుకెట్ నగర సమీపంలోని పర్యాటక ప్రాంతం 'టైగర్ కింగ్‌డమ్'లో ఇటీవల చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించిన వీడియో 'ఎక్స్'లో తెగ వైరలవుతోంది. సిద్ధార్థ శుక్లా అనే వ్యక్తి ఈ వీడియోను పోస్ట్ చేశారు. 'టైగర్ కింగ్‌డమ్‌లో పులులు పెంపుడు జంతువు మాదిరిగా తిరుగుతుంటాయి. పర్యాటకులు వాటితో సెల్ఫీలు తీసుకోవచ్చు, వాటికి ఆహారం పెట్టవచ్చు..ఇక్కడ ఇటీవల సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించిన ఓ భారతీయుడిపై పులి దాడి చేసింది'అంటూ శుక్లా వివరించారు. పార్కులో పులితోపాటు నడుస్తూ ఒక వ్యక్తి కనిపించారు. అప్పటి వరకు మామూలుగానే ఉన్న పులి..అతడు ఫోన్‌లో సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న ట్రెయినర్ దానిని కూర్చోబెట్టేందుకు కర్రతో కొట్టారు. అయితే, అకస్మాత్తుగా పులి ఉగ్రరూపంతో ఆ వ్యక్తిపైకి దూకింది. ట్రెయినర్ దాన్ని అడ్డుకున్నారు. దీంతో, పర్యాటకుడు కొద్దిపాటి గాయాలతో బయటపడ్డాడు. లేకుంటే ప్రాణాలకే ప్రమాదం వాటిల్లేది. ఈ వీడియోను ఎక్స్‌లో 20 లక్షల మంది వీక్షించారు. ఇటువంటి సందర్భాల్లో భద్రతాపరమైన ముందు జాగ్రత్తలను పాటించాలని పలువురు నెటిజన్లు సూచించారు. 'జంతువులు ఎప్పటికీ జంతువులే. వాటితో చాలా జాగ్రత్తగా మెలగాలి. అంతేతప్ప వాటి నుంచి సానుకూలత ఆశించడరాదు. అసహజ పరిస్థితుల కారణంగా అవి ప్రమాదకరంగా ప్రవర్తిస్తాయి. ఎందుకంటే అవి జంతువులు 'అని ఓ యూజర్ పేర్కొన్నారు.

రూ.500 నోట్ల కట్టలను రోడ్డుపైకి విసిరేసి..

విజిలెన్స్ దాడులతో ఒడిశా అధికారి విపరీతం

రూ.2 కోట్ల నగదుతోపాటు ఆస్తి పత్రాలు స్వాధీనం

భువనేశ్వర్: విజిలెన్స్ సోదాలతో బెంబేలెత్తిన ఓ అధికారి వింతగా ప్రవర్తించాడు. తన ఇంట్లో దాచిన రూ.500 నోట్ల కట్టలను రోడ్డుపైకి విసిరేశాడు. తీవ్ర కలకలం రేపిన ఈ ఘటన శుక్రవారం ఒడిశా రాజధాని భువనేశ్వర్‌లో చోటుచేసుకుంది. రహదారుల విభాగంలో చీఫ్ ఇంజనీర్‌గా ఉన్న బైకుంఠనాథ్ సారంగిపై ఆదాయానికి మించిన ఆస్తులను కూడబెట్టారన్న ఆరోపణలున్నాయి. కేసు దర్యాప్తులో భాగంగా అధికారులు ఆయన కార్యాలయం, ఇళ్లు కలిపి మొత్తం ఏడు చోట్ల సోదాలు చేపట్టారు. భువనేశ్వర్ డుమ్‌డుమా ప్రాంతంలోని ఫ్లాట్‌లో సుమారు రూ.కోటి, అంగుల్‌లోని నివాస భవనంలో మరో రూ.కోటి నగదును అధికారులు సోదాల సమయంలో స్వాధీనం చేసుకున్నారు. అయితే, భువనేశ్వర్‌లోని ఫ్లాట్‌లోకి విజిలెన్స్ అధికారులు రావడంతో సారంగి గబగబా తన గదిలోకి వెళ్లి రూ.500 నోట్లున్న కట్టలను కిటికీ గుండా రోడ్డుపైకి విసిరేయడం ప్రారంభించాడు. దీంతో, అక్కడ జనం గుమికూడారు. వెంటనే అధికారులు జనం చూస్తుండగా ఆ నోట్ల కట్టలను స్వాధీనం చేసుకున్నారు. సోదాలు ఇంకా కొనసాగుతున్నట్లు విజిలెన్స్ అధికారులు వెల్లడించారు. ఆస్తుల పూర్తి వివరాలను తర్వాత వెల్లడిస్తామన్నారు. అంగుల్‌లో రెండంతస్తుల నివాస భవనం, భువనేశ్వర్‌లో ఫ్లాట్లు, పూరీ జిల్లాలోని సియులా, పిపిలిలోనూ ఆయనకు ఫ్లాట్లున్నట్లు గుర్తించారు. సారంగి పూర్వీకుల ఇంటితోపాటు బంధువుల ఇళ్లపైనా దాడులు చేపట్టామని చెప్పారు. అంగుల్‌లోని విజిలెన్స్ ప్రత్యేక కోర్టు జడ్జి అనుమతితో చేపట్టిన ఈ సోదాల్లో 8 మంది డీఎస్పీలు, 12 మంది ఇన్‌స్పెక్టర్లు, ఆరుగురు అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ఇజ్రాయెల్ దాడుల్లో 44 మంది మృతి

దెయిర్ అల్ బలాహ్: గాజాపై ఇజ్రాయెల్ తాజా దాడుల్లో 44 మంది మరణించారు. అల్-బురైజ్‌లో ఒక్కఇంటిలోనే ఏకంగా 23 మంది మరణించారు. దక్షిణ గాజాలోని అమెరికా సహాయ కేంద్రం సమీపంలో ఇజ్రాయెల్ కాల్పుల్లో ఇద్దరు మరణించగా చాలా మంది గాయపడ్డారు. హమాస్‌కు సహాయ సామగ్రి అందకుండా చేసేందుకు అమెరికా మద్దతుతో గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జీహెచ్‌ఎఫ్) ఈ కేంద్రాన్ని నిర్వహిస్తోంది. దీన్ని ఐరాసతో పాటు యూరోపియన్ యూనియన్ కూడా వ్యతిరేకిస్తున్నాయి. ఇజ్రాయెల్ అన్ని నైతిక, చట్ట పరమైన హద్దులు దాటుతోందని జోర్డాన్ మండిపడింది. ఒక సంచి పిండి కోసం కూడా ప్రాణాలు పణంగా పెట్టాల్సి వస్తోందని పాలస్తీనియన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాజా అంతటా డజన్ల కొద్దీ ఉగ్రవాద కేంద్రాలను ధ్వంసం చేశామని ఇజ్రాయెల్ పేర్కొంది.

ఇంకా ఆకలి కేకలే

రెండు నెలల పై చిలుకు దిగ్బంధం తర్వాత గాజాలోకి ఇప్పుడిప్పుడే మానవతా సాయం చేరుతోంది. ఇజ్రాయెల్ పరిమిత అనుమతితో ట్రక్కులు గాజాలోకి ప్రవేశిస్తున్నట్టు ఐరాసలో ఇజ్రాయెల్ రాయబారి డానీ డానన్ భద్రతా మండలికి తెలిపారు. దాని పంపిణీకి తమ వంతు కృషి చేస్తున్నట్లు ఐరాస తెలిపింది. అయినా గాజాలో ఎటు చూసినా ఆకలి కేకలే వినిపిస్తున్నాయి.

విరమణకు మరో ప్రతిపాదన

గాజాలో కాల్పుల విరమణ కోసం చర్చలు కొనసాగుతున్నాయి. అమెరికా ప్రత్యేక ప్రతినిధి స్టీవ్ విట్కాఫ్ మరోసారి కాల్పుల విరమణ ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. దాని ప్రకారం హమాస్ తన వద్ద సజీవంగా ఉన్న 10 మంది ఇజ్రాయెలీ బందీలను అప్పగించాలి. 18 మంది బందీల మృతదేహాలను రెండు దశల్లో ఇజ్రాయెల్‌కు ఇవ్వాలి. బదులుగా ఇజ్రాయెల్ 60 రోజుల కాల్పుల విరమణ పాటిస్తుంది. పాలస్తీనా ఖైదీలను విడుదల చేస్తుంది.

కోల్‌కతాలో 150 మంది మాజీ టీచర్ల అరెస్ట్

కోల్‌కతా: ఉద్యోగాలు కోల్పోయి నిరసనకు దిగిన సుమారు 150 మంది ఉపాధ్యాయులను కోల్‌కతా పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. తమలో అర్హులైన వారిని శాశ్వత ప్రాతిపదికన తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. మళ్లీ ఎంపిక పరీక్ష పెడతామంటూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. నిరసన తెలిపేందుకు సెక్రటేరియట్ వైపు ర్యాలీగా వెళ్తుండగా పోలీసులు అడ్డుకుని 100 మందిని అరెస్ట్ చేశారు. కోల్‌కతాలోని సెంట్రల్ పార్క్ వద్ద కూడా మరో 500 మంది మాజీ ఉపాధ్యాయులు ఇదే డిమాండ్‌తో ఆందోళన చేపట్టారు. అక్కడికి రెండు కిలోమీటర్ల దూరంలో సాల్ట్‌లేక్, ఎస్‌ప్లనేడ్‌ల వద్ద వందలాది మంది టీచర్లు నిరసనకు దిగారు. సెక్రటేరియట్ వైపు వెళ్తున్న వీరిని పోలీసులు ఆపేశారు. తమ పరిస్థితిని వివరించేందుకు సీఎం మమతా బెనర్జీ అపాయింట్‌మెంట్ ఇవ్వాలంటూ డిమాండ్ చేశారు. సాల్ట్‌లేక్ వద్ద 500 మంది మాజీ ఉపాధ్యాయులు ఆందోళన చేపట్టారు. అయితే, టీచర్లు షర్టులు తీసేసి ర్యాలీ చేపట్టడాన్ని పోలీసులు అనుమతించలేదు. కోల్‌కతా హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా సెంట్రల్ పార్క్ వద్ద నిరసన చేపట్టేందుకు వీరికి వీలు కల్పించారు. అయితే, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేందుకు యత్నించిన 50 మంది మాజీ టీచర్లను అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. మహిళా పోలీసులతో జరిగిన తోపులాటలో కాలికి గాయమైన ఓ మాజీ ఉపాధ్యాయినిని ఆస్పత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించామన్నారు. రాష్ట్ర విద్యాశాఖ ప్రధాన కార్యాలయం వద్ద గత 22 రోజులుగా కొందరు బాధితులు నిరసన సాగిస్తున్నారు. 2016లో ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేసేందుకు చేపట్టిన ఎంపిక పరీక్షల్లో తీవ్ర స్థాయిలో అక్రమాలు జరిగాయని తేలడంతో సుప్రీంకోర్టు ఏప్రిల్ 3వ తేదీన మొత్తం 25,753 మంది టీచర్ల నియామకాలు చెల్లవంటూ సంచలన తీర్పు వెలువరించడం తెల్సిందే. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం గురువారం 40 వేల టీచర్ల నియామకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇప్పటికే ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో పనిచేసిన అనుభవమున్న టీచర్లకు ఈ పరీక్షల్లో అదనంగా మార్కులుంటాయని ప్రకటించింది.

యూట్యూబర్‌పై సుప్రీం ధిక్కార చర్యలు

న్యూఢిల్లీ: అత్యున్నత న్యాయస్థానంలోని జడ్జీలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన పంజాబ్ యూట్యూబర్ అజయ్ శుక్లాపై సుప్రీంకోర్టు మండిపడింది. సుప్రీం జడ్జీలపై అతడు చేసిన వ్యాఖ్యలు అవమానకరంగా, ప్రతిష్టకు భంగం కలిగించేలా, ధిక్కార పూరితంగా ఉన్నాయని వ్యాఖ్యానించింది. సుమోటోగా అతడిపై ధిక్కార చర్యలు చేపట్టింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ ఆగస్టీన్ జార్జి మసీహ్, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌ల ధర్మాసనం శుక్రవారం..తక్షణమే శుక్లా వ్యాఖ్యలున్న వీడియోను తొలగించాలని, మరోసారి అదే వీడియోను కానీ, అలాంటి వీడియోను కానీ ప్రసారం చేయరాదంటూ అతడి వరప్రద్ మీడియా చానల్‌ను ఆదేశించింది. శుక్లా వ్యాఖ్యలు తీవ్రమైనవని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. రాజ్యాంగం ప్రసాదించిన వాక్ స్వాతంత్య్రం, పత్రికా స్వేచ్ఛకు కొన్ని పరిమితులున్నాయని ధర్మాసనం తెలిపింది. ఈ స్వేచ్ఛను అడ్డుపెట్టుకుని సుప్రీంకోర్టులోని న్యాయమూర్తులపై అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని అనుమతించబోమని స్పష్టం చేసింది. శుక్లాపై ధిక్కారం కేసు నమోదు చేయాలని ఆదేశించింది. రిటైర్డు జస్టిస్ బేలా ఎం త్రివేదిపై వ్యాఖ్యలతో కూడిన వీడియోను శుక్లా తన యూట్యూబ్ చానల్‌లో ఇటీవల అప్‌లోడ్ చేశాడు.

వివేక్ రామస్వామిపై జాతి విద్వేష వ్యాఖ్యలు

వాషింగ్టన్: బయోటెక్ వ్యవస్థాపకుడు, భారత సంతతికి చెందిన ప్రముఖ రిపబ్లికన్ నాయకుడు వివేక్ రామస్వామిపై అమెరికన్లు జాతి విద్వేష వ్యాఖ్యలకు దిగారు. వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఆయన పంచుకున్న పోస్టుపై వలస వ్యతిరేక వ్యాఖ్యలతో విరుచుకుపడ్డారు. రామస్వామి, ఆయన భార్య డాక్టర్ అపూర్వ ఇద్దరివీ భారత మూలాలే. వారికిద్దరు పిల్లలు. వివాహ వార్షికోత్సవం సందర్భంగా వివేక్ రామస్వామి ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. ''2011లో అపూర్వ అనే తెలివైన వైద్య విద్యార్థినిని కలిశాను. తొలి డేటింగ్ కోసం రాకీ సానువుల్లోకి ఫ్లాట్‌టాప్ పర్వతంపైకి హైకింగ్‌కు వెళ్లాం. దారిలో మంచు తుపాను విరుచుకుపడింది. అయినా శిఖరంపైకి వెళ్దామని నేను మూర్ఖంగా పట్టుబట్టాను. అందుకు జీవితకాలం ఉందంటూ అపూర్వ వారించింది. ఇది జరిగి 14 ఏళ్లు. ఈ వారాంతం మా పదో వివాహ వార్షికోత్సవం. ఈ సందర్భంగా ఫ్లాట్‌టాప్ శిఖరాన్ని అధిరోహించాం''అంటూ అక్కడ దిగిన ఫొటోలను పంచుకున్నారు. ఈ పోస్టుపై అమెరికన్లు తీవ్రంగా ట్రోల్ చేశారు. 'గో బ్యాక్ టు ఇండియా', 'మీ నాన్నను ఎప్పుడు బహిష్కరిస్తారు?''పర్వతపు తెలుపు అందాలను గోధుమ రంగు (భారతీయుల ఒంటి రంగును ఉద్దేశించి) నాశనం చేసింది', 'భారత్ తిరిగి వెళ్లి అక్కడ ట్రెక్కింగులు చేసుకోండి'అంటూ సోషల్ మీడియాలో విద్వేష వ్యాఖ్యలకు దిగారు. వివేక్ ఒహాయో గవర్నర్ పదవికి పోటీ పడుతున్నారు. అందుకోసం డోజ్ సారథ్య బాధ్యతల నుంచి కూడా తప్పుకొన్నారు. కానీ ఆయనను గెలిపిస్తే హెచ్-1బీ వీసా తదితరాలపై వలసదారులకు అనుకూల వైఖరే ప్రదర్శిస్తారంటూ ట్రోలర్లు ఆక్షేపించారు. నిజానికి వివేక్ గతంలో వలసవాదులకు అనుకూలంగా మాట్లాడినా కొంతకాలంగా హెచ్-1బీ వీసా పథకం తదితరాలను వ్యతిరేకిస్తున్నారు. భారతీయ అమెరికన్లు కూడా దీనిపై ఆయన్ను తీవ్రంగా తప్పుబడుతున్నారు.



రామస్వామి, అపూర్వ

ప్రముఖ కన్నడ కవి హెచ్‌ఎస్‌వీ మూర్తి కన్నుమూత

బెంగళూరు: ప్రముఖ కన్నడ కవి, నాటక రచయిత 'హెచ్‌ఎస్‌వీ'గా సుపరిచితులైన హెచ్‌ఎస్ వెంకటేశ మూర్తి(80) శుక్రవారం కన్నుమూశారు. వయో సంబంధ సమస్యలతో బాధపడుతున్న మూర్తి బెంగళూరులోని ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారని కుటుంబసభ్యులు తెలిపారు. ఆయనకు నలుగురు కుమారులున్నారు. బెంగళూరులోని సెయింట్ జోసెఫ్ కామర్స్ కాలేజీలో మూడు దశాబ్దాలకుపైగా లెక్చరర్‌గా పనిచేసిన మూర్తి కన్నడ సాహిత్య వికాసానికి విశేషమైన సేవలందించారు. బాలల సాహిత్య రచయితగా, అనువాదకుడిగా, విమర్శకుడిగా, సినీ గేయ రచయితగా హెచ్‌ఎస్‌వీ మూర్తి పేరు గడించారు. ఆయన మృతికి సీఎం సిద్ధరామయ్య సంతాపం ప్రకటించారు. ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు జరిపిస్తామన్నారు.

రాజకీయ లబ్ధి కోసం భారత్ పాకులాట

సింధూ నదీ జలాల ఒప్పందాన్ని కొనసాగించాలి

- పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ డిమాండ్

ఇస్లామాబాద్: ప్రజలకు ప్రాణాధారమైన నీటిని ఆయుధంగా మార్చడాన్ని తాము తిరస్కరిస్తున్నామని పాకిస్తాన్ ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ చెప్పారు. సింధూ నది జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం సంకుచిత రాజకీయ ప్రయోజనాల కోసం కోట్లాది మందిని ఇబ్బందుల్లోకి నెట్టొద్దని హితవు పలికారు. ఈ ఒప్పందం విషయంలో భారత్ రెడ్‌లైన్ దాటడాన్ని తాము అనుమతించబోమని అన్నారు. భారత్ అనుచిత వైఖరిని అంతర్జాతీయ వేదికలపై నిలదీస్తామని స్పష్టం చేశారు. హిమానీనదాల పరిరక్షణపై తజకిస్తాన్‌లో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో శుక్రవారం షెహబాజ్ షరీఫ్ మాట్లాడారు. సింధూ నది జలాల ఒప్పందాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ ఒప్పందాన్ని నిలిపివేస్తూ ఇండియా తీసుకున్న నిర్ణయం ఏకపక్షం, చట్టవ్యతిరేకమని తేల్చిచెప్పారు. భారత ప్రభుత్వం రాజకీయ లబ్ధి కోసం పాకులాడుతోందని మండిపడ్డారు. ఒప్పందాన్ని యథాతథంగా కొనసాగించాలని షెహబాజ్ షరీఫ్ భారత్‌ను డిమాండ్ చేశారు. నీటిని కూడా ఆయుధంగా మార్చుకొనే కొత్త ధోరణి మొదలైందని విమర్శించారు.

కొలంబియా వైఖరిపై శశి థరూర్ అసంతృప్తి

బొగోటా: దక్షిణ అమెరికాలోని కొలంబియా దేశం క్రమంగా పాకిస్తాన్‌కు సన్నిహితంగా మారుతోంది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆ దేశంతో సంబంధాలు క్షీణించాయి. దీంతో పాకిస్తాన్, చైనాల వైపు కొలంబియా మొగ్గుచూపుతోంది. చైనా చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్(బీఆర్ఐ) కింద ఒక ఉమ్మడి సహకారం ఒప్పందంపై సంతకాలు కూడా చేసింది. ఇటీవల భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌లో పాకిస్తాన్‌లో పలువురు ఉగ్రవాదులు హతమైన సంగతి తెలిసిందే. సైనికుల స్థావరాలు ఎయిర్ బేస్‌లు సైతం ధ్వంసమ య్యా యి. అయితే ఆపరేషన్ సిందూర్‌ను ఖండించిన కొలంబియా, టెర్రరిస్టులు మృతిపట్ల సంతాపం ప్రకటించడం గమనార్హం. ఈ నేపథ్యంలో కొలంబియా వైఖరిని ఇండియా ఎంపీ శశి థరూర్ తప్పుపట్టారు. ఆయన నేతృత్వంలో అఖిలపక్ష బృందం కొలంబియాలో పర్యటిస్తోంది. కొలంబియా వైఖరి తమకు అసంతృప్తి కలిగించిందని శశి థరూర్ చెప్పారు. ఉగ్రవాదులను ఎగుమతి చేసేవారు, ఉగ్రవాదులను ఎదిరించే వారి మధ్య సారూప్యత ఎలా ఉంటుందని ప్రశ్నించారు. ఉగ్రవాదులపై దాడిచేసేవారిని, ఉగ్రవాదులను కాపాడేవారిని ఒకేలా చూడొద్దని అన్నారు. కొలంబియా కూడా ఉగ్రవాద బాధిత దేశమేనని గుర్తుచేశారు. ఆత్మరక్షణ హక్కు భారత్‌కు ఉందని పేర్కొన్నారు.

లంచం తీసుకుంటుండగా.. ఈడీ డిప్యూటీ డైరెక్టర్‌ను అరెస్ట్ చేసిన సీబీఐ

న్యూఢిల్లీ/భువనేశ్వర్: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) లో డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న చింతన్ రఘువంశీ రూ.20 లక్షలు లంచం తీసుకుంటూ శుక్రవారం ఒడిశాలో సీబీఐకి పట్టుబడ్డారు. 2013 బ్యాచ్ ఐఆర్‌ఎస్ అధికారి అయిన చింతన్ కస్టమ్స్, ఇన్‌డైరెక్ట్ ట్యాక్ విభాగంలో ఉన్నారు. ఈడీ దర్యాప్తు జరుపుతున్న ఓ కేసు నుంచి బయటపడేసేందుకు రతికాంత రౌత్ అనే వ్యాపారవేత్తను చింతన్ రూ.5 కోట్లు లంచం డిమాండ్ చేశారు. లంచాన్ని చివరికి రూ.2 కోట్లకు తగ్గించేందుకు అంగీకారం కుదిరింది. మధ్యవర్తిద్వారా మొదటి విడతగా రూ.50 లక్షలను గురువారం సాయంత్రం ఇవ్వాల్సి ఉంది. ఇందుకు సంబంధించి రౌత్ సీబీఐకి ఫిర్యాదు చేశారు. ముందుగా పథకం ప్రకారం రూ.50 లక్షలకు గాను రూ.20 లక్షలను మధ్యవర్తి చింతన్‌కు అందజేస్తుండగా మాటు వేసిన సీబీఐ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. చింతన్‌ను అదుపులోకి తీసుకుని, ప్రశ్నించారు. అనంతరం సీబీఐ ప్రత్యేక కోర్టులో హాజరుపచగా 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి అనుమతించింది. డెంకనాల్ ప్రాంతంలో మైనింగ్ బిజినెస్ చేస్తున్న రౌత్‌పై 2020లో ఈడీ కేసు నమోదు చేసింది.

బాల్య వివాహ నిషేధ చట్టం తెచ్చిన పాక్

ఇస్లామాబాద్: పాకిస్తాన్ బాల్య వివాహాల నిషేధ చట్టాన్ని తీసుకువచ్చింది. అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ శుక్రవారం ఇందుకు సంబంధించిన బిల్లుపై సంతకం చేశారు. పాకిస్తాన్‌లో ఇకపై 18 ఏళ్ల లోపు బాలబాలికలకు వివాహం చేయడం చట్ట విరుద్ధం. 'ఇస్లామాబాద్ కేపిటల్ టెర్రిటరీ చైల్డ్ మ్యారేజీ రిస్ట్రెయింట్ బిల్లు'ను పార్లమెంట్‌లోని ఉభయసభలు ఈ నెల 27వ తేదీన ఆమోదించాయి. బిల్లుపై అధ్యక్షుడు జర్దారీ సంతకం చేసిన విషయాన్ని పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ)సెనేటర్ షెర్రీ రెహ్మాన్ 'ఎక్స్'లో ప్రకటించారు. 'బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ముఖ్యమైన చట్టాన్ని రూపొందించడంలో పాకిస్తాన్ ఒక మైలురాయిని అధిగమించింది'అని ఆమె పేర్కొన్నారు. అయితే, మత సంస్థలతోపాటు ఇస్లామిక్ చట్టాలకు భాష్యం చెప్పే కౌన్సిల్ ఆఫ్ ఇస్లామిక్ ఐడియాలజీ(సీఐఐ)సైతం ఈ చట్టాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. 18 ఏళ్లలోపు వివాహాన్ని అత్యాచారంగా పరిగణించడం ఇస్లామిక్ చట్టాలకు వ్యతిరేకమని సీఐఐ వాదిస్తోంది. సమాజంలో అరాచకాన్ని నిరోధించాలంటే అధ్యక్షుడు జర్దారీ ఈ బిల్లుపై సంతకం చేయరాదని సీఐఐ సభ్యుడు మౌలానా జలాలుద్దీన్ అంతకుముందు వ్యాఖ్యానించారు.

మస్క్ ఎల్లప్పుడూ మనతోనే: ట్రంప్

వాషింగ్టన్: డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీ (డోజ్) సారథ్యం నుంచి వైదొలిగినా ఎలాన్ మస్క్ ఎల్లప్పుడూ అమెరికా ప్రభుత్వంతోనే ఉంటారని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. మస్క్ అద్భుతమైన వ్యక్తి అంటూ కొనియాడారు. ట్రూత్ సోషల్ వేదికగా మస్క్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ''ప్రభుత్వంలో మస్క్ చివరి రోజు ముగిసిందనడం నిజం కాదు. ఆయన ఎల్లప్పుడూ మనతోనే ఉంటాడు. అన్ని విధాలుగా సాయపడతాడు. ఎలాన్ అద్భుతమైన వాడు!' అని పేర్కొన్నారు. డోజ్‌లో మస్క్ పాత్రను వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కరో లిన్ లెవిట్ కూడా ప్రశంసించారు. ఆయన సేవలకు ధన్యవాదాలు తెలియజే స్తున్నామన్నారు. డోజ్‌ను వీడుతున్నట్టు మస్క్ బుధవారం ధ్రువీకరించడం తెలిసిందే. ఆయన సంస్థ టెస్లా తాలూకు పెట్టుబడిదారులు దీన్ని స్వాగతించారు.

బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

పంజాబ్‌లో ఐదుగురు మృతి

ముక్త్‌సర్: పంజాబ్‌లోని ముక్త్‌సర్ జిల్లా సింగ్‌వాలా గ్రామంలో బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు సంభవించింది. శుక్రవారం అర్ధరాత్రి జరిగిన ఈ దుర్ఘటనలో ఐదుగురు మరణించగా 34 మంది గాయపడ్డారు. కార్మికుల్లో ఎక్కువ మంది ఉత్తరప్రదేశ్, బిహార్ వలసదారులే. టార్సేమ్ సింగ్ అనే వ్యక్తికి గ్రామ శివార్లలో రెండతస్తుల్లో బాణసంచా ఫ్యాక్టరీ ఉంది. బాణసంచా తయారీ, ప్యాకింగ్ అక్కడే జరుగుతాయి. కార్మికులు కూడా ఫ్యాక్టరీ భవనంలో నివసిస్తున్నారు. శుక్రవారం అర్ధరాత్రి పేలుడు సమయంలో కొందరు కార్మికులు ప్యాకేజింగ్‌లో బిజీగా ఉండగా మరికొందరు నిద్రిస్తున్నారు. పేలుడు తీవ్రతకు భవనం పూర్తిగా కూలిపో యింది. శిథిలాల కింద చిక్కిన వారిని వెలికి తీసి క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించారు. బాణసంచా తయారీలో వాడే పేలుడు పదార్థాలను సరిగా నిల్వ చేయకపోవడమే పేలుడుకు కారణమని భావిస్తున్నారు. పేలుడు శబ్దంతో పరిసర గ్రామాల ప్రజలు కూడా భయంతో ఇళ్ల నుంచి పరుగులు తీశారు.

రాష్ట్రపతి ఏడీసీగా తొలిసారి నేవీ అధికారిణి

న్యూఢిల్లీ: రాష్ట్రపతి సహాయకురాలిగా నావికా దళానికి చెందిన లెఫ్టినెంట్ కమాండర్ యశస్వీ సోలంకి నియమితులయ్యారు. రాష్ట్రపతి ఎయిడ్-డి-క్యాంప్(ఏడీసీ)లో నియమితురాలైన తొలి నేవీ అధికారిణిగా రికార్డు సృష్టించారు. ఐదుగురు ఏడీసీల్లో ఆర్మీ నుంచి ముగ్గురు, నేవీ, ఎయిర్‌ఫోర్స్ నుంచి ఒక్కొక్కరు నియమితులవుతారు. అదనంగా ఏ సాయుధ దళాల నుంచైనా అధికారులను తీసుకునే అధికారం రాష్ట్రపతికి ఉంటుంది. సైనిక దళాల్లో ఇటీవల మహిళలకు ప్రాధాన్యం పెరుగుతుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి ఏడీసీగా యశస్వి నియామకం జరిగింది.

ఉద్యోగ్ భవన్‌కు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలోని భారీ పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఉద్యోగ్ భవన్‌ను మందుపాతరతో పేల్చేస్తామంటూ శుక్రవారం అందిన మెయిల్ తీవ్ర కలకలం రేపింది. సెంట్రల్ సెక్రటేరియట్‌కు సమీపంలోని ఈ భవన సముదాయంలో కేంద్ర ప్రభుత్వానికి చెందిన పలు కీలక విభాగాలున్నాయి. మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారుల పేరుతో మధ్యాహ్నం 1 గంట సమయంలో అందిన బెదిరింపు మెయిల్‌తో భద్రతా యంత్రాంగం అప్రమత్తమైంది. వెంటనే అక్కడికి చేరుకుని, భవన సముదాయంలోని ఉద్యోగులందరినీ ఖాళీ చేయించామని ఫైర్ సర్వీస్ తెలిపింది. డాగ్ స్క్వాడ్, బాంబు డిస్పోజల్ స్క్వాడ్ సిబ్బంది రెండుగంటలపాటు భవనంలోని అణువణువూ క్షుణ్నంగా తనిఖీ చేసి, ఎటువంటి ప్రమాదకర వస్తువులు లేవని తేల్చారు. బెదిరింపు మెయిల్‌పై దర్యాప్తు చేపట్టారు.

సిక్కింలో లోయలో పడ్డ వాహనం

- ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషమం
- 8 మంది గల్లంతు, వారిలో బీజేపీ నేత

గాంగ్‌టక్: సిక్కింలో పర్యాటకుల వాహనం తీస్తా నదిలో పడిపోయింది. ఈ ఘటనలో ఒకరు మరణించగా మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. 8 మంది గల్లంతయ్యారు. వారిలో ఓ బీజేపీ నేత ఉన్నారు. గురువారం రాత్రి ఉత్తర సిక్కింలో లాచెన్ నుంచి లాచుంగ్‌కు వెళ్తూ మూల మలుపులో వాహనం అదుపు తప్పింది. 1,000 అడుగుల లోతున్న లోయలో పడిపోయింది. వాహనంలో డ్రైవర్‌తో సహా 10 మంది ఉన్నారు. వారంతా ఒడిశా, కోల్‌కతా నుంచి వచ్చినట్టు సమాచారం. గల్లంతైన వారిలో ఒడిశాలోని బీజేపీ జాజ్‌పూర్ యూనిట్ ప్రధాన కార్యదర్శి ఇతిశ్రీ నాయక్ జెనా కూడా ఉన్నారు. సైన్యం, ఇండో-టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ), సిక్కిం పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. డైవర్లు, హై ఆల్టిట్యూడ్ రెస్క్యూ యూనిట్లు రాత్రంతా సహాయక చర్యలు చేపట్టారు. సహాయక చర్యల కోసం ఒడిశా ప్రభుత్వం ప్రత్యేక బృందాన్ని పంపారు. తదుపరి నోటీసు వచ్చేవరకు లాచెన్-లాచుంగ్ మార్గంలో ప్రయాణించొద్దని పర్యాటకులకు సిక్కిం ప్రభుత్వం సూచించింది.

నైజీరియాలో వరదలు.. 88 మంది మృత్యువాత

అబుజా: ఆఫ్రికా దేశం నైజీరియాలో సంభవించిన ఆకస్మిక వరదల్లో కనీసం 88 మంది ప్రాణాలు కోల్పోయారు. గురువారం జలాశయం ధ్వంసమై నైగర్ రాష్ట్రంలోని మొక్వా పట్టణాన్ని చుట్టుముట్టింది. పట్టణంలోని ప్రముఖ మార్కెట్ వరదలకు తీవ్రంగా ప్రభావితమైంది. రక్షణ, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని ఇప్పటి వరకు 88 మృతదేహాలను వెలికి తీశామని అధికారులు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయన్నారు. ఏకధాటిగా కొన్ని గంటలపాటు కురిసిన భారీ వర్షమే ఈ దుర్ఘటనకు కారణమన్నారు.

ప్రధానికి బెదిరింపులు.. బిహార్ వాసి అరెస్ట్


భాగల్పూర్: బిహార్‌లో పర్యటన సమయంలో ప్రధాని మోదీని చంపుతానంటూ బెదిరించిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆస్తి తగాదాల నేపథ్యంలో ప్రత్యర్థిని ఇబ్బందుల పాల్జేసేందుకు అతడీ పనికి పూనుకున్నట్లు విచారణలో తేలింది. భాగల్పూర్ జిల్లా సుల్తాన్‌గంజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహేషి గ్రామానికి చెందిన మంటూ చౌదరి(71), పొరుగింట్లో ఉండే సమీర్ రంజన్(35) మధ్య భూమి విషయమై విభేదాలున్నాయి. వీటిని మనసులో పెట్టుకున్న సమీర్ ఎలాగైన మంటూను ఇబ్బంది పెట్టాలని చూస్తున్నాడు. ప్రధాని మోదీ గురు, శుక్రవారాల్లో బిహార్ పర్యటించాల్సి ఉంది. గురువారం ఉదయం మంటూకు తెలియకుండా అతడి సెల్‌ఫోన్ ద్వారా భద్రతాధికారులకు ఫోన్ చేసి, ప్రధాని మోదీని చంపేస్తానంటూ బెదిరించాడు. వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు లొకేషన్ ఆధారంగా మంటూ చౌదరిని పట్టుకున్నారు. నాకేం తెలియదు మహాప్రభో అంటూ అతడు నెత్తీనోరూ బాదుకున్నాడు. మరింత లోతుగా విచారణ చేపట్టిన పోలీసులు సమీర్‌ను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు. ఈ ఘనకార్యం తనదేనంటూ అతడు నేరం అంగీకరించాడు. మంటూ సెల్‌లోని వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్(వీపీఎన్) ద్వారా సమీర్ వాట్సాప్ కాల్ చేసినట్లు గుర్తించాడు. ఆస్తి తగాదాలే కారణమని చెప్పాడు. సమీర్ రంజన్ ఇప్పుడు కటకటాలు లెక్కిస్తున్నాడు.

కృష్ణ చరితం అనే గ్రంథాన్ని రచించిన గుప్తరాజు?

గ్రూప్-1, గ్రూప్-2 పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ



గుప్త సామ్రాజ్యం

గుప్తుల సమాచారం అనేక సాహిత్య, పురావస్తు ఆధారాల ద్వారా లభిస్తోంది. వీరి కాలంలోని అనేక మంది కవులు గుప్తులకు సంబంధించిన సమాచారాన్ని తమ గ్రంథాల ద్వారా అందించారు. సాహిత్యాధారాలతోపాటు గుప్తులు 42 శాసనాలను జారీ చేశారు. వీటిలో కొన్ని రాజ ప్రశస్తులు కాగా మిగిలినవి దాన శాసనాలు. మొదట కుషాణులకు సామంతులుగా ఉన్న గుప్తులు వారి రాజ్య పతనం తర్వాత అధికార పగ్గాలు చేపట్టారు.

గుప్తుల రాజకీయ చరిత్ర:

శ్రీగుప్తుడు:

ఇతడు కుషాణుల సామంతుడిగానే పరిపాలన సాగించినట్లు తెలుస్తోంది. అందుకే నాటి సామంత రాజులు, భూస్వాములు ధరించే 'మహారాజ' అనే సాధారణ బిరుదును శ్రీగుప్తుడు ధరించాడు. ఇత్సింగ్ ప్రకారం.. మృగశిఖవనం వద్ద చైనాకు చెందిన బౌద్ధ సన్యాసుల ప్రయోజనార్థం శ్రీగుప్తుడు ఒక దేవాలయాన్ని నిర్మించినట్లు తెలుస్తోంది. అంతేగాక దాని నిర్వహణకు 20 గ్రామాలను కూడా అతడు దానం చేశాడు.

ఘటోత్కచ గుప్తుడు:

ఇతడు క్రీ.శ. 300 ప్రాంతంలో రాజ్యానికి వచ్చాడు. ఘటోత్కచుడు కూడా తన తండ్రి శ్రీగుప్తుడిలాగే ఒక సామంతరాజుగానే పరిపాలించాడు. ఇతడు తన కుమారుడైన మొదటి చంద్రగుప్తుడికి లిచ్ఛవీల రాకుమార్తె కుమారదేవితో వివాహం జరిపించాడు. తద్వారా గుప్త రాజ్య పటిష్టతకు కృషి చేశాడు.

మొదటి చంద్రగుప్తుడు:

ఇతడు తన తాత, తండ్రిలా 'మహారాజ' అనే బిరుదుతో కాకుండా 'మహారాజాధి రాజు'గా ప్రసిద్ధుడయ్యాడు. గుప్తవంశంలో తొలి స్వతంత్ర రాజుగా ఇతడిని భావించాలి. మొదటి చంద్రగుప్తుడు క్రీ.శ.320లో గుప్త శకాన్ని ప్రారంభించాడు. తన భార్య తరఫు నుంచి మగధ రాజ్యాన్ని పొందాడు. అందుకే తన నాణేలన్నింటిపై తన భార్య కుమారదేవి చిత్రంతో పాటు లిచ్ఛవీ వంశస్తుల పేర్లనూ ముద్రించాడు. గుప్త సామ్రాజ్య విస్తరణను చంద్రగుప్తుడే ప్రారంభించాడు.

సముద్ర గుప్తుడు:

సముద్ర గుప్తుడు రాజ్యానికి రాకముందు.. 'కచ' అనే మరో గుప్త రాకుమారుడు ఈ రాజ్యాన్ని పాలించినట్లు కొన్ని నాణేల ద్వారా తెలుస్తోంది. సముద్రగుప్తుడు ఈ వంశంలో అందరి కంటే గొప్ప రాజు. గుప్తుల జైత్రయాత్రను ఆసేతు హిమాచలం కొనసాగించాడు. సముద్రగుప్తుడి విజయాలపై ఇతడి ఆస్థాన కవి హరిసేనుడు ప్రయాగ ప్రశస్తి (అలహాబాద్ ప్రశస్తి)ని జారీ చేశాడు. దక్షిణాపథాన్ని పాలించే 12మంది రాజులను సముద్రగుప్తుడు జయించాడు. తర్వాత వారినే తన సామంతులుగా నియమించుకున్నాడు. ఆర్యావర్తాన్ని పాలించే 8 మంది రాజులను ఓడించి వారి రాజ్యాలను స్వాధీనం చేసుకున్నాడు. ఆ తర్వాత నేపాల్, బెంగాల్, అస్సాం మొదలైన సరిహద్దు రాజ్యాలను జయించాడు. అనేక ఆటవిక రాజ్యాలూ సముద్ర గుప్తుడికి దాసోహమన్నాయి. ఆ తర్వాత దైవపుత్ర షహానుషాహీలు, శక మురుండులు, సింహళీయులూ ఇతడి సార్వభౌమత్వాన్ని స్వచ్ఛందంగా అంగీకరించారు. సముద్రగుప్తుడిలో సైనిక సామర్థ్యంతో పాటు, కవితా గుణాలు కూడా ఉన్నట్లు తెలుస్తోంది. ఇతడికి 'కవిరాజు' అనే బిరుదు ఉంది. తన విజయాలకు గుర్తుగా సముద్రగుప్తుడు అశ్వమేధ యాగాన్ని నిర్వహించాడు. పులిని వేటాడుతున్నట్లు, వీణను సాధన చేస్తున్నట్లు ఉండే చిహ్నాలతో పలు నాణేలు జారీ చేశాడు. అప్రతిరథ, సర్వరాజాచ్ఛేత, అశ్వమేధ పరాక్రమ, వ్యాఘ్ర పరాక్రమ.. తదితర బిరుదులు ఇతడికి ఉన్నాయి.

రెండో చంద్రగుప్తుడు:

ఇతడికి విక్రమాదిత్య, నరేంద్రచంద్ర, సింహచంద్ర, సింహ విక్రమ.. తదితర బిరుదులున్నాయి. విశాఖదత్తుని 'దేవీచంద్రగుప్తం' అనే గ్రంథం ప్రకారం.. రెండో చంద్రగుప్తుడు తన అన్న రామగుప్తుడిని వధించి సింహాసనాన్ని ఆక్రమించినట్లు తెలుస్తోంది. ఇతడు సౌరాష్ట్ర, గుజరాత్ ప్రాంతాలను తన సామ్రాజ్యంలో విలీనం చేశాడు. దీంతో పశ్చిమాసియాతో పెద్ద ఎత్తున వ్యాపార-వాణిజ్యాలు నిర్వహించే అవకాశం కలిగింది. రెండో చంద్రగుప్తుడు.. తన కుమార్తె ప్రభావతీ గుప్తను వాకాటక రెండో రుద్రసేనుడికిచ్చి వివాహం చేశాడు. ఇతడు తన సైనిక విజయాలను చంద్ర అనే పేరుతో మెహ్రౌలీ ఇనుప స్తంభ శాసనాన్ని జారీచేశాడు. తన తండ్రి సముద్రగుప్తుడిలాగే రెండో చంద్రగుప్తుడు కూడా అనేక బంగారు నాణేలు జారీ చేశాడు. సింహాన్ని వధిస్తున్నట్లుగా, చేతిలో పుష్పాన్ని ధరించినట్లుండే చిహ్నాలతో ఇతడు బంగారు నాణేలు జారీ చేశాడు. ఇతడు ఉజ్జయినీని తన రెండో రాజధానిగా చేసుకున్నాడు. రెండో చంద్రగుప్తుడి ఆస్థానంలో నవరత్నాలు అనే కవులున్నట్లు ప్రతీతి.

కుమార గుప్తుడు:

తన సోదరుడు గోవింద గుప్తుడితో వారసత్వ తగాదాల అనంతరం ఇతడు రాజ్యానికి వచ్చాడు. క్రీ.శ.415 నుంచి క్రీ.శ.455 వరకు దాదాపు 40 ఏళ్ల పాటు ఇతడు గుప్త సామ్రాజ్యాన్ని పరిపాలించాడు. కుమారగుప్తుడు జారీచేసిన 1,400 నాణేలు మహారాష్ట్రలోని సామంద్ అనే ప్రాంతంలో బయటపడ్డాయి. తాను నిర్వహించిన అశ్వమేధ యాగానికి గుర్తుగా.. సముద్రగుప్తుడిలాగే ఇతడు కూడా అశ్వమేధ నాణేలు జారీ చేశాడు. కుమారు గుప్తుడు.. మహేంద్రాదిత్య, అశ్వమేధ మహేంద్ర అనే బిరుదులతో నాణేలు జారీ చేశాడు. మయూర వాహనంపై కార్తికేయుడి చిత్రంతో బంగారు నాణేలు ముద్రించాడు.

స్కంద గుప్తుడు:

ఇతడు విక్రమాదిత్యుడు అనే బిరుదును ధరించాడు. వారసత్వ యుద్ధాల్లో పురు గుప్తుడిని ఓడించి రాజ్యానికి వచ్చాడు. జునాగఢ్, భిటారి ప్రశస్తుల్లో.. స్కందగుప్తుడు తన శత్రువుల గురించి పేర్కొన్నాడు. హూణులపై ఇతడు సాధించిన విజయాల వల్ల 50 ఏళ్ల పాటు గుప్త సామ్రాజ్యానికి హూణుల నుంచి ప్రమాదం తొలగిపోయింది.

బుధ గుప్తుడు:

బుధ గుప్తుడి కాలంలో గుప్తసామ్రాజ్య పతనం ప్రారంభమైంది. ఇతడి తర్వాత భానుగుప్తుడు, నరసింహ గుప్త, బాలాదిత్యుడు, 3వ కుమారగుప్తుడు, విష్ణుగుప్తుడు పాలించారు. గుప్తవంశ పాలన క్రీ.శ. 550లో అంతమైంది.

మాదిరి ప్రశ్నలు

1. 'ఆర్య మంజుశ్రీ మూలకల్ప' గ్రంథం ప్రకారం బౌద్ధులను హింసించిన గుప్తరాజు?
ఎ) సముద్ర గుప్తుడు బి) కచ గుప్తుడు
సి) నరసింహ బాలాదిత్యుడు
డి) విష్ణు గుప్తుడు
2. భూమిపై ఉన్న సమస్త రాజులను ఓడించినట్లు ఎరాన్ ప్రశస్తిలో పేర్కొన్న రాజు?
ఎ) మొదటి చంద్రగుప్తుడు
బి) రెండో చంద్రగుప్తుడు
సి) సముద్రగుప్తుడు డి) స్కంద గుప్తుడు
3. గుప్తుల అధికారిక చిహ్నం?
ఎ) పులి బి) గరుడ
సి) వీణ డి) సింహం
4. కామరూపలో సముద్రగుప్తుడి ప్రతినిధిగా నియమితుడైన రాజు?
ఎ) భాస్కర వర్మన్ బి) సూర్య వర్మన్
సి) పుష్య వర్మన్ డి) గృహ వర్మన్
5. సముద్రగుప్తుడికి కానుకలు పంపిన గాంధార రాజు?
ఎ) కిదార బి) చిరాతదత్త
సి) సిద్ధార్థ డి) నరసింహన్
6. రోమ్‌కు రాయబార బృందాన్ని పంపిన గుప్తరాజు?
ఎ) పురు గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
సి) కుమార గుప్తుడు డి) బుధ గుప్తుడు
7. బోధ్‌గయలో సింహళ విహారాన్ని నిర్మించిన శ్రీలంక రాజు?
ఎ) శ్రీ మార విజయోత్తుంగ వర్మ
బి) శ్రీ మేఘవర్మ
సి) విజయబాహు డి) కుమార బాహు
8. తాను వీణ వాయిస్తున్నట్లుగా బంగారు నాణేలను జారీ చేసిన రాజు..?
ఎ) కుమార గుప్తుడు
బి) చంద్రగుప్త విక్రమాదిత్యుడు
సి) సముద్ర గుప్తుడు
డి) శ్రీ గుప్తుడు
9. కృష్ణ చరితం అనే గ్రంథాన్ని రచించిన గుప్తరాజు?
ఎ) సముద్ర గుప్తుడు
బి) నరసింహ గుప్తుడు
సి) మొదటి చంద్రగుప్తుడు
డి) రెండో చంద్రగుప్తుడు
10. అశ్వమేధ నాణేలు జారీ చేసిన గుప్తరాజు?
ఎ) విష్ణు గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
సి) కుమార గుప్తుడు డి) బి, సి
11. సముద్ర గుప్తుడిని 'ఇండియన్ నెపోలియన్' అని పిలిచినవారు ?
ఎ) సర్ విలియం జోన్స్
బి) వి.ఎ.స్మిత్
సి) హెచ్.సి. రామచౌదరి
డి) కె.పి. జయస్వాల్
12. రెండో చంద్రగుప్తుడి చేతిలో హతుడైన శకరాజు?
ఎ) రెండో రుద్రసేనుడు
బి) మూడో రుద్రసేనుడు
సి) రెండో రుద్రసింహుడు
డి) మూడో రుద్రసింహుడు
13. సాహసాంక, శకారి అనే బిరుదులున్న గుప్త రాజు?
ఎ) మొదటి చంద్రగుప్తుడు
బి) రెండో చంద్రగుప్తుడు
సి) సముద్ర గుప్తుడు
డి) కుమార గుప్తుడు
14. నవ రత్నాలు ఏ రాజు ఆస్థాన కవులు?
ఎ) సముద్రగుప్తుడు బి) కచ గుప్తుడు
సి) రెండో చంద్రగుప్తుడు
డి) బుధ గుప్తుడు
15. రెండో చంద్రగుప్తుడి కాలంలో భారతదేశాన్ని సందర్శించిన చైనా యాత్రికుడు?
ఎ) ఇత్సింగ్ బి) పాన్‌చావో
సి) హుయాన్‌చాంగ్
డి) ఫాహియాన్
16. ఖడ్గమృగాన్ని సంహరిస్తున్నట్లుగా నాణేలు జారీ చేసింది?
ఎ) కుమార గుప్తుడు
బి) 2వ చంద్రగుప్తుడు
సి) సముద్రగుప్తుడు
డి) మొదటి చంద్రగుప్తుడు
17. సుదర్శన తటాకానికి మరమ్మతులు నిర్వహించినట్లు శాసనం జారీ చేసింది?
ఎ) స్కంద గుప్తుడు బి) కుమార గుప్తుడు
సి) పురు గుప్తుడు డి) బుధ గుప్తుడు
18. హూణుల దాడిని విజయవంతంగా ఎదుర్కొన్న గుప్తరాజు?
ఎ) సముద్ర గుప్తుడు
బి) నరసింహ గుప్తుడు
సి) స్కంద గుప్తుడు డి) బి, సి
19. వంద రాజులకు అధిపతిగా ప్రశస్తుడైన గుప్త రాజు?
ఎ) స్కంద గుప్తుడు బి) సముద్ర గుప్తుడు
సి) మొదటి చంద్రగుప్తుడు
డి) రెండో చంద్రగుప్తుడు
20. సముద్రగుప్తుడి పాలనలో హరిసేనుడు అధిష్ఠించిన పదవి?
ఎ) మహాదండ నాయకుడు
బి) కుమారామాత్యుడు
సి) సంధి విగ్రాహకుడు
డి) పైవన్నీ
21. గుప్తుల కాలంలో రాష్ట్ర పాలకులను ఎలా పిలిచేవారు?
ఎ) విషయపతి బి) ఉపారిక
సి) కుమారామాత్య డి) అమాత్యా
22. గుప్తుల కాలంలో భూమి శిస్తు ఎంత?
ఎ) 1/6వ వంతు
బి) 1/4వ వంతు
సి) 1/4 నుంచి 1/6వ వంతు
డి) 1/8వ వంతు
23. గుప్తుల కాలంనాటి అధికారులను సరిగా జతపరచండి?

A) టలుపతి	1) గజదళ అధ్యక్షుడు
B) పుస్తపాల	2) భూ విక్రయాల రికార్డులు
C) దివిర	3) లేఖకుడు
D) శౌల్కిక	4) సుంకాల వసూలు అధికారి

	A)	B)	C)	D)
ఎ)	1	2	3	4
బి)	2	1	4	3
సి)	4	3	2	1
డి)	3	4	1	2

24. గుప్తుల కాలంలో ఉపారికార, హిరణ్య అనేవి?
ఎ) పన్నులు బి) అధికారులు
సి) భూమి కొలబద్దలు
డి) నాణేలు
25. గుప్తుల కాలంలో గుజరాత్ నుంచి మాందసోర్‌కు వలస వెళ్లిన వ్యాపార సంఘం ఏ వృత్తికి సంబంధించింది?
ఎ) కుండల తయారీ
బి) సిల్క్ తయారీ
సి) దంతపు వస్తువుల తయారీ
డి) ఇనుప వస్తువుల తయారీ

సమాధానాలు

1) బి; 2) సి; 3) బి; 4) సి; 5) ఎ; 6) బి; 7) బి; 8) సి; 9) ఎ; 10) డి; 11) బి; 12) డి; 13) బి; 14) సి; 15) డి; 16) ఎ; 17) బి; 18) డి; 19) ఎ; 20) డి; 21) బి; 22) బి; 23) ఎ; 24) ఎ; 25) బి.


ఊయల ఊగే బాలికకు ఏ చలనం ఉంటుంది?



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక, రసాయన శాస్త్రం

మాదిరి ప్రశ్నలు

1. ఉష్ణ అయనీకరణ సిద్ధాంతాన్ని ప్రతిపాదించినవారు?
ఎ) ఎం.ఎస్. స్వామినాథన్
బి) మేఘనాథ్ సాహా
సి) పి.సి. రే డి) జె.సి. బోస్
2. సెకన్ల లోలకం డోలనావర్తన కాలం ఎంత?
ఎ) 4 సె. బి) 6 సె. సి) 2 సె. డి) 10 సె.
3. ఫారన్‌హీట్ ఉష్ణమాపకంలోని విభాగాల సంఖ్య?
ఎ) 100 బి) 212 సి) 32 డి) 180
4. బొగ్గుపులుసు వాయువు అని దేన్ని అంటారు?
ఎ) NO_2 బి) CO_2
సి) CO డి) SO_2
5. సముద్ర మట్టం నుంచి ప్రతి 272.7 మీటర్ల ఎత్తుకు పోయేకొద్దీ పీడనం ఎంత తగ్గుతుంది?
ఎ) 2.54 సెం.మీ. బి) 25.4 సెం.మీ
సి) 27.2 సెం.మీ. డి) 2.72 సెం.మీ.
6. అణు పరీక్షల నుంచి వెలువడే కాలుష్య పదార్థం?
ఎ) N_2O బి) CFC
సి) స్ట్రాన్షియం-90 డి) Co
7. బ్లీచింగ్ పౌడర్ ఫార్ములా ఏది?
ఎ) CCl_3NO_2 బి) $CHCl_3$
సి) $CaCl_2$ డి) $CaOCl_2$
8. నీటి శాశ్వత కాఠిన్యానికి కారణం?
ఎ) కాల్షియం, మెగ్నీషియంల సల్ఫేట్లు, క్లోరైడ్లు
బి) కాల్షియం, మెగ్నీషియంల బై కార్బొనేట్లు
సి) జింక్, మెగ్నీషియంల బై కార్బొనేట్లు
డి) పైవన్నీ
9. గోడ నిలువు స్థితి సరిగా ఉందా? లేదా? అని దేని ద్వారా తెలుసుకుంటారు?
ఎ) స్పిరిట్ లెవల్ బి) ప్లంబ్ బాంబ్
సి) కోణమాణిని డి) పైవన్నీ
10. వర్షానికి తడవని దుస్తులను ఏమంటారు?
ఎ) ఖాదీ బి) పట్టు
సి) ఉలెన్ డి) కేన్వాస్
11. బట్టలోని నిలువు దారాలను ఏమంటారు?
ఎ) పడుగు బి) పేక
సి) షటిల్ డి) హెడిల్స్
12. దుస్తులపై ఏర్పడే సిరా మరకలను దేని ద్వారా తొలగిస్తారు?
ఎ) బోరాక్స్ బి) హైపో
సి) బెంజీన్ డి) నిమ్మరసం
13. మొదటి రకం తులాదండానికి ఉదాహరణ?
ఎ) ట్రాలీ బండి బి) అడకత్తెర
సి) కత్తెర డి) శ్రావణం
14. ఇనుప పట్టీలకు రంధ్రాలు వేయడానికి ఉపయోగించే పరికరం?
ఎ) డ్రిల్ బిట్ బి) పోకర్
సి) రెంచ్ డి) వైస్
15. ఊయల ఊగే బాలికకు ఏ చలనం ఉంటుంది?
ఎ) డోలన చలనం బి) భ్రమణ చలనం
సి) కంపన చలనం డి) స్థానాంతర చలనం
16. టపాకాయలో నిల్వ ఉండే శక్తి?
ఎ) ఉష్ణశక్తి బి) ధ్వనిశక్తి
సి) రసాయనశక్తి డి) సౌరశక్తి
17. ద్రవాల్లో ఉత్తమ ఉష్ణవాహక పదార్థం?
ఎ) బ్రోమిన్ బి) పాదరసం
సి) ఆల్కహాల్ డి) బెంజీన్
18. ఒక ఫుట్ కాండిల్ ఎన్ని లక్స్‌లకు సమానం?
ఎ) 12.5 బి) 7.46 సి) 4.12 డి) 10.76
19. దూరదర్శినిలో కాంతిని పరావర్తనం చెందించడానికి ఏ దర్పణాలను ఉపయోగిస్తారు?
ఎ) కుంభాకార బి) పుటాకార
సి) సమతల డి) వాలు
20. పరావర్తన ధ్వనిని వినాలంటే పరావర్తన తలం మనకు కనీసం ఎంత దూరంలో ఉండాలి?
ఎ) 22 మీ. బి) 44 మీ.
సి) 11 మీ. డి) 5.5 మీ.
21. బైక్రోమేట్ ఘటంలోని డీ పోలరైజర్?
ఎ) $KMnO_4$ బి) $K_2Cr_2O_7$
సి) NH_4Cl డి) MnO_2
22. విద్యుత్ బల్బులోని ఫిలమెంట్‌ను దేనితో తయారుచేస్తారు?
ఎ) ఇనుము బి) జింక్
సి) రాగి డి) టంగ్‌స్టన్
23. ఆర్ద్రతా శాతాన్ని కొలిచే పరికరం?
ఎ) హైగ్రో మీటర్ బి) హైడ్రో మీటర్
సి) ఓల్టా మీటర్ డి) బారో మీటర్
24. దూరదృష్టి దోషం నివారణకు ఉపయోగించే కటకం ఏది?
ఎ) పుటాకార బి) కుంభాకార
సి) సమతల పుటాకార డి) ఏదీకాదు
25. తెల్లని రంగు ఉన్న జింక్ ఆక్సైడ్‌ను వేడి చేసినప్పుడు అది ఏ రంగులోకి మారుతుంది?
ఎ) నలుపు బి) ఎరుపు
సి) పసుపు డి) ఆరెంజ్
26. ఆక్సీ-ఎసిటలిన్ జ్వాల ఉష్ణోగ్రత?
ఎ) 2400 °C బి) 3200 °C
సి) 100 °C డి) 1250 °C
27. కృత్రిమ పెట్రోల్‌ను సంశ్లేషించిన శాస్త్రవేత్త?
ఎ) కావెండిష్ బి) బెర్జీలియస్
సి) బెర్జియస్ డి) లెవోయిజర్
28. నూనెల హైడ్రోజనీకరణంలో ఉత్ప్రేరకంగా దేన్ని ఉపయోగిస్తారు?
ఎ) Fe బి) Mo సి) Pt డి) Ni
29. ఎల్‌పీజీ వంటగ్యాస్‌లో ఉండే వాయువు?
ఎ) ఈథేన్ బి) ఆక్సిజన్
సి) ఎసిటలిన్ డి) బ్యూటేన్
30. భాస్వరం రూపాంతరాల్లో అత్యంత చురుకైంది ఏది?
ఎ) నల్ల భాస్వరం బి) తెల్ల భాస్వరం
సి) ఎర్ర భాస్వరం డి) స్కార్లెట్ భాస్వరం
31. సూర్యుని తర్వాత కాంతివంతంగా కనిపించే నక్షత్రం ఏది?
ఎ) ప్రాక్సిమా సెంటావరి బి) సిరియస్
సి) హైడ్రా డి) హీడా
32. హేలీ తోక చుక్క మళ్లీ ఏ సంవత్సరంలో సూర్యునికి దగ్గరగా వస్తుంది?
ఎ) 2046 బి) 2025
సి) 2062 డి) 2086
33. వివిధ రంగుల కాంతుల తరంగదైర్ఘ్యం తగ్గే క్రమం?
ఎ) ROYGBIV బి) VIBGYOR
సి) IBGYORV డి) YORGBIV
34. పొడిమంచు అంటే?
ఎ) ఘన SO_2 బి) ఘన NO_2
సి) ద్రవ CO_2 డి) ఘన CO_2
35. మానవుడు నీటిలో ఈదడంలో ఇమిడి ఉన్న నియమం ఏమిటి?
ఎ) న్యూటన్ మొదటి గమన నియమం
బి) న్యూటన్ రెండో గమన నియమం
సి) న్యూటన్ మూడో గమన నియమం
డి) పైవన్నీ
36. అగ్నిమాపక యంత్రంలో ఉపయోగించే వాయువు?
ఎ) SO_2 బి) CO_2 సి) O_2 డి) H_2
37. సూపర్ ఫాస్ఫేట్ ఆఫ్ లైమ్ ఒక ... ఎరువు?
ఎ) నత్రజని బి) కాల్షియం
సి) పొటాషియం డి) ఫాస్ఫేటిక్
38. గెలీనా ధాతువు రసాయన ఫార్ములా?
ఎ) FeS బి) HgS
సి) CuS డి) PbS
39. ఇళ్లలో బల్బులను అమర్చే పద్ధతి?
ఎ) శ్రేణి బి) సమాంతర
సి) ఎదురెదురు డి) ఏదీకాదు
40. ఉష్ణమాపనిలో ఉపయోగించే ద్రవం?
ఎ) నీరు బి) HCl
సి) బ్రోమిన్ డి) పాదరసం
41. రోడ్డు రోలర్ ఏ స్థితిలో ఉంటుంది?
ఎ) స్థిర నిశ్చల బి) అస్థిర నిశ్చల
సి) తటస్థ నిశ్చల డి) ఏదీకాదు
42. విమానాల ఎత్తును కొలవడానికి ఉపయోగించే పరికరం?
ఎ) ఆల్టీ మీటర్ బి) బారో మీటర్
సి) హైగ్రో మీటర్ డి) లాక్టో మీటర్
43. విద్యుదయస్కాంతాల తయారీకి ఉపయోగించే పదార్థం?
ఎ) అల్నికో బి) మెత్తని ఇనుము
సి) ఉక్కు డి) కోబాల్ట్
44. కుళ్లిన కోడిగుడ్ల వాసన కలిగి ఉండే వాయువు ఏది?
ఎ) HCl బి) SO_2
సి) H_2S డి) SO_3
45. సిల్వర్ లాటిన్ పేరు ఏమిటి?
ఎ) నేట్రియం బి) ఆరమ్
సి) అర్జెంటమ్ డి) స్టానమ్
46. STP వద్ద 24 గ్రా. మీథేన్ ఆక్రమించే ఘనపరిమాణం? (లీటర్లలో)
ఎ) 22.4 బి) 2.24
సి) 33.6 డి) 11.2
47. గన్‌పౌడర్‌లో ఉపయోగించేది?
ఎ) ఇసుక బి) సల్ఫర్
సి) మెర్క్యూరిక్ పౌడర్
డి) సోడియం క్లోరైడ్
48. కిందివాటిలో అమ్మోటాల్ సంఘటనం?
ఎ) NH_4NO_3 + 20% TNT
బి) $NaNO_3$ + 20% TNT
సి) NH_4NO_2 + 20% TNT
డి) NH_4NO_3 + Al పొడి
49. కిందివాటిలో దృష్టి స్థిరత ధర్మం ఆధారంగా సాధ్యపడింది ఏది?
ఎ) మైక్రోఫోన్ బి) సినిమాటోగ్రఫి
సి) టెలివిజన్ డి) టెలిఫోన్
50. కాంతి తీవ్రతకు ప్రమాణం?
ఎ) ల్యూమెన్ బి) వాట్
సి) లక్స్ డి) వోల్ట్
51. టెలిగ్రాఫ్ ఆఫీసులో ఉపయోగించే విద్యుత్ ఘటం?
ఎ) లెక్లాంచి బి) ఓల్టాయిక్
సి) బైక్రోమేట్ డి) నిర్జల
52. ఫాస్ఫేట్(PO_4) ప్రాతిపదిక సంయోజకత?
ఎ) 1 బి) 2 సి) 3 డి) 4
53. $CuO + H_2 \rightarrow Cu + H_2O$లో క్షయకరణి ఏది?
ఎ) CuO బి) Cu
సి) H_2O డి) H_2
54. దత్తాంశాన్ని టైప్ చేయడానికి వాడే ఇన్ పుట్ సాధనం?
ఎ) స్కానర్ బి) వెబ్ కెమెరా
సి) మౌస్ డి) కీబోర్డ్
55. కిందివాటిలో తీగ వాయిద్యానికి ఉదాహరణ?
ఎ) పిల్లనగ్రోవి బి) బుల్-బుల్
సి) క్లారినెట్ డి) హార్మోనియం
56. విద్యుత్ నిరోధానికి సంకేతం?

ఎ) బి) సి) డి)
57. రెండు దర్పణాల మధ్య కోణం 60° ఉన్నప్పుడు ఏర్పడే ప్రతిబింబాల సంఖ్య?
ఎ) 4 బి) 6 సి) 11 డి) 5
58. పాస్కల్ దేనికి ప్రమాణం?
ఎ) సాంద్రత బి) పీడనం
సి) ఒత్తిడి డి) ఘనపరిమాణం
59. పాదరసం తారతమ్య సాంద్రత?
ఎ) 0.8 బి) 13.6 సి) 2.5 డి) 8.9
60. 'బ్రిటిష్ పద్ధతి'గా దేన్ని పేర్కొంటారు?
ఎ) CGS బి) MKS
సి) S.I. డి) FPS
61. నియమిత ఘనపరిమాణం ఉన్న ద్రవాలను తీసుకోవడానికి వాడే పరికరం?
ఎ) కొలజాడి బి) బ్యూరెట్
సి) పిప్పెట్టు డి) కోనికల్ ఫ్లాస్క్
62. వేరు బొడిపెలు ఉండి నత్రజని స్థాపన చేసే మొక్క?
ఎ) మొక్కజొన్న బి) వరి
సి) వెదురు డి) చిక్కుడు
63. 8 గ్రా. $CaCO_3$ని వేడిచేస్తే వెలువడే CO_2 భారం?
ఎ) 2.54 గ్రా. బి) 3.52 గ్రా.
సి) 35.2 గ్రా. డి) 4.72 గ్రా.
64. కనిపించని సిరా అని దేన్ని అంటారు?
ఎ) $CaCl_2$ బి) $COCl_2$
సి) $CoCl_2$ డి) $CaOCl_2$
65. సల్ఫర్ పరివర్తన ఉష్ణోగ్రత ఎంత?
ఎ) 120 °C బి) 444 °C
సి) 96 °C డి) 119 °C
66. H_2S తయారీలో ఉపయోగించేది?
ఎ) ఎర్లన్ మేయర్ ఫ్లాస్క్
బి) ప్రమాణ కుప్పె
సి) కిప్స్ పరికరం డి) కెలోరీ మీటర్
67. ఉపగ్రహాలు అధికంగా ఉన్న గ్రహం?
ఎ) శని బి) గురుడు
సి) అంగారకుడు డి) భూమి
68. బాణాసంచా తయారీలో ఉపయోగించేది?
ఎ) Be బి) Mg సి) Ca డి) Sr
69. అత్యంత తీయనైన చక్కెర ఏది?
ఎ) సుక్రోజ్ బి) గ్లూకోజ్
సి) ఫ్రక్టోజ్ డి) మాల్టోజ్
70. పరమాణు సంఖ్య 26 ఉన్న మూలకం లాటిన్ పేరు?
ఎ) అర్జెంటమ్ బి) ఫెర్రమ్
సి) స్టానమ్ డి) ఆరమ్

సమాధానాలు

1) బి	2) సి	3) డి	4) బి	5) ఎ
6) సి	7) డి	8) ఎ	9) బి	10) డి
11) ఎ	12) బి	13) సి	14) బి	15) సి
16) సి	17) బి	18) డి	19) బి	20) సి
21) బి	22) డి	23) ఎ	24) బి	25) సి
26) బి	27) సి	28) డి	29) డి	30) బి
31) బి	32) సి	33) ఎ	34) డి	35) సి
36) బి	37) డి	38) సి	39) బి	40) డి
41) సి	42) ఎ	43) బి	44) సి	45) సి
46) సి	47) బి	48) ఎ	49) బి	50) సి
51) ఎ	52) సి	53) డి	54) డి	55) బి
56) ఎ	57) డి	58) బి	59) బి	60) డి
61) సి	62) డి	63) బి	64) సి	65) సి
66) సి	67) ఎ	68) బి	69) సి	70) బి

ఓడ నది నుంచి సముద్రంలోకి ప్రవేశిస్తే... ?

నదీజలం కంటే సముద్ర జలాల్లో లవణాలు ఎక్కువ కాబట్టి సాంద్రత అధికంగా ఉంటుంది. అందువల్ల అత్యంత లవణమయమైన 'డెడ్ సీ' నీటిపై నడవవచ్చు. ప్రస్తుతం మార్కెట్లో విక్రయించే మినరల్ వాటర్‌ను 'తిరోగామి ద్రవాభిసరణ' (రివర్స్ ఆస్మాసిస్) ప్రక్రియ ద్వారా ప్రాసెస్ చేస్తారు. ఇదే ఆర్.ఓ. ప్రక్రియగా ప్రాచుర్యంలో ఉంది. ఈ ప్రక్రియలో 'మెంబ్రేన్' (అతి సూక్ష్మ రంధ్రాలున్న పలుచని పొర) ద్వారా ఉప్పు (కఠిన) నీటిని అధిక పీడనాన్ని ఉపయోగించి పంపిస్తారు. మెంబ్రేన్ నుంచి స్వాదుజలం బయటకు వస్తుంది. దీనిలో అయాన్‌లన్నీ తొలగిపోతాయి. కాబట్టి 'డీ అయొనైజ్డ్ వాటర్' అని కూడా అంటారు.

గ్రూప్స్,
ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

రసాయన శాస్త్రం

హైడ్రోజన్ - దాని సమ్మేళనాలు

ఆవర్తన పట్టికలో మొదటి మూలకం హైడ్రోజన్. ఇది అత్యంత తేలికైంది. సాధారణ హైడ్రోజన్ పరమాణు సంఖ్య ఒకటి, పరమాణు భారం ఒకటి. న్యూట్రాన్లు లేని ఒకే ఒక కేంద్రకం హైడ్రోజన్. దీన్నే ప్రోటియం అని కూడా అంటారు. దీని సమస్థానీయాలు (ఐసోటోపులు) డ్యుటీరియం, ట్రిటియం.

- డ్యుటీరియంనే భార హైడ్రోజన్ అంటారు. ట్రిటియం రేడియోధార్మిక కేంద్రకం.
- హైడ్రోజన్ అత్యంత శ్రేష్ఠమైన ఇంధనం. దీన్ని మండించినప్పుడు నీటి ఆవిరి (H_2O) మాత్రమే విడుదలవుతుంది. కాబట్టి వాతావరణ కాలుష్యం ఉండదు.
- నక్షత్రాల్లోని శక్తికి మూలాధారం హైడ్రోజన్. హైడ్రోజన్‌కు చెందిన ఐసోటోపులు 'కేంద్రక సంలీన' చర్య ద్వారా అత్యధిక శక్తిని విడుదల చేస్తాయి. ఈ ప్రక్రియలోనే వివిధ మూలకాలు ఏర్పడతాయి.
- కార్బన్ మోనాక్సైడ్, హైడ్రోజన్‌ల మిశ్రమాన్నే ($CO+H_2$) 'వాటర్ గ్యాస్' అంటారు. దీన్నే నీలిగ్యాస్ అని కూడా అంటారు.
- హైడ్రోజన్‌ను ఇంధన ఘటాల్లో ఉపయోగిస్తారు. హైడ్రోజన్ లేదా కార్బన్ మోనాక్సైడ్ లేదా మీథేన్ లాంటి ఇంధనాలను దహనం చేయడం ద్వారా వచ్చే శక్తిని సరళరీతిలో విద్యుత్‌శక్తిగా మార్చే ఘటాలే ఇంధన ఘటాలు. వీటిలో 'ఆక్సిజన్' వాయువు 'ఆక్సీకరణి'గా పనిచేస్తుంది.
- ఇది నూనెలను 'హైడ్రోజనీకరణం' చేసి 'కొవ్వులు'గా మార్చడానికి ఉపయోగపడుతుంది. ఈ ప్రక్రియలో ఉత్ప్రేరకం 'నికెల్' లోహం. డాల్డాను ఈ విధానంలోనే రూపొందిస్తారు.
- 'ఫిషర్ - ట్రాప్స్' పద్ధతిలో కృత్రిమంగా పెట్రోల్ తయారు చేయడానికి దీన్ని ఉపయోగిస్తారు. ఈ పద్ధతిలో 'వాటర్ గ్యాస్' ను దానిలో సగం పరిమాణం ఉన్న 'హైడ్రోజన్'తో కలిపి ఐరన్ ఆక్సైడ్, కోబాల్ట్ ఉత్ప్రేరకాల సమక్షంలో 200°C వద్ద వేడిచేస్తే హైడ్రోకార్బన్ల మిశ్రమం (కృత్రిమ గ్యాసోలిన్) వస్తుంది.
- ఆమ్లాల్లో ఒక ముఖ్యమైన అనుఘటకం హైడ్రోజన్.
- లోహ సంగ్రహణలో.. లోహ ఆక్సైడ్‌ల నుం చి క్షయకరణ పద్ధతిలో లోహాల్ని నిష్కర్షించడానికి హైడ్రోజన్‌ను ఉపయోగిస్తారు.

నీరు

గాలి తర్వాత అత్యంత అవసరమైంది నీరే. ప్రకృతిలో లభ్యమయ్యే నీటిలో అత్యంత శుద్ధమైంది 'వర్షపు నీరు'. తాగడానికి పనికివచ్చే నీటిని 'పోటబుల్ నీరు' అంటారు. నాలుగింట మూడు వంతుల నీరు సముద్రాల్లోనే ఉంది. సముద్ర జలాల్లో అనేక రకాల లవణాలుంటాయి. ఈ నీరు తాగడానికి పనికి రాదు. సబ్బుతో నురగనివ్వదు. ఇలాంటి నీటిని కఠిన జలం అంటారు. ప్రధానంగా కాల్షియం, మెగ్నీషియం బైకార్బొనేట్లు; క్లోరైడ్‌లు; సల్ఫేట్లు ఉండటం వల్ల నీటికి కఠినత్వం వస్తుంది. నీటి కాఠిన్యత రెండు రకాలు. ఒకటి తాత్కాలిక కాఠిన్యత, రెండోది శాశ్వత కాఠిన్యత.

తాత్కాలిక కాఠిన్యత: కాల్షియం బై కార్బొనేట్, మెగ్నీషియం బై కార్బొనేట్ లవణాల కారణంగా నీటికి తాత్కాలిక కాఠిన్యం వస్తుంది.

- నీటిని మరిగించడం ద్వారా తాత్కాలిక కాఠిన్యతను పూర్తిగా తొలగించవచ్చు. మరిగిస్తే బైకార్బొనేట్లు కార్బొనేట్లుగా అవక్షేపితమవుతాయి. నీటిని మరిగించినప్పుడు పాత్ర అడుగుభాగంలో తెల్లని పొలుసులను గమనించవచ్చు. ఈ పొలుసుల్లో ఉండేది కాల్షియం, మెగ్నీషియం కార్బొనేట్‌లు. ఈ ప్రక్రియలో కార్బన్ డై ఆక్సైడ్ కూడా విడుదలవుతుంది. దీని కారణంగానే నీటిని మరిగిస్తున్నప్పుడు బుడగలు వస్తాయి.
- తాత్కాలిక కాఠిన్యాన్ని తొలగించడానికి తోడ్పడే మరో విధానం 'క్లార్క్ పద్ధతి'. కఠిన జలానికి సున్నపు నీరు లేదా మిల్క్ ఆఫ్ లైమ్ (కాల్షియం హైడ్రాక్సైడ్) కలపడం ద్వారా నీటి తాత్కాలిక కాఠిన్యాన్ని తొలగించవచ్చు.

నీటి శాశ్వత కాఠిన్యత: కాల్షియం, మెగ్నీషియం క్లోరైడ్‌లు, సల్ఫేట్లు నీటికి శాశ్వత కాఠిన్యాన్ని కలుగజేస్తాయి. అంటే నీటిలో కాల్షియం క్లోరైడ్, కాల్షియం సల్ఫేటు, మెగ్నీషియం క్లోరైడ్, మెగ్నీషియం సల్ఫేట్లు కరిగి ఉంటాయి.

- సాధారణంగా పెర్మ్యుటిట్ (సోడియం అల్యూమినియం ఆర్థోసిలికేట్) లేదా కాల్గన్ (సోడియం హెక్సామెటా ఫాస్ఫేట్) ద్వారా కఠిన జలాన్ని పంపిస్తే అందులోని కాల్షియం, మెగ్నీషియం అయాన్‌లు తొలగిపోతాయి.
- అయాన్ మార్పిడి రెజిన్‌లు కూడా కఠిన జలాన్ని స్వాదుజలంగా మారుస్తాయి.
- 'స్వేదన' (డిస్టిలేషన్) ప్రక్రియ ద్వారా కూడా నీటి కఠినత్వాన్ని తొలగించవచ్చు. నీటిని మరిగించినప్పుడు ఆవిరవుతుంది. ఆవిరిని చల్లారిస్తే పరిశుద్ధ జలం (100% పరిశుద్ధమైంది) వస్తుంది.
- సముద్ర జలాన్ని 'ఆవిరి చేయడం' వల్ల చివరగా ఉప్పు మిగులుతుంది.

	పరమాణు సంఖ్య	పరమాణు భారం	ప్రోటాన్ల సంఖ్య	న్యూట్రాన్లు
ప్రోటియం (H)	1	1	1	0
డ్యుటీరియం(D)	1	2	1	1
ట్రిటియం (T)	1	3	1	2



- నీటి రసాయన నామం హైడ్రోజన్ ఆక్సైడ్ (H_2O)
- నీటికి అనేక పదార్థాలను కరిగించుకునే స్వభావం ఉంటుంది. కాబట్టి దీన్ని సార్వత్రిక ద్రావణి అంటారు.
- 4°C వద్ద నీటికి గరిష్ఠ సాంద్రత ఉంటుంది. అందుకే నీటిని 0°C నుంచి 10°C వరకు వేడి చేసినప్పుడు ఉష్ణోగ్రత - ఘనపరిమాణానికి వక్రాన్ని గీస్తే 'హాకీ స్టిక్'లా ఉంటుంది. ఘనపరిమాణం మొదట తగ్గి తర్వాత పెరుగుతుంది.
- నీరు 0°C (273K) వద్ద ఘనీభవిస్తుంది. 100°C (373K) వద్ద మరుగుతుంది.
- లవణాలు ఎక్కువగా ఉండటం వల్ల సముద్ర నీటి సాంద్రత అధికంగా ఉంటుంది. అందువల్ల ఏదైనా వస్తువు నది నీటి నుంచి సముద్రం నీటిలోకి ప్రవేశిస్తే కొంచెం పైకి తేలుతుంది.
- నీటిని విద్యుద్విశ్లేషణ చేస్తే విఘటనం చెంది హైడ్రోజన్, ఆక్సిజన్‌లుగా విడిపోతుంది.
- నీటిని క్రిమిరహితం చేయడానికి విరంజన చూర్ణం (బ్లీచింగ్ పౌడర్) లేదా క్లోరిన్ వాయువు లేదా అతి నీలలోహిత (UV) కిరణాలను ఉపయోగిస్తారు.
- పాత్రలో నీటిని వేడిచేసినప్పుడు పై నుంచి మరుగుతుంది.
- పొడిగాలి కంటే తడిగాలిలో ధ్వని వేగం ఎక్కువ.

భారజలం

రసాయనికంగా భారజలాన్ని డ్యుటీరియం ఆక్సైడ్ (D_2O) అంటారు. దీన్ని హెచ్‌సీ యురే కనుగొన్నాడు. భారజలం ఘనీభవన స్థానం 3.82°C, బాష్పీభవన స్థానం 101.42°C. దీన్ని న్యూక్లియర్ రియాక్టర్లలో న్యూట్రాన్ల వేగాన్ని తగ్గించడానికి మితకారిగా వాడతారు.

మాదిరి ప్రశ్నలు

1. హైడ్రోజన్ ఇంధన వాహనాలు కిందివాటిలో దేని 'ఎగ్జాస్ట్'ను ఉత్పత్తి చేస్తాయి? (సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్-2010)
   1) NH_3 2) CH_4
   3) H_2O 4) H_2O_2
2. రసాయనికంగా నీరు అనేది?
   1) ఆక్సిజన్ హైడ్రైడ్
   2) హైడ్రోజన్ ఆక్సైడ్
   3) డ్యుటీరియం ఆక్సైడ్
   4) నైట్రోజన్ హైడ్రైడ్
3. కిందివాటిలో స్వచ్ఛమైన జలం ఏది?
   1) నది నీరు 2) సముద్రపు నీరు
   3) భూమిని చేరకముందు వర్షపునీరు
   4) బావి నీరు
4. కిందివాటిలో రాకెట్ ఇంధనంగా ఉపయోగపడేది?
   1) ద్రవ హైడ్రోజన్
   2) ద్రవ అమ్మోనియా
   3) భారజలం 4) నీటి ఆవిరి
5. కిందివాటిలో దేనిలో హైడ్రోజన్ ఉండదు?
   1) నీరు 2) హైడ్రోజన్ పెరాక్సైడ్
   3) అమ్మోనియా 4) కార్బన్ డై ఆక్సైడ్
6. నీరు అనేది ఒక?
   1) మిశ్రమం 2) మూలకం
   3) సంయోగ పదార్థం 4) పరమాణువు
7. ఓడ నది నుంచి సముద్రంలోకి ప్రవేశిస్తే..?
   1)అది సముద్ర నీటిలో పైకి తేలుతుంది
   2) నీటిలోకి మరింతగా మునుగుతుంది
   3) ఎలాంటి మార్పూ ఉండదు
   4) ఓడలోని సరుకుపై ఆధారపడి ఉంటుంది
8. నీటిపై తేలుతున్న ఐస్ కరిగినప్పుడు బీకర్‌లోని నీటి స్థాయి?
   1) పెరుగుతుంది 2) తగ్గుతుంది
   3) యథావిధిగా ఉంటుంది
   4) మొదట పెరిగి, తర్వాత తగ్గుతుంది
9. నీటికి శాశ్వత కాఠిన్యత కిందివాటిలో దేని వల్ల ఏర్పడుతుంది? (గ్రూప్-I, 2010)
   1) కాల్షియం సల్ఫేట్
   2) కాల్షియం బై కార్బొనేట్
   3) సోడియం బై కార్బొనేట్
   4) మెగ్నీషియం బై కార్బొనేట్
10. కృత్రిమ వర్షం కురిపించడానికి ఉపయోగించే సమ్మేళనం?
    1) సిల్వర్ అయొడైడ్
    2) సోడియం నైట్రేట్
    3) సోడియం క్లోరైడ్
    4) హైడ్రోజన్ పెరాక్సైడ్
11. గాయాలను క్రిమిరహితం చేయడానికి ఉపయోగించే హైడ్రోజన్ సమ్మేళనం ఏది?
    1) నీరు 2) హైడ్రోజన్ పెరాక్సైడ్
    3) భారజలం 4) అమ్మోనియా
12. నీరు ద్రవ రూపంలో ఉండటానికి కారణం?
    1) అయానిక బంధం
    2) సమయోజనీయ బంధం
    3) లోహబంధం
    4) హైడ్రోజన్ బంధం

సమాధానాలు

1) 3; 2) 2; 3) 3; 4) 1;
5) 4; 6) 3; 7) 1; 8) 3;
9) 1; 10) 1; 11) 2; 12) 4.

Pronoun must be in subject form



Sentence correction section is one of the important areas in many competitive examinations. Eight types of errors pertaining to the following broad areas are generally given. Candidates who wish to secure good scores need to enhance their knowledge on these areas.

They are:

1. Collocation
2. Idioms and Phrases
3. Pronoun agreement
4. Concord
5. Modifiers
6. Verb sequences
7. Comparisons
8. Parts of speech

Out of these we have studied the first two topics collocation and idioms and phrases in the last sessions. Let us learn about pronoun agreement in this session.

Pronouns stand in for nouns in a sentence. Pronouns follow the same agreement rules as nouns, so when using a pronoun, it is important to be clear about what noun it is replacing. Take a look at the following tips:

1. A pronoun in the nominative form should be compared with the same form of the pronoun.
2. When two singular nouns are joined by and refer to the same person the pronoun used in their place should be singular in form.
3. A singular pronoun should be used when two singular nouns are joined by either or neither nor.
4. A pronoun in the plural form should be used when two nouns of different members are joined by 'or' or 'nor'.
5. The distributive pronouns 'either, neither, none, any, no one are used with singular verbs.
6. The indefinite pronoun 'one' should be used as 'one's for its possessive case.
7. The verbs such as cheat, prostrate, introduce, present, absent, satisfy, prepare, enjoy, hurt, avail of are followed by either an object or a reflexive pronoun.
8. The word 'who' as a relative pronoun in the nominative case takes a verb.
9. If a pronoun is to be placed after 'to be', the pronoun in the subjective case is used. A very important point to be noted is that we should use the personal pronouns in the order of second person, third person and first person. The order first person, second person and third person is possible when we admit guilt.

Pronoun Subject Vs Pronoun Object

Once you've found a pronoun in a Sentence Correction question, check whether it's acting as the SUBJECT or the OBJECT of the sentence or phrase. Is the following sentence correct or incorrect?

How could she blame you and he for the accident?

The first step is to identify the pronoun(s). There are three in this sentence: "she," "you," and "he". Next, try to define whether each pronoun is acting as a subject or object. Here, "she" is the subject, and the pronouns "you" and "he" are acting as the objects of the sentence.

How do we know this? Because "she" is doing the action (blaming) and "you" and "he" are receiving it (getting blamed). However, "he" does not seem to be in the correct form. "Who did she blame?", which is "him" not "he." ("Who did she blame? She blamed him")

The pronouns acting as objects must be in the objective case; "him" is objective - while "he," used in the sentence, is subjective, and therefore incorrect.

Incorrect: How could she blame you and he for the accident?

Correct: How could she blame you and him for the accident?

Who Vs Whom

If the pronoun is acting as a subject, use who. If it is acting as an object, use whom.

I don't know whom Kavitha married.

Why is "whom" correct? Because Kavitha is the subject of this sentence - not the person she married.

Singular and Plural Pronouns

Pronouns also act like nouns in the realm of verb agreement. For some pronoun questions, you also need to check if the pronoun and its verb agree in number.

Here's an example:

Incorrect: Everyone on the project have to come to the meeting.

Correct: Everyone on the project has to come to the meeting.

The pronoun "everyone" is singular. Its verb must therefore be singular as well: "has" is correct, not "have".

Possessive Pronoun Agreement

When you come across possessive pronouns such as your, their, his, and hers, check to see whether they agree with other pronouns in the sentence. Most possessive pronouns are used messily in spoken language, so be careful to take special note when you see two pronouns in a sentence.

Incorrect: Some of you will have to bring their own bags.

Correct: Some of you will have to bring your own bags.

In this sentence, the possessive pronoun towards the end of the sentence should match the pronoun following "Some of". Because the first pronoun is "you", the possessive pronoun must be your, not their.

Objects of to be verbs are in the subject form.

Watch for pronouns following "to be" verbs such "It should have been," "It is," "It could have been," "It was", and make sure they are in subject form.

Incorrect: It must have been her who called.

Correct: It must have been she who called.

"It must have been" is a "to be" verb, so the pronoun must be in subject form: "she," not "her".

Relative Pronouns

Which, that and who are relative pronouns. A relative pronoun must refer to the word immediately preceding it. If the meaning of the sentence is unclear, the pronoun is in the wrong position.

Which introduc-es non-essential clauses; that introduces essential clauses. Who refers to individuals; that refers to a group of persons, class, type, or species.

Incorrect: The person who draws the winning number hits the jackpot.

Correct: The person who draws the winning number hits the jackpot.

Here the relative pronoun 'who' is the correct form as it is the subject of the verb draws and also introduces the clause draws twinning number.

Impersonal Pronouns

We can use impersonal pronouns to talk about people in general or unspecified objects. The pronouns "one" and "you," which are included in a class of pronouns called "impersonal pronouns," are often improperly matched with their respective possessive pronouns.

Incorrect: One should have their teeth checked every six months.

Correct: One should have one's teeth checked every six months.

PRACTICE TEST

1. Her was better suited for the job.
2. Johnny and me drank a bottle of champagne.
3. The dinner was eaten by Smith and I.
4. Whom took out the trash?
5. Neither his bodyguards nor he were there.
6. Neither he nor his bodyguards was there.
7. If anyone comes over, take their name.
8. One should take your responsibilities seriously.
9. This test is for students which native language is not English.
10. My pencil is broken. Can I borrow its?

Answers and explanation:

1. She was better suited for the job. Here, the pronoun is the subject of the sentence, as "the job" is clearly not the subject, and there are no other nouns in the sentence. Because the pronoun stands in for "the woman", the pronoun should be the subject form of the her/she pronoun meaning, "she".
2. Johnny and I drank a bottle of champagne. Because it's confused so often in spoken language, it can be difficult to tell when the pronoun in the phrase "someone else and me/I" is used incorrectly. But it's actually quite easy to remember when to use "me" and when to use "I": cross out everything in the "someone else and me/I" phrase except the pronoun - and then read it aloud. How does it sound? If it sounds fine, the pronoun is correct; if it sounds really odd, the pronoun is incorrect. "Me drank a bottle of wine" sounds odd, so the proper pronoun is clearly "I".
3. The dinner was eaten by Smith and me. "I/me" is acting as the object, so the proper pronoun is "me."
4. Who took out the trash? You wouldn't say "him took out the trash," so the pronoun in the original sentence must match the form of the pronoun "he," which is a subject pronoun: who is correct.
5. Neither his bodyguards nor he was there.
6. Neither he nor his bodyguards were there. The constructions "either... or" and "neither... nor" always take the verb form that matches the noun that is closer to the verb. Thus, "were" is incorrect in the fifth sentence because "he," a singular pronoun, is closer to the verb than "bodyguards," a plural noun; but "were" is correct in the sixth sentence because the order of the subjects is reversed, so that the plural noun "bodyguards" is closer to the verb.
7. If anyone comes over, take his or her name. The subject is anyone, which is singular, and therefore requires a singular pronoun such as "his" or "her".
8. One should take one's responsibilities seriously. The subject is one, which is singular, and therefore requires a singular pronoun.
9. This test is for students whose native language is not English. The correct relative pronoun to be used in this sentence is 'whose'.
10. My pencil is broken, can I borrow yours? The correct possessive pronoun is 'yours'.